వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 18 సంచిక : 9 హైదరాబాద్ 227 సెప్టెంబర్ 2020 పేజీలు : 68 రు. 25

- ఆగస్ట్ 5 - దేశం తలదించుకోవలసిన రోజు
- న్యాయ వ్యవస్థనా, అన్యాయ వ్యవస్థనా?
- తిరోగమన జాతీయ విద్యా విధానం
- ఎపి ప్రభుత్వ రాజ్యాంగ ఉల్లంఘనలు
- తెలంగాణ సోయి మర్సిందెవలు?
- పర్యావరణ పరిరక్షణకు తూట్లు
- శ్రీలంక ఎన్నికల ఫలితాల దుర్మార్గం

వీక్షణం విడిప్రతి కొనుగోలు కోసం

మీ సమీపంలోని ఈ కింది న్యూస్‌స్టాల్స్‌లో వీక్షణం విడిప్రతి కొనుక్కోవచ్చు

రైజింగ్ సన్ న్యూస్ ఏజెన్సీ (సోల్ డిస్ట్రిబ్యూటర్)	ఆబిడ్స్, హైదరాబాద్	96666 80857
నవోదయ బుక్‌హౌస్	కాచిగూడ, హైదరాబాద్	90004 13413
బాల రాజేశ్వర బుక్ డిపో	నల్లకుంట బస్ స్టాప్ హైదరాబాద్	97050 55738
వెంకటేశ్వర బుక్‌స్టాల్, స్టేషనరీ	నల్లకుంట, శంకర్‌మఠ్ హైదరాబాద్	040-66131071
ఫస్ట్ లక్కీ పాన్‌షాప్	విద్యానగర్ సిగ్నల్స్ హైదరాబాద్	9848672831
సుధాకర్ బుక్‌స్టాల్	సన్‌మాన్ హోటల్ పక్కన, తార్నాక హైదరాబాద్	9949337605
వెంకటేశ్వర బుక్‌స్టాల్	రామ్‌నగర్ గుండు హైదరాబాద్	9502964995
భవాని బుక్‌స్టాల్	శివం రోడ్ హైదరాబాద్	9849836996
శ్రీభవాని బుక్‌స్టాల్	శివం రోడ్ (ఇండియన్ బ్యాంక్ దగ్గర) హైదరాబాద్	9640712555
ఓరియన్ బుక్‌స్టాల్	అంబర్‌పేట్ (శ్రీరమణ టాకీస్ దగ్గర) హైదరాబాద్	7702535137
అరవింద్ బుక్‌స్టాల్	రామంతాపూర్ (టివి స్టూడియో ఎదురుగా) హైదరాబాద్	8977995537
నేషనల్ బుక్‌హౌస్	అబిడ్స్, హైదరాబాద్	9394495189
దుర్గా భవన్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9030656640
డైమండ్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9885127491
రాజు రామ్‌దాస్ బుక్‌స్టాల్	మెహదీపట్నం, హైదరాబాద్	7799244409
రిలయబుల్ బుక్ సెంటర్	నానల్‌గూడ, హైదరాబాద్	040-23512447
ఇస్పెక్ట్రం బుక్‌హౌస్	లంగర్‌హౌజ్, హైదరాబాద్	98486 68354
శ్రీ లక్ష్మి బుక్‌స్టాల్	హైదర్‌గూడ, హైదరాబాద్	98855 81249
మల్లిఖార్జున బుక్‌స్టాల్	దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్	90594 40756
సుధీర్ బుక్‌స్టాల్	తార్నాక, హైదరాబాద్	95426 04166
లడ్డు బుక్‌స్టాల్	పంజగుట్ట, హైదరాబాద్	99492 15135
వినోద్ బుక్‌స్టాల్	సరూర్‌నగర్, హైదరాబాద్	95536 03603
రాజారెడ్డి బుక్‌స్టాల్	చందానగర్ బిఎచ్‌ఇఎల్	93466 07648
నవ తెలంగాణ బుక్ హౌస్	చిక్కడపల్లి, హైదరాబాద్	94900 99373
నవ తెలంగాణ బుక్ హౌస్	బాగ్‌లింగంపల్లి-సుందరయ్య విజ్ఞాన కేంద్రం, హైదరాబాద్	94900 99378
రాజ్ బుక్స్ స్టేషనరీ	ఓల్డ్ బస్‌స్టాండ్ దగ్గర, మెదక్ రోడ్, సిద్దిపేట్	87905 60097
అక్షర బుక్ వరల్డ్, ఎటిసి మార్కెటింగ్	న్యూ టౌన్, మహబూబ్‌నగర్	90102 10464
శ్రీ స్వయం రాజరాజేశ్వర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుస్నాబాద్	90592 85948
భాస్కర్ పాన్ షాప్ & జనరల్ స్టోర్	కోహెడ	95021 82545
గణేష్ బుక్‌స్టాల్	కళాభారతి ఎదురుగా, కరీంనగర్	97019 99007
పాండు బుక్‌స్టాల్, కూల్‌డ్రింక్స్	ఆర్‌టిసి కాంప్లెక్స్, మిర్యాలగూడ	98857 38144
సత్యసాయి బుక్‌స్టాల్	ఖమ్మం	79890 81728
రాజన్న బుక్ స్టాల్	హనుమకొండ చౌరస్తా	93955 07773
మణి బుక్‌స్టాల్	సండేమార్కెట్, నెల్లూరు	73862 23538
సురేష్ బుక్‌స్టాల్	శివాలయం వీథి, ప్రొద్దటూరు	81210 02112
క్రిసెంట్ న్యూస్ ఏజెన్సీ	కడప	98852 35846
పద్మావతి బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, అనంతపూర్	73965 09767
అనేక బుక్‌స్టాల్	ఏలూరు రోడ్డు, విజయవాడ	92472 53884
మైత్రీ బుక్‌హౌస్	మజీద్ వీథి, అరండల్‌పేట, విజయవాడ	98486 31604
రాజేశ్ బుక్‌సర్వీస్	ఆర్‌టిసి బస్‌స్టేషన్ కాంప్లెక్స్, విశాఖపట్నం	99483 19842
వి. భాస్కర్ న్యూస్‌పేపర్ ఏజెన్సీ	డాబా గార్డెన్, విశాఖపట్నం	99482 90318
రాఘవేంద్ర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, ఒంగోల్	90595 23091
శ్రీదేవి సాయి కూల్‌డ్రింక్స్, కమ్యూనికేషన్స్	దేవి చౌక్, రాజమండ్రి	98489 84394
త్రినాథ్ పాన్ షాప్	మరిడి మహాలక్ష్మి టెంపుల్, రాజమండ్రి	99519 76044

227 ISSN 2231-6892

వీక్షణం

రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

సెప్టెంబర్ 2020
సంపుటి : 18
సంచిక : 9

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు, డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం VEEKSHANAM

మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495

Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : **చరితా ఇంప్రెషన్స్**
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 25	రు. 25
సంవత్సరం	రు. 300	రు. 250
మూడు సంవత్సరాలు	రు. 900	రు. 650
ఐదు సంవత్సరాలు	రు. 1500	రు. 1100
పది సంవత్సరాలు	రు. 3000	రు. 2000

ఆన్‌లైన్ ఆంధ్రబ్యాంక్ ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌లపై '**VEEKSHANAM**' అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 0000139** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

వీక్షణం ఆర్థిక పరిస్థితిని వివరిస్తూ చేసిన విజ్ఞప్తికి స్పందిస్తూ వీక్షణంను నిలబెట్టుకోవాలనే తపనతో ఆర్థిక సహాయం అందించిన ఎ. సూర్యనారాయణ, మన్సూరాబాద్, రంగారెడ్డి జిల్లా - రు. 2,000; డి. అంజయ్య (రిటైర్డ్ టీచర్), అంబర్‌పేట్, హైదరాబాద్ - రు. 2,000; ఎ. మధుసూదన్ రెడ్డి, వరంగల్ - రు. 3,000; డా. డి. రామక్రిష్టారెడ్డి, వరంగల్ - రు. 2,000; కె.బి. హరినాథ్, అనంతపూర్ - రు. 500; టి. అంజనామూర్తి, హైదరాబాద్ - రు. 5,000; మిత్రులకు కృతజ్ఞతలు - సం.

నేను వీక్షణం పాఠకున్ని. ఈ పత్రిక ద్వారానే నేను సమాజంలో జరుగుతున్న పరిణామాలను తెలుసుకోగలుగుతున్నాను. కరోనా కాలంలో కూడా ఇబ్బందుల్ని అధిగమించి వీక్షణం బృందం పత్రికను ముద్రించి పాఠకులకు అందిస్తున్నందుకు అభినందనలు. ఇన్ని ఇబ్బందుల మధ్య తెస్తున్న పత్రిను ఆదుకోవడానికి నా వంతుగా ఆర్థిక సహాయాన్ని అందిస్తాను. ఇదే కాలంలో కరోనాను అడ్డుపెట్టుకొని పాలకులు చాపకింద నీరులా ఎటువంటి చర్చ లేకుండానే విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటున్న తీరును, వాటి ఫలితాలను ఎప్పటికప్పుడు పాఠకులకు అందించి వాటి పట్ల అవగాహనను కల్పిస్తున్న రచయితలకు కృతజ్ఞతలు. పాలకులు మతం పేరుతో ప్రజలను మభ్యపెట్టి రాజ్యాంగ వ్యవస్థలను తమకు అనుకూలంగా మలుచుకోవడమో లేదా వాటిని రద్దుచేయడమో చేస్తున్నారు. దీనితో రాజ్యాంగంలో పొందిపరిచిన ప్రాథమిక హక్కులు కూడా లేకుండాపోయి, కొన్ని దశాబ్దాల పాటు సమాజాన్ని వెనుక్కు నెడుతున్న తీరును అర్థవంతంగా చెప్పారు. ఇప్పుడు పాలకులు చిన్న విమర్శను కూడా సహించలేని స్థితికి చేరుకున్నారు. ఈ పరిణామాలను బుద్ధిజీవులు, ప్రజలు ఐక్యంగా ప్రశ్నించి ఉద్యమించకుంటే సమాజం తీవ్రమైన నష్టానికి గురయ్యే ప్రమాదం ఉంది.

– ఎన్. రవి
సిద్దిపేట్

వీక్షణం ఆగస్టు సంచికలో వేణుగోపాల్ రాసిన 'సెక్రటేరియట్ కూల్చివేత – మూఢనమ్మకాలు' వ్యాసం చదువుతుంటే తెలంగాణ పాలకులు ఎంత మూఢ విశ్వాసాలతో పాలన కొనసాగిస్తున్నారో అర్థమవుతుంది. సెక్రటేరియట్‌లోని శిథిలావస్థలో ఉన్న భవనాల స్థానంలో కొత్తవి నిర్మించాల్సింది పోయి, కొత్తగా నిర్మించిన భవనాలను సైతం కూలగొట్టి వందల కోట్ల రూపాయలతో కొత్త సెక్రటేరియట్‌ని నిర్మించాలనుకోవడం తెలంగాణ ప్రజా ధనం మట్టిపాలు చేయడమే. ఇటీవల కరోనా ప్రభావంతో వందలాది మంది చనిపోతుంటే అసుపత్రులలో కనీస వసతులు కల్పించకుండా, అకాల వర్షాలతో రైతులు తమ పంటలను కోల్పోయి రోడ్డున పడితే పట్టించుకోకుండా అనవసరమైన వాటి కోసం ప్రజల సొమ్మును ఖర్చు చేయడం శోచనీయం. కేశవ్ రాసిన వ్యాసంలో మోడీ ప్రభుత్వం సాగిస్తున్న అనాలోచిత విధానాలను చక్కగా వివరించారు. మోడీ ప్రభుత్వం చైనా ఫోన్‌లను, సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, యాప్‌లను, ఇతర సరుకులను భారత్ మార్కెట్‌లోకి ఆహ్వానించి, దేశ ప్రజలను, యువతను ఆ మత్తులో మునిగి తేలేలా చేసి ఇప్పుడు చైనా, భారత్‌ల మధ్య సరిహద్దు వివాదం వలన తమ దేశభక్తిని నిరూపించుకొని, దేశ ప్రజలను నమ్మించడానికి చైనా యాప్‌లను తొలగించడం చూస్తుంటే దేశభక్తి ముసుగులో మోడీ ప్రభుత్వం చేస్తున్న ఇలాంటి అనాలోచిత విధానాల వలన దేశ ప్రజలే బలవుతున్నారు. ఒకవైపు కరోనా వల్ల వేల మంది చనిపోతుంటే కనీస సౌకర్యాలు కల్పించని మోడీ ప్రభుత్వం, అయోధ్యలో రామమందిరం కోసం పూజలు చేయడం, వందల కోట్లు భారత ప్రజా ధనంతో మందిరాన్ని నిర్మించాలని చూడడం చూస్తుంటే తమ మూఢ విశ్వాసాలతో ఈ దేశాన్ని ఎటువైపు తీసుకుపోతున్నారో అర్థం కావడం లేదు. వీక్షణంలో ఎప్పటికప్పుడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న అనాలోచిత విధానాలను వ్యాసాల రూపంలో తెస్తున్నందుకు సంపాదకులకు ధన్యవాదాలు.

– కృష్ణహరి
మహబూబ్‌నగర్

ఆగస్టు వీక్షణంలో కరోనా వైరస్ మొదలైనప్పటి నుంచి వచ్చిన ప్రతీ వ్యాసం చదువుతుంటే వైరస్ రావడానికి గల కారణాలను, ఈ వైరస్‌ను ఇతర దేశాలు ఎలా ఎదుర్కొంటున్నాయో తెలిపారు. వైరస్‌ను కట్టడి చేయడంలో విఫలమైన మన పాలకులు తరును చక్కగా వివరించారు. కరోనా పట్ల ప్రజలకు అవగాహన కల్పించి, దాని ప్రభావం ఎవరిపై ఎంత ఉంటుంది, ఎలా అప్రమత్తంగా ఉండాలో చెప్పాల్సిన ప్రభుత్వాలు వారి ప్రయోజనాల కోసం తప్పుడు సమాచారంతో పేద ప్రజలను ఎన్నో ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. అలాగే 'సెక్రటేరియట్ కూల్చి వేత – మూఢ నమ్మకాలు' వ్యాసం చదువుతుంటే ఎంతో కాలంగా రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు పాలనా సేవలను అందించిన సెక్రటేరియట్‌ను తెలంగాణ పాలకులు మూఢవిశ్వాలతో అందులో పాత భవనాలతో సహా కొత్తగా నిర్మించిన వాటిని కూల్చి, తమ మూఢ విశ్వాసాలకనుగుణంగా ఎలా నడుచుకుంటున్నారో ఈ వ్యాసంలో చాలా వివరంగా రాశారు. రాష్ట్రంలో ఒకవైపు కరోనా ప్రభావంతో ఆసుపత్రులలో సరైన వసతులు లేక, సరైన తిండిలేక ఎంతోమంది పేద ప్రజలు చనిపోతుంటే వారి ప్రాణాలను కాపాడాల్సింది పోయి, వారి సొమ్ముతో సెక్రటేరియట్‌ని నిర్మించాలనుకోవడం చాలా విచారకరం.

– మాధవ్‌కుమార్
జహీరాబాద్

వీక్షణం ఆగస్టు సంచికలో జైలులో ఉన్న సాయిబాబాకు అరుంధతీరాయ్ ఉత్తరంలో ఆయన అనారోగ్యం గురించి ఏమి చేయలేకపోతున్నామని బాధపడుతూ, తీవ్ర ఆవేదనకు లోనయినట్లుగా ఉంది. జైలులో కొవిడ్ సోకినా అనారోగ్యంతో ఉన్న నీలాంటి వారికి ప్రమాదం అని తెలిసినా వాళ్లు వదిలిపెట్టకుండా అదే మరశిక్ష కాగలదని అనుకుంటున్నారనే చేదు నిజాన్ని చెప్పి మా మనుసులను బరువెక్కించి రాజ్య స్వభావాన్ని మరోసారి బయటపెట్టారు. సాయిబాబా తల్లి చనిపోయినా చూసుకునే అవకాశాన్ని ఇవ్వని రాజ్యం ఎంత దుర్మార్గమైందో మరోసారి రుజువైంది.

– వి. నారాయణ
మెదక్

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

(ఈ సంచికలోని హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, నల్గొండ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం, ప. గోదావరి జిల్లాల అసహజ మరణాల వివరాలు అందిస్తున్నవారు ఎస్. వెంకటేశ్)

ధ్వంస రచనకు భూమి పూజ!

తనను తాను లౌకిక రాజ్యమని స్వయంగా రాజ్యాంగంలో రాసుకున్న దేశంలో ప్రభుత్వాధికారులు ఒక మతాచార తంతులో పాల్గొనడం తప్పు కాని కొత్తేమీ కాదు. రాజ్యాంగంలో ఏమి రాసుకున్నప్పటికీ, లౌకికత్వానికి ఎంత తలకిందుల నిర్వచనాలు ఇచ్చుకున్నప్పటికీ ఆ చేయగూడని పనిని, పార్టీలతో నిమిత్తం లేకుండా, భారత పాలకవర్గాలన్నీ ఏడు దశాబ్దాలుగా చేస్తూనే ఉన్నాయి. ఆ అపసవ్య చరిత్రకంతా శిఖరాయమానంగా, మరింత దుర్మార్గంగా ఆగస్ట్ 5న అయోధ్యలో రామమందిర నిర్మాణానికి భారత ప్రధానమంత్రి భూమి పూజ చేశాడు.

ఆయన నరేంద్ర మోడీ అనే వ్యక్తి కాదు. ప్రజాస్వామిక, లౌకిక, సర్వసత్తాక భారత గణతంత్రపు ప్రభుత్వంలో అత్యున్నతాధికార పీఠం మీద ఐదు సంవత్సరాల పాటు కూచోవడానికి ప్రజలు అధికారం ఇచ్చిన వ్యక్తి. ఆ పదవిని భారత ప్రధానమంత్రి అంటారు. ఆ పదవీ బాధ్యత భారత రాజ్యాంగాన్ని, రాజ్యాంగ విలువలను రక్షించడం. భారతదేశం బహుళ సమాజం గనుక, భిన్న మతాలకు నిలయం గనుక, ఇక్కడ ఏకత్వంలో భిన్నత్వం అనేదే మార్గదర్శక సూత్రంగా ఉండాలని రాజ్యాంగ నిర్మాతలు భావించారు. వలసవాద వ్యతిరేక జాతీయోద్యమం పొడవునా ఆ విలువలే ప్రాధాన్యత సంతరించుకున్నందువల్ల కూడ అవి రాజ్యాంగం లోకి చేరాయి. లౌకికత్వం అనే మాటకు ఆచరణలో సర్వధర్మ సమభావం, అన్ని మతాలకూ సమాన ప్రతిపత్తి అనే తప్పుడు అర్థం ఇచ్చుకున్నప్పటికీ, ఆ అర్థాన్ని అమలులో పెట్టినప్పటికీ, దాని అసలు అర్థం వ్యక్తిగత జీవితంలో మత ప్రమేయం ఎంత ఉన్నా బహిరంగ, సామాజిక జీవితంలో మత ప్రమేయం ఉండగూడదు అని. ప్రభుత్వాధికారంలో ఉన్నవాళ్లు తప్పనిసరిగా, ఎక్కువగా పాటించవలసిన సూత్రం అది. ఒక బహుళ సమాజంలో, అందులోనూ కొన్ని స్వార్థపరశక్తులు మతాల మధ్య విద్వేషం పెంచిపోషించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు, ప్రభుత్వాధికారులు మత ప్రమేయాన్ని దూరం పెట్టవలసి ఉంటుంది. కనీసం అన్ని మతాలకూ సమాన దూరాన్ని పాటిస్తున్నామని చూపుకోవడానికైనా ప్రయత్నించవలసి ఉంటుంది. కాని భారత ప్రధానమంత్రి ఆగస్ట్ 5న ఒక మతాచారం ప్రకారం, ఒక ఆలయ నిర్మాణ శంకుస్థాపన, భూమి పూజ కార్యక్రమంలో పాల్గొనడం భారత రాజ్యాంగానికి వ్యతిరేకం, భారత సమాజపు బహుళత్వానికి వ్యతిరేకం.

ఇది కేవలం రాజ్యాంగ సమస్య మాత్రమే కూడ కాదు. చరిత్ర సమస్య కూడ. ఇప్పుడు రామమందిర నిర్మాణం కోసం తలపెట్టిన స్థలం వివాద స్థలం. అక్కడ ఇరవై ఎనిమిది సంవత్సరాల కింది వరకూ భారత చరిత్రలో ఒక కీలకమైన చారిత్రక కట్టడం ఉండేది. ఆ కట్టడం ఐదువందల సంవత్సరాల కింద నిర్మాణమైనది. అంతకు ముందు అక్కడ ఉన్న ఒక కట్టడాన్ని కూల్చి దాన్ని నిర్మించారనే కట్టుకథలు, వలసవాదుల ఉద్దేశపూర్వక అబద్ధాలు తప్ప, కచ్చితమైన సాక్ష్యాధారాలేమీ లేవు. అసలు అక్కడ ఎవరి పుట్టుక జరిగిందనే పుక్కిటిపురాణం వ్యాప్తిలో ఉందో, ఆ వ్యక్తి ఒక కావ్య నాయకుడే తప్ప వాస్తవ చారిత్రక వ్యక్తి అనడానికి, అక్కడే పుట్టాడనడానికి ఆధారాలు లేవు. సరిగ్గా ఆ నగరంలోనే మరికొన్ని డజన్ల స్థలాల యజమానులు తమదే జన్మస్థలం అని నొక్కి చెపుతున్నారు. బాబ్రీ మసీదు నిర్మాణం తర్వాత కొద్ది కాలానికే ఆ ప్రాంతంలోనే జీవించి రామాయణం రాసిన కవులు అక్కడి రామమందిర విధ్వంసం గురించి ఒక్క మాట కూడ రాయలేదు. ఆ పునాదుల కిందనే రామజన్మభూమి ఉందనే వాదన కేవలం బాబ్రీ మసీదును కూల్చడం కోసం, రెండు మతాల మధ్య విద్వేషాగ్ని చల్లారకుండా నిలిపి ఉంచడం కోసం చేసినదే తప్ప ఎటువంటి వాస్తవిక, చారిత్రక, పురావస్తు, సామాజిక ఆధారం ఉన్నది కాదు.

సరిగ్గా సంఘ పరివారానికి కావలసింది ఆ ప్రయోజనమే. దేశంలోని రెండు ప్రధాన మతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి, తామే రక్షకులమని ఒక మతస్తులను ఆకట్టుకోవడం, తమను చూసి భయోత్పాతంలో బతికే స్థితి మరొక మతస్తులకు కల్పించడం సంఘ్ పరివార్ ప్రయోజనం. దేశంలోని రెండు ప్రధాన మతాలకు చెందినవారిలో ఒకరిని నయాన, మరొకరిని భయాన లొంగదీసి తమ ఉక్కుపాదం కింద అణచిపెట్టడమే సంఘ్ పరివార్ రాజకీయార్థిక వ్యూహం. బ్రాహ్మణీయ భూస్వామ్య విలువలకూ, సామ్రాజ్యవాద దళారీ విలువలకూ లంకె కుదిర్చిన పీడక సిద్ధాంతం అది. అందువల్ల ఆ సిద్ధాంతానికి బాబ్రీమసీదు విధ్వంసం కావాలి. రామమందిర నిర్మాణం కావాలి. అయితే రామమందిర నిర్మాణం కూడ నిజానికి దాని అసలు అర్థంలో నిర్మాణం కాదు, అది మరొకరకమైన విధ్వంసమే. అది సమాజ విధ్వంసం, విలువల విధ్వంసం, బహుళత్వ విధ్వంసం. ప్రతి నిర్మాణానికీ విధ్వంసం అవసరమని, అవి రెండూ ఒక వైరుధ్యంలో అవిభాజ్య అంశాలని గతితర్కం భావిస్తుంది. కాని ఇక్కడ సంఘ్ పరివారం ప్రయత్నిస్తున్నది ఒక మహా విధ్వంసానికి నిర్మాణం అని పేరు పెట్టి, రెండు విధ్వంసాలనూ ఒకే ఒరలో ఇమడ్చడం.

రామమందిర నిర్మాణమనేది కేవలం ఒకానొక ఆలయ నిర్మాణం కాదు. అది హిందువులకు కూడ ఒరగబెట్టేదేమీ లేదు. ఈ దేశ ప్రజల ఆకలిదప్పులను, దారిద్ర్యాన్ని, నిరుద్యోగాన్ని, ఆర్థిక సంక్షోభాన్ని తీర్చబోయేదేమీ కాదు, ఈ దేశ ప్రజల బతుకులలో రావలసిన మార్పు తెచ్చేదేమీ కాదు. కాకపోగా, అది ఈ దేశ చరిత్రను తుడిచేసే ప్రయత్నం. ఈ దేశంలో ఒక ప్రధాన మత విశ్వాసాలున్నవారిని నిరంతరం భయ భీతావహంలో ముంచే ప్రయత్నం. తాము ఆడింది ఆట పాడింది పాట అని ప్రత్యర్థులందరినీ భయపెట్టి లొంగదీసే ప్రయత్నం. ఈ దేశంలోకి మళ్లీ ఒకసారి హిందూ బ్రాహ్మణీయ వర్ణాశ్రమ ధర్మ కుల వివక్షా పీడనా విలువలను పునఃస్థాపించగలనని భూస్వామ్య శక్తులకు హామీ ఇచ్చే ప్రయత్నం. చరిత్ర, పురావస్తు ఆధారాలు, రాజ్యాంగం వంటివేవీ తమ విధ్వంస కార్యక్రమానికి అడ్డంకి కావని, ఈ దేశాన్ని, దేశవనరులను, దేశ ప్రజల జీవనాన్ని బంగారు పళ్లెంలో పెట్టి అప్పగించినా ఎవరూ ప్రశ్నించరని దేశదేశాల సామ్రాజ్యవాద బహుళ జాతి సంస్థలకు హామీ ఇచ్చే ప్రయత్నం. ఈ వాస్తవాలను ప్రజలకు విప్పిచెప్పడం, సంఘ్ పరివార్ మహావిపత్తును అడ్డుకోగల మహాశక్తి ప్రజాశక్తేనని గుర్తించి, వివరించి, ఆ లక్ష్యం కోసం ఆ ప్రజాశక్తిని సమీకరించడానికి సకల ప్రయత్నాలూ చేయడం, విశాల ప్రజా రాశుల ఐక్యతతో సంఘ్ పరివార్ ను ఓడించి, మన సమాజ బహుళత్వాన్ని కాపాడడం ఇవాళ భారత ప్రగతిశీల శక్తుల ముందున్న కర్తవ్యం.

వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

నీళ్ల జాగలకు మనం బోయినమా, అవి మన జాగలకొచ్చినయా!

అబ్బ, మా ఊళ్లె ఒరంగల్ల నీళ్లొస్తానయంటె ఎంత సంబురమాయె. ఒక్క మా ఊళ్లనె గాదు, మొత్తం తెలంగాణల్నె నీళ్లు రాబట్టె. ఇంకెంత సంబురం. నివ్వద్దె నా శిన్నప్పుడు మా ఊరినైతె రాళ్ల రాజారం అనెటోల్లు. బిందెడు నీళ్ల కోసం అరిగోస బడుతుంటిమి. ఆ ఎన్క ఒరంగల్ల గుడ కష్టమే ఉండెడిది. మనిషి లోతు గుంటలు దవ్వి, ఆడ నల్ల పైపు తెగ్గొట్టి ఆడ గిన్నో, తప్పాలో బెట్టి నీళ్లు పైకి ఎత్తిపోసుకునెడిది. గటువంటిది, మా ఒరంగల్ల నీళ్లొచ్చినయని సంబురం మాత్రమే గాదు, పడవలు ఒచ్చినయని గుడ ఇంకా బగ్గ సంబురమాయె. నీళ్లు లేని ఊళ్లె కండ్లల్ల నీళ్లొచ్చె నీ బాంచెన్. తాగుటానికి నీళ్లు లేవు, సౌలతులకు నీళ్లు లేవు, చారెడు నీళ్లు గావాలె నాయనా అని అడిగితె, చారెడు గాదు దోశెడు గాదు, గిట్ల గుమ్ముల నింద నీళ్లు గురిపిచ్చి ఇండ్లు, రోడ్లు, మనుసులు మునిగిపోయెటట్టు జేసుడు ఏమన్నాలెం. ఓరినీ ఎంత గతి బట్టెరా, దూపకు నీళ్లడిగితె నీళ్లల్ల ముంచి ఇడిచిపెట్టె గదరా అని నేను పరిషానయితాంటె, మావోడు గదేదో సదువబట్టె. గాల్లెవలో రాసిండ్లట గద. గిదంత దొర దండి గన కార్యమే, గోదారిని మలిపిండు, నీళ్లు లేని కాడికి నీళ్లు దెచ్చిండు, ఆంద్రోల్లు అరువై ఏండ్లు జెయ్యని పని, మన దొర ఆరేండ్లల్ల జేసిండు అని పురానం మొదలువెట్టె. వారీ, గదంత మంచిగనే ఉన్నది గని, తాగుటానికి, ఇంట్లకు, పంటలకు నీళ్లడిగినం గని, బుడుంగున మునుగుటానికి అడిగినామురా అని సవాల్ జేసిన. ఎహె, ఇది ఇప్పటి ఆనల సంగతి గాదు, ఆనల కన్న ముందర దొర ఎంత దండి పనులు జేసిండో గాయినెవలో రాసిండు, గది జదువుతాన అని మావోడు బుదరకిచ్చె. మరి గిప్పుడు గీ వానల సంగతి జెప్పు కొడుకా, పాత ముచ్చెట ఎందుకు అని నేను మళ్ల అడ్డం దిరిగిన. నాకు లెక్కలు రావు గని, మావోడు లెక్కలు మొదలుబెట్టె. మన తెలంగాణ రాకముందు మన బూములు జాగలు జాయెదాదులన్ని ఆంద్రోల్లు ఎత్తుకపోతాంద్రు, ఆల్లే కబ్జ పెడుతాంద్రు, ఆల్లే ఎకరాల్ల గొని గజాల్ల అమ్మి కోట్లు కూడబెడ్తాంద్రు అని మస్తు మాట్లాడినమా లేదా అన్నడు. మరి తెలంగాణ దెచ్చుకున్నాక ఏం జెయ్యాలె. గా పనులల్ల నుంచి ఆంద్రోల్లను ఎల్లగొట్టాలె. ఎల్లగొట్టినమనుకో ఆడ మనం దిగి, గవ్వే పనులు మనం జెయ్యాలె. ఎల్లగొట్టలేక పోయినమనుకో ఆల్ల తోనె గలిసిపొయ్యి గవ్వే పనుల్ల శేరిదారుగనో, గుత్తెదారుగనో చేరిపోవాలె. గంతేనా కాదా అని నన్ను రొకాయించిండు. అబ్బ ఏం తెలివిరా నీది అనుకున్న. అగో గట్ల భూములు జాగల పంచాతులు తెలంగాణ వచ్చినంక పెరిగినయి. ఒక్క మనూల్లెనె వందల బస్తీలు కొత్తగ పుట్టుకొచ్చినయి. మరి జాగేడున్నది? చెరువు షికాల్లల్ల, ఆగుల ఒడ్లపొంటి జాగలు సంపాంచి అమ్మాలె కొనిపిచ్చాలె బంగ్లలు గట్టిపిచ్చాలె అని కొసాకరి ముచ్చట జెప్పిండు. ఎడ్డి బాగులోన్ని గద, మారె, చెరువు షికంలకు ఎట్ల బోతరురా, తప్పు గాదు, మా శిన్నప్పుడు ఎండకాలంల షికంల శనగ పంట ఏస్కుంటానికే రామ రావణ యుద్ధం అయితాండె అన్న. అయ్యా, మరి గిప్పుడు మనూళ్లె గీ నీళ్లన్ని యాడ్నుంచి వచ్చినయనుకుంటానవు, వాటి జాగల్లకు అవి వచ్చినయి. గంతే ముచ్చట. వాటి జాగల్లకు మనం బోతె మనను ముంచినయి అని అసలు సంగతి జెప్పిండు.

వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

నిజమైన సమస్యలు తప్పించడానికి కల్పిత సమస్య

ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి సమస్యలు అనేకం ఉండగా, అదనంగా కొవిడ్ విజృంభణ తోడు కాగా, వాటి గురించి, వాటి పరిష్కారాల గురించి ఆలోచించకుండా ప్రజలనూ, ఆలోచనాపరులనూ పక్కదారి పట్టించడంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం విజయం సాధించినట్టు కనబడుతున్నది. ఎవరైనా ఆమోదించదగిన అధికార వికేంద్రీకరణ అనే సూత్రం సాకుగా పెట్టుకుని, తన ఆశ్రితుల రియల్ ఎస్టేట్ ప్రయోజనాలను పెంపొందించడం కోసం, తన ప్రత్యర్థుల రియల్ ఎస్టేట్ ప్రయోజనాలను దెబ్బతీయడం కోసం రాజధాని సమస్యను ముందుకు తెచ్చిన ప్రభుత్వం మొత్తం ఆంధ్రప్రదేశ్ సమాజాన్ని ఈ కొత్త కల్పిత సమస్య చుట్టూ తిప్పుతున్నది. పాలనాసరళి మారనంతవరకూ రాజధాని వందల కిలోమీటర్ల అవతల ఉన్నా, మన ఊళ్లోనే ఉన్నా, ఎక్కడ ఉన్నా ప్రజలకు ఒరగబోయేదేమీ లేదని గుర్తించి, పాలనా సరళి గురించి, అసలు సమస్యల గురించి మాట్లాడవలసిన వాళ్లు కూడ అధికారపక్షం వైపా, ప్రతిపక్షం వైపా అని, రెడ్ల ప్రయోజనాల వైపా, కమ్మల ప్రయోజనాల వైపా అని, వికేంద్రీకరణ వైపా, కేంద్రీకరణ వైపా అని అనవసర వివాదంలో చిక్కుకున్నారు. రాజధాని ఉన్నచోటి నుంచి తరలించవద్దు, రాజధాని మా ఊళ్లోనే ఏర్పాటు చేయాలి లాంటి భావోద్వేగాలను రెచ్చగొట్టి ప్రజలను సమీకరించడం కూడ ప్రారంభమైంది. ఈ వివాదాన్ని శాసననిర్ణయాలు, న్యాయస్థానాల జోక్యాలు మరింత జటిలం చేస్తున్నాయి. శాసనసభ చేసిన తీర్మానం శాసనమండలిలో వీగిపోయింది. అయినా రాజ్యాంగ నిబంధనలను ఉపయోగించుకుని శాసనసభ మరొకసారి తీర్మానం చేసి ఆమోదం కోసం గవర్నర్ కు పంపింది. గవర్నర్ ఆమోద ముద్రతో రాజధాని వికేంద్రీకరణ చట్టబద్ధంగా మారి ఆ విధానం అమలుకు ఆగస్ట్ మొదటివారానికి మార్గం సుగమమయింది. ఈ లోగా రాష్ట్ర హైకోర్టులో రాజధాని వివాదం మీద డజన్ల కొద్దీ వ్యక్తిగత వ్యాజ్యాలు, ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. హైకోర్టు మొదట ఆగస్ట్ 14 వరకు యథాతథ స్థితి కొనసాగాలని స్టే ఇచ్చింది. ఆ తర్వాత ఆ గడువును సెప్టెంబర్ 21 దాకా పొడిగించింది. ఈ లోగా కేంద్ర ప్రభుత్వం ఇందులో తనకేమీ పాత్ర లేదని, ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ అధీనంలోని విషయమేనని తప్పించుకుంది. ఈ గందరగోళం మధ్య విశాఖపట్నంలో రాజధాని కోసం తలపెట్టిన భూమిపూజ వివాదంలో పడింది. భౌగోళికంగా రాజధాని రాష్ట్ర ప్రజలందరికీ సమాన దూరంలో ఉండడం మంచిదనే ఒక అభిప్రాయం ఉన్నప్పటికీ దేశంలో అనేక రాష్ట్రాలలో చారిత్రక కారణాల వల్ల రాజధానులు కొన్ని ప్రాంతాలకు సుదూరంగానే ఉన్నాయి. అమరావతి సమానదూరంలో ఉన్నట్టు కనబడుతున్నప్పటికీ చంద్రబాబు నాయుడు పాలనాకాలపు అక్రమాల వల్ల, రాజధాని సమస్యను తన కుల సంపన్నుల ప్రయోజనాలతో, రియల్ ఎస్టేట్ ప్రయోజనాలతో ముడిపెట్టడం వల్ల అది వివాదాస్పదం అయింది. ఇప్పుడు కొత్త ప్రభుత్వానికి వికేంద్రీకరణ అనే ప్రజాస్వామిక విధానం పట్ల ఆసక్తి ఏమీ లేదని, ఇక్కడ కూడ రియల్ ఎస్టేట్ ప్రయోజనాలే ప్రాధాన్యత వహిస్తున్నాయనీ స్పష్టమే. ఈ స్థితిలో నిజమైన ప్రజా సమస్యలను, రాజధాని సమస్య కన్న ప్రధానం చేయడమే ప్రగతిశీల ఆలోచనాపరుల బాధ్యత కావాలి.

వీ


కరోనా కట్టడిలో చిన్నదేశాల విజయం


- రాజేంద్రబాబు అర్విణి

కరోనా తాకిడికి అగ్ర రాజ్యాలుగా పేరుపొందిన దేశాలు, బాగా అభివృద్ధి చెందినవిగా గుర్తింపు పొందిన దేశాలు విలవిలలాడి పోతున్నాయి. ఈ సంపాదక వ్యాఖ్య రాసే సమయానికి అమెరికాలో కోవిడ్ బాధితుల సంఖ్య 56 లక్షలు దాటగా, మరణాలు 1 లక్షా 75 వేల 298. కరోనాకు పుట్టినిల్లయిన చైనాలో ఆ దేశ ప్రభుత్వం ప్రకటించిన అధికారిక లెక్కల ప్రకారం వ్యాధి సోకిన వారు 84,939 అయితే మరణాలు 4,634. 14 కోట్ల 60 లక్షల జనాభా కలిగిన రష్యాలో ఇంతవరకు ఒక లక్ష మందికి ఈ వ్యాధి సోకగా అందులో దాదాపు 17 వేల మంది మరణించారు. బహుళ ప్రచారంలేని దేశాలు, పెట్టుబడి తన విశృంఖలత్వం ప్రదర్శించని దేశాలలో పరిస్థితి కొంత ఆశాజనకంగా ఉంది. వియత్నాంలో కరోనా బారినపడిన వారు 1014, మరణాలు 25. దాదాపు 9 కోట్ల జనాభా కలిగిన ఆ దేశం తన జిడిపిలో 6.6 శాతం (2012 బడ్జెట్ లెక్కల ప్రకారం) ప్రజారోగ్య పరిరక్షణ కోసం ఖర్చు చేస్తుంది. వియత్నాంలో ప్రైవేట్ వైద్యం ఉన్నా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉండే వైద్య వ్యవస్థకే ప్రాధాన్యం ఎక్కువ. ప్రజలు ఎక్కువగా ఆధారపడేది ప్రభుత్వం అందించే వైద్యం మీదే. తన జాతీయ ఆదాయంలో 11 శాతం ప్రజారోగ్యం మీద ఖర్చు పెట్టే న్యూజిలాండ్‌లో రోజూ 300 మందిని ఫోన్‌లోనో, ఇంటర్నెట్ ద్వారానో సంప్రదించి వారి ఆరోగ్య పరిస్థితి కనుక్కొంటూ ఉంటారు. ఆ దేశంలో 1621 మందికి కరోనా సోకితే, 25 మంది మరణించారు. ప్రజలలో ఒక్కొక్కరి మీద సగటున 4500 డాలర్లు ఆరోగ్యం కోసం ఖర్చుపెడుతుంది ఆ దేశం. తైవాన్‌లోని వైద్య వ్యవస్థ ప్రపంచంలోనే అత్యుత్తమమైన వాటిలో ఒకటిగా స్థానం సంపాదించుకుంది. వైద్య బీమా పథకం ద్వారా తైవాన్‌లోని దేశ ప్రజలందరికి అతి స్వల్పమైన ఖర్చుతో వైద్య సదుపాయాలన్నీ అమరుస్తుంది. తైవాన్‌లో ఇప్పటికి నిర్ధారించిన కోవిడ్ కేసులు 487 కాగా మరణాలు 7. పూర్తిగా కోలుకున్న వారి సంఖ్య 457. కరోనాను కట్టడి చేయడంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూఎచ్‌ఓ) ప్రశంసలు కూడా పొందిన దేశాలలో ఒకటి శ్రీలంక. మొత్తం రెండు కోట్ల పది లక్షల జనాభాలో 11 మంది కరోనాతో చనిపోగా ఆ వ్యాధి సోకినవారు 3000 మందికంటే తక్కువే. నాణ్యమైన ప్రాథమిక వైద్యం ప్రజలందరికి అందుబాటులో ఉంచడం శ్రీలంక ప్రత్యేకత. కరోనాను కట్టడి చేయడంలో ప్రశంసనీయమైన కృషిచేసి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిన క్యూబాలో ప్రభుత్వం నుండి వైద్యం పొందడం ప్రజల ప్రాథమిక హక్కుగా రాజ్యాంగంలో పొందుపరుచుకున్నారు.


అమెరికాలో నివసిస్తున్న ఓ ఎన్‌ఆర్‌ఐ మిత్రుడు ఒక ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించాడు. అమెరికాలో రిపబ్లికన్లు అధికారంలో ఉన్న రాష్ట్రాలలో కోవిడ్ మరణాలు అధిక సంఖ్యలో నమోదవుతున్నాయట. వాటితో పోల్చుకుంటే డెమొక్రటిక్ పార్టీవారు పాలిస్తున్న రాష్ట్రాలలో కరోనా మరణాల రేటు తక్కువట. రిపబ్లికన్ పార్టీ అధినేత, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కోవిడ్ పట్ల, ప్రజారోగ్యం పట్ల కనపరుస్తున్న నిర్లక్ష్య వైఖరి, రిపబ్లికన్ పార్టీ వైద్య విధానం కూడా ఇందుకు కారణం కావచ్చు.

వైద్య రంగాన్ని పూర్తిగా ప్రైవేట్ పరం చెయ్యకుండా ప్రజారోగ్యానికి పెద్దపీట వేసిన విధానాలు కలిగిన ప్రభుత్వాలే రోగాల విపత్తు కమ్ముకున్నప్పుడు ప్రజలను కాపాడడంలో చాలావరకు సఫలీకృతం కాగలవన్నది కరోనా మహమ్మారి మనకు నేర్పిన గుణపాఠం. వీ






❖ **వలస భారతం** – (వచన కవితా కావ్యం) – డా॥ జి.వి. కృష్ణయ్య – జనసాహితి ప్రచురణ – 56 పేజీలు, 1/8 డెమీ, రు. 50, ప్రతులకు: మైత్రీ బుక్ హౌస్, జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్ రోడ్డు, విజయవాడ – 520 002




❖ **రావూరి భరద్వాజ కథలు** – పాద్యమి – నశేషం – వీరగాథ – నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణలు – 180 పేజీలు, 1/8 డెమీ, రు. 150




❖ **ది తెలంగాణ ఆర్మ్‌డ్ స్ట్రగుల్ – మై ఎక్స్‌పీరియెన్స్** – నల్ల నర్సింహులు – అనువాదం ఎన్. సాంభశివరావు – నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణలు – 302 పేజీలు, 1/8 డెమీ, రు. 220



❖ **పూలతోట** – అనువాద కథలు – ఐతా చంద్రయ్య – నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణలు – 134 పేజీలు, 1/8 డెమీ, రు. 110



❖ **బొమ్మల బాల భాగవతం** – దాశరథి కృష్ణమాచార్య – సి. నారాయణరెడ్డి – నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణలు – 96 పేజీలు, 1/4 క్రౌన్, రు. 100




❖ **కిషన్‌చందర్ కథలు** – అనువాదం జ్ఞానేంద్ర – నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురణలు – 148 పేజీలు, 1/8 డెమీ, రు. 120


పై ఐదు ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్, గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్), జి.ఎస్.ఐ. పోస్టు, హైదరాబాద్–500068, ఫోన్: 040–29884454




❖ **కొత్త వేకువ** – కవిత్వం – పద్మావతి రాంభక్త – పాలపిట్ట బుక్స్ – 144 పేజీలు, 1/8 డెమీ, రు. 100, ప్రతులకు: పాలపిట్ట బుక్స్, 16–11–20/6/1, 403, విజయసాయి రెసిడెన్సీ, సలీంనగర్, మలక్‌పేట్, హైదరాబాద్ – 500036, సెల్: 9848787284




❖ **జోగులాంబ గద్వాల జిల్లా సాహిత్య చరిత్ర** – సంబరాజు రవిప్రకాశరావు – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణలు – 166 పేజీలు, 1/8 డెమీ, రు. 70




❖ **వనపర్తి జిల్లా సాహిత్య చరిత్ర** – కోట్ల వెంకటేశ్వర రెడ్డి – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణలు – 62 పేజీలు, 1/8 డెమీ, రు. 30




❖ **కామారెడ్డి జిల్లా సాహిత్య చరిత్ర** – డా. వి. శంకర్ – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణలు – 127 పేజీలు, 1/8 డెమీ, రు. 60




❖ **తెలంగాణ పదసంకీర్తనలు** – సంపాదకుడు డా.పి. భాస్కరయోగి – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణలు – 369 పేజీలు, 1/8 డెమీ, రు. 200,




❖ **మల్లినాథసూరి జీవితం – రచనలు** – బృందావనం రామానుజాచార్యులు – డా. గుమ్మా శంకరరావు – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణలు – 168 పేజీలు, 1/8 డెమీ, రు. 70,



❖ **డా. ముకురాల రామారెడ్డి కవిత్వం – నవ్యేకత్తులు – దేవరకొండ దుర్గం** – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణలు – 128 పేజీలు, 1/8 డెమీ, రు. 50,



❖ **ల కు మ** – నవలిక – భరత కళా ప్రపూర్ణ నటరాజ రామకృష్ణ – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణలు – 78 పేజీలు, 1/8 డెమీ, రు. 40,



❖ **నెల్లూరి కేశవస్వామి సమగ్ర కథా సంపుటి** – చార్మినార్ – పసిడిబొమ్మ – ఇతర కథలు – తెలంగాణ సాహిత్య అకాడమి ప్రచురణలు – 364 పేజీలు, 1/8 డెమీ, రు. 160, పై ఎనిమిది ప్రతులకు: తెలంగాణ సాహిత్య అకాడమి, కళాభవన్, రవీంద్రభారతి ప్రాంగణం, హైదరాబాద్ – 500004, ఫోన్ : 040–29703142

ఆగస్ట్ 5 - దేశం సిగ్గుతో తలదించుకోవలసిన రోజు

కశ్మీర్ ప్రజలపై గత ఆగస్ట్ 5న జరిగిన దాడి నుంచి ఈ ఆగస్ట్ 5న జరిగిన రామమందిర శంకుస్థాపన వరకు పరిణామాలను విశ్లేషిస్తున్నారు **అరుంధతీ రాయ్**

సరిగ్గా ఒక సంవత్సరం కింద, 2019 ఆగస్ట్ 5న, కశ్మీర్ లోయలో డెబ్బై లక్షల మంది ప్రజలు ఒక కఠోరమైన సైనిక కర్ఫ్యూ కింద తమ ఇళ్లలో బందీలుగా మారిపోయారు. చిన్నారి పిల్లల నుంచి, రాళ్లు విసిరిన నవయువకుల నుంచి మాజీ ముఖ్యమంత్రుల దాకా, భారత అనుకూల రాజకీయవేత్తల దాకా పదమూడు వేలమంది అరెస్టు చేయబడ్డారు. అలా ప్రివెంటివ్ డిటెన్షన్ పేరిట నిర్బంధానికి గురైనవాళ్లలో చాల మంది ఇంకా జైళ్లలోనే ఉన్నారు. ఆగస్ట్ 4 అర్ధరాత్రి ఫోన్లు మూగవోయాయి, ఇంటర్నెట్ కనెక్షన్లు తెంపివేయబడ్డాయి.

ఆగస్ట్ 6న పార్లమెంటు ఆమోదం పొందిన బిల్లు ప్రకారం జమ్ము-కశ్మీర్ రాష్ట్రానికి అప్పటివరకూ భారత రాజ్యాంగం కల్పించిన స్వతంత్ర ప్రతిపత్తినీ, ప్రత్యేక హోదానూ రద్దు చేశారు. అసలు రాష్ట్రాన్నే రద్దు చేసి, లదఖ్, జమ్ము-కశ్మీర్ అనే రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా మార్చేశారు. లదఖ్ కు శాసనసభ కూడ ఉండదు, నేరుగా న్యూఢిల్లీ పాలన కింద ఉంటుంది.

కశ్మీర్ సమస్య చిట్టచివరికి ఎల్లకాలానికీ పరిష్కారమైపోయిందని చెపుతున్నారు. మరో మాటల్లో చెప్పాలంటే వేలాది మంది సైనికుల, మిలిటెంట్ల, పౌరుల ప్రాణాలతో, వేలాది బలవంతపు 'అదృశ్యాల'తో, క్రూరమైన చిత్రహింసలకు గురైన శరీరాలతో మూల్యం చెల్లిస్తూ దశాబ్దాల పాటు కశ్మీర్ సాగించిన స్వయంనిర్ణయాధికార పోరాటం అంతమై పోయిందని చెపుతున్నారు. లోకసభ వేదిక మీద హోం మంత్రి అమిత్ షా మరొక అడుగు ముందుకు వేశాడు. పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ అని భారతదేశమూ, ఆజాద్ కశ్మీర్ అని కశ్మీరీలూ పిలిచే భూభాగాన్ని, దానితో పాటు గిల్గిత్ - బాల్టిస్తాన్ వంటి సరిహద్దు ప్రాంతాలను స్వాధీనం చేసుకోవడానికి తన ప్రాణాలైనా అర్పించడానికి సిద్ధంగా ఉన్నానని ఆయన అన్నాడు. ఒకప్పుడు పాత జమ్ము-కశ్మీర్ రాజ్యంలో భాగంగా ఉండిన, ప్రస్తుతం చైనాలో భాగంగా ఉన్న అక్సాయి చిన్ ను కూడ ఆయన ఈ జాబితాలో కలిపాడు.

ఆయన ఒక ప్రమాదకరమైన భూభాగంలోకి అడుగుపెడు తున్నాడనాలి. ప్రమాదకరమైన భూభాగం అనడం వాచ్యంగానూ, అలంకారికంగానూ కూడ సరిగ్గా సరిపోతుంది. ఆయన ప్రస్తావిస్తున్న సరిహద్దులు మూడు అణ్వాయుధ దేశాల సరిహద్దుల్లో ఉన్నాయి. భారతదేశంలో వీథుల్లో చెలరేగిన అనుచిత సంబరాల మధ్య, కశ్మీర్ పొందిన అవమానంతో పెచ్చరిల్లిన అదనపు కాంతి ప్రధానమంత్రి ముఖం మీద వెలిగింది. అప్పటికే ఆయన చుట్టూ భగవంతుడి లాగ కాంతివలయం కమ్ముకుని ఉంది. ఇంకా రెచ్చగొట్టేందుకన్నట్టుగా, భారత వాతావరణ శాఖ దేశం గురించి ఇచ్చే వాతావరణ నివేదికల్లో గిల్గిత్ - బాల్టిస్తాన్‌ను కూడ చేర్చడం మొదలుపెట్టింది. భారతదేశం "సరిహద్దు విషయంలో తన మాటల్లో, చేతల్లో జాగ్రత్తగా ఉండాల"ని చైనా ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని దేశంలో పట్టించుకున్నవాళ్లే లేకపోయారు.

ఇంతవరకూ గడిచిన సంవత్సరంలో కశ్మీర్ లో పోరాటం ఎంతమాత్రమూ ఆగిపోలేదు. కేవలం గత కొద్ది నెలల్లోనే పత్రికల్లో వెలువడిన వార్తల ప్రకారమే 34 మంది సైనికులు, 154 మంది మిలిటెంట్లు, 17 మంది పౌరులు చంపివేయబడ్డారు. కరోనా వైరస్‌తో అల్లకల్లోలమైపోయిన ప్రపంచం కశ్మీర్ ప్రజలకు భారత ప్రభుత్వం ఏం చేసిందో పట్టించుకోకపోవడాన్ని అర్థం చేసుకోవచ్చు. నిరంతర కర్ఫ్యూ, సమాచార సంబంధాల నిలిపివేత, ఆ దిగ్బంధనానికి ఉన్న అన్ని అర్థాలూ - వైద్యులు, ఆస్పత్రులు, పనిస్థలాలు అందుబాటులో లేకపోవడం, వ్యాపారం జరగకపోవడం, పాఠశాలలు లేకపోవడం, ప్రియమైనవారిని కలుసుకునే అవకాశం లేకపోవడం - నెలల తరబడి కొనసాగాయి. చివరికి యుద్ధసమయంలో ఇరాక్ లో అమెరికన్ ప్రభుత్వం కూడ ఇటువంటి పని చేయలేదు.

సైనిక కర్ఫ్యూ లేకుండానే, సమాచార సంబంధాల నిలిపివేత లేకుండానే, కొన్ని నెలల పాటు కరోనావైరస్ వల్ల లాక్ డౌన్ విధిస్తేనే, ప్రపంచమంతా అతలాకుతలమైపోయింది. వందల కోట్ల మంది తాము భరించగలిగిన అంచులకూ, మానసిక స్థితి అంచులకూ చేరారు. అటువంటప్పుడు ప్రపంచంలోకెల్లా ఎక్కువ సాంద్రమైన సైనిక మోహరింపులున్న కశ్మీర్ ఎలా ఉండి ఉంటుందో ఊహించండి. మీరు భరిస్తున్న కరోనా వైరస్ వేదన పైన మీ వీథుల నిండా ముళ్ల కంచెల వరుసలను ఊహించుకోండి. సైనికులు మీ తలుపులు బద్దలు కొట్టి మీ ఇంట్లోకి చొరబడి, మీ మగవాళ్లను కొట్టే, మీ ఆడవాళ్లను బూతులు తిట్టే స్థితిని ఊహించుకోండి. మీరు నిలువ చేసుకున్న ఆహారపదార్థాలను వాళ్లు ధ్వంసం చేయడం ఊహించుకోండి. వీథుల నిండా ఏర్పాటు చేసిన మైకులలో చిత్రహింసలకు గురవుతున్న మనుషుల ఆర్తనాదాలు ఊహించుకోండి.

దీనికి న్యాయవ్యవస్థను, భారత అత్యున్నత న్యాయస్థానంతో సహా, అన్ని న్యాయస్థానాలనూ కలపండి. అవన్నీ ఇంటర్నెట్ లేకుండా విధించిన దిగ్బంధనాన్ని సజావుగా సాగిపోనిచ్చాయి. తమ కుటుంబ సభ్యులను ఎక్కడికి ఎత్తుకుపోయారో, ఏమి చేశారో తెలియని కుటుంబాలు దాఖలు చేసిన ఆరు వందల హెబియస్ కార్పస్ పిటిషన్ల మీద ఆ న్యాయస్థానాలు పెదవి విప్పి మాట్లాడలేదు. వీటన్నిటికీ తోడు, భారతీయులు

ఇష్టారాజ్యంగా కశ్మీర్ లో ప్రవేశించి అక్కడ స్థిరపడడానికి తలుపులు బార్లా తెరిచిన స్థానికతా చట్టాన్ని కలుపుకోండి. ఇంతకాలమూ కశ్మీరీలు విలువైనవిగా భావిస్తున్న రాష్ట్ర పౌరసత్వపు ధ్రువీకరణ పత్రాలు చట్టపరంగా ఇంకెంతమాత్రమూ చెల్లవు. తమ మాతృభూమిలో తాము పౌరులే అని చెప్పుకోవడానికి భారత ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నామని చూపే పత్రాల సాక్ష్యం కావాలి. ఆ దరఖాస్తులు తిరస్కరించబడినవారు అసలు అక్కడ నివాసం ఉండడానికే వీల్లేదు. వారిని అక్కడి నుంచి తరలిస్తారు. ఇవాళ కశ్మీర్ లో జరుగుతున్నది ఒక సంస్కృతిని తుడిచిపెట్టేయడం కన్న తక్కువేమీ కాదు.

కశ్మీర్ లో ప్రవేశపెట్టిన కొత్త స్థానికతా చట్టం ఇప్పటికే భారతదేశంలో స్పష్టంగా ముస్లిం వ్యతిరేకమైనదిగా రుజువైపోయిన, 2019 డిసెంబర్ లో ఆమోదం పొందిన పౌరసత్వ సవరణ చట్టానికి, "బంగ్లాదేశీ చొరబాటుదారులను" అడ్డుకోవడానికనే పేరుతో ప్రవేశపెట్టిన జాతీయ పౌర జాబితాకు ఒక అంటుకొమ్మ. బంగ్లాదేశీ చొరబాటుదారులు అంటే ముస్లింలే. వారిని హోం మంత్రి చెదపురుగులు అని కూడ అన్నాడు. అస్సాంలో ఇప్పటికే జాతీయ పౌర జాబితా కల్లోలం సృష్టించింది. లక్షలాది మంది పేర్లను ఆ జాబితా నుంచి కొట్టివేశారు. ప్రపంచంలో ఎన్నో దేశాలు శరణార్థుల సంక్షోభాన్ని పరిష్కరించడానికి ప్రయత్నిస్తుండగా, భారత ప్రభుత్వం మాత్రం తన సొంత పౌరులకు శరణార్థుల పేరు పెట్టి, పరిష్కరించడానికి వీలు కానంత పెద్ద సంక్షోభానికి, ఏ దేశానికీ చెందని ప్రజల సంక్షోభానికి ఆజ్యం పోస్తున్నది.

సిఎఎ, ఎన్ఆర్ సి, కశ్మీర్ లోని కొత్త స్థానికతా చట్టం నిర్ధారిత పౌరులను కూడ కొత్త పత్రాలు ఇమ్మని, వాటిని ప్రభుత్వం ఆమోదిస్తేనే పౌరసత్వం ఇవ్వడం జరుగుతుందని ఆదేశిస్తున్నాయి. తమ ప్రభుత్వం ఆమోదించే వంశపారంపర్య పత్రాలు దాఖలు చేసిన వారికి మాత్రమే జర్మన్ పౌరసత్వం పొందే అర్హత ఉంటుందని 1935లో నాజీ పార్టీ ప్రవేశపెట్టిన న్యూరెంబర్గ్ చట్టాలు ప్రకటించాయి.

ఈ వ్యవహారాలన్నిటినీ ఏమని పిలవాలి? యుద్ధ నేరాలు అనా? మానవత పట్ల నేరాలు అనా?

ఇలా వ్యవస్థా నిర్మాణాలన్నీ కూడబలుక్కోవడాన్ని, భారతదేశపు వీథుల్లో ఉన్మాద సంబరాలను ఏమని పిలవాలి? ప్రజాస్వామ్యం అనా?

ఏడాది తర్వాత చూస్తే, కశ్మీర్ గురించి వీథుల్లో సంబరాలు కనుమరుగైపోయాయి. అందుకు సరైన కారణమే ఉంది. మన ఇంటి ముంగిట ఒక డ్రాగన్ నిలిచి ఉంది. అదేమీ మర్యాదగా కూడ లేదు. 2020 జూన్ 17న మనందరికీ ఒక భయం గొలిపే వార్తతో తెల్లవారింది. లడఖ్ సరిహద్దుల్లో, సుదూరంగా గల్వన్ లోయలోని మంచుకొండల్లో చైనా ప్రజా విముక్తి సైన్యం భారత సైనికులలో ఒక కర్నల్ తో సహా ఇరవై మందిని క్రూరంగా చంపివేసిందనేది ఆ వార్త. ఆ ప్రాంతంలో అనేక చోట్ల చొరబాటు జరిగిందని భారత పత్రికలలో కొన్నిటిలో తర్వాత రోజుల్లో వార్తలు వచ్చాయి. భారతదేశం తన భూభాగంగా భావించే ప్రాంతంలో వందలాది చదరపు కిలోమీటర్లను పి ఎల్ ఎ ఆక్రమించిందని మాజీ సైనికాధికారులు, గౌరవనీయమైన రక్షణ వ్యవహారాల విలేఖరులు అన్నారు. అంటే భారత పత్రికా రంగం చెప్పినట్టు అది ఒక నగ్నమైన దురాక్రమణ మాత్రమేనా? లేక, చైనీయులు తమ కీలక ప్రయోజనాలుగా భావిస్తున్న వాటిని రక్షించుకునే దిశగా అడుగులు కదిపారా? ఆ ప్రాంతంలో వారి కీలక ప్రయోజనాలు అక్సాయి చిన్ ప్రాంతంలోని ఎత్తైన పర్వతాల గుండా పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్ లోకి, లేదా ఆజాద్ కశ్మీర్ లోకి వేస్తున్న రహదారి, వ్యాపార మార్గం. భారత హోం మంత్రి చేసిన దుందుడుకు ప్రకటనలను తీవ్రంగా తీసుకున్నట్టయితే ఎలా చూసినా ప్రమాదం పొంచి ఉందనే అర్థం. అది ప్రమాదం కాకుండా ఎలా ఉండగలదు?

తాను జాతీయవాద ప్రభుత్వాన్నని తీవ్రాతితీవ్రంగా చెప్పుకునే ప్రభుత్వం తన సొంత సార్వభౌమాధికారం ఉన్న ప్రాంతాన్ని వదులుకోవడం అంటే అది భయానకమైన పీడకల కంటె తక్కువేమీ కాదు. అటువంటిదాన్ని సహించడానికే వీలులేదు. కాని చేయగలిగిందేమిటి? ఒక సులభమైన పరిష్కారం కనిపెట్టారు. గల్వన్ లోయ విషాదం తర్వాత కొద్ది రోజులకే ప్రధాని మోడీ జాతిని ఉద్దేశించి ఒక ప్రసంగం చేశాడు. "మన భూభాగంలో ఒక్క అంగుళాన్ని కూడ ఎవరూ ఆక్రమించలేదు. ఎవరూ మన సరిహద్దులు దాటి లోపలికి రాలేదు. మన సరిహద్దు స్థావరాలలో ఏ ఒక్కదాన్నీ ఎవరూ ఆక్రమించలేదు" అన్నాడాయన.

మోడీ విమర్శకులు పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వారు. ఆయన ప్రకటనను చైనా ప్రభుత్వం వెంటనే ఆహ్వానించింది. ఎందుకంటే వాళ్లు ఆ మాటే అంటున్నారు. అయితే మోడీ ప్రకటన కనిపించినంత తెలివితక్కువది కాదు. ఇరు దేశాల సైనికాధికారులు ఉపసంహరణ గురించీ, సైనిక బలగాలు వెనక్కి తగ్గడం గురించీ చర్చలు జరుపుతుంటే, సోషల్ మీడియా నిండా పరిహాసాలు, వ్యంగ్యాలూ వెల్లివిరిశాయి. అసలు చొరబడనే చొరబడని వారు ఉపసంహరించుకునే, వెనక్కి తగ్గే కళ ఎంత అద్భుతం అని వ్యాఖ్యాతలు అన్నారు. చైనీయులు తమదిగా చెప్పుకునే భూభాగంలో కొనసాగుతున్నారు. కాని వాస్తవాలు తెలియని అసంఖ్యాక భారత ప్రజానీకం దృష్టిలో మోడీ విజేతగా మిగిలాడు. అవును, ఆయన టివి మీద విజయం సాధించాడు. అయినా ఏది ముఖ్యమో చెప్పగలవారెవరు? టివి ముఖ్యమా, భూభాగం ముఖ్యమా?

ఎటువైపు నుంచి ఎట్లా చూసినా సరే, దీర్ఘకాలికంగా భారతదేశానికి ఎప్పుడూ యుద్ధ సన్నద్ధంగా ఉండే సైన్యం కావాలి. అది ఇటు పశ్చిమ సరిహద్దున పాకిస్తాన్ తో కావచ్చు, లేదా తూర్పు సరిహద్దున చైనాతో కావచ్చు. దానికి తోడు భారత ప్రభుత్వ వైఖరి వల్ల పొరుగుదేశాలైన నేపాల్, బంగ్లాదేశ్ లు దూరమైపోయాయి. యుద్ధమే వస్తే తన సొంత సంక్షోభాలలో చిక్కుకుని ఉన్న అమెరికా భారత్ సాయానికి వస్తుందని గప్పాలు కొట్టుకునే స్థాయికి దిగజారాం. అవునా? సిరియా, ఇరాక్ లలో కుర్దులను కాపాడడానికి వెళ్లినట్టు అమెరికా భారత్ కు వస్తుందా? లేక సోవియట్ల నుంచి అఫ్ఘన్లను కాపాడడానికి వెళ్లినట్టు భారత్ కు వస్తుందా? లేదా ఉత్తర వియత్నమీయుల నుంచి దక్షిణ వియత్నమీయులను కాపాడడానికి వెళ్లినట్టు వస్తుందా?

రాతి నాకొక కశ్మీరీ స్నేహితుడు ఒక మెసేజి పంపాడు: "భారత్, పాకిస్తాన్, చైనాలు మమ్మల్ని చూడకుండానే మా ఆకాశంలో పోట్లాడుకుంటాయా?" అని. అదేమీ జరగడానికి వీలులేని దృశ్యమేమీ కాదు. ఈ మూడు దేశాల్లో ఏ ఒక్కటీ మరొకదానికన్న నైతికంగా ఉన్నతమైనదేమీ కాదు, మానవీయమైనదేమీ కాదు. మానవజాతికి మెరుగైన మంచి కోసం నిలబడదామని వీరిలో ఏ ఒక్కరికీ లేదు.

అయితే అధికారికంగా యుద్ధమేమీ లేకుండానే, లడఖ్ సరిహద్దు మీద సైన్యాన్ని నిలబెట్టవలసిన అవసరం ఏమీ లేకుండానే, ఆకాశయుద్ధానికి అవసరమైన సరఫరాలు, సామగ్రి అవసరమేమీ లేకుండానే, చైనా దగ్గర ఉన్న యుద్ధ సామగ్రితో సుదూరంగానైనా పోల్చగల సామగ్రి సమకూర్చుకోకుండానే, భారత దేశపు రక్షణ వ్యయం పరిమాణం ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్నది. బడ్జెట్ లో ప్రకటించిన ఆ కేటాయింపు కూడ సరిపోకపోవచ్చు. ఆ పెరుగుదల ఇప్పటికే కుదేలవుతున్న భారత ఆర్థిక వ్యవస్థ మీద గొడ్డలి పెట్టు అవుతుంది. కొవిడ్ లాక్ డౌన్ కన్న ముందే నిరుద్యోగ రేటు 45 సంవత్సరాల్లో అత్యధికంగా ఉంది. భారత జాతీయోత్పత్తి 3.2 శాతం నుంచి 9.5 శాతం కుదింపుకు గురి కావచ్చునని అంచనాలు వేస్తున్నారు. ఈ చైనీస్ చక్కర్స్ ఆటలో తొలి దశల్లో మోడీ ఏమంత బాగా ఆడుతున్నట్టు లేదు.

ఆగస్ట్ మొదటి వారం మరిన్ని మైలురాళ్లను కూడ తీసుకొస్తున్నది. అనాలోచితమైన, దుర్మార్గమైన, చావ చితకగొట్టిన లాక్ డౌన్ ఉన్నప్పటికీ, ఇతర దేశాలతో పోలిస్తే దారుణంగా తక్కువ స్థాయిలో పరీక్షలు జరిగినప్పటికీ, దేశంలో నిర్ధారణ అయిన కరోనా వైరస్ కేసులు ప్రపంచంలోకెల్లా ఎక్కువ వేగంగా పెరుగుతున్నాయి. ఆ వ్యాధి పీడితులలో కత్తులు తిప్పే హోం మంత్రితో సహా మరెందరో ఉన్నారు. ఆ హోం మంత్రి ఈ ఆగస్ట్ 5న ఆస్పత్రి పడక మీద ఉండబోతున్నాడు. ఆయన దగ్గరికి వచ్చేసరికి నాటు వైద్యుల చిట్కాలూ, గోమూత్రం, కరొనిల్ అనే మాంత్రిక ఔషధం, శంఖం ఊదడం, పళ్లాలూ పాత్రలూ వాయించడం, హనుమాన్ చాలీసా చదవడం, గో కరోనా గో అని సంస్కృత మంత్రోచ్చాటనను అనుకరించడం మొదలైన బాబాలూ, సొంత పార్టీ పార్లమెంటు సభ్యులూ చెప్పిన వైద్యాలేవీ పనిచేయడం లేదు. ఉహు, అవేమీ పని చేయవు. ఆయన కోసం అత్యంత ఖరీదైన ప్రైవేటు ఆస్పత్రిలో, అత్యుత్తములైన అల్లోపతి ప్రభుత్వ వైద్యులే కావాలి.

మరి ఈ ఆగస్ట్ 5న భారత ప్రధాన మంత్రి ఎక్కడ ఉండబోతున్నాడు?

నిజంగానే కశ్మీర్ సమస్య ఎల్లకాలానికీ పరిష్కారం అయిపోతే, ఆ రోజున ఆయన అక్కడే ఉండేవాడు. సామాజిక దూరం పాటించే భక్త సమూహాల సన్మానాలు అందుకుంటూ ఉండేవాడు. కాని కశ్మీర్ సమస్య పరిష్కారం కాలేదు. కశ్మీర్ ను మళ్లీ దిగ్బంధనం చేశారు. ఇప్పుడిక లడఖ్ కూడ ఒక యుద్ధ క్షేత్రం అయిపోయింది. అందువల్ల మోడీ చాల తెలివిగా ఆ సంక్షుభిత సరిహద్దు ప్రాంతాల నుంచి దూరం జరిగి, ఒక సురక్షితమైన ప్రాంతానికి చేరి, సుదీర్ఘకాలంగా ఉన్న మరొక ఎన్నికల వాగ్దానాన్ని అమలులోకి తేదలచాడు. మీరిది చదివే సమయానికి ఆయన పూజారులతో, దేశం నలుమూలల నుంచీ ఉచ్చిన తన మనుషులతో, సుప్రీం కోర్టు ఆశీస్సులతో, రామమందిరానికి నలభై కిలోల వెండి పలకల పునాది వేస్తూ ఉంటాడు. ఆ మందిరం బాబ్రీ మసీదు శిథిలాల మీద నిర్మాణం కాబోతున్నది. ఆ మసీదును మోడీ భారతీయ జనతా పార్టీ సభ్యుల నాయకత్వంలో హిందూ మూకలు నేలమట్టం చేశాయి. ఇదంతా ఒక సుదీర్ఘ ప్రయాణం. దాన్ని మనం సంకల్ప విజయం అని పిలుద్దాం.

లాక్ డౌన్ ఉండనీ, ఉండకపోనీ, నేనిది రాస్తున్న సమయానికి, ఆ చరిత్రాత్మక క్షణం కోసం ఎదురుచూస్తూ గాలి వణుకుతున్నది. ఇప్పుడిక అమాయకులూ, సిద్ధాంత అవగాహనలో నిండా కూరుకుపోయినవాళ్లూ మాత్రమే ఆకలీ నిరుద్యోగమూ విప్లవానికి దారి తీస్తాయని నమ్మగలరు. దేవాలయాలూ, స్మృతి చిహ్నాలూ ఆకలిని తీర్చలేవని భ్రమపడగలరు. వాళ్లు ఆ నమ్మకంలో, భ్రమలో ఉండనీ. ఇవాళ ఆకలిగొన్న కోట్లాది మంది హిందువులకు రామమందిరమే కడుపు నింపే ఆహారం. ఇప్పటికే అవమానానికి గురైన ముస్లింలకూ, ఇతర మత మైనారిటీలకూ మరింత అవమానం కలిగిస్తేనే ఆ ఆకలిగొన్న మనుషుల నాలుకల మీద విజయపు రుచి మరింత ఎక్కువవుతుంది. ఈ రుచితో రొట్టె రుచికి పోలికెక్కడ?

2019 ఆగస్ట్ 5 నుంచి 2020 ఆగస్ట్ 5 దాకా జరిగిన 365 రోజుల వైపు చూడడం సులభం. భారతదేశంలోకి కశ్మీర్ అంతిమ 'విలీనం', సిఎఎ, ఎన్ఆర్సి ల ఆమోదం, రామమందిర శంకుస్థాపన – మోడీ పాలనలోని భారతదేశం లాంఛనప్రాయంగా తనను తాను హిందూ రాష్ట్రంగా ప్రకటించుకున్నదనీ, ఒక కొత్త శకం ప్రారంభమైందనీ చెప్పే నిర్ణయాత్మక కాలం ఇది.

కాని చాల సందర్భాలలో ప్రకటనల వెనుక గుర్తింపుకు రాని అపజయాలుంటాయి. మిరుమిట్లు గొలిపే ప్రారంభాలకు అనూహ్యమైన ముగింపులుంటాయి. అతిశయోక్తులతో మోడీ పేరు మారు మోగి పోతున్నప్పటికీ, పార్లమెంటులో భారతీయ జనతా పార్టీకి అఖండ విజయం దక్కినప్పటికీ, భారత జనాభాలో కేవలం 17.2 శాతం మంది మాత్రమే వారికి వోటు వేశారనే వాస్తవం గుర్తుంచుకోవాలి. బహుశా, చైనీయులు అన్నట్టుగా, ఈ విషయంలో మనం కాస్త జాగ్రత్తగా పరిశీలించాలేమో. కాస్త ఆలోచించండి. మోడీ రామమందిర శంకుస్థాపన చేయడానికి ఇప్పుడే ఎందుకు ఎంచుకున్నాడు? ఇదేమీ దసరా కాదు, దీపావళి కాదు. రామాయణంలో గాని, హిందూ పంచాంగంలో గాని ఈ తేదీకి ఏ ప్రాధాన్యతా లేదు. దేశంలోని అనేక ప్రాంతాలలో పాక్షికంగా లాక్ డౌన్ కొనసాగుతూనే ఉన్నది. రామమందిర స్థలంలో సన్నాహాలు చేస్తున్న పూజారులలో, భద్రతా ఏర్పాట్లలో ఉన్న పోలీసులలో అత్యధికులకు కొవిడ్ సోకింది. తర్వాతెప్పుడో జరిపితే హాజరు కాగలిగిన భారీ ప్రజా సమూహాలకు ఇప్పుడు అవకాశం లేదు.

అయినా ఆగస్ట్ 5 ఎందుకు?అది కేవలం కశ్మీర్ పుండు మీద కారం చల్లడానికేనా? లేక భారత్ పుండు కు మలాం పూయడానికా? ఎందుకంటే, వాళ్లు టివి మీద ఏమి చెపుతున్నప్పటికీ, భారత సరిహద్దుల్లో గణనీయమైన మార్పులు జరిగాయి. పెద్ద పెద్ద భూగర్భ ఫలకాలు కదిలిపోతున్నాయి. ప్రపంచ వ్యవస్థ మారిపోతున్నది. నువ్వేదో ప్రధాన పెంపుడు కుక్కవైనట్టు నటించడానికీ, జనం మీద ఎగిరిదూకడానికీ ఇప్పుడిక అవకాశం లేదు. నువ్వు ప్రధాన పెంపుడు కుక్కవేమీ కాదు. ఆ మాట చైనీయులేమీ అనడం లేదు. వీధుల్లో మామూలు మనుషుల ఇంగితానికి కూడ తెలుస్తున్నది.

అంటే 2020 ఆగస్ట్ 5 అనే తేదీ వాస్తవంగా ఏమని ప్రచారం జరుగుతున్నదో అది కాదన్నట్టేనా? పైకి ఎగుస్తున్నట్టు కనబడుతున్న విజయశిఖరం మీద సిగ్గుతో అతికించుకున్న నత్తగుల్ల మాత్రమేనా?

కశ్మీర్ ఆకాశం మీద ఎప్పుడైనా ఒకవేళ భారత దేశమూ పాకిస్తానూ చైనా పోట్లాడుకునే అవకాశమే వస్తే, మన వంటి మిగిలినవాళ్లందరమూ చేయవలసిన పని అక్కడి ప్రజల మీదికి దృష్టి సారించడం.

(అరుంధతీ రాయ్ నవలా రచయిత, సామాజిక కార్యకర్త) వీ

న్యాయవ్యవస్థనా - అన్యాయవ్యవస్థనా?

***న్యాయవ్యవస్థను ప్రశ్నించడమే తప్పు అంటూ సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్‌పై కోర్టు ధిక్కార కేసు పెట్టడమంటే రాజ్యాంగపరమైన మాట్లాడే హక్కును కాలరాయడమే అంటున్నారు* ఇందిరా జైసింగ్**

వ్యక్తిగతమైనదీ రాజకీయమేనని మనకి చాలా కాలం నుంచి తెలుసు. అయితే సంస్థల విషయంలో ఈ రెండింటికీ మధ్య స్పష్టమైన తేడా ఉంది. న్యాయవ్యవస్థ రాజ్యాంగపరమైనది. భారతదేశ ఉన్నత న్యాయస్థానాలలో ఉన్నవాళ్లు ఆ అధికార పాత్రలను నిర్వర్తిస్తుంటారు. అధికారం, అధికారం నిర్వర్తించే వ్యక్తి – ఈ రెండూ వేరువేరు. రాజ్యాంగ విధులను నిర్వర్తించడానికి న్యాయ అధికారాలను కల్పించారు, ఆ అధికారుల వ్యక్తిగత రక్షణ కోసం కాదు.

న్యాయమూర్తులు ఈ తేడాను గుర్తించకపోతే 'నేరపూరిత కోర్టు ధిక్కారం' అన్న బూచిని తెర మీదకి తెస్తారు. ప్రశాంత్ భూషణ్‌కి జరిగినది ఇందుకు చక్కని ఉదాహరణ.

నేరపూరిత కోర్టు ధిక్కారానికి పార్లమెంట్ చట్టపర విధానాన్ని పొందుపరిచింది. ఈ విషయంలో సుప్రీంకోర్టు తన న్యాయపరిధిని వర్తింప చేస్తూ, దానిని తనంతట తాను (సువోమోటో)గా చేపట్టవచ్చని నిర్ణయించింది. చట్టం ప్రకారం కోర్టు ధిక్కార వాజ్యానికి అటార్నీ జనరల్ ఆమోదం అవసరం. కానీ అది లేకుండానే ప్రస్తుత కేసును చేపట్టారు. ఈ నియమాన్ని పట్టించుకోకుండా విచారణతో ముందుకు వెళ్లాలని పరిపాలనాపర నిర్ణయాన్ని కోర్టు తీసుకుంది. అయితే సమీక్షకి గాని, స్క్రూటినీకి గాని పరిపాలనాపర నిర్ణయాన్ని వర్తింపచెయ్యలేదు. ఇది ఎలా జరిగిందో, అందుకు ఎవరు అనుమతించారో, ఎందుకు జరిగిందో మనకు ఏమీ తెలియని అంధకార పరిస్థితి నెలకొని ఉంది.

కోర్టుల ధిక్కార చట్టాన్ని, అటార్నీ జనరల్ ఆమోదం కావాలన్న నియమాన్ని పట్టించుకోకుండా రికార్డులతో కూడిన కోర్టుగా ధిక్కారానికి శిక్షించే అధికారం ఉన్న కోర్టు అని రాజ్యాంగంలోని 129వ అధికరణాన్ని కోర్టు ఆసరాగా చేసుకుంది. ఆ అధికారం విషయంలో ఎటువంటి వివాదం లేదు. ఆ అధికారాన్ని అమలు చెయ్యడానికి కోర్టుల ధిక్కార చట్టం సూచించిన విధి విధానాలను పాటించకపోవడం మాత్రమే వివాదాస్పదమైంది. ధిక్కార విషయంలో మొదటిస్థాయి విచారణగా తన అభిప్రాయం చెప్పమని అటార్నీ జనరల్‌ని కోర్టు అడిగి ఉంటే దాని స్థాయి ఎంతో పెరిగి ఉండేది. ఈ రక్షణ కవచం వెనక ఒక ఉద్దేశం ఉంది. ప్రతి ధిక్కారాన్ని విచారించాల్సిన అవసరం లేదు, ప్రజా ప్రయోజనం దృష్ట్యా అటార్నీ జనరల్ విధాన నిర్ణయం తీసుకుంటారు.

తనకు లేని అధికారాన్ని తీసుకోవడం అన్న అత్యంత ప్రమాదకర పరిణామం ఈ తీర్పువల్ల ఏర్పడుతుంది – ఇకపై ధిక్కార విషయాలలో కోర్టు తన చిత్తం ప్రకారం విచారించి, శిక్షించవచ్చు.

అభియోగాలు మోపకుండా, కోర్టుని అవమానాల పాలుచెయ్యాలన్న దురుద్దేశాన్ని అంటగట్టి దోషిగా పరిగణించడం రాజ్యాంగ బద్ధమైనదేనా? ఈ తీర్పు న్యాయపరంగా లోపభూయిష్టమైనదనీ, రాజ్యాంగ వ్యతిరేకమైనదనీ, జీవించే హక్కుకీ, వాక్ స్వాతంత్రానికి ప్రతిఘాతమైనదనీ అనడానికి ఈ ఒక్క అంశం చాలు.

కోర్టే స్వయంగా పేర్కొన్నట్టు 30 ఏళ్లుగా న్యాయవాదిగా ఉన్న వ్యక్తిని కోర్టు ధిక్కారం కేసులో దోషిగా తీర్పు చెప్పడం చిత్రంగా అనిపిస్తుంది. న్యాయ వ్యవస్థ స్వతంత్రతని కాపాడటంలో న్యాయవాదులు అగ్రభాగాన ఉంటారు. కోర్టుల లోపల ఏం జరుగుతోందో అందరికంటే వాళ్లకే బాగా తెలుస్తుంది. న్యాయమూర్తులు అయినవాళ్లు ఒకప్పుడు వాళ్ల తోటి న్యాయవాదులే. న్యాయమూర్తులు బాగా పనిచెయ్యడం, లేదా పనిచెయ్యక పోవడం వాళ్లు ప్రతి రోజూ చూస్తూనే ఉంటారు. ఒక ప్రధాన న్యాయమూర్తి తరవాత మరొక ప్రధాన న్యాయమూర్తి వచ్చి వాళ్ల వాళ్ల వ్యక్తిగత అభిప్రాయాల ప్రకారం తీర్పులు చెప్పడం, పాత తీర్పులను తిరగదోడటం వాళ్లు గమనిస్తూ ఉంటారు. న్యాయ చరిత్రను ఇతరుల కంటే ఎంతో బాగా న్యాయవాదులు తమ జ్ఞాపకాలలో నిక్షిప్తం చేస్తూ ఉంటారు. అందుకే పత్రికా రంగాన్ని కాకుండా న్యాయవాదిని కోర్టు తమ లక్ష్యంగా చేసుకోవడం ఆశ్చర్యం కలిగించదు.

ఈ కేసులోని రెండు ట్వీట్‌లలో ఒకటి భారతదేశ ప్రధాన న్యాయమూర్తి ఫొటోపై చేసిన వ్యాఖ్యానానికి సంబంధించినది. ఆ ఫొటోలో ప్రధాన న్యాయమూర్తి రోజువారీ దుస్తులలో ఖరీదైన హార్లే డేవిడ్ సన్మోటర్ సైకిల్ మీద ఉన్నారు. ఇది 'వ్యక్తిగతమైన' విషయం అని తీర్పు పేర్కొన్నది. వ్యక్తిగతమైనదానికీ, వ్యవస్థాపరమైనదానికీ మధ్య తేడాలు న్యాయమూర్తులకు తెలుసు. మరి సమస్య ఎక్కడ వస్తోంది?

ప్రజలకు అందుబాటులో లేకుండా కోర్టులను మూసివేశారన్న వ్యాఖ్యానం కోర్టుకి కోపం తెప్పించింది. అక్కడి నుంచి తీర్పు రాజ్యాంగపరమైన అంశాలను పట్టించుకోకుండా ప్రశాంత్‌భూషణ్ వైపు 'వ్యక్తిగతం'గా మళ్లింది. ఇంతకీ అతడు చేసిన నేరం ఏమిటి– అతడి అస్తిత్వమేనా?

అతడు 30 సంవత్సరాలుగా కోర్టులో పని చేస్తున్నాడు. ఈ పనిలో ప్రజాస్వామ్య పరిరక్షణకు, న్యాయ వ్యవస్థ నుంచి జవాబుదారీతనాన్ని కోరడానికి సంబంధించినది కూడా ఉంది. దురుద్దేశపూరిత వాజ్యంలో లాక్‌డౌన్ కాలంలో కూడా కోర్టుని ఆశ్రయించి అతడు అనుకూల ఉత్తర్వులు పొందాడు. కాబట్టి అతడి ట్వీట్ దురుద్దేశపూరితమైనదీ, ఉద్దేశపూర్వకంగా అవమానించేదీ అయ్యిందా? ఇదేమైనా తర్కబద్ధంగా ఉందా?

లాక్‌డౌన్ కాలంలో కోర్టు 626 రిట్ పిటిషన్లను, 12,567 కేసులను విచారించిందని తీర్పులో పేర్కొన్నారు. జమ్ము, కశ్మీర్‌లో లాక్‌డౌన్‌తో సహా వ్యక్తిగత స్వేచ్ఛకి సంబంధించిన ముఖ్యమైన ప్రశ్నలు కోర్టు విచారణకు ఎదురు చూస్తున్నాయి. కోర్టు విన్న 12,567 కేసుల గురించి

కాకుండా, అది ఎటువంటి అంశాలను వినలేదన్న దానిపై ప్రశాంత్ భూషణ్ వ్యాఖ్యానించారని కోర్టు తీరుపై విమర్శలను గమనిస్తున్నవాళ్లకి స్పష్టంగా అర్థమవుతుంది. మొత్తం కథని కేవలం గణాంకాలు వివరించలేవు. ఏవి విన్నారు, ఎప్పుడు విన్నారు, ఎందుకు విన్నారు అన్నవి ముఖ్యమౌతాయి.

న్యాయ వ్యవస్థ సమయం కొరతలో ఉన్నప్పుడు ఆ సమయాన్ని ఎలా కేటాయిస్తారన్నది న్యాయ నాణ్యతని నిర్ణయిస్తుంది. రాశి రీత్యా కాకుండా వాసి రీత్యా దానిని అంచనా వేస్తారు. సుప్రీం కోర్టు కొన్నింటిని మాత్రమే 'అత్యంత ప్రాముఖ్యత' కలిగిన అంశాలుగా నిర్ణయించడం గత కొంత కాలంగా విమర్శకు గురౌతోంది. ప్రశాంత్ భూషణ్ వ్యాఖ్యానం ధిక్కార స్థాయిలో ఉందా అని విశ్లేషించకుండా సుప్రీం కోర్టు పనితీరుని వ్యక్తిగతంగా సమర్థించడానికి ఈ తీర్పు పూనుకుంది. అభియోగాలపై విచారణ లేకుండా, ప్రశాంత్ భూషణ్ వాదనలు వినకుండా ఈ తీర్పు ద్వారా కోర్టు అతడిని తప్పుపట్టడానికే పూనుకున్నట్టు అనిపిస్తుంది.

న్యాయం అందుబాటులో లేదన్న ప్రశాంత్‌భూషణ్ వ్యాఖ్యానం "అతడికి తెలిసిన దాని ప్రకారం తప్పు" అని తీర్పు పేర్కొన్నది. అయితే "తప్పుడు" వ్యాఖ్యానానికీ – అంటే వాస్తవ ఆధారం లేని వ్యాఖ్యానానికీ, అతడికి తెలిసిన దాన్ని బట్టి తప్పుకావడానికీ మధ్యతేడా ఉంది. అంతే కాకుండా, నాకు ఉన్న అభిప్రాయం "నాకు తెలిసిన దాని ప్రకారం తప్పు" ఎలా అవుతుంది? న్యాయం అందుబాటులో లేదన్న అభిప్రాయం ప్రశాంత్‌భూషణ్‌కి ఉంది. వాస్తవాలు, గణాంకాల ఆధారంగా ఆ అభిప్రాయం తప్పని న్యాయమూర్తులు భావించారు. ఏ కేసు వినాలి, ఏది వినకూడదన్నది కోర్టు ఆలోచించి నిర్ణయం తీసుకుంటుంది. దానిపై పౌరుడిగా ప్రశాంత్‌భూషణ్ వ్యాఖ్యానిస్తే అది దురుద్దేశంతో కూడుకున్నది ఎలా అవుతుంది? రాజ్యాంగపరంగా విచారించాల్సినది వ్యక్తిగతంగా మారిందని అందుకే అనిపిస్తోంది.

వ్యవస్థని మెరుగుపరిచే సదుద్దేశంతో న్యాయ వ్యవస్థపై చేసే వ్యాఖ్యానాలను అనుమతించవచ్చని న్యాయమూర్తులు ఒప్పుకుంటున్నారు. అయితే ప్రశాంత్‌భూషణ్ వ్యాఖ్యానాలు దురుద్దేశ పూరితమైనవన్న నిర్ణయానికి దేని ఆధారంగా వాళ్లు వచ్చారు?

తీర్పులో ఆ తరవాత అంతా వాస్తవాలను చూడడానికి ఇష్టపడకపోవడం కనిపిస్తుంది.

"గత ఆరు సంవత్సరాలుగా భారత ప్రజాస్వామ్యం విచ్ఛిన్నం కావడంలో దేశంలో సర్వోన్నత న్యాయ స్థానం అయిన సుప్రీం కోర్టు కీలక పాత్ర పోషించిందన్న అభిప్రాయాన్ని ఈ ట్వీట్ స్పష్టంగా కలగచేస్తోంది. న్యాయ వ్యవస్థ పట్ల ప్రజల నమ్మకాన్ని ఈ ట్వీట్ చెదరగొడుతోంది అనడంలో ఎటువంటి అనుమానం లేదు. ట్వీట్‌లోని మొదటి సగంలోని నిజా నిజాలలోకి వెళ్లాలనీ, రాజకీయ చర్చలకు న్యాయస్థానాన్ని వేదికగా మార్చాలనీ మాకు లేదు. న్యాయాన్ని అందించే వ్యవస్థకి నష్టం చేకూర్చాలనుకోవడం గురించే మేం పట్టించుకుంటున్నాం. భారత దేశ సర్వోన్నత న్యాయ స్థాన, సర్వోన్నత న్యాయ మూర్తి వ్యవస్థల అధికారాన్ని, గౌరవాన్ని ఆ ట్వీట్ బంగపరుస్తోందనీ, చట్ట సర్వోన్నత అధికారాన్ని నేరుగా ప్రతిఘటిస్తోందనీ అన్నింటినీ పరిశీలించిన తరవాత మేం భావిస్తున్నాం."

భారతదేశంలో 'ప్రజాస్వామ్యం చచ్చిపోయిందా, లేదా' అన్నది రాజకీయాలకు సంబంధించినదని కోర్టు సరిగానే గుర్తించింది. అటువంటప్పుడు, ప్రజాస్వామ్యాన్ని రక్షించాల్సిన వ్యవస్థపై చేసిన విమర్శ కూడా రాజకీయ ఉపన్యాసం అవుతుంది. ఇది తప్పు ఎలా అవుతుంది? రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని సుప్రీం కోర్టు సంరక్షించాలి. భారత దేశంలో ప్రజాస్వామ్య పరిస్థితిపై అనుమతించిన విమర్శలో దాని సంరక్షకుల చర్యలపై కూడా వ్యాఖ్యానించే హక్కు ఉంటుంది. ట్వీట్‌లో మొదటి భాగాన్ని తప్పుపట్టకుండా రెండవ భాగాన్ని తప్పు పట్టడాన్ని చూస్తే అతడి మాటలలో ధిక్కారం ఉందా అనే దానికంటే ప్రశాంత్ భూషణ్ ఆ మాటలు అనటమే ధిక్కారంగా కోర్టు పరిగణించిందని భావించాల్సి వస్తోంది. అంటే బార్ సభ్యుడికీ, కోర్టు బెంచ్‌కీ మధ్య వ్యక్తిగత వివాదాన్ని ధిక్కార వాజ్యంగా మలిచారని భావించాల్సి వస్తోంది.

నా గురించి చెప్పాల్సి వస్తే, నా వృత్తి ద్వారా నేను మనందరి ప్రాథమిక స్వేచ్ఛా, స్వాతంత్రాలను కాపాడడానికి రాజ్యాంగ విధిని నిర్వర్తిస్తున్నాను. ఆ దృష్ట్యా చూస్తే, కోర్టులో నా పని రాజకీయమైనది.

తన చర్యలను తనకు తానుగా సమర్థించుకోడానికి కోర్టు దిగి వచ్చినట్టు ఇక్కడ అనిపిస్తోంది.

ఈ తీర్పు భవిష్యత్తుపై ఎటువంటి ప్రభావం చూపిస్తుంది? న్యాయ వృత్తిలో ఉన్న వాళ్లు భయభ్రాంతులై మౌనంగా ఉండిపోతారా? అదే గనక జరిగితే అంతకంటే విషాదం ఉండదు. రాజ్యాంగ పరిరక్షణలో వాళ్లు అగ్ర భాగాన ఉంటారని నేను ఇంతకు ముందే పేర్కొన్నాను. కోర్టులో సమస్యలను ముందుగా ఎత్తి చూపేవాళ్లు (విజిల్ బ్లోయర్స్)గా ఇతరులకంటే న్యాయవాదులకి రక్షణ అవసరం ఎక్కువగా ఉంటుంది. ఇంకా ఆమోదం పొందని విజిల్ బ్లోయర్ల చట్టం న్యాయవాదులకు కూడా వర్తింప చేయాలని సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు. ఇప్పుడు దానికి సమయం వచ్చింది. ఇటీవల కాలంలో న్యాయవాదులను కార్యనిర్వాహక వర్గం లక్ష్యంగా చేసుకుని న్యాయం కోసం న్యాయ స్థానాలను ఆశ్రయించేలా చేసే ధోరణిని చూస్తూ ఉన్నాం. ఇది అంతిమంగా కోర్టుకు వెళ్లాల్సిన ప్రతి పౌరుడిపై ప్రభావం చూపిస్తుంది కాబట్టి దీనిని న్యాయ ప్రాతినిధ్యంపై దాడిగా కోర్టు గుర్తించాలి గాని న్యాయవాదులపైనే మళ్లీ దాడికి పాల్పడకూడదు.

సచేతనమైన న్యాయవాదుల బృందం (బార్) లేకుండా సచేతనమైన న్యాయ వ్యవస్థ మనలేదు. ఈ తీర్పుకి మొట్టమొదట బలి అయ్యేది మా న్యాయవాదులే. గమ్మున ఉండండి లేదా ధిక్కార వాజ్యాన్ని ఎదుర్కోండి అన్న సందేశాన్ని న్యాయవాదులకు కోర్టు ఇస్తోంది.

ఈ తీర్పు వల్ల పత్రికా రంగం ప్రభావితం కాకపోవచ్చు. అత్యవసర కాలంలో లాగా సంపాదకీయాలలో ఏమీ రాయకుండా ఖాళీగా వదిలేస్తే అద్భుతంగా ఉంటుంది. న్యాయ వ్యవస్థపై పత్రికా రంగం విమర్శలు చేయగూడదనటం (జస్టిస్ డెన్నింగ్ మాటలలో) బెకబెకలాడవద్దని కప్పని ఆదేశించినట్లు ఉంటుంది.

ఎలా రాయకూడదన్న దానికి ఈ తీర్పు చక్కని ఉదాహరణ అవుతుంది. మోటరుసైకిల్ నడిపేవాళ్లు ఖరీదైన హార్లే డేవిడ్‌సన్ కాకుండా సాధారణ హీరో హోండా నడిపి లాటిన్ అమెరికాలో చే గువేరా లాగా రోగాలను, పేదరికాన్ని చూడడానికి సన్నద్ధమౌతారేమో.

(రచయిత్రి భారత దేశ అదనపు సొలిసిటర్ జనరల్‌గా గతంలో పనిచేశారు. భారతదేశ సర్వోన్నత న్యాయస్థానంలో సీనియర్ న్యాయవాదిగా ఉన్నారు. ఈ వ్యాసం మొదట బ్లూమ్స్ బెర్గ్‌క్వింట్‌లో ప్రచురితమయ్యింది.)

(అనువాదం : కె. సురేష్) వీ

వ్యవసాయరంగ ఆర్డినెన్స్‌లతో ఎవరికి లాభం?

వ్యవసాయ రంగ అభివృద్ధి పేరుతో కేంద్రం తెచ్చిన ఆర్డినెన్స్‌లు విదేశీ, స్వదేశీ బహుళజాతి కంపెనీలకు మేలు చేస్తూ భారత గ్రామీణ పేద రైతాంగాన్ని మరింత ఊబిలోకి నెడుతాయని అంటున్నారు **కన్నెగంటి రవి**

భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్యం గురించి చాలా కాలంగా ఒక మాట వినిపిస్తుంది. పేదలు ఓటర్లుగా ఎన్నికలలో ఓట్లు వేసి తమ బాధ్యత నెరవేరుస్తారు. గెలిచిన పార్టీల ప్రభుత్వ పెద్దలు ధనికులకు సేవచేసి తమ కృతజ్ఞత చెప్పుకుంటారు. ఐదేళ్లకు ఒకసారి జరిగే ఈ ప్రక్రియలో సాధారణ ప్రజలు తమ జీవితాలలో ఏ మార్పు కనపడక నిట్టూరుస్తుంటారు.

గత 73 ఏళ్ల 'స్వతంత్ర్య' పాలనలో మొదట 40 ఏళ్లు పాలకులు కొంత ముసుగుతో సంక్షేమ రాజ్య భావన కలిగించడానికి ప్రయత్నాలు చేశారు. కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో ప్రభుత్వ సంస్థలను నెలకొల్పి, నడిపించి తాము ప్రజలకు వాగ్దానం చేసిన సోషలిజం వైపు పోతున్నట్లుగా చెప్పుకోవడానికి ప్రయత్నం చేశారు. స్వాతంత్రోద్యమ ఆకాంక్షలతోనూ, సాధారణ ప్రజల, గ్రామీణ రైతుకూలీల, కార్మికుల, ఉద్యోగుల నిరంతర ఉద్యమాల ఫలితంగానూ ప్రజలకు హక్కులు కల్పిస్తూ కొన్ని చట్టాలు ఉనికిలోకి వచ్చాయి.

ప్రజలు సంఘటితంగా తగిన స్పృహతో ఉండి, గట్టిగా అడిగిన చోట ఈ చట్టాలను, హక్కులను అమలు చేయించుకోగలిగారు. ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిని చల్లార్చడానికి అనివార్యంగా ప్రభుత్వాలు కొన్ని సంక్షేమ పథకాలను ప్రకటించి, అరకొరగానైనా అమలు చేయవలసి వచ్చింది. బాలగోపాల్ అన్నట్లు, ప్రజల పోరాటాల ఫలితంగానే ఈ సంక్షేమ పథకాలు వచ్చాయి. కాబట్టి వీటి సక్రమ అమలు కోసం కూడా ప్రజలే పోరాడాల్సి ఉంటుంది. సంక్షేమ పథకాలను రాజ్యం కుట్రగా చూసి, వాటి రక్షణ కోసం, అమలు కోసం పోరాడకపోతే, ప్రజల జీవితాలు దుర్భరమవుతాయి.

కానీ గత 30 ఏళ్లలో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి, ప్రపంచ వాణిజ్య సంస్థలు భారత ఆర్థిక వ్యవస్థలో నేరుగా జోక్యం చేసుకుంటూ, పాలకులను నేరుగా శాసించడం ప్రారంభించాయి. తమ విధానాల అమలు కోసం అవి ఒత్తిడి చేశాయి. భారతదేశ ఆర్థిక వ్యవస్థ బాగుపడాలంటే సరళీకరణ, ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ మూడు మంత్ర దండాలుగా పని చేస్తాయని ప్రచారం చేశారు.

ఈ ఆర్థిక, పారిశ్రామిక విధానాలు గ్రామీణ ప్రాంతాన్ని మాత్రం మరింత సంక్షోభంలోకి నెట్టాయి. సన్న, చిన్నకారు, మధ్యతరగతి రైతులు ఆర్థికంగా చితికిపోయారు. ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటలు విస్తరించడమే కాదు, పంటల ఉత్పత్తి ఖర్చులూ భారీగా పెరిగిపోయాయి. ఎరువులు, పురుగు మందులు, కలుపు మందుల వినియోగం బాగా పెరిగిపోయింది. గ్రామీణ కుటుంబాలు అర్ధాకలితో, అనారోగ్యంతో, అప్పులతో కుంగిపోతున్నాయి. రైతు బలవన్మరణాల సంఖ్య గణనీయంగా పెరిగింది. గత 25 సంవత్సరాలలో రెండు తెలుగు రాష్ట్రాలలో 50,000 మంది రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు ఆత్మహత్యలు చేసుకున్నారు. గ్రామీణ ప్రాంతం నుండి వలసలు భారీగా పెరిగాయి. మెరుగైన జీవనోపాధికోసం కాకుండా, బతికి ఉండడం కోసం ఈ వలసలు సాగాయి.

వ్యవసాయ కుటుంబాల ఆదాయాలు గణనీయంగా పడిపోవడమే ఈ వలసలకు, ఆత్మహత్యలకు ప్రధాన కారణం. గ్రామీణ ప్రజలకు ఉపాధి అవకాశాలను కల్పించే సహజ వనరులు కూడా తగ్గిపోతున్నాయి. లేదా కాలుష్యం బారిన పడుతున్నాయి. భూగర్భ జలాలు అడుగంటి పోవడం, భూసారం తగ్గిపోవడం, అడవుల విస్తీర్ణం తగ్గిపోవడం లాంటివి గ్రామీణ, ఆదివాసీ ప్రజలను మరింత సంక్షోభంలోకి నెడుతున్నాయి.

ఈ పరిస్థితికి ప్రధాన కారణం కేంద్ర, రాష్ట్ర పాలకుల విధానాలే. పట్టణాభివృద్ధి, పారిశ్రామిక, సేవా రంగాల అభివృద్ధి పేరుతో గ్రామాలను, గ్రామీణ ప్రజలను నిర్లక్ష్యం చేస్తూ, నిధుల కేటాయింపు చేయకుండా, గ్రామీణాభివృద్ధిని, వ్యవసాయ కుటుంబాల సంక్షేమాన్ని గాలికి వదిలేశారు. ప్రభుత్వ రంగ వ్యవసాయ విస్తరణ వ్యవస్థను కుంటుపరిచి, పూర్తిగా వ్యవసాయ రంగాన్ని ప్రైవేట్ కంపెనీల, దళారీల దోపిడీకి ఒదిలేశారు. విత్తనాలు, రసాయనాలు, యంత్రాలు, ఇతర మౌలిక వసతులు, చివరికి పంటసాగు సలహాలు – అన్నిటి కోసం ప్రైవేట్ కంపెనీల మీద, వ్యాపారుల మీద ఆధారపడి బతకాల్సిన దుస్థితికి రైతులను నెట్టారు. రైతులను ఒంటరులను చేసి లాభాపేక్ష నిండిన కంపెనీల ఆకలికి బలి చేశారు.

ఈ కాలంలో కూడా నూతన ఆర్థిక విధానాలకు, సామ్రాజ్యవాద ప్రపంచీకరణకు వ్యతిరేకంగా భారత ప్రజలు పోరాడుతూ వచ్చారు. ముఖ్యంగా ఆదివాసీ ప్రజలు తమ అడవుల, అడవులలో వనరుల రక్షణకు సాగించిన మిలిటెంట్ ఉద్యమాలు అనివార్యంగా అటవీ హక్కుల చట్టం లాంటిది తేవడానికి కారణమయ్యాయి. ప్రజలలో పెరిగిన పౌష్టికాహార లోపం, తగ్గిన కొనుగోలు శక్తి, అక్కడక్కడా సంభవించిన ఆకలి చావులు ప్రాతిపదికగా చేసుకుని వివిధ సామాజిక సంస్థలు నిర్విరామంగా సాగించిన కృషి ఫలితంగా ఆహార భద్రతా చట్టం వచ్చింది. విద్యా రంగంలో ప్రైవేటీకరణ ఫలితంగా, ప్రభుత్వ విద్యా సంస్థల ప్రమాణాలు పడిపోవడం, ఫలితంగా పేద విద్యార్థుల డ్రాప్ అవుట్లు పెరగడం నేపథ్యంగా, విద్యార్థి, ఉపాధ్యాయ ఉద్యమాలు, సామాజిక సంస్థల కృషి కారణంగా విద్యా హక్కు చట్టం వచ్చింది. ప్రభుత్వ విధానాల రూపకల్పనలో, పథకాల అమలులో పారదర్శకత కోరుతూ సాగించిన ఉద్యమాల ఫలితంగా సమాచార హక్కు చట్టం వచ్చింది. గ్రామీణ పేదలకు 100 రోజుల పనిని హక్కుగా కల్పిస్తూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూడా ఈ కాలంలోనే అమలులోకి వచ్చింది.

సాధించుకున్న ఈ చట్టాలకు కొన్ని పరిమితులు ఉండవచ్చు.

అమలును నీరు కార్చడంలో పాలకుల అనివార్యతలు ఉండవచ్చు. అవినీతి ఉండవచ్చు. కానీ ఈ చట్టాలు ప్రజలకు కొంత ఊరట నిచ్చేవి. వారి జీవన ప్రమాణాలు మరింత దిగజారిపోకుండా కొంత వెసులు బాటును ఇచ్చేవి. వీటి అమలు కోసం చేసే పోరాటాలు వీటిని మరింత సమగ్రపరిచే అవకాశం ఎప్పుడూ ఉంటుంది. ఇవి ఉనికిలో ఉండడం వల్లనే ప్రజలు, ప్రజా సంఘాలు తమ హక్కుగా వీటి అమలు కోసం ఎలుగెత్తి పోరాడ గలుగుతారు.

కానీ గత 6 సంవత్సరాలలో మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిరంకుశ స్వభావంతో వ్యవహరిస్తున్నది. కరోనా సంక్షోభ కాలంలో కూడా ఈ ప్రభుత్వ పాలనా తీరు అందుకు భిన్నంగా లేదు. దేశంలో పేద ప్రజల, వలస కూలీల గురించి క్షణం కూడా ఆలోచించకుండా అకస్మాత్తుగా లాక్‌డౌన్ ప్రకటించింది.

ఇప్పుడు దేశంలో బక్క రైతుల స్థితిగతుల గురించి ఏమాత్రం స్పృహ లేకుండా కేంద్ర ప్రభుత్వం 3 ఆర్డినెన్స్‌లు జారీచేసింది. పైగా తాము జారీ చేసిన ఈ ఆర్డినెన్స్‌లు రైతులను బంధ విముక్తులను చేస్తాయని చెబుతున్నది. రైతులు స్వేచ్ఛగా తమ ఉత్పత్తులను ఎక్కడైనా అమ్ముకోవచ్చని, తాము పండించిన పంటలకు తామే ధరలను నిర్ణయించు కోవచ్చు అని బుకాయిస్తున్నది. నిత్యావసర సరుకుల చట్టంలో తెచ్చిన సవరణ మొత్తం భారత ప్రజలకు మేలు చేస్తుందని చెప్పుకుంటున్నది.

వ్యవసాయ రంగంలో సంస్కరణలు అంటూ కేంద్రం తెచ్చిన ఈ మూడు ఆర్డినెన్స్‌లు కూడా కరోనా కంటే ప్రమాదకరం. కేవలం లాభాపేక్ష తప్ప, ఇతర ఏ నియమాలు పాటించని విదేశీ, స్వదేశీ బహుళ జాతి కంపెనీలు, వ్యాపారులు గ్రామీణ పేద రైతాంగం మీదకి ఎగబడేలా చేస్తాయి. సన్న చిన్నకారు రైతులను కొల్లగొడతాయి. వారిని మరింత నష్టాల ఊబిలోకి దించి, బలవన్మరణాల వైపు నెడతాయి.

కేంద్ర ప్రభుత్వం నిత్యావసర సరుకుల చట్టంలో సవరణ చేస్తూ ఒక ఆర్డినెన్స్ తెచ్చింది. ఈ సవరణ ప్రకారం చిరు ధాన్యాలు, పప్పు ధాన్యాలు, నూనె గింజలు, ఉల్లిగడ్డలు, ఆలుగడ్డలు ఇకపై నిత్యావసర సరుకుల చట్టం పరిధిలో ఉండవు. వీటి నిల్వ, ధరలపై ప్రభుత్వానికి ఎటువంటి నియంత్రణ ఉండదు. కొన్ని ప్రత్యేక పరిస్థితులలో మాత్రమే ప్రభుత్వం జోక్యం చేసుకుంటుంది. వ్యాపారులు ఈ ఉత్పత్తులను ఎంతపెద్ద మొత్తంలో నిలువచేసుకున్నా అది నల్లబజారు కిందికి రాదు.

భారతదేశంలో నూటికి 70 మంది ప్రజలు దారిద్ర్యంలో మగ్గుతున్నారు. ప్రజల కొనుగోలు శక్తి అతి తక్కువగా ఉంది. ప్రభుత్వం ఆహార భద్రత చట్టాన్ని తెచ్చి రేషన్ కార్డుల ఆధారంగా ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వహిస్తే తప్ప అత్యధిక మంది ప్రజలు బతకలేరని ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి.

కరువులు, వర్షాభావ పరిస్థితులు, తుపాన్లు, వరదలు, భూకంపాలు, ప్రజల జీవితాలను అల్లకల్లోలం చేసినప్పుడు, అకస్మాత్తుగా ఆహార ధాన్యాల, ఇతర నిత్యావసర సరుకుల ధరలు వ్యాపారులు పెంచకుండా ఈ చట్టం ద్వారా అడ్డుకునే అవకాశం ఉంది. అదే స్ఫూర్తితో ప్రభుత్వాలు అమలు చేశాయా లేదా అనేది వేరే చర్చ. కానీ ప్రజలు, ప్రజా సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వాలను ప్రశ్నించడానికి ఒక అవకాశం ఉండేది.

కరోనా వైరస్ కారణంగా లాక్‌డౌన్ విధించినప్పటికీ ఆహార ఉత్పత్తుల, కూరగాయల, పండ్ల, పాల ధరలు విపరీతంగా పెరిగి పోకుండా, పేద మధ్య తరగతి ప్రజలు కొనుగోలు చేయడానికి కారణం ఈ చట్టం ఉనికిలో ఉండడం కూడా..

ఇప్పుడు ఈ చట్ట సవరణతో ప్రభుత్వాలకు ఉన్న హక్కు తొలగిపోయింది, ఇప్పుడు దేశంలో పండే పంటలు, ఇతర ఉత్పత్తులు బడా కంపెనీల, వ్యాపారుల కబంధ హస్తాల్లోకి వెళ్లిపోతాయి. ఇకపై వినియోగదారుల మార్కెట్‌ను, సరుకుల ధరలను వాళ్లే నియంత్రిస్తారు. ఇప్పటికే పప్పు ధాన్యాలు, నూనె గింజలు లాంటి సరుకుల ధరలను కొన్ని కంపెనీలు నియంత్రిస్తున్నాయి. దేశంలో ఎగుమతి దిగుమతి విధానాలు కూడా ప్రజలకు కాక, కంపెనీలకు, వ్యాపారులకు అనుకూలంగా ఉన్నాయి.

ఈ సందర్భంలోనే కొందరికి, కొన్ని భ్రమలు ఏర్పడుతున్నాయి. ఈ ఆర్డినెన్స్ వినియోగదారులకు కొంత ఇబ్బంది కలిగిస్తుందేమో కానీ, పంటలు పండించి వ్యాపారులకు అమ్ముకునే రైతులకు ఇది మంచి చేస్తుంది కదా అనే అభిప్రాయం కొందరికి ఉంది.

రైతులకు అటువంటి మంచి ఏమీ జరగకుండా, వ్యాపారులకు, కంపెనీలకు మాత్రమే మంచి జరిగేలా ప్రభుత్వం మరో రెండు ఆర్డినెన్స్‌లు ఈ సమయంలోనే జారీచేసింది.

రైతు ఉత్పత్తుల వ్యాపార, వాణిజ్య (ప్రోత్సాహక, సులభతర) ఆర్డినెన్స్ 2020 అందులో ఒకటి.

రాష్ట్రంలో, రాష్ట్రాల మధ్యలో పారదర్శకంగా, ఆంక్షలు లేని, సమర్థమైన వాణిజ్య కార్యకలాపాలు రైతులు నిర్వహించుకోవచ్చని, పైగా తమ ఉత్పత్తులకు తామే ధరలు నిర్ణయించుకోవచ్చు అని ఈ ఆర్డినెన్సు చెబుతోంది.

ఇకపై, పాన్ కార్డు ఉన్న రైతులు, ఇతర వ్యక్తులు, భాగస్వామ్య సంస్థలు, కంపెనీలు, సహకార సంఘాలు/రైతు ఉత్పత్తిదారుల కంపెనీలు ఎటువంటి లైసెన్స్‌లు, ఫీజులు, పరిమితులు లేకుండా వ్యవసాయ ఉత్పత్తుల మార్కెటింగ్ నిర్వహించుకోవచ్చని ఈ ఆర్డినెన్స్ సారాంశం. మార్కెట్ యార్డ్ బయట కూడా ఎక్కడైనా, ఎప్పుడైనా, ఎలక్ట్రానిక్ ప్లాట్‌ఫాంపై (ఇ–మార్కెట్) కూడా వ్యాపారం చేసుకోవచ్చు.

వినడానికి ఇది అంతా అద్భుతంగా అనిపిస్తుంది కదూ. కానీ ఆచరణలో ఇది ఎవరికి లాభం చేస్తుంది?

రైతులు అసంఘటిత స్థితిలో ఉన్నారు. రైతు సహకార సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల కంపెనీలు ఇప్పటికీ బలహీనంగా ఉన్నాయి. నిర్వహణ పెట్టుబడి లేకపోవడం, మౌలిక సౌకర్యాల కొరత, ఈ సంఘాలకు పెద్దగా ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం ఈ సంఘాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు.

బడా బహుళజాతి కంపెనీలతో, వ్యాపారులతో తమ ఉత్పత్తులకు మంచి ధరల గురించి బేరమాడే స్థితిలో రైతులు లేరు. అన్నిటినీ మించి కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ప్రకటించే కనీస మద్దతు ధరలకు చట్టబద్ధత లేదు. ఈ కనీస మద్ధతు ధరల అమలు తీరుచూస్తే అత్యంత దారుణంగా ఉంది. మెజారిటీ రాష్ట్రాలలో ఈ మద్దతు ధరల గురించి రైతులకు సమాచారం, అవగాహన లేదు. రెగ్యులేటెడ్ మార్కెట్ యార్డులు ఉన్నచోట కూడా కొన్ని రాష్ట్రాలలో ప్రభుత్వాలు మాత్రమే కనీస మద్ధతు ధరలకు వరి ధాన్యం, గోధుమలు లాంటివి కొనుగోలు చేస్తున్నాయి. ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మార్కెట్ యార్డ్‌లో కూడా వ్యాపారులు ఎం.ఎస్.పి కంటే తక్కువ ధరలకే కొంటున్నారు.

వ్యాపారులు సీజన్ ప్రారంభంలోనే గ్రామాలకు వెళ్లి అతి తక్కువ ధరలకు రైతుల నుండి పంటలు కొంటున్నారు. సన్న, చిన్న కారు రైతులు తాము పండించిన పంటలను కొంత కాలం నిల్వ చేసుకొని, మంచి

ధరలు వచ్చాక అమ్ముకునే స్థితి లేదు. గ్రామాలలో డ్రయ్యింగ్ యార్డులు, గిడ్డంగులు లేకపోవడం, తక్షణ డబ్బు అవసరాలు, తక్కువ ధరలకే తమ పంటలు అమ్ముకునే పరిస్థితికి రైతులను నెడుతున్నాయి. రైతులు గ్రామాలు దాటి ఇతర ప్రాంతాలకు, రాష్ట్రాలకు వెళ్లి తమ ఉత్పత్తులను నేరుగా అమ్ముకునే స్థితి, తమ పంటలకు తామే ధరలు నిర్ణయించుకునే పరిస్థితి ఎక్కడ ఉంది ?

పైగా వ్యాపారులు రైతులకు విత్తనాలు, ఎరువులు, పెట్టుబడి కూడా అప్పుగా ఇచ్చి ఎక్కువ వడ్డీ వసూలు చేసుకుంటారు. ఈ కారణంగా పంటలను కూడా తక్కువ ధరకు వారే కొనుగోలు చేస్తున్నారు.

ఈ నేపథ్యంలో ఈ ఆర్డినెన్స్ ఆహార సరఫరా చైన్‌లో ఉన్న కంపెనీలకు, మరింత మంది బడా వ్యాపారులకు, రిటైల్ చైన్స్‌కు, ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులకు, దళారులకు మరిన్ని అవకాశాలు పెంచుతుంది తప్ప రైతులకు ఏమాత్రం ప్రయోజనం లేదు. రాబోయే కాలంలో వీళ్లు ఒక కూటమిగా కూడా ఏర్పడి రైతులకు మద్దతు ధరలు అందకుండా చేస్తారు.

కేంద్ర ప్రభుత్వం తెచ్చిన మరో ఆర్డినెన్స్ రైతుల (సాధికారత, రక్షణ) ధర హామీ, సేవల ఒప్పంద ఆర్డినెన్స్ 2020 కూడా ఈ కోవకు చెందినదే.

ఈ ఆర్డినెన్స్ ప్రకారం రైతులు వ్యాపారులతో, వాణిజ్య కంపెనీలతో, ప్రాసెసింగ్ యూనిట్లతో నేరుగా కాంట్రాక్ట్ వ్యవసాయ ఒప్పందం చేసుకోవచ్చు. ఒప్పందం ప్రకారం రైతులు తమ ఉత్పత్తులను ఆ కంపెనీలకు నేరుగా అమ్ముకోవచ్చు.

వ్యాపారులు ఎప్పుడూ రైతులు సంఘటితమై బేరం ఆడడం సహించరు. ఒంటరి రైతులు బలహీనులని వ్యాపారులకు తెలుసు. రైతులతో, ఇతర గ్రామీణ ఉత్పత్తిదారులతో ఒప్పందంలో ఎప్పుడూ పై చేయి వ్యాపారులదే అవుతుంది. వ్యాపారులు, ఒప్పందాన్ని ఉల్లంఘించవచ్చు. రైతుల అవసరాలను అలుసుగా తీసుకొని నాణ్యత పేరుతో, మార్కెట్ ఒడిదుడుకుల పేరుతో రైతులకు హామీ ఇచ్చిన ధరలను చెల్లించకుండా ఎగ్గొట్టవచ్చు.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో బడా కంపెనీలు విత్తనాలు, కూరగాయల ఉత్పత్తిలో ఇప్పటికే రైతులతో ఒప్పందాలు చేసుకుని కాంట్రాక్టు వ్యవసాయం చేస్తున్నాయి.

బీటీ పత్తి విత్తనాలు ఉత్పత్తి చేస్తున్న గద్వాల ప్రాంత రైతుల జీవితాలు దుర్భరం. ఈ రైతులతో చేసుకునే ఈ కాంట్రాక్ట్‌లో కంపెనీ నేరుగా కనపడదు. ఆర్గనైజర్లు ఒప్పందాలు చేసుకుంటారు. రైతులకు పెట్టుబడి కోసం అధిక వడ్డీలకు రుణాలు ఇస్తారు. అప్పులు ఇచ్చినందుకు ఖాళీ ప్రామిసరీ నోట్లపై సంతకాలు తీసుకుంటారు. అనేక సందర్భాలలో భూమి కాగితాలు తమ దగ్గర పెట్టుకుంటారు. అప్పులు తీర్చలేని పరిస్థితి ఏర్పడితే బెదిరించి భూమి తమ పేరున రాయించుకుంటారు. రైతు పొలం నుండి పత్తి పంట తీసుకున్నాక, ఎప్పటికో చెల్లింపులు చేస్తారు. కానీ ఆలస్యమైనందుకు రైతుకు చెల్లించాల్సిన వడ్డీ మాత్రం చెల్లించరు. తాము ఇచ్చిన పెట్టుబడి అప్పుపై మాత్రం సంవత్సరానికి వడ్డీ వసూలు చేస్తారు. అక్కడి రైతులు ఆర్గనైజర్‌లకు కట్టు బానిసలుగా మారిపోయారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం, కంపెనీలు ఆదుకోవడం లేదు. భద్రాచలం ఏరియాలో మొక్క జొన్న విత్తన రైతులు, కరీంనగర్ జిల్లాలో వరి విత్తన రైతులు కూడా కంపెనీలతో చేదు అనుభవాలు పొందారు.

ఒకవేళ కంపెనీ, వ్యాపారులు మోసం చేస్తే ఈ ఆర్డినెన్స్‌లో చెప్పినట్లుగా మధ్యవర్తుల బోర్డు చుట్టూ, అధికారుల చుట్టూ తిరిగే స్థితిలో రైతులు ఉండరు.

నిత్యావసర సరుకుల చట్ట సవరణ ఆర్డినెన్స్‌ను, మిగిలిన ఈ రెండు ఆర్డినెన్స్‌లను ఒకే దగ్గర ఉంచి చూడాలి. మొదట కంపెనీలు, వ్యాపారులు రైతులతో కాంట్రాక్ట్ వ్యవసాయ ఒప్పందాలు చేసుకుంటారు. తరువాత కనీస మద్దతు ధరలు చెల్లించకుండా తక్కువ ధరలకే రైతుల నుండి పెద్ద ఎత్తున ఉత్పత్తులను కొని నిల్వ చేస్తారు. ఎక్కడికైనా తీసుకెళ్లి అమ్ముకుంటారు. వినియోగదారుల మార్కెట్‌లో ధరలను శాసిస్తారు. అంతిమంగా అధికారులు, రాజకీయ నాయకులు ఈ కంపెనీల ప్రయోజనాల కోసం సేవ చేస్తారు. వాళ్లు ఇచ్చే లంచాలు మరిగి రైతులను, ప్రజలను ముంచేస్తారు.

వ్యవసాయ కుటుంబాల సంక్షోభ పరిష్కారానికి కొన్ని నిర్దిష్ట చర్యలను చేపట్టాలని ప్రభుత్వాలను రైతు, వ్యవసాయ కూలీ, దళిత, ఆదివాసీ సంఘాలు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నాయి. నిర్దిష్ట డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచాయి. కానీ వీటిని పరిష్కరించడానికి ప్రభుత్వాలు పూనుకోలేదు. 250 రైతు, గ్రామీణ, ఆదివాసీ సంఘాలతో ఏర్పడిన అఖిల భారత రైతు ఉద్యమాల సమన్వయ సమితి గత మూడు సంవత్సరాలుగా దేశ వ్యాపితంగా బలమైన రైతు ఉద్యమాన్ని నిర్మించడానికి ప్రయత్నం చేస్తున్నది. ముఖ్యంగా కొన్ని నిర్దిష్ట డిమాండ్లను ఈ సమితి ముందుకు తెచ్చింది.

- గ్రామాలలో వాస్తవ సాగుదారులను గుర్తించాలి. వారి జీవనోపాధికి, ఆదాయానికి భద్రత కల్పించాలి.
- భారత వ్యవసాయ రంగంలో కార్పొరేట్లను తొలగించి రైతు సహకార సంఘాలను నిర్మాణం చేయాలి.
- ప్రపంచ వ్యాపితంగా వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని భారతదేశ రైతుల, గ్రామీణ ప్రజల, ఆదివాసీల ప్రయోజనాలను కాపాడడానికి పూనుకోవాలి.
- వారి వ్యవసాయానికి అన్ని రకాల మద్దతు అందించాలి. వనరులపై వారికి హక్కులు కల్పించాలి.
- శాస్త్రీయంగా పంటల, ఇతర ఉత్పత్తుల ఉత్పత్తి ఖర్చులు లెక్కవేసి అన్ని గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాల ఉత్పత్తులకు మద్దతు ధరలను రాష్ట్ర స్థాయిలో ప్రకటించాలి. ఆ మద్దతు ధరలకు చట్టబద్ధత కల్పించాలి.
- రాష్ట్ర ప్రభుత్వ, కేంద్ర ప్రభుత్వ సంస్థలు వ్యవసాయ, అనుబంధ రంగాల, ఇతర గ్రామీణ ఉత్పత్తుల సేకరణలో చురుకుగా పాల్గొనాలి. రైతు, మహిళా సహకార సంఘాలను ఈ ప్రక్రియలో భాగస్వాములను చేయాలి.
- గ్రామీణ ప్రాంతాలలో గిడ్డంగులు, శీతల గిడ్డంగులు, డ్రయ్యింగ్ యార్డులు, ప్రాసెసింగ్ యూనిట్లు సహకార సంఘాలు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పరచాలి.
- సురక్షితమైన, నాణ్యమైన, పౌష్టిక ఆహార ఉత్పత్తులను చౌక ధరల దుకాణాల ద్వారా వినియోగదారులకు అందించాలి. ఇందుకోసం పర్యావరణ హితమైన సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహించాలి. అందుకోసం పెట్టుబడులు పెట్టాలి.
- రైతులతో కంపెనీలు ఇప్పటికే చేసుకుంటున్న అన్ని కాంట్రాక్ట్ వ్యవసాయ ఒప్పంద పత్రాలపై వ్యవసాయ శాఖ అధికారులు కూడా సంతకాలు చేసి భాగస్వాములు కావాలి. రైతులకు అన్యాయం జరగకుండా కాపాడాలి. ఇది ఒక్కటే దేశ ప్రజల ప్రయోజనాలకు రక్షణ.

(రచయిత రైతు స్వరాజ్య వేదిక) వీ

కొత్త పర్యావరణ ప్రభావ మదింపు చట్టంపై అభ్యంతరాలు

***దేశ సహజ సంపదలను సంపన్నులకు కట్టబెట్టే లక్ష్యంతో కొవిడ్ మహావిపత్తు చీకటి మాటున కేంద్రప్రభుత్వం ప్రతిపాదిస్తున్న కొత్త పర్యావరణ చట్టం పట్ల ప్రజల అభ్యంతరాలు ప్రకటిస్తున్నది* మహారాష్ట్ర పియుసిఎల్**

కేంద్ర ప్రభుత్వ పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వశాఖ 2020 మార్చ్ 12న విడుదల చేసిన పర్యావరణ ప్రభావ మదింపు ఉత్తర్వుల ముసాయిదా 2020 పట్ల పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్ (పియుసిఎల్) మహారాష్ట్ర శాఖ తన తీవ్రమైన అభ్యంతరాన్ని తెలియజేస్తున్నది. ఈ 2020 ముసాయిదా ప్రస్తుతం అమలులో ఉన్న పర్యావరణ ప్రభావ మదింపు ఉత్తర్వులు 2006 ను తొలగించి వాటి స్థానంలో రావడానికి ఉద్దేశించినది. నిజానికి ఇప్పుడున్న చట్టమే ఉండవలసినదాని కన్న చాల కొరతలతో ఉండగా, ప్రస్తుత ముసాయిదా దాన్ని కూడ నీరుగార్చడానికి ఉద్దేశించినది. ప్రత్యేకంగా దేశం పర్యావరణ సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న స్థితిలో ఉన్నదాన్ని బలోపేతం చేయవలసి ఉండగా, దాన్ని ప్రస్తుత ముసాయిదా నీరుగారుస్తున్నది. దేశం కనీవినీ ఎరగని మహావిపత్తును ఎదుర్కొంటున్న కష్టకాలంలో ఉండగా, ఈ చర్చా ప్రక్రియలో పాల్గొనడానికి సాధ్యం కానన్ని కష్టాలనూ కడగండ్లనూ ప్రజానీకం ఎదుర్కొంటుండగా, దేశంలోని న్యాయస్థానాలూ, ప్రజాస్వామిక సంస్థలూ అన్నీ ఒత్తిడికి గురవుతుండగా, ఈ ముసాయిదాను ముందుకు తేవడం అన్యాయం,అవాంఛనీయం కూడ.

మొట్టమొదట ఈ సంక్షోభ సమయంలో మంత్రిత్వశాఖ ఈ ముసాయిదాను విడుదల చేయడానికి ఎంచుకున్న పద్ధతి మాకు తీవ్రంగా ఆందోళనకరంగా ఉంది. దేశమంతా కొవిడ్–19 మహావిపత్తుతో అల్లల్లాడుతుంటే, మార్చ్ 12న మంత్రిత్వశాఖ ఈ ముసాయిదాను తన వెబ్‌సైట్ మీద ప్రచురించి, ప్రజలనుంచి అభ్యంతరాలను కోరింది. ఎంతో నిరసన వచ్చిన మీదట, న్యాయస్థానాల జోక్యం తర్వాత, చివరికి ఢిల్లీ హైకోర్టు ఆదేశాల తర్వాత, అభ్యంతరాలూ సలహాలూ చెప్పడానికి గడువును ఆగస్ట్ 11 కు పొడిగించారు. ఆ ప్రతిపాదిత చట్టం ముసాయిదాను కూలంకషంగా చదవడానికీ, అభ్యంతరాలూ సూచనలూ తెలియజేయడానికి ప్రజలకు ఒక అవకాశం ఇచ్చారు. అయితే, కొనసాగుతున్న కొవిడ్ - 19 సంక్షోభ సమయంలో ఈ ఆగస్ట్ 11 గడువు సమయం కూడ నిజమైన పరిశీలనకు సరిపోదు. ఒకవైపు దేశం ఇంత గడ్డు స్థితిలో ఉన్న సమయాన్నే ప్రభుత్వం ఈ ముసాయిదా చర్చకు ఎందుకు ఎంచుకున్నదనే ప్రశ్నకు సక్రమమైన వివరణ ఏదీ లేదు. ఈ మహావిపత్తు సంక్షోభం ముగిసిపోయి, ఒక రకమైన సాధారణ స్థితి ఏర్పడే దాకా ఈ ముసాయిదా ప్రజా పరిశీలనను వాయిదా వేయవచ్చు.

మన దేశంలో పర్యావరణానికి సంబంధించిన న్యాయశాస్త్రాన్ని పూర్తిగా మార్చివేయదలచుకున్న ముసాయిదా 2020, తద్వారా దేశంలోని ప్రజల జీవితాలను, జీవనోపాధులనూ, ఆరోగ్యాలనూ, మొత్తంగా పర్యావరణాన్నీ ప్రభావితం చేయనుంది. కాని ఈ ముసాయిదాను దేశంలోని స్థానిక, ప్రాంతీయ భాషల్లో ప్రచురించలేదు. అంటే ఈ ముసాయిదా గురించిన ప్రజా చర్చలో ప్రజలందరూ పాల్గొనడానికి వీలులేని స్థితి కల్పించారు. చర్చలో అందరికీ ప్రాతినిధ్యం ఉండడానికి అవకాశం లేని స్థితి కల్పించారు. కేవలం పైపైన లాంఛనప్రాయమైన ప్రజాభాగస్వామ్యం మాత్రమే ఉండేలా చూశారు. దేశంలోని విభిన్న ప్రాంతాలలోని అత్యధికులైన ప్రజలు, ప్రభావిత సమూహాలు, స్థానిక భాగస్వామ్య పక్షాలు ఈ కీలకమైన చర్చలో పాలుపంచుకునే వీలు లేదు. కర్నాటక, చెన్నై, ఢిల్లీ హైకోర్టులు ఈ ప్రక్రియ మీద ప్రశ్నలు సంధించాయి. అయినా ఇవాళ్టికి కూడ (ఇది రాసిన ఆగస్ట్ 11 నాటికి కూడ) ప్రభుత్వం ఈ ముసాయిదాను స్థానిక భాషల్లో అచ్చు వేయలేదు. ఆ పని చేసేవరకూ ప్రజాభిప్రాయ సేకరణ ప్రక్రియను వాయిదా వేయలేదు. కేంద్ర మంత్రిత్వశాఖ జరుపుతున్న ఈ అక్రమ వ్యవహారాన్ని మేం ఖండిస్తున్నాం. ముసాయిదాను వెంటనే ఉపసంహరించుకోవాలనీ, కొవిడ్ మహావిపత్తు సంక్షోభం తొలగిపోయేవరకూ ఈ మొత్తం ప్రక్రియను నిలిపివేయాలనీ కోరుతున్నాం.

అలాగే, పర్యావరణ ప్రభావ మదింపుపై కీలకమైన ప్రభావం ఉండే చట్టాన్ని ఇలా ఉత్తర్వుల రూపంలో తీసుకు రావడాన్ని కూడ మేం వ్యతిరేకిస్తున్నాం. పర్యావరణ ప్రభావ మదింపు విషయంలో ఒక చట్టమనేది ఎంత ముఖ్యమైనదంటే అది పరిశ్రమలను స్థాపించడం, నిర్మాణాలు జరపడం, గనులు తవ్వడం, మౌలిక సాధన సంపత్తి, విద్యుదుత్పాదన పథకాలు వంటి వాటిని ఏర్పాటు చేయడం లాంటి అన్ని రకాల పథకాలకూ, కార్యక్రమాలకూ ఉండగల పర్యావణ ప్రభావాన్ని నిర్ణయిస్తుంది. అంత విశాలమైన ప్రాధాన్యత ఉండే చట్టాన్ని పార్లమెంటులో చర్చ ద్వారా అమలులోకి వచ్చే శాసనంగా తయారు చేయాలి గాని, ఒక ప్రభుత్వ ఉత్తర్వు ద్వారా కాదు. ఇటువంటి ఉత్తర్వులను కాలక్రమంలో ప్రభుత్వాధికారులే సవరించవచ్చు, నీరుగార్చవచ్చు. నిజానికి పర్యావరణ ప్రభావ మదింపు ఉత్తర్వులు 1994, 2006 విషయంలో ఇదే జరిగింది. ఎటువంటి ప్రజా బహిరంగ చర్చా లేకుండానే ప్రజా ప్రయోజనం అనే సాకుతో ఆ ఉత్తర్వులను లోలోపలి నుంచి తొలిచేయడం, కత్తిరించడం చేశారు. అందువల్ల ప్రస్తుత, ప్రతిపాదిత విధానం స్థానంలో పర్యావరణ ప్రభావ మదింపు కోసం ఒక దృఢమైన, క్రియాశీలమైన చట్టం రావాలని మేం కోరుతున్నాం.

ఈ ముసాయిదాను పైపైన చదివి చూసినా, ఇది రాసేటప్పుడు దేశంలోని గణనీయమైన పర్యావరణ ఉద్యమ కార్యకర్తల, నిపుణుల సమూహంలో ఏ ఒక్కరినీ సంప్రదించకుండా రాసినట్టు తెలిసిపోతున్నది. ప్రస్తుతం ఉన్న చట్టానికి గత కొద్ది సంవత్సరాలలో ఎక్కడెక్కడ ఎట్లా తూట్లు పొడవడం జరిగిందో చూసి, ఆ తూట్లన్నిటినీ ఒక్కదగ్గరికి తెచ్చిన ఫలితమే ఈ ముసాయిదా. అంటే ఇప్పటికే ఉన్న పర్యావరణ ప్రభావ మదింపు ప్రక్రియను మరింత బలహీనం చేసేందుకు, ఆయా పథకాల స్వార్థ ప్రయోజనాలు ఉన్నవారికి మేలు చేసేందుఉ, పర్యావరణ హక్కుల

పట్ల, ప్రజల హక్కుల పట్ల ఏ మాత్రం గౌరవం లేకుండా ఈ ముసాయిదా తయారయింది. ఈ ముసాయిదాను సవివరంగా అధ్యయనం చేసిన మేము ఈ ముసాయిదా పూర్తిగా చట్టవ్యతిరేకంగా, రాజ్యాంగ వ్యతిరేకంగా ఉన్నదని, ఇప్పటికే ఏర్పడి ఉన్న పర్యావరణ న్యాయశాస్త్ర సూత్రాలకు వ్యతిరేకంగా ఉన్నదని, అశాస్త్రీయంగా ఉన్నదని, పర్యావరణ పరిరక్షణ అనే ప్రాథమిక లక్ష్యాన్ని సాధించడంలో విఫలమవుతున్నదని, పర్యావరణ నియంత్రణా, నిఘా యంత్రాంగాలు దృఢంగా క్రియాశీలంగా ఉండేందుకు సహాయపడే అత్యవసరమైన చట్ట పరమైన చట్రాన్ని ఇవ్వడంలో విఫలమవుతున్నదని మీ దృష్టికి తేవడం కోసమే ఈ లేఖ రాస్తున్నాము. అంటే ఈ ముసాయిదా దాని మౌలిక కర్తవ్యంలోనే విఫలమవుతున్నది గనుక దీన్ని తక్షణమే ఉపసంహరించాలని కోరుతున్నాము.

ప్రజల పౌరస్వేచ్ఛలనూ, ప్రజాస్వామిక హక్కులనూ పరిరక్షించడానికి, ఎత్తిపట్టడానికి అంకితమైన సంస్థగా మహారాష్ట్ర పియుసిఎల్ ముసాయిదా పర్యావరణ ప్రభావ మదింపు 2020 పై ఈ కింది నిర్దిష్ట అభ్యంతరాలను వివరంగా తెలియజేస్తున్నది. ఈ అభ్యంతరాలు సమగ్రమైనవేమీ కావు, మరిన్ని అభ్యంతరాలు కూడ ఉండవచ్చు.

పర్యావరణ పరిరక్షణ సూత్రాల ఉల్లంఘన

1. కాలుష్యకారకులు మూల్యం చెల్లించాలి, ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి, ప్రజా సమ్మతిని సాధించాలి అనే పర్యావరణానికి సంబంధించిన మూడు మౌలిక సూత్రాలను ఈ ముసాయిదా స్ఫూర్తిలోనూ, అక్షరాలా కూడ పాటించలేదు. కొత్త మార్పులన్నీ ఈ మార్గదర్శక సూత్రాలకు పూర్తిగా వ్యతిరేకంగా ఉన్నాయి. పర్యావరణ ప్రభావ మదింపు ప్రక్రియకు కొత్తగా ప్రతిపాదిస్తున్న మార్పులు ప్రస్తుతం అమలులో ఉన్న 2006 పర్యావరణ ప్రభావ మదింపు ఉత్తర్వుల ప్రకారం పాటించే వివరమైన ప్రక్రియకు పెద్ద ఎత్తున మినహాయింపులను ఇస్తున్నాయి. పెద్ద సంఖ్యలో పథకాలను ఎ తరగతి నుంచి బి1, బి2 తరగతులకు పునర్నిర్వచించడం జరిగింది. తద్వారా సహజ భౌగోళిక అంశాల్లో, ప్రాకృతిక అంశాల్లో, జీవ వైవిధ్యంలో, అటవీ జీవరాశిలో గణనీయమైన పర్యావరణ ప్రభావాల విషయంలో పర్యావరణ ప్రభావ మదింపు ప్రక్రియలో ఉండవలసిన తీవ్రతను పెద్ద ఎత్తున తగ్గించడం జరుగుతున్నది. ఈ ప్రతిపాదిత మార్పులన్నీ కూడ ప్రస్తుతం అమలులో ఉన్న విశాల చట్టమైన పర్యావరణ పరిరక్షణ చట్టం 1986కు వ్యతిరేకమైనవి. అందువల్ల ఉపసంహరించవలసినవి.
2. పర్యావరణ పరిరక్షణా ప్రమాణాల ప్రకారం పర్యావరణ ప్రభావ మదింపు అనేది అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన పర్యావరణ నియంత్రణా, అనువర్తనా యంత్రాంగం. పథకాల విషయంలో తప్పనిసరిగా పాటించవలసిన పర్యావరణ పరిరక్షణా నియమాలను ప్రస్తుత ముసాయిదా స్పష్టంగా నీరుగారుస్తున్నది. పర్యావరణ ప్రభావ మదింపు అనేది ఒక తప్పనిసరి ప్రక్రియ కాగా, కొత్త చట్టం చాల పథకాలకు పర్యావరణ ప్రభావ మదింపు దశలను తగ్గిస్తున్నది, మరికొన్ని పథకాలను అసలు ఆ మదింపు నుంచి మినహాయిస్తున్నది. ఈ నిబంధనలన్నీ కూడ పర్యావరణ ప్రయోజనాలకు అనుగుణమైనవి కావు. అందువల్ల తక్షణమే ఉపసంహరించాలి.
3. ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న పర్యావరణ ప్రభావ మదింపు 2020 భారత ప్రభుత్వం రియో డిక్లరేషన్ కింద, పారిస్ అగ్రిమెంట్ కింద కుదుర్చుకున్న అంతర్జాతీయ ఒప్పందాలకూ, మార్గదర్శకంగా పనిచేసే ఎస్పో కన్వెన్షన్, ఆర్హస్ కన్వెన్షన్ వంటి ఇతర అంతర్జాతీయ పర్యావరణ ఒప్పందాలకూ వ్యతిరేకమైనది. వాణిజ్య, మానవహక్కుల విషయంలో ఐక్యరాజ్యసమితి మార్గదర్శక సూత్రాల ప్రకారం బాధ్యతాయుతమైన ప్రవర్తన, త్వరలో రూపొందించనున్న జాతీయ కార్యాచరణ ప్రణాళిక బలమైన నియంత్రణా యంత్రాంగాన్ని ఆశిస్తాయి. కాని పర్యావరణ ప్రభావ మదింపు నిబంధనలను ఈ రకంగా నీరుగారిస్తే అది బాధ్యతాయుత ప్రవర్తననూ, జవాబుదారీతనాన్నీ విఫలం చేస్తుంది.

పని మొదలైన తర్వాత అనుమతులు ఇవ్వడం

4. కొత్త ముసాయిదా లోని 22వ నిబంధన ప్రకారం ఒక పథకం అమలు ప్రారంభమైన తర్వాత పర్యావరణ అనుమతులు పొందడానికి అవకాశం ఇస్తున్నారు. అంటే ఇకనుంచి పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు తమ పథకాలను, పనులను ఎటువంటి పర్యావరణ అనుమతులు లేకుండానే ప్రారంభించి, పని మొదలైందనే కారణంతో అనుమతులు సంపాదించడానికి అవకాశం వస్తుంది. అంటే పర్యావరణ అనుమతులు పొందడం అనేదాన్ని ఇది ప్రహసనంగా, కేవలం లాంఛనంగా మార్చివేస్తుంది. పైన చెప్పిన మూడు పర్యావరణ మౌలిక సూత్రాలను ఉల్లంఘిస్తుంది. నిజానికి ఇటువంటి పర్యావరణ అనుమతి మినహాయింపు అనేదాన్ని 2018 మార్చ్‌లో అప్పుడు కొనసాగుతుండిన చట్టానికి సవరణగా, ఒకేసారి అమలయ్యేదిగా ప్రవేశపెట్టారు. ఆ సవరణను ఎన్నో వేదికల మీద సవాల్ చేయడం జరిగింది. అలెంబిక్ ఫార్మాసుటికల్స్ వర్సస్ రోహిత్ ప్రజాపతి అనే కేసులో 2020 ఏప్రిల్ 1 న తీర్పు ఇస్తూ సుప్రీం కోర్టు ఆ సవరణను కొట్టివేసింది. "పని మొదలైన తర్వాత పర్యావరణ అనుమతి పొందడమనేది పర్యావరణ న్యాయశాస్త్రపు ప్రాథమిక సూత్రాల ఉల్లంఘన. పర్యావరణ చట్టం రీత్యా పని మొదలైన తర్వాత అనుమతి అనేదానికి అర్థం లేదు. అది అటు ముందుజాగ్రత్తల సూత్రానికీ, ఇటు సుస్థిర అభివృద్ధి అవసరానికీ వ్యతిరేకమైనది" అని సుప్రీం కోర్టు వ్యాఖ్యానించింది. కాని ప్రస్తుత ముసాయిదా ఉపోద్ఘాతంలో "ఉల్లంఘనలన్నిటినీ న్యాయ ప్రయోజనాల రీత్యా నియంత్రించడం జరుగుతుంది" అని రాసింది. ఈ మాట చట్టానికీ, ఇంగిత జ్ఞానానికీ కూడ వ్యతిరేకమైనది. ఎందుకంటే ఏ ఉల్లంఘన అయినా న్యాయ ప్రయోజనం కాజాలదు. ఈ నిబంధన వల్ల జరిగే ఏకైక కార్యక్రమమేమంటే, ఉల్లంఘించదలచినవారు పర్యావరణ ప్రభావ మదింపు ప్రక్రియను తోసిరాజని, విస్మరించి, తమ పథకాలూ పనులూ ప్రారంభిస్తారు, ఆ పని మొదలైంది గనుక అధికారులకు అనుమతి ఇవ్వక తప్పని స్థితి, తప్పులన్నిటినీ ఆమోదించే స్థితి వస్తుంది. అంటే చట్టవ్యతిరేకతే విలువైనదవుతుంది. చట్ట ఉల్లంఘనలను ప్రోత్సహించినట్టవుతుంది. ఈ నిబంధన వల్ల ఎటువంటి ప్రమాదాలు జరగడానికి అవకాశం ఉందో గుర్తించాలంటే, 2020 మే 7న విశాఖపట్నంలో ఎల్ జి పాలీమర్స్ ఇండియా కర్మాగారంలో జరిగిన విషపూరితమైన స్టైరీన్ వాయువు లీకేజి ప్రమాదాన్ని చూడాలి. ఆ ప్రమాదంలో పన్నెండు మంది అమాయకులు మరణించారు, వందలాది మంది గాయపడ్డారు.

ఆ కర్మాగారం 1997 నుంచి 2019 వరకు ఎటువంటి సక్రమ అనుమతులు లేకుండానే పని చేసింది. పని జరుగుతున్నది గనుక అనుమతి ఇమ్మని దరఖాస్తు కూడ పెట్టుకొని ఉంది.

పర్యావరణ ప్రభావ మదింపు ప్రక్రియను భంగపరచే మార్పులు

5. **పథకాలకు మినహాయింపులు:** ముసాయిదాలో 26 వ నిబంధన కింద 40 రకాల పథకాలను తప్పనిసరి ముందస్తు పర్యావరణ అనుమతి నుంచి మినహాయించారు. తత్ఫలితంగా, తీవ్రమైన పర్యావరణ ప్రభావం చూపే సౌర విద్యుదుత్పాదనా కేంద్రాలు, మురికినీటి శుద్ధి కేంద్రాలు, ఆనకట్టల కోసం మట్టి తోడడం, ఎంతో దూరం పాటు వరుసగా సాగే రహదారులు, పైప్ లైన్లు వంటి పథకాల కోసం తొలగింపులు, రక్షణ మంత్రిత్వ శాఖ కోసం తయారీ కర్మాగారాలు, వగైరాలను ముందస్తు పర్యావరణ అనుమతి నుంచి, ముందస్తు పర్యావరణ సమ్మతి నుంచి మినహాయించడం జరిగింది.
6. **పర్యావరణ సమ్మతి అనే కొత్త ప్రక్రియ ప్రవేశం:** ముసాయిదాలో నిబంధన ప్రకారం బి2 తరగతికి చెందిన కొన్ని ప్రత్యేక పథకాలకు పర్యావరణ సమ్మతి అనే ఒక కొత్త భావనను ప్రవేశపెట్టారు. ఆ పథకాలకు పరీక్ష, అంచనా, ప్రజా ఆమోదం, నిపుణుల బృందం అంచనా అనే నాలుగు అంచెల ప్రక్రియ నుంచి పూర్తి మినహాయింపు ఉంటుంది. అవి ఈ పర్యావరణ సమ్మతి తీసుకోవలసి ఉంటుంది. వాణిజ్య హెలికాప్టర్లు, దేశీయ జలమార్గాలు, యాభై వేల చదరపు మీటర్ల వరకూ భవన నిర్మాణం, పెట్రోలియమ్ ఉత్పత్తుల శుద్ధీకరణ రంగంలో కొన్ని మధ్యతరహా పథకాలు, సిమెంట్ కర్మాగారాలు, ఖనిజాలను అభివృద్ధి చేయడం వగైరా రంగాలన్నీ ఈ తరగతిలో చేర్చారు. ఇక బి2 తరగతిలోని మిగిలిన పథకాలు పర్యావరణ ప్రభావ మదింపు నివేదిక సమర్పించడం నుంచీ, ప్రజా ఆమోదం పొందడం నుంచీ మినహాయించారు. వాటి కాలుష్యకారక స్వభావం వల్ల గతంలో కఠినమైన పర్యావరణ ప్రభావ మదింపు ప్రక్రియ కింద పరిశీలనకు వచ్చే పథకాలలో చాల భాగం ఇప్పుడు ఈ తరగతిలో చేరాయి. ఓడరేవులు, హార్బర్లు, బ్యాక్ వాటర్స్, దేశీయ జలమార్గాలలో భారీ డ్రెడ్జింగ్, కొన్ని ప్రత్యేక ఆర్థిక మండలాలు, కొంత స్థాయి వరకు నీటి పారుదల పథకాలు, గనుల తవ్వకాలు ఇప్పుడు కొత్తగా బి2 తరగతిలో చేరాయి. నిజానికి ఈ పథకాలన్నీ కూడ పర్యావరణం మీద తీవ్రమైన ఒత్తిడిని కలగజేస్తాయి.
7. **జాతీయ రక్షణ, భద్రత, ఇతర వ్యూహాత్మక ప్రాధాన్యత గల పథకాలన్నిటికీ మినహాయింపు:** ముసాయిదాలో నిబంధన 5 (7) కింద "జాతీయ రక్షణ లేదా భద్రత లేదా కేంద్ర ప్రభుత్వం నిర్ణయించే ఇతర వ్యూహాత్మక ప్రాధాన్యత గల" పథకాలన్నిటి సమాచారం ప్రజలకు అందుబాటులో ఉంచడం జరగదు. అంటే ఈ పథకాల వల్ల జరగబోయే పర్యావరణ ప్రమాదమేమిటో ప్రజలకు చెప్పడం గాని, ఆ పర్యావరణ ప్రమాదాలను సవాల్ చేసే అవకాశం ప్రజలకు ఇవ్వడం గాని జరగదు. అలాగే నిబంధన 14 (2)(ఇ) ప్రకారం ఇటువంటి పథకాలన్నీ ప్రజా బహిరంగ చర్చ నుంచి మినహాయించబడతాయని ముసాయిదా చెపుతున్నది. ఇక్కడ గుర్తించవలసిన విషయమేమంటే ఏ పథకాలను వ్యూహాత్మక ప్రాధాన్యతగల పథకాలుగా గుర్తిస్తారో, అందుకు ప్రమాణాలేమిటో నిర్వచించకుండా వదిలేశారు. అంటే అది ఎవరికి వీలైన వ్యాఖ్యానం వాళ్లు ఇవ్వడానికీ, నిరంకుశ నిర్ణయం తీసుకోవడానికీ వీలు కల్పిస్తుందన్నమాట. ఈ నిబంధనను ఉద్దేశపూర్వకంగానే అస్పష్టంగా, ఎటు పడితే అటు సాగేలా వదిలేశారు. తత్ఫలితంగా అనేక రకాల పథకాలను రక్షణ రంగానికి చెందినవనో, వ్యూహాత్మక ప్రాధాన్యత గలవనో పేరుతో పర్యావరణ ప్రభావ మదింపు పరిధి నుంచి, ప్రజా పరిశీలన నుంచి తప్పించవచ్చు. వాటి ప్రభావం పర్యావరణం మీద, ప్రజల మీద ఎంత తీవ్రంగా ఉన్నప్పటికీ వాటిని కొనసాగించవచ్చు.
8. **ఆధునికీకరణ, విస్తరణ పథకాల, కార్యక్రమాల మినహాయింపు:** ప్రస్తుతం ఉనికిలో ఉండి 25 శాతం కన్న ఎక్కువ ఆధునికీకరణ, విస్తరణ చేయదలచుకున్న పథకాలకు పర్యావరణ ప్రభావ మదింపు అవసరమనీ (నిబంధన 16(1)), 50 శాతం కన్న ఎక్కువ ఆధునికీకరణ, విస్తరణ చేయదలచుకున్న పథకాలకు ప్రజా సంప్రదింపులు (నిబంధన 14(2)) అవసరమనీ ముసాయిదా చెపుతున్నది. ఈ నిబంధన నిరంకుశం మాత్రమే గాక, పర్యావరణ ప్రభావం గురించి ఎంతమాత్రమూ పట్టించుకోవడం లేదు. పెద్దఎత్తున ప్రభావం ఉండే పరిశ్రమలో చిన్నపాటి ఆధునికీకరణ, విస్తరణ కూడ ప్రమాదకరమైనదిగా ఉండవచ్చు.
9. **బహిరంగ ప్రజా విచారణ నుంచి మినహాయింపు:** స్థానిక ప్రజా సమూహాల మీద, పర్యావరణం మీద తీవ్రమైన ప్రభావం చూపే అవకాశం ఉన్నప్పటికీ, కొన్ని భారీ పథకాలను బహిరంగ ప్రజా విచారణ ప్రక్రియ నుంచి ముసాయిదా పూర్తిగా మినహాయించింది. పర్యావరణం మీద పెద్ద ఎత్తున ప్రభావం వేసే పరిశ్రమలనూ, పథకాలనూ ముసాయిదాలోని షెడ్యూల్‌లో ఎ, బి1, బి2 తరగతులుగా విభజించారు. బి2 తరగతి పథకాలకు బహిరంగ ప్రజా విచారణ అవసరమే లేదన్నారు. అంటే అత్యధిక పథకాల విషయంలో చర్చా క్రమంలో ప్రజలకు ఉండే భాగస్వామ్య హక్కును పూర్తిగా కొల్లగొట్టారు. ముసాయిదా ప్రకారం బి2 తరగతిలోని అన్ని పథకాలూ, నిబంధన 14 (2) కింద వచ్చే అన్ని పథకాలూ బహిరంగ ప్రజా విచారణ అవసరం నుంచి మినహాయించబడ్డాయి. ఈ తరగతుల్లోకి వచ్చే పథకాలూ పరిశ్రమలూ అన్నీ కూడ సమాజపు అంచులలో ఉండే ప్రజా సమూహాల మీద తీవ్రమైన ప్రభావాన్ని వేసేవి. కీలకమైన వన్యప్రాణి జాతులు నివసించే భౌగోళిక ప్రాంతాల మీద ప్రభావాన్ని వేసేవి. పులుల అభయారణ్యాలు, పర్యావరణరీత్యా సున్నితమైన ప్రాంతాలు వంటి కీలకమైన రక్షిత ప్రంతాల మీద ప్రభావాన్ని వేసేవి. పర్యావరణ ప్రభావ మదింపు ఉత్తర్వులు 2006 కింద ప్రజలకు దక్కిన పరిశీలనా హక్కును ఈ నిబంధన కాలరాస్తున్నది. బహిరంగ ప్రజా విచారణ రద్దు చేయడమంటే అధికారవర్గపు అలసత్వానికి, పారదర్శకత లేకపోవడానికీ, లంచగొండితనానికీ, జవాబుదారీ తనం లేకపోవడానికీ తలుపులు బార్లా తెరిచినట్టే.
10. **ప్రజా సంప్రదింపుల ప్రక్రియలో అభ్యంతరాలు చెప్పడానికి గడువు:** ముసాయిదాలో అనుబంధం 1, నిబంధన 3 ప్రకారం ప్రతిపాదిత పథకానికి అభ్యంతరాలు చెప్పే గడువును గతంలోని 30 రోజుల నుంచి కొత్తగా 20 రోజులకు తగ్గించారు. ఈ గడువు తగ్గింపు ఎందుకు ప్రధానమైనదంటే, ఈ అభ్యంతరాలు చెప్పడానికీ,

బహిరంగ ప్రజా విచారణలో పాల్గొనడానికీ అవసరమైన పత్రాలు సంపాదించడం, వాటి పై అభ్యంతరాలు రూపొందించడం మామూలుగానే కష్టతరమైన పని. అసలు ఆ పథకాల వల్ల హానికి గురయ్యే ప్రజలు ఆ పథకాల పత్రాలను సంపాదించడం, చదివి అర్థం చేసుకోవడం కష్టం. అంటే స్థానిక ప్రజా సమూహాలు ఆ పథకాల పర్యవసానాలను అర్థం చేసుకోవడానికీ, తమ అభ్యంతరాలు మెరుగ్గా వెల్లడించే ప్రతినిధులను తయారు చేసుకోవడానికీ సమయం పడుతుంది. ఆ సమయాన్ని 20 రోజులకు కుదించడం పూర్తిగా అసంగతం. ఈ ముసాయిదాను చదివి, అర్థం చేసుకుని, అభ్యంతరాలు, సలహాలు, సూచనలు రాయడానికే 20 రోజులు సరిపోవు. అటువంటప్పుడు, తమ జీవితాలమీద, జీవనోపాధుల మీద తీవ్రమైన ప్రభావం చూపే పథకాల గురించి అభ్యంతరాలు చెప్పడానికి ప్రజలకు పూర్తి హక్కు ఉండాలి. ఆ హక్కును కొల్లగొట్టడానికి వీలు లేదు. ఈ పథకాలలో చాల భాగం పెద్ద ఎత్తున ప్రజా సమూహాలను నిర్వాసితులను చేసేవి. ముఖ్యంగా మత్స్యకారులు, సాంప్రదాయిక వ్యవసాయ దారులు, అటవీ ఆధారిత సమూహాలు వంటి సాంప్రదాయిక జీవనోపాధుల ప్రజలను నిర్వాసితులను చేసేవి. అటువంటి స్థానిక ప్రజా సమూహాల, భాగస్వామ్య సమూహాల అభిప్రాయాలను వినకుండా అధికారులు తమ ఇష్టం వచ్చినట్టుగా పథకాలకు అనుమతులూ, సమ్మతి తెలియజేయడమూ జరగగూడదు.

11. **ఉల్లంఘనల గురించి ఫిర్యాదులు:** ఉల్లంఘనల గురించి ప్రజలు ఫిర్యాదు చేయడానికి వీలు లేదని ముసాయిదాలోని నిబంధన 22 శాసిస్తుంది. అటువంటి ఉల్లంఘనలేవైనా ఉంటే అవి ఉల్లంఘనదారు–పారిశ్రామికవేత్త, ప్రభుత్వాధికారి, పరీక్షక బృందం లేదా నియంత్రణా బృందం మాత్రమే ప్రభుత్వానికి నివేదించాలని, అవి మాత్రమే ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని ఈ నిబంధన అంటుంది. అటువంటి ఉల్లంఘనల గురించి నివేదికలు వచ్చిన పథకాలను కూడ జరిగిన పర్యావరణ ప్రమాదానికి పరిహారం చెల్లించడమనే షరతుతో అంగీకరించవచ్చునంటుంది. ఆ ప్రమాదం ఎంతో అంచనా వేసే అధికారం, దాని మీద నివేదిక ఇచ్చే అధికారం కూడ ఉల్లంఘనదారుదే తప్ప స్వతంత్ర సంస్థది కాదు. ఈ నిబంధన పూర్తిగా అక్రమమైనది. పర్యావరణ లోపాల గురించి నివేదించే, న్యాయం కోరే, ఫిర్యాదుకు పరిష్కారం కోరే, పర్యావరణ నిర్ణయాధికారంలో భాగం పంచుకునే ప్రజల హక్కుకు భంగకరమైనది. బాధిత సమూహాలు, భాగస్వామ్య పక్షాలు, నిపుణులు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజానుకూల వ్యక్తులు ఎవరైనా సరే, పర్యావరణాన్ని కలుషితం చేసే, ప్రభావితం చేసే, పర్యావరణ సూత్రాలను ఉల్లంఘించే పథకాల గురించి ఫిర్యాదు చేసే హక్కు ఉండాలి. వారి వ్యాఖ్యలను అధికారులు పరిగణనలోకి తీసుకుని నిర్ణయాలు తీసుకోవాలి.

12. **అనుమతుల గడువు పొడిగింపు:** ముసాయిదా నిబంధన 19 (1) పర్యావరణ అనుమతుల, సమ్మతుల గడువును గణనీయంగా పొడిగించింది. గత ఉత్తర్వులలో ఉన్న గడువుతో పోలిస్తే, గనుల తవ్వకం పథకాలకు 30 సంవత్సరాల నుంచి 50 సంవత్సరాలకు, నదీలోయ పథకాలకు 10 నుంచి 15 సంవత్సరాలకు, మిగిలిన అన్ని పథకాలకూ 5 నుంచి 10 సంవత్సరాలకు పొడిగించారు. పర్యావరణ విధ్వంసం విపరీతంగా జరిగిపోతున్న సమయంలో, వాతావరణ మార్పుల ప్రభావాలు కళ్లముందర కనబడుతున్న సమయంలో పర్యావరణ అనుమతుల, సమ్మతుల గడువును పెంచడం, అది కూడ నిర్మాణ, స్థాపన దశలో ఈ పొడిగింపు, ఒకసారి స్థాపించబడి పనిచేస్తున్న దశలో శాశ్వతంగా కొనసాగింపు ఇవ్వడం అంటే పర్యావరణం మీద, స్థానిక ప్రజల హక్కుల మీద అది గొడ్డలిపెట్టే. హేతుబద్ధంగా ఆలోచిస్తే, ఈ గడువులను తగ్గించవలసి ఉంటుంది. ఒకసారి పర్యావరణ అనుమతి గడువు ముగియగానే మళ్లీ ఒక సారి పర్యావరణ ప్రభావ మదింపు జరపవలసి ఉంటుంది. పర్యావరణ మార్పులు వేగవంతంగా జరుగుతున్నందువల్ల, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వల్ల నిర్మాణ సమయం నానాటికీ తగ్గిపోతున్నందు వల్ల గడువు తగ్గడమే సముచితం. కాని చట్టాన్ని పర్యావరణ ప్రయోజనాల కోసం బలోపేతం చేయకుండా, ఎలా బలహీనం చేస్తున్నారో ఈ అక్రమ చర్యే నిదర్శనం.

13. **ముందస్తు పర్యావరణ అనుమతి, సమ్మతి లేకుండానే కొన్ని చర్యలు:** ముసాయిదా నిబంధన 4 (3) 'నిర్మాణ కార్యక్రమాలు' అనే మాటకు నిర్వచనాన్ని నీరుగార్చి, నేల చదును చేయడం, కంచె వేయడం, భూమి మీద భూసాంకేతిక పరీక్షలు జరపడం వంటి పనులు ముందస్తు పర్యావరణ అనుమతి, సమ్మతి లేకుండానే జరపవచ్చునని అంటుంది. ఈ చర్యల్లో కొన్ని, ఉదాహరణకు కొండవాలులలో నేల చదును చేయడం భూమి కోతకూ, తద్వారా కొండచరియలు విరిగిపడడానికి దారి తీయవచ్చు. అలాగే రహదారుల కోసం, జలవిద్యుత్ పథకాల కోసం భూసాంకేతిక పరీక్షలు జరపాలంటే కొండలలో సొరంగాలు తవ్వడం వంటి పర్యావరణానికి ప్రమాదం కలిగించే భారీ నిర్మాణ చర్యలు అవసరమవుతాయి.

14. **ప్రామాణిక ప్రతిపాదనా అంశాలు:** ముసాయిదా నిబంధన 3 (56)(బి) ప్రకారం సాధారణ ప్రతిపాదనా అంశాలలో పథకం గురించీ, పని గురించీ నిర్దిష్ట అంశాలేమీ లేవు. అటువంటి ప్రామాణిక ప్రతిపాదనా అంశాలు లేకుండా, ఎవరైనా ఒక పథకం గురించి, దాని స్థలం గురించీ, దాని లక్షణాల గురించీ పర్యావరణ ప్రభావ మదింపు నివేదిక తయారు చేయడం సాధ్యం కాదు.

15. **పర్యావరణ ప్రభావ మదింపు నివేదిక మౌలిక సమాచారం:** ముసాయిదా నిబంధన 13 (2) పర్యావరణ ప్రభావ మదింపు నివేదికకు అవసరమైన మౌలిక సమాచార సేకరణకు కాలవ్యవధిని ఒక రుతువుకు పరిమితం చేసింది. ఈ కాలవ్యవధి అర్థరహితం, అశాస్త్రీయం. ఏ పర్యావరణ, పథక స్థలంలోనైనా సహజమైన పర్యావరణ మార్పుల గమనం ఎలా ఉందో తెలుసుకోవడానికి కనీసం 12 నెలల సమాచారం సేకరించడం అవసరం. ఆ సమాచారం లేకుండా సహజ పర్యావరణ వ్యవస్థను పరిరక్షించే చర్యలను శాస్త్రీయంగా సూచించడం అసాధ్యం. ఒక రుతువును మాత్రమే కాక, అన్ని రుతువులనూ అధ్యయనం చేస్తేనే నిర్ణయాధికారం ఉన్నవారికి సరైన, హేతుబద్ధమైన నిర్ణయం తీసుకోవడం వీలవుతుంది. అంతేగాక, ఈ మౌలిక సమాచార సేకరణ అనేది ముసాయిదాలో చెప్పినట్టు "ఏదో ఒక సమయంలో" తీసుకునేది కాదు, అది శాస్త్రీయంగా అన్ని రుతువులలో సేకరించి, ప్రామాణిక ప్రతిపాదనా అంశాలతో అనువర్తింపజేస్తేనే సరైన విశ్లేషణ వీలవుతుంది.

16. **పరిశీలనా ప్రాంతం నిర్వచనం:** ముసాయిదా నిబంధన 3 (54) ప్రతి పథకానికీ పరిశీలనా ప్రాంతం అనేదాన్ని ఎ తరగతిలోనైతే పది కిమీ, బి తరగతిలోనైతే 5 కిమీ అని పరిమితం చేసింది. ఇది పూర్తిగా లోపభూయిష్టం. ఎందుకంటే ఒక పథకపు ప్రభావాలు కొన్ని సందర్భాల్లో ఎన్నో కిమీ అవతల కూడ కనిపించవచ్చు. ఒక పథకపు పర్యావరణ ప్రభావం ఎంత దూరం ఉంటుందని కుదించడం ఒకరి ఇష్టాయిష్టాలను బట్టో, చట్టాన్ని బట్టో కాక, అక్కడి స్థల పరిస్థితులను బట్టి, రక్షిత ప్రాంతాల నుంచి సామీప్యాన్ని బట్టి ఉంటుంది.
17. **సాధారణ పరిస్థితుల నిర్వచనం కుదింపు:** ముసాయిదా నిబంధన 3 (3) సాధారణ పరిస్థితులు అనే మాటకు నిర్వచనాన్ని కూడ నీరుగార్చింది. అది రక్షిత ప్రాంతాల సరిహద్దుల నుంచి, రాష్ట్రాల సరిహద్దుల నుంచి, పర్యావరణ పరంగా సున్నితమైన ప్రాంతాల నుంచి, ప్రమాదకరంగా కలుషితమైన ప్రాంతాల నుంచి 10 కిమీ అనే పాత నిర్వచనాన్ని చాల రకాల పథకాల, పనుల విషయంలో 5 కిమీ కు తగ్గించింది. బి1 తరగతిలో కేవలం నాలుగు రకాల పథకాలకు మాత్రమే, నదీలోయ పథకాలకు, థర్మల్ విద్యుత్ పథకాలకు, విమానాశ్రయాలకు, షిప్ బ్రేకింగ్ యూనిట్లకు మాత్రమే, పది కిమీ దూరంలో ఉంటే కేంద్ర స్థాయిలో అంచనా వేయాలని నిర్దేశించింది. కాని ఈ జాబితాలోని చివరి రెండూ బి1 తరగతిలోవి కావు. అంతే కాదు, సాధారణ పరిస్థితులు అనేది బి1 తరగతిలోని కొన్ని పథకాలకూ, బి2 తరగతిలోని అన్ని పథకాలకూ, నదీ గర్భపు పథకాలకూ వర్తించదని కూడ ముసాయిదా రాసింది. ఇది పూర్తిగా అక్రమం. సాధారణ పరిస్థితులు అనేదాన్ని అన్ని రకాల పథకాలకూ వర్తింపజేయాలి.
18. **స్థానిక భాషలో పర్యావరణ ప్రభావ మదింపు నివేదిక, ఇతర పత్రాలు:** ముసాయిదాలో నిబంధన 14 (3) పర్యావరణ ప్రభావ మదింపు నివేదిక పది ప్రతులు ఇంగ్లిష్ లో తయారుచేయాలని, దాని సారాంశం పది ప్రతులు ఇంగ్లిష్ లో, పది ప్రతులు స్థానిక భాషలో తయారుచేయాలని చెపుతుంది. కాని ఒక ప్రాంత ప్రజలు ఆ పథకంతో తీవ్రంగా ప్రభావితులు అయ్యేప్పుడు, ఆ పథకం గురించిన అన్ని పత్రాలూ, పర్యావరణ ప్రభావ మదింపు నివేదికతో సహా, ఆ ప్రాంత ప్రజలకు అర్థమయ్యే భాషలో ప్రచురించి వారికి అందుబాటులో ఉంచాలి. ప్రత్యామ్నాయ స్థలాల గురించిన విశ్లేషణ, సామాజిక ప్రభావ మదింపు, పర్యావరణ నిర్వహణా ప్రణాళిక, వన్యప్రాణి అనుమతులు, అటవీ అనుమతులు, పథక స్థలపు గూగుల్ పటాలు, వంటి అన్ని పత్రాలూ ప్రజలకు వారి స్థానిక భాషలో అందాలి.
19. **సామాజిక ప్రభావ మదింపు జాడ లేదు:** ఈ ముసాయిదాలో మామూలుగా తప్పనిసరిగా ఉండవలసిన సామాజిక ప్రభావ మదింపు నివేదిక గురించి మాటమాత్రం కూడ లేదు. బహిరంగ ప్రజా విచారణ లేకుండానే అనుమతులూ, సమ్మతులూ ఇవ్వడానికి అవకాశం ఉన్నప్పుడు ఈ సామాజిక ప్రభావ మదింపు నివేదిక లేకపోవడం తీవ్రమైన అన్యాయం.
20. **ఉల్లంఘనలకు శిక్షలు:** పర్యావరణ అనుమతి, సమ్మతిని పాటించకపోతే ఎంత కఠినమైన శిక్షలు విధిస్తారో స్పష్టత ఉండాలి. కాని ఉల్లంఘనల విషయంలో కఠినమైన శిక్షలను ముసాయిదా నిర్దేశించడం లేదు. నిబంధన 23 (10) ప్రకారం పథక ప్రతిపాదకులు ఒక బ్యాంక్ గ్యారంటీ డిపాజిట్ చేస్తే చాలు. పారిశ్రామికవేత్తలకు, వ్యాపారస్తులకు డబ్బుకు కొరత లేదు గనుక ఎంతయినా డబ్బు డిపాజిట్ చేయవచ్చు, పర్యావరణానికి ఎంత హాని అయినా చేయవచ్చు, దాని నుంచి ఎంత లాభమైనా పొందవచ్చు అనే స్థితి ఏర్పడుతుంది. కాలుష్యకారకులే మూల్యం చెల్లించాలి అనే సూత్రానికీ, చట్టపరమైన ప్రక్రియకూ ఇది విఘాతం.
21. **చట్టాన్ని పాటించడం, పర్యవేక్షించడం:** ముసాయిదా నిబంధన 20 (4) ప్రకారం పథక ప్రతిపాదకులు తాము తమకు అందిన అనుమతి మేరకు నిబంధనలను పాటిస్తున్నామని ఏడాదికి ఒకసారి ఒక అనువర్తన నివేదికను సమర్పిస్తే సరిపోతుంది. ఇటువంటి నివేదికను ఆరు నెలలకు ఒకసారి సమర్పించాలని ప్రస్తుత చట్టం చెపుతుంది. పెట్టుబడిదారులకు అనుకూలమైన ఈ నిబంధన మార్పు ఏ షరతులపై అనుమతి మంజూరు చేశారో ఆ షరతుల ఉల్లంఘనే అవుతుంది, ఆ షరతులను పాటించారా లేదా చూసే పర్యవేక్షణ యంత్రాంగాన్ని బలహీనపరుస్తుంది.

కమిటీల స్వాతంత్ర్యాన్ని కత్తిరించడం

22. రాష్ట్ర స్థాయి పర్యావరణ ప్రభావ మదింపు అథారిటీ, కేంద్ర పాలిత ప్రాంతాల పర్యావరణ ప్రభావ మదింపు అథారిటీ సభ్యుల నియామకాలలో కేంద్ర ప్రభుత్వ జోక్యం అనేది ఈ కమిటీ సభ్యుల స్వాతంత్ర్యాన్ని దెబ్బతీస్తుంది. వారు ఎవరి భయాలకూ, ప్రయోజనాలకూ, రాగద్వేషాలకూ లొంగకుండా స్వేచ్ఛగా, సక్రమంగా పరిశీలన జరిపే అవకాశాన్ని తగ్గిస్తుంది.
23. రాష్ట్ర స్థాయి కమిటీల, నిపుణుల కమిటీల ఏర్పాటును, అందులో సభ్యుల ఎంపికను మార్చే అధికారాన్ని ఈ ముసాయిదా కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖకు ఇస్తున్నది. అంటే ఈ కమిటీల, సభ్యుల స్వాతంత్ర్యాన్ని దెబ్బతీసి, వారు స్వేచ్ఛగా, సక్రమంగా పని చేసే అవకాశాన్ని తగ్గిస్తుంది.

ఇతర పర్యావరణ చట్టాలను నీరుగార్చడం

24. గతంలోని కోస్టల్ రెగ్యులేషన్ జోన్ నోటిఫికేషన్స్, వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ ఆక్ట్ 1972, ఫారెస్ట్ రైట్స్ ఆక్ట్ 2006, పంచాయత్ (ఎక్స్ టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్) ఆక్ట్ 1996 వగైరా పర్యావరణ చట్టాలనూ, నియమ నిబంధనలనూ బలోపేతం చేయడంలో ఈ ముసాయిదా విఫలమయింది. ఏ పథకమైనా ప్రారంభించడానికి ముందే పొందవలసిన అనుమతులను, అంగీకారాలను ఈ ముసాయిదా పరిగణనలోకే తీసుకోలేదు. పర్యావరణ పరిరక్షణ కోసం తీసుకునే సమగ్ర వైఖరిలో భాగంగా పరిరక్షణ చట్టాలకు మరింత బలం చేకూర్చడంలో ఈ ముసాయిదా విఫలమయింది. వన్యప్రాణి అనుమతులు, అటవీ అనుమతులు, సి ఆర్ జెడ్ అనుమతులు, జల చట్టం, వాయు చట్టం కింద అంగీకారాలు వంటివి పొందవలసిన అవసరాన్ని ఈ ముసాయిదా గుర్తించనే లేదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇతర చట్టాల కింద హామీ దొరికిన హక్కుల పట్ల ఈ ముసాయిదా వ్యతిరేక వైఖరి తీసుకుంది, వాటన్నిటినీ నీరుగార్చింది.
25. పర్యావరణ ప్రభావ మదింపును ఈ రకంగా సంపూర్ణంగా కొత్తగా

రూపొందించదలచుకున్నప్పుడు, నిజానికి పర్యావరణ పరిరక్షణ యంత్రాంగాన్ని బలోపేతం చేసే అవకాశం దొరికి ఉండేది. అన్ని పర్యావరణ చట్టాలనూ కలిపి ఒక సమగ్రమైన పర్యావరణ ప్రభావ మదింపు ప్రక్రియను తయారు చేయడానికి అవకాశం ఉండేది. కాని ఈ ముసాయిదాలో ఆ అవకాశాన్ని పూర్తిగా కోల్పోవడం జరిగింది.

దూరదృష్టి లేమి

26. రానున్న సంవత్సరాల్లో, దశాబ్దాల్లో ప్రపంచవ్యాప్తంగానే ఎదుర్కోనున్న వాతావరణ మార్పుల, వాతావరణ అత్యవసర పరిస్థితి సవాళ్లను పరిగణనలోకి తీసుకోవడంలో ఈ ముసాయిదా విఫలమయింది. అలా పరిగణనలోకి తీసుకుంటే చట్టాన్ని దూరదృష్టితో తయారు చేసి, భవిష్యత్తులో తలెత్తనున్న సవాళ్లను అధిగమించే చట్రాన్ని రూపొందించి ఉండవలసింది. అందుకు బదులుగా ఈ ముసాయిదా ఒక తిరోగమన, అపసవ్య చట్టాన్ని ప్రతిపాదిస్తున్నది.

పైన చెప్పిన కారణాల వల్ల, ఇంకా ఇక్కడ చెప్పలేకపోయిన కారణాల వల్ల కూడ పియుసిఎల్ మహారాష్ట్ర ప్రస్తుతం ఉన్న స్థితిలోని పర్యావరణ ప్రభావ మదింపు 2020 ముసాయిదాను తిరస్కరిస్తున్నది. పర్యావరణ ప్రభావ మదింపు ప్రక్రియ లోపాల గురించి ఇన్నాళ్ల అనుభవంలో పర్యావరణ హక్కుల బృందాలు, పౌరసమాజం తెలుసుకున్న అవగాహనను గుర్తించడంలో ఈ ముసాయిదా విఫలమయింది. నియంత్రణాధికారాన్ని కేంద్రీకరించడం, అధికార యంత్రాంగానికి ఎక్కువ అధికారాలు ఇవ్వడం, తద్వారా ప్రక్రియ స్వాతంత్ర్యాన్ని అరికట్టడం, అవినీతి కార్యకలాపాలను ప్రోత్సహించడం అనే లోపాలకు ఈ ముసాయిదా కారణమవుతున్నది. ఈ ముసాయిదా అప్రజాస్వామికమైనది, గ్రామీణ, అట్టడుగు భాగస్వామ్యం ద్వారా స్థానిక స్వపరిపాలన సాగాలనే విలువ మీద దాడి చేస్తున్నది, రాజ్యాంగపు ప్రాథమిక పునాది అయిన సమాఖ్య సూత్రాన్ని రద్దు చేస్తున్నది. ఎన్నో పథకాలకు ప్రజా విచారణ, ప్రజాభిప్రాయ సేకరణ అవసరం లేదని అనడం ద్వారా, ప్రజా విచారణా ప్రక్రియలో ఎన్నో ప్రజా వ్యతిరేక మార్పులు ప్రవేశపెట్టడం ద్వారా, ఈ ముసాయిదా నిర్ణయాధికారంలో ప్రజాభాగస్వామ్యం ఉండాలనే ఆలోచనను తిరస్కరిస్తున్నది. కాని ఆ ఆలోచన పర్యావరణ పాలనకూ, సుస్థిర అభివృద్ధికీ అత్యంత కీలకమైనది. ఈ ముసాయిదా అంతర్జాతీయ పర్యావరణ న్యాయశాస్త్రానికి వ్యతిరేకమైనది. భారతదేశం సంతకం పెట్టిన రియో డిక్లరేషన్, వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి అవగాహన, పారిస్ ఒప్పందం వంటి అనేక ముఖ్యమైన అంతర్జాతీయ ఒప్పందాలనూ, ఒడంబడికలనూ, సూత్రాలనూ ఈ ముసాయిదా ఉల్లంఘిస్తున్నది. తద్వారా ఐక్యరాజ్యసమితి తయారుచేసిన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో భారతదేశానికి ఉన్న (బహుశా లేని) చిత్తశుద్ధికి ఈ ముసాయిదా అద్దం పడుతున్నది. ఈ ముసాయిదా గనుక చట్టంగా మారితే, ఈ దేశం దశాబ్దాలుగా శాసనాల ద్వారా, న్యాయస్థానాల ద్వారా పర్యావరణ న్యాయశాస్త్రంలో సాధించిన విజయాలన్నిటినీ రద్దు చేస్తూ వెనక్కి వెనక్కి గంతులుగా తిరోగమిస్తుంది. అంతేకాదు, స్థానిక ప్రజా సమూహాలు, ప్రభావానికి గురయ్యే ప్రమాదం ఉన్న బృందాలు, కార్యకర్తలు దశాబ్దాలుగా తమ పర్యావరణ అవగాహన ద్వారా, ఉద్యమం ద్వారా సాధించిన విజయాలను ఈ ముసాయిదా నిష్ఫలం చేస్తుంది. పర్యావరణ విధానాలను నీరుగార్చిన ప్రత్యక్ష ఫలితంగా మన పర్యావరణ, ఆరోగ్య సూచికలు అతి దారుణంగా పడిపోయి ఉన్న నేపథ్యంలో ఒక బలమైన, దృఢమైన చట్టాన్ని రూపొందించవలసి ఉంది. దానిద్వారా దేశంలో పర్యావరణ పాలనను బలోపేతం చేసి, తరం నుంచి తరానికి అందే పర్యావరణంలో సమతుల్యత, సమానత, పర్యావరణ పరిరక్షణ, పర్యావరణ న్యాయం వంటి విలువలను నిలబెట్టవలసి ఉన్నది. ఆ పని చేయడానికనే పేరుతో వస్తున్న ప్రస్తుత పర్యావరణ ప్రభావ మదింపు ముసాయిదా 2020 పూర్తిగా తలకిందులుగా ఉంది. మన సమాజాన్ని పూర్తిగా వెనక్కి తీసుకుపోదలచింది. అందువల్ల ఇది ఎంతమాత్రమూ అంగీకరించడానికి వీలులేనిది.

అందువల్ల పియుసిఎల్ మహారాష్ట్ర ఈ ముసాయిదాను బేషరతుగా ఉపసంహరించుకొమ్మని పర్యావరణ, అటవీ, వాతవరణ మార్పుల మంత్రిత్వ శాఖను కోరుతున్నది. కొవిడ్ మహావిపత్తు విజయవంతంగా సమసిపోయేవరకూ, ఈ దేశ ప్రజలు క్రియాశీలంగా ఈ ప్రక్రియలో పాల్గొనే అవకాశం వచ్చేవరకూ ఈ కొత్త చట్టాన్ని ప్రవేశపెట్టే ప్రక్రియను నిలిపివేయవలసిందిగా కోరుతున్నది.

అందుకు బదులుగా, ఒక బలమైన, దృఢమైన పర్యావరణ చట్టాన్ని ప్రవేశపెట్టే ప్రయత్నంలో ప్రజలందరి స్వేచ్ఛాయుత, సక్రమ భాగస్వామ్యానికి అవకాశం ఇవ్వాలని, ప్రత్యేకంగా పర్యావరణ ప్రభావ మదింపు చట్టాన్ని తయారుచేయడంలో స్థానిక ప్రజా సమూహాలను, నిపుణులను, పర్యావరణ పరిరక్షకులను, సంబంధిత భాగస్వామ్య పక్షాలన్నిటినీ భాగం చేయాలని, వారి అవగాహనలను, అనుభవాలను, సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని పియుసిఎల్ మహారాష్ట్ర సూచిస్తున్నది.

మా అభ్యంతరాలను, సూచనలను పరిగణనలోకి తీసుకుంటారని, పర్యావరణ ప్రభావ ముసాయిదా 2020ని మరింత ఆలస్యం చేయకుండా పక్కన పెడతారని ఆశిస్తున్నాము.

(పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్, మహారాష్ట్ర శాఖ ఈ లేఖను ఆగస్ట్ 11 న కేంద్ర ప్రభుత్వ పర్యావరణ అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ కార్యదర్శికి పంపింది)

వచ్చే సంచికలలో...

- **వ్యవసాయంలో లాభం వస్తుందా! - డా. రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
- **స్త్రీలు - న్యాయవ్యవస్థ - హేమా వెంకట్రావు**
- **ఆంధ్రప్రదేశ్ రాజధాని మార్పు - బి.ఎస్. రాజు**
- **కరోనా వైరస్ - పాలకుల స్వభావం - ఎ. తిరుపతి**
- **యాంత్రిక సమాజ సృష్టికే ఆన్‌లైన్ విద్య - చుంచు శ్రీశైలం**

తిరోగమన జాతీయ విద్యా విధానం

నూతన జాతీయ విద్యా విధానం ద్వారా దేశ సామాజిక స్థితిని గుర్తించకుండా కార్పొరేటీకరణ, కాషాయీకరణ వైపు వెళ్లడమంటే తిరోగమనమేనని అంటున్నారు **ఎ. నర్సింహారెడ్డి**

కరోనా కల్లోల కష్టకాలంలో కస్తూరి రంగన్ నూతన విద్యావిధాన ముసాయిదా 2019 ఆధారంగా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం పార్లమెంటును పక్కనపెట్టి జాతీయ ప్రాముఖ్యత గల ప్రాథమిక విద్య మొదలుకొని విశ్వవిద్యాలయ స్థాయి వరకు ఉద్దేశించిన నూతన విద్యా విధానాన్ని జూలై 29న ఆమోదించింది. ఈ విద్యా విధానం భారతీయ సంస్కృతి పునాదులపై విశ్వస్థాయి మహా జ్ఞానశక్తిగా దేశాన్ని 2040 వరకు పునర్నిర్మించేందుకు ఉద్దేశించిందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఈ నివేదిక సహజంగానే బిజెపి రాజకీయ తాత్వికతను, ఆర్థిక స్వభావాన్ని, సామాజిక సాంస్కృతిక ధోరణులను ప్రతిబింబిస్తుంది. ఈ నివేదిక డా.కొఠారీ కమిటీ 1966లో చేసిన సూచనల నుంచి అలాగే 1968, 1986 జాతీయ విద్యావిధానాల నుంచి వెనక్కు మలుపు (యుటర్న్) తీసుకుంది. నూతన విద్యావిధానం తెస్తున్న మార్పులు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన సమూహాల విద్యార్థులకు సమాన విద్యావకాశాలను నిరాకరిస్తుంది. విద్య వ్యాపారీకరణకు ఊతం ఇస్తుంది. అందరికి ప్రమాణాలతో కూడిన సమాన విద్యను అందించాల్సిన బాధ్యత నుంచి రాజ్యం తప్పుకునేలా చేస్తుంది. అంతేగాక కీలకమైన విద్యారంగ సమస్యలను అతిగా కేంద్రీకృతం చేసి, భారత యూనియన్ ఫెడరల్ స్వభావాన్ని హరిస్తుంది.

స్వేచ్ఛ, ప్రగతిని అడ్డుకునే విద్యావిధానం

ఈ నివేదిక హేతుబద్ధంగా ఆలోచించగల మానవులను, సహానుభూతి, ధైర్య సాహసాలు, శాస్త్రీయ దృక్పథం, సృజనాత్మకత, నైతిక విలువలు కలిగిన మానవులను తయారుచేసే విధంగా విద్యావిధానం ఉండాలని, రాజ్యాంగ విలువలైన సమాన, సమ్మిళిత, బహుళత్వ సమాజాన్ని నిర్మించే పౌరులను తయారు చేయాలని నివేదిక పరిచయ వాక్యంలో చెప్పుకుంది. అదే సమయంలో ప్రాథమిక స్థాయి నుండి పరిశోధన వరకు దేశ జాతీయ స్థానిక సంప్రదాయాలను, ఆచారాలను, వారసత్వాన్ని, ప్రాచీన సమకాలీన జ్ఞానాన్ని గురించి బలమైన పునాదితో బోధనాభ్యసన శాస్త్రం(పెడగాగీ), పాఠ్య ప్రణాళిక (కరికులం)ను మార్పు చేస్తున్నట్లు ప్రముఖంగా పేర్కొన్నారు. నివేదికను ఆసాంతం పరిశీలిస్తే విద్యావిధాన మౌలిక లక్ష్యం నుంచి ప్రభుత్వం వైదొలగడం సారాంశంగా కనిపిస్తుంది. సంప్రదాయం, సంస్కృతి పేరుతో విద్యలో కాలం చెల్లిన, రుజువుకు నిలువని అశాస్త్రీయ భావాలను జొప్పించే ప్రయత్నం చేస్తుంది.

34 సంవత్సరాల తర్వాత మోడీ ప్రభుత్వం తీసుకువస్తున్న విద్యావిధానం క్షేత్ర స్థాయి పరిస్థితులను పరిగణలోకి తీసుకోలేదు. నూతన విద్యావిధాన దార్శనికతలో పేర్కొన్న ఆశయాల అమలుకు అవసరమైన యంత్రాంగం రూపకల్పన చేయలేదు. విద్య ప్రధాన లక్ష్యం వ్యక్తి వికాసం, సామాజిక ప్రగతి. కుల, మతపరమైన సమీకరణలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితులలో వివక్ష, ఆధిపత్య స్వభావం లేకుండా ఉండేటట్లు విద్యా వ్యవస్థను ప్రజాస్వామికంగా రూపొందించడం లౌకిక, ప్రజాస్వామ్య వ్యవస్థ పురోగమనానికి ఎంతో అవసరం. అయినప్పటికీ విద్యా సంస్థల స్థాపన, నిర్వహణకు సంబంధించి మత సంస్థలైన మదర్సాలు, సరస్వతీ శిశుమందిర్‌లు, క్రిస్టియన్ మిషనరీల ద్వారా కాంక్షించడం ఎంతవరకు సబబు? ఈ విధానం క్రమకంగా ప్రభుత్వరంగ పాఠశాలలను నిర్వీర్యపరుస్తుంది. మరోవైపు విద్యార్థుల్లో మత మౌఢ్యాన్ని పెంచే ప్రమాదముంది.

మన దేశ విద్యా వ్యవస్థలో సమానత్వం, సామాజిక న్యాయం, శాస్త్రీయ దృక్పథం కోసం జాతీయ ఉద్యమం, సంస్కరణోద్యమ కాలం నుంచి ఇప్పటికీ పెద్ద పోరాటమే చేస్తున్నారు. భారత రాజ్యాంగం ప్రజలందరికి పాఠశాల విద్యను హామీ ఇచ్చింది. ఏ జాతి వికాసానికైనా విద్య జీవనాడి లాంటిది. జాతి సమైక్యత, సమగ్రతల పరిరక్షణలో విద్య పాత్ర అమూల్యమైంది. వ్యక్తి వికాసానికి, సమాజాభివృద్ధికి విద్య ప్రధాన చోధక శక్తి. అందువల్లనే ఉదారవాద విద్య ప్రతి వ్యక్తికి విద్య ద్వారా జ్ఞానం, నైపుణ్యం, విలువలు అందించడం రాజ్యం బాధ్యతగా గుర్తించింది. దేశ అవసరాలకు అనుగుణంగా, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా, విద్యారంగం ఎదుర్కొంటున్న మౌలిక సమస్యలు పరిష్కరించేలా విద్యావిధానం ఉండాలని ప్రజలు ఆశిస్తున్నారు. నూతన విధానం రాజ్యాంగం ఇచ్చిన హామీలనే తిరస్కరించింది.

ప్రస్తుత విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న సంక్షోభాన్ని నివేదిక ప్రస్తావించనే లేదు. దేశ ఆర్థిక, సామాజిక వ్యవస్థలో నెలకొన్న పరిస్థితికి సంబంధం లేకుండా విద్యా వ్యవస్థను రూపొందించడం శోచనీయం. డా. కొఠారి సూచన ప్రకారం కుల ఆధారిత, అత్యంత ఆర్థిక అసమాన సమాజంలో విద్యను ప్రభుత్వమే అందరికి సమానంగా అందించాలి. బోధనాంశాలను మరింత పరిమితం చేయడానికి ఈ విధానం మొగ్గు చూపుతుంది. మన విద్యా వ్యవస్థ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య నిధుల కొరత, పాలకుల చిత్తశుద్ధి లేమి అని చెప్పవచ్చు. కోట్లాది మంది పేదలున్న దేశంలో విద్యను ఒక అంగడి సరుకుగా మార్చి అందరికి ప్రమాణాలతో కూడిన సమగ్ర విద్యను అందిస్తామనడం ప్రభుత్వ ద్వంద్వ విధానానికి పరాకాష్ట. ఈ నివేదిక... సెక్యులరిజం, సోషలిజం, సామాజిక న్యాయం అనే పదాల ప్రస్తావనను, భిన్నత్వంలో ఏకత్వం అనే భావాన్ని పూర్తిగా విస్మరించింది. సంస్కరణోద్యమం, స్వాతంత్ర్యోద్యమం అందించిన భావాలు, వ్యక్తీకరణలను ఈ నివేదిక తిరస్కరించినట్లు స్పష్టమవుతున్నది.

మధ్య యుగాల చరిత్రను ముస్లిం చరిత్రగా చూసే సంఘ్‌పరివార్ దృక్పథాన్ని ఈ నివేదిక ప్రతిబింబించింది. వ్యక్తి వికాసం, సామాజిక ప్రగతి లక్ష్యాలతో విద్యావస్తువు, ప్రక్రియ రూపకల్పనకు సూచనలు చేయలేదు. విద్యావ్యాపారానికి దాతృత్వం ముసుగు తొడిగింది. అగ్ర వర్ణాల ఆధిపత్యం, మతాచారాల ముసుగు మాటున శతాబ్దాల కాలం

నుండి అణచివేతకు గురవుతూ, అభివృద్ధికి దూరంగా ఉండిపోయిన వివిధ తరగతుల ప్రజలున్న దేశం మనది. ఇప్పటికీ వివిధ రకాల వివక్షతల మధ్య సమాజం నలిగిపోతుంది. అందుకే సెకండరీ స్థాయి దాటిన తర్వాత విద్యా, ఉపాధి రంగాల్లో దళిత, గిరిజన, వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లను మన రాజ్యాంగం కల్పించింది. ఈ విద్యావిధానం సామాజిక న్యాయం గురించి పట్టించుకున్న దాఖలాల్లేవు. వివక్షత, అణచివేత ఉన్న సమాజంలో రిజర్వేషన్ గురించి మాటమాత్రంగా కూడా నూతన విద్యావిధానం ప్రస్తావించలేదు.

ఉదాత్త విలువలకు దూరమవుతున్న విద్య

1948లో ఏర్పడిన డా. రాధాకృష్ణన్ కమిటీ నుంచి 2018లో ఏర్పడిన కస్తూరి రంగన్ కమిటీ వరకు అందరు విలువలు, ఆదర్శాల ప్రాధాన్యత గురించి చెబుతున్నారు. ఇవాళ విద్యారంగం ఎంత దీనావస్థలో ఉందో మనందరికి కనిపిస్తూనే ఉంది. 1966లో వెలువడిన కొఠారి కమీషన్ నివేదికపై స్వాతంత్ర్య ఉద్యమం, సంస్కరణోద్యమం ప్రభావం కనిపిస్తుంది. అందువల్లనే అది దేశ సమైక్యతకు, అభివృద్ధికి కామన్‌స్కూల్ నైబర్ హుడ్ వ్యవస్థను, ఉపాధ్యాయుని ప్రాముఖ్యతను, విద్యావ్యవస్థ వికేంద్రీకరణను, పట్టణ-గ్రామీణ ప్రాంతాల మధ్య సమానత్వాన్ని, శాస్త్రీయ విద్యను ప్రతిపాదించింది. అందుకు గాను స్థూల జాతీయోత్పత్తిలో 6 శాతం, కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు విద్యపై వ్యయం చేయాలని సూచించింది. ఐదు దశాబ్దాలు గడిచినా కొఠారి సూచనలు అమలు కాలేదు.

1968లో అమలులోకి వచ్చిన మొదటి జాతీయ విద్యావిధానం జాతీయోద్యమం ఆశయాలను, సమానత్వ భావనను, వ్యక్తిత్వ నిర్మాణాన్ని, సర్వతోముఖ వికాసాన్ని లక్ష్యంగా పెట్టుకొంది. 1986 జాతీయ విద్యావిధానం విశ్వవిద్యాలయాల గురించి ఇలా చెపుతోంది. "విద్యకు సమాజాన్ని సంస్కృతీకరించే పాత్ర ఉంది. జాతీయ ఐక్యతను, శాస్త్రీయ దృక్పథాన్ని, స్వతంత్ర ఆలోచనను, అంతఃకరణను పాదుకొల్పే మృదుత్వాన్ని దృక్పథాన్ని విద్య సునిశితం చేయగలుగుతుంది. ఆ విధంగా భారత రాజ్యాంగంలో పొందుపరిచిన సామ్యవాదం, లౌకికవాదం, ప్రజాస్వామ్యం అనే లక్ష్యాలను ముందుకు తీసుకువెళ్ల గలుగుతుంది". "విద్య ఆర్థిక రంగానికి కావలసిన వివిధ స్థాయిల మానవ శక్తిని అందిస్తుంది. జాతీయ స్వయం పోషకత్వానికి, పరిశోధన అభివృద్ధికి విద్యే ఆధార భూతంగా ఉంటుంది". అందువల్ల అందరికి ప్రమాణాలతో కూడిన విద్యను సమానంగా అందించాలని పేర్కొంది.

నేషనల్ కరిక్యులం ఫ్రేమ్ వర్క్ 2005 ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ, సమానత్వం, లౌకికతత్వం, మానవ హక్కులకు ప్రాధాన్యం ఇచ్చేట్టుగా విద్యావ్యవస్థ ఉండాలని సూచించగా ఎన్ఇపి 2020లో ఫెడరల్ విధానం, సామాజిక న్యాయం, శాస్త్రీయ దృక్పథం వంటి భావనల ఊసెత్తకపోవడం గమనార్హం. ఈ విధానం రాజ్యాంగ విలువల నుంచి నిర్లక్ష్యాత్మకంగా దూరం జరగటాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రజాస్వామ్యయుత, సంక్షేమ వరవడితో కూడిన సమ్మిళిత విద్యను తిరస్కరిస్తుంది. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, సరళీకరణ ధోరణులకు ప్రాధాన్యతనిస్తుంది. నూతన విద్యావిధానం కేంద్రీకరణ, వ్యాపారీకరణ, మత ప్రాధాన్యత, కార్పొరేటైజేషన్‌ను ముందుకు గొనిపోవటాన్ని సులభతరం చేస్తుంది. సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతులకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్, రీసెర్చి, స్కాలర్‌షిప్, అపాయింట్‌మెంట్ వగైరా సదుపాయాలను ఇది నిరాకరిస్తున్నది. ప్రతిభ సాకుతో ఈ అవకాశాలు నిరాకరించబడుతున్నాయి. దళిత, ఆదివాసీ, వెనుకబడిన వర్గాల విద్యార్థులను విద్యారంగం నుంచి పక్కకు నెట్టివేసే ధోరణి స్పష్టంగా కనిపిస్తుంది.

భారత రాజ్యాంగం అందరికీ ప్రమాణాలు గల పాఠశాల విద్య (అధికరణం 21-ఏ, 45), రాజ్య ఆర్థిక స్థోమత మేరకు సామాజిక న్యాయం ప్రాతిపదికన అందరికీ సమాన అవకాశాలతో ఉన్నత విద్య (అధికరణం 41) ప్రకారం అందించవలసి ఉంది. నూతన విద్యావిధానం రాజ్యాంగం కల్పించిన హక్కులను హరించడమేకాక ఉన్నత విద్యావ్యవస్థకు మూలమైన శాస్త్రీయత, ప్రజాస్వామ్యం, స్వతంత్ర ఆలోచనా శక్తిని వికసింపచేయడం వంటి లక్షణాలను దెబ్బతీసే విధంగా ఉంది. ఈ విధానం దేశానికీ, భావితరాలకు తీవ్ర ప్రమాదకరమైనది. ఈ నివేదికలో తీవ్రమైన అధికార కేంద్రీకరణే ప్రధానంగా కనిపిస్తున్నది. అధికార కేంద్రీకరణ అటు మార్కెట్‌కు ఇటు మనువాద పునరుద్ధరణకు అత్యంత కీలకమనేది తెలిసిందే. విద్యావ్యాపారంలోకి విదేశీ బడా కార్పొరేటు సంస్థలు రావడానికి తలుపులు బార్లా తెరవడంతో పాటు బిజెపి రాజకీయ సాంస్కృతిక ప్రయోజనాలు నెరవేర్చుకోవడం ప్రధాన లక్ష్యంగా ఈ నివేదికలో కనిపిస్తుంది. అలాగే రాష్ట్రాల హక్కులను కుదిస్తున్నది. అది అతి కేంద్రీకరణను ప్రోత్సహిస్తూ, తద్వారా రాజ్యాంగ ఫెడరల్ స్వభావాన్ని తిరస్కరిస్తుంది.

నూతన విద్యా విధానం 2020 ప్రపంచ బ్యాంకు నిర్దేశాలు, ప్రపంచ వాణిజ్య సంస్థలో వాణిజ్య సేవల ఒప్పందం, అంబానీ-బిర్లా నివేదిక, నాలెడ్జి కమీషన్(శ్యాం పిట్రోడా) రిపోర్టు, ఎంహెచ్ఆర్‌డి సూచనలు ఇవన్నీ కలిపి ఆర్ఎస్ఎస్ ఎజెండాను మాత్రమే ప్రతిపాదించింది. ఈ నివేదికలో పేర్కొన్న ఆదర్శాలకు ఆచరణకు పొంతన లేకుండా ఉంది. అది అందరికీ విద్య గూర్చి మాట్లాడింది, అయితే కొద్ది మందికే మార్గం సుగమం చేస్తున్నది. అది ప్రాచీన చరిత్రను మాత్రమే ప్రస్తావించింది. మధ్యయుగాల, ఆధునిక భారత్ గూర్చి ప్రస్తావన చేయకపోవటం ఆశ్చర్యకరంగా ఉంది. భారతదేశ స్వాతంత్ర్య పోరాటం గూర్చి, వలస వ్యతిరేక ఆదివాసీ ఉద్యమాలు, రాచరిక భూస్వామ్య వ్యతిరేక రైతాంగ ఉద్యమాలు, కార్మిక ఉద్యమాలు, మతవ్యతిరేక సంస్కరణ ఉద్యమాల సుదీర్ఘ పోరాటాల గూర్చి ప్రస్తావించ లేదు. నూతన విద్యావిధానం రాజ్యాంగ విలువల బోధన ఆవశ్యకత గురించి చెపుతుంది. కానీ లౌకికత, సార్వభౌమత్వం, సామ్యవాదం, సమన్యాయం లాంటి విలువల గురించి ప్రస్తావించలేదు. ఇది చాలా తీవ్రమైన విషయం.

నూతన విద్యావిధాన రూపకల్పనకు ఆరేళ్లు

కేంద్రంలో బిజెపి మే 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మోడీ ప్రభుత్వానికి ఈ దేశంలో విద్యా వ్యవస్థను సమూల ప్రక్షాళన చేయాలన్న సంకల్పంతో ఉంది. అందులో భాగంగానే 1986 జాతీయ విద్యా విధానాన్ని సమూలంగా సమీక్షించి, నూతన జాతీయ విద్యా విధానం రూపొందించేందుకు 2015 జనవరిలో ఆన్‌లైన్ సంప్రదింపుల ప్రక్రియను ప్రారంభించింది. వివిధ అంశాలపై విద్యా సంస్థలు, అధ్యాపకుల నుండి స్పందనలు ఆహ్వానిస్తూ పాఠశాల విద్యకు సంబంధించి 13 అంశాలతో, ఉన్నత విద్యకు సంబంధించిన 20 అంశాలతో ప్రశ్నావళిని విడుదల చేసింది. దేశవ్యాప్తంగా చర్చలు జరిగాయి. అభిప్రాయాలు కేంద్రానికి పంపడం జరిగింది. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగిన చర్చల సారాంశాన్ని క్రోడీకరించేందుకు కేంద్ర కేబినెట్ సెక్రటరీగా పనిచేసిన టిఎస్ఆర్ సుబ్రమణియన్ ఆధ్వర్యంలో 2015 అక్టోబర్‌లో ఒక కమిటీని నియమించారు. ఆ కమిటీ 230 పేజీలతో కూడిన నివేదికను మే

2016లో సమర్పించింది. ఆ నివేదికను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో తానే స్వయంగా ప్రజల ముందుంచాడు.

సుబ్రమణ్యం కమిటీ తన నివేదికలో కొన్ని ఘాటైన విమర్శలు చేసింది. అధికారుల్లో ప్రభుత్వాల్లో తీవ్ర అవినీతి చోటు చేసుకుందని, పరీక్షలు ఫార్స్‌గా తయారయ్యాయని నివేదిక పేర్కొంది. 'విద్యా దుకాణాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, విద్య వ్యాపార వస్తువుగా మారిందని, బోధనాంశాల్లో గానీ, బోధనా తీరులో గానీ నాణ్యత లేదని, అభివృద్ధికి వెలుపల ఉన్న సామాజికవర్గాల పిల్లలకు కనీసపు విద్య కూడ అందడం లేదని, మన ప్రభుత్వాలు పరీక్షలు, బదిలీలు, నియామకాలు తప్ప చదువును గురించి పట్టించుకొన్న దాఖలాలు లేవన్నది'. మనదేశంలో విద్య అత్యంత రాజకీయ ప్రాధాన్యం లేని అంశమని, మీడియాకు కూడా ఇదేమి పట్టదని వ్యాఖ్యానించింది. అదే నివేదికలో సంస్కృత భాష గొప్పదని, దాన్ని అందరు నేర్చుకోవాల్సిన అవసరముందని పేర్కొంది. విదేశీ పెట్టుబడులను విద్యలోకి ఆహ్వానించాలని సూచించింది. ఇది ఇట్లా ఉండగా కేంద్ర మానవ వనరుల శాఖ నూతన విద్యావిధానం-2016 పేరిట 43 పేజీల చిత్తు ప్రతిని విడుదల చేసింది.

2017 జూన్ 24న ఇస్రో మాజీ చైర్మన్ కస్తూరి రంగన్ సారథ్యంలో 8 మందితో మరో కమిటీ ఏర్పాటైంది. అది 2018 డిసెంబర్ 25న 484 పేజీల నివేదికను మానవ వనరుల మంత్రిత్వ శాఖకు సమర్పించింది. 2019 ఎన్నికల్లో గెలిచి రెండవసారి అధికారం చేపట్టిన మరుసటిరోజే ప్రభుత్వం 2019 మే 31న నివేదికను వెల్లడించింది. కస్తూరి రంగన్ నివేదికలోని చాలా అంశాలు బిజెపి రాజకీయ, సామాజిక ఆలోచనలకు అనుగుణంగా ఉండటమే కాకుండా వాటి విస్తృతికి బలంగా తోడ్పడుతాయి అనడంలో సందేహం లేదు. విద్యావ్యాపారం విషయంలో అస్పష్టత, మరొకవైపు తీవ్రమైన అధికార కేంద్రీకరణ ఈ నివేదికలో ప్రధానంగా కనిపిస్తుంది. అధికార కేంద్రీకరణ అటు మార్కెట్‌కు ఇటు మనువాద పునరుద్ధరణకు దోహదపడుతాయి అన్న విషయం తెలిసిందే. 2019 జూన్ 10న మానవ వనరుల మంత్రిత్వ శాఖ 53 పేజీల విధాన పత్రం విడుదల చేసింది.

విద్యావేత్తలు, మేధావులు, విద్యాసంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజలు కస్తూరి రంగన్ సమర్పించిన ముసాయిదాపై తమ అభిప్రాయాలు, సూచనలు తెలుపవలసిందిగా కేంద్ర ప్రభుత్వం కోరింది. ఆనాటి నుంచీ నూతన విద్యావిధానం ముసాయిదాపై అనేకానేక చర్చలు జరిగాయి. కస్తూరి రంగన్ నివేదిక ప్రైవేటీకరణను ప్రోత్సహిస్తుందని, రాజ్యాంగ విలువలను పట్టించుకోలేదని, హిందువేతరుల చరిత్రను నిరాకరించిందని, ఫెడరల్ విధానానికి, సామాజిక న్యాయానికి హాని కల్గిస్తుందని అధ్యాపక, ఉపాధ్యాయ, విద్యార్థి, ప్రజాసంఘాలు కేంద్ర ప్రభుత్వానికి తెలిపినా పట్టించుకోలేదు. అక్టోబర్ 2019లో కేంద్ర మానవ వనరుల మంత్రిత్వ శాఖ 'సమ్ ఇన్ పుట్స్ ఫర్ డ్రాఫ్ట్ నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ-2019' అనే పేరుతో మరో 55 పేజీల విధాన పత్రాన్ని విడుదల చేసింది.

వర్సిటీల అటానమీ అంటే ప్రైవేటీకరణనే

కొఠారి కమీషన్ ఎలాంటి అడ్డంకులులేని బోధన, అభ్యాసం, పరిశోధనల కోసం, విద్యార్థులలో సామాజిక బాధ్యతను పెంపొందించడం కోసం యూనివర్సిటీలకు అకాడమిక్ అటానమీ అవసరమని విస్పష్టంగా తెలియజేసింది. ఎన్ఇపి 2020లో అటానమీ అంటే యూనివర్సిటీల, ఇతర ఉన్నత విద్యాసంస్థల యాజమాన్యాలకు ఇచ్చిన ఫైనాన్షియల్ (వివిధ రూపాలలో తమకు తామే ఆర్థిక వనరులను సమకూర్చుకునే) అటానమీ తప్ప, అధ్యాపకులకు, విద్యార్థులకు ఇచ్చిన అకాడమిక్ అటానమీ కాదు. న్యాక్ ఇచ్చిన ఒకటి, రెండు కేటగిరీలలోని విద్యాసంస్థలు కొత్త కోర్సులు పెట్టడానికి, కొత్త పరిశోధనా కేంద్రాలు ఏర్పాటు చేయడానికి, ప్రైవేటు భాగస్వాములను ఆహ్వానించడానికి ప్రభుత్వ అనుమతి పొందవలసిన అవసరం లేదు. యాజమాన్యాలు కొత్త కోర్సులు పెట్టుకోవడానికి స్వేచ్ఛ ఉంటుంది కాని అందుకు అవసరమైన ఆర్థిక వనరులను మాత్రం ప్రభుత్వాన్ని అడగరాదు. అలాంటప్పుడు విద్యార్థుల ఫీజులను భారీగా పెంచడం మినహా మరొక మార్గమేముంటుంది?

ప్రైవేట్ వర్సిటీలు మార్కెట్ ఓరియెంటేషన్‌తో కొత్తగా సెల్ఫ్ ఫైనాన్సింగ్ కోర్సులను పెట్టి విద్యార్థులను ఆకర్షించి అధిక ఫీజులను వసూలు చేయడం, తమ వనరులను, ప్రయోగశాలలను ఇతర సంస్థలకు అద్దెకు ఇచ్చి నడపడం తప్ప మరొక గత్యంతరం ఉండదు. ఈ పనిని ప్రైవేటు యూనివర్సిటీలు భేషుగ్గా చేస్తాయి. లేకుంటే మార్కెట్ పోటీలో నిలబడలేక మూతపడుతాయి. ఈ గ్రేడెడ్ అటానమీ కింద ఒకటి, రెండు కేటగిరిలోని విద్యాసంస్థలు విదేశీ విద్యార్థులను చేర్చుకొని ఎంత ఫీజైనా వసూలు చేసుకునే అధికారం, విదేశీ అధ్యాపకులను పరిమిత కాలం పాటు, లేదా కాంట్రాక్టు పద్ధతిలో నియమించుకోవడానికి స్వేచ్ఛ ఉంటుంది. ఇది గ్యాట్స్ ఒప్పందం మేరకు అంతర్జాతీయ విపణి వీధిలో విద్యను ఒక సరుకుగా మార్చడంలోను, ఎలాంటి నియంత్రణ లేకుండా లిబరలైజ్ చేయడంలోను భాగమే. ఈ విధానం ఒకవైపు అకాడమిక్ అటానమీని హరిస్తూ, మరోవైపు అదే అటానమీ పేరు మీద ఉన్నత విద్యను పూర్తిస్థాయి వ్యాపారంగా మార్చడం, ప్రపంచీకరణ మార్కెట్‌కు అనుసంధానిస్తూ, దీన్ని క్వాలిటీ సాధించడానికి గ్రేడెడ్ అటానమీగా చెప్పడం ప్రభుత్వ కొత్త ఎత్తుగడ.

ఎన్ఇపిలో భాష – సంస్కృతి

భాషా సమస్య సహజంగానే క్లిష్టమైన సమస్య. పాలక వర్గాలు అనుసరించే ఆధిపత్య వాదం వలన ఈ సమస్య మరింత జటిలమవుతుంది. విద్యలో ప్రధానాంశాల ప్రస్తావన, స్పష్టమైన సిఫార్సుల కంటే వ్యాఖ్యానానికీ, నీతి వాక్యాల వల్లింపునకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చింది. మన ప్రాచీన వారసత్వాన్ని గొప్పగా కొనియాడింది. సంస్కృత భాషను గొప్పదిగా కీర్తించింది. సంస్కృత సాహిత్యంలో ఎంతో విజ్ఞానం దాగి ఉందని చెప్పుకొచ్చింది. సంస్కృతం ఇతర భారతీయ భాషల అభివృద్ధికి ఎంతో సహకరించిందని, ఇప్పటికీ ఇతర భాషల అభివృద్ధికి అది ఎంతగానో సహకరించగలదని పేర్కొంది. నిజానికి సంస్కృతం మన దేశంలో ఏనాడు ప్రజల భాషగా లేదు. చరిత్ర పొడవునా సంస్కృతం ఇతర భాషాల అభివృద్ధిని అడ్డుకొంది. ఈ నిజాన్ని చెప్పకుండా నివేదిక దాచిపెట్టింది. మన సంప్రదాయాల్లో అత్యధికం అభివృద్ధి నిరోధకమైనవే.

మన ప్రాచీన విద్య 'స్వయం విముక్తి' లక్ష్యంగా సాగిందనీ, భారతీయుల తాత్విక పునాది అంతా అందులోనే ఉందని పేర్కొంది. ప్రాచీణ గురుకుల సంప్రదాయాలను, పద్ధతులను చాల గొప్పగా చిత్రించారు. ఈ ప్రాచీన గురుకులాలలో శూద్రులకు, అతిశూద్రులకు, స్త్రీలకు ప్రవేశార్హత లేదన్న చేదు నిజాన్ని దాచి పెట్టారు. ఒక పక్క సామాజిక న్యాయం అనే రాజ్యాంగ లక్ష్యాన్ని నీరు గారుస్తూ, మరో ప్రక్క కుల వివక్షకు, పురుషాధిపత్యానికి మారుపేరైనా నలందా, తక్షశిల వంటి గురుకులాలను ఆకాశానికెత్తడంలోని అసలు ఉద్దేశం ఏమిటి? దేశ సంస్కృతి, విద్య, నాగరికత వంటి అంశాలు చర్చకు వచ్చినప్పుడల్లా

మన ప్రాచీన సంప్రదాయాలను, వారసత్వాన్ని ప్రస్తావించడం, రుజువుకు నిలువని పుక్కిడి పురాణాలను ఉటంకించడం చూస్తే నూతన విద్యావిధాన పత్రం 'హిందూత్వ', 'మనువాద' భావాజాలాన్ని నెత్తికెత్తుకుందన్నది స్పష్టం. అందులో భాగంగానే చరకుడు, చాణుక్యుడి నుంచి గాంధీ, అరవిందుడు వరకు దీన్నుంచే ఉద్భవించారని పేర్కొని మన ఆదిమ వారసత్వాన్ని శ్లాఘించింది. నిజమే, మన వారసత్వంలోని మంచిని స్వీకరించాలి. చెడును త్యజించాలి. ఆ మంచి ఏమిటన్నది ముందుగా గుర్తించాలి. కుల వ్యవస్థను, అంటరానితనాన్ని సృష్టించి విద్యను కొందరికి దూరం చేసిన వారసత్వం మనదే గదా!

భారతదేశంలో కుల, మత, భాషా, సాంస్కృతిక వైవిధ్యం ఉంది. కాని నూతన విద్యా విధాన పత్రం 'భారతీయ సంస్కృతి' అని ప్రస్తావించిన ప్రతిసారి అది ఏకరూప సంస్కృతి అన్నట్లు ధ్వనిస్తుంది. నివేదికలో బహుళ సంస్కృతుల భావన ఎక్కడా కన్పించదు. భారత్‌లో వందలాది భాషలు, సంస్కృతులు ఉండడమే కాదు అవి గడచిన నాలుగు వేల సంవత్సరాలలో ఎంతో మార్పు చెందాయి. పాలకుల, ప్రజల సంస్కృతి ఏనాడు ఒకటిగా లేవు. దీర్ఘకాలంగా పాలకుల మరియు ప్రజల సంస్కృతుల మధ్య వైవిధ్యమే కాదు వైరుధ్యం కూడ ఉంది. సమూహాలలో వైవిధ్యం, వర్గంలో వైరుధ్యం, కాలంలో మార్పు సంస్కృతి నైజం. అయితే విద్యావిధాన పత్రం సంస్కృతి అనే భావాన్ని మార్పు చెందని ఏకశిలా రూపంగా చూపింది. అలా చూపడంలోనే పాలకవర్గ సంస్కృతికి పట్టం కట్టినట్టయింది. అంటే కులతత్వాని, పురుషాధిక్య సంస్కృతికి పట్టం కట్టనుంది.

సృజనాత్మక భావ చింతనకు అవరోధం

పెట్టుబడిదారీ ప్రపంచీకరణ పెట్టుబడితో పాటు ప్రభుత్వ విద్యారంగాన్ని నాశనం చేసే ప్రక్రియను మోసుకొచ్చింది. మన దేశానికి సంబంధించినంత వరకు విద్యారంగంలో మతతత్వ ఫాసిజం చొరబాటు అదనపు అంశం. విద్య సరుకీకరించబడినందున పేదలు చదువుకు దూరమవుతున్న స్థితి మనం మూడు దశాబ్దాలుగా చూస్తూనే ఉన్నాం. మరోవైపు సరుకీకరించబడిన విద్య 'నైపుణ్యం' పేరుతో విద్యను జ్ఞానం నుండి వేరు చేస్తుంది. ఎన్ఇపి నైపుణ్యాలు పెంచడమే పరమ లక్ష్యంగా పెట్టుకుంది. క్లుప్తంగా చెప్పాలంటే విద్య సరుకీకరించబడినప్పుడు విద్యార్థులలో జిజ్ఞాసను, ఆలోచనను పెంచదు. జ్ఞానం లేకున్న పర్వాలేదు ఉత్పత్తి చేసే నైపుణ్యం ఉంటే చాలు అని పెట్టుబడి భావిస్తుంది. జ్ఞాన ఆర్థిక వ్యవస్థ గురించి చేసే వాదనలో జ్ఞానం, నైపుణ్యం మధ్యగల తేడాను విస్మరించడం జరుగుతోంది. ఆలోచన ప్రపంచంలో, సృజనాత్మక ఆలోచనలను, విమర్శనాత్మకంగా వ్యవహరించే చైతన్యాన్ని కార్పొరేట్ పెట్టుబడి కోరుకోవడం లేదు. అలాంటి జ్ఞానం అందుబాటులో లేకుంటే శాస్త్ర సాంకేతిక రంగాలలో పరిశోధన కుంటుబడుతుంది. సాంకేతిక పరాధీనత పెరుగుతుంది.

మొత్తం నివేదికలో ఆహ్వానించదగిన అంశం ఒక్కటే, అది విద్యను 3-18 సంవత్సరాల వయసున్న వారందరికి (ప్రీ స్కూలు నుంచి ఇంటర్ వరకు) హక్కుగా అందిస్తామని పేర్కొంది. అయితే అది విద్యాహక్కు చట్టంలో మార్పు చేయాల్సి ఉంది. అలాగే ప్రీ స్కూలు విద్యను అంగన్‌వాడీల ద్వారా నిర్వహిస్తామని చెప్పింది. అలా చేస్తే ఆశించిన ఫలితాలు రావు. ఇక ఇప్పుడిదాకా భారతీయ విద్య బ్రిటన్ వారసత్వంగా కొనసాగుతుందని ఆరోపించిన బిజెపి ప్రభుత్వం ఇప్పుడు అమెరికా విద్యావిధాన నమూనాను స్వీకరించింది. అందులో భాగంగానే 10+2 విద్యా వ్యవస్థీకరణను 5+3+3+4గా వ్యవస్థీకరించింది. మొత్తంగా నూతన విద్యావిధానం సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలు, ప్రపంచ బ్యాంకు నిర్దేశితాలు, ప్రపంచ వాణిజ్య సంస్థలోని సాధారణ సేవల ఒప్పందాన్ని(గాట్స్) వంద శాతం అమలుచేసే విధంగా కనిపిస్తున్నాయి.

ఈ విద్యావిధానంలో విద్యార్థులకు వారి ప్రాథమిక హక్కుల గురించి ఏమీ బోధించరు. వారి ప్రాథమిక విధుల గురించి మాత్రమే బోధిస్తారు. ఈ విధాన పత్రం మొత్తం మీద 'లొంగివుండడం' అనే స్వభావాన్ని విద్యార్థులకు నేర్పించడమనేదే అంతర్లీన సూత్రంగా ఉంది. సంపన్న వర్గాలకు చెందిన విద్యార్థులేమో ఉన్నత చదువులు చదివి ఉన్నత పదవులు పొంది అంతర్జాతీయ ద్రవ్య పెట్టుబడి ఆదేశాలకు లొంగి వుంటూ వ్యవహరిస్తారు. అటువంటి అవకాశాలేవీ అందుబాటులోకి రాని వెనుకబడిన సామాజిక, ఆర్థిక తరగతుల విద్యార్థులంతా ఈ వ్యవస్థకు లొంగివుండే శ్రామికవర్గంలో చేరుతారు. ఇంకోపక్క కృత్రిమ మేథతో నానాటికీ ఉద్యోగవకాశాలు తగ్గిపోతుండడంతో అలా లొంగిఉండే స్వభావమూ పెరుగుతుంది. ఈ పరిస్థితుల్ని ఎదిరించి పోరాడే మేధోపరమైన శక్తియుక్తులూ సన్నగిల్లుతాయి. ఇదే ఈ నూతన విద్యావిధాన రూపకర్తల అసలు లక్ష్యం.

ముగింపు

34 సంవత్సరాల తర్వాత మోడీ ప్రభుత్వం తీసుకువస్తున్న విద్యావిధానం క్షేత్ర స్థాయి పరిస్థితులను పరిగణలోకి తీసుకోలేదు. శిథిలావస్థలో ఉన్న భారతీయ విద్యా వ్యవస్థకు జవసత్వాలు అందించడానికి బదులు కార్పొరేటీకరణ, కేంద్రీకరణ, కాషాయీకరణ విధానాలు అమలుచేయాలనుకోవడం తిరోగమనం తప్ప మరొకటి కాదు. ఎందుకంటే, నూతనంగా ఆవిర్భవిస్తున్న మనలాంటి దేశాలలో విద్యార్థులలో సృజన పెరుగకుండా పెట్టుబడిదారీ దేశాలు చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నాయి. అదే సమయంలో అది తన ఉత్పాదితాలలో విద్యార్థులకు సామాజిక సున్నితత్వం లేకుండా చేస్తుంది. విద్యార్థులను శ్రామికుల పట్ల సానుభూతిలేని స్వార్థపరులుగా మారుస్తుంది. సమాజంలోని దురన్యాయాన్ని ప్రతిఘటించలేని, గొంతు పెగలని సమూహంగా మారుస్తుంది. ఇవాళ మనదేశంలో విద్య సరుకీకరణ చెందడం, మత తత్వీకరణకు గురికావడంతో విద్య నాశనమవుతోంది. దీనికి కారణం ప్రభుత్వంలో ఉన్న నేతలు- కార్పొరేట్ శక్తుల మైత్రి. విద్యారంగంలో సహజీవనం చేస్తున్న ఈ రెండు ధోరణుల ద్వారా నూతన విద్యావిధానం ఈ తీవ్రతను ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లే ప్రమాదం ఉంది.

నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆమోదం తెలిపిన నూతన విద్యావిధానం విద్యార్థి, ఉపాధ్యాయ, పేద ప్రజలకు వ్యతిరేకమైందిగా గుర్తించాలి. అదే సమయంలో అది దేశ విద్యావ్యవస్థను మతమయం, కేంద్రీకృతం, కార్పొరేటీకరణ చేస్తున్న విధానంగా భావించాలి. ఎన్ఇపి ప్రధాన లక్షణం సాంస్కృతిక ఆధిపత్యం, అది ఫాసిజానికి అవసరమైన భూమికగా ఉంటుంది. పెట్టుబడిదారీ, భూస్వామ్య దోపిడీ పీడనలను ఎల్లకాలం కొనసాగించడానికి వీలుగా ఎలాంటి ప్రతిఘటనా లేని పరిస్థితులను నెలకొల్పడం విద్యావిధాన లక్ష్యంగా కనిపిస్తుంది. మొత్తంగా నూతన విద్యావిధానం దేశ ప్రయోజనాలకు వ్యతిరేకమైందిగా పరిగణిస్తూ ముక్తకంఠంతో తిరస్కరించాలి. భారతీయుల భవిష్యత్ ప్రమాదంలో పడకూడదని లౌకిక, ప్రజాస్వామిక వాదులు కేంద్ర ప్రభుత్వ బరితెగించిన ప్రయత్నానికి వ్యతిరేకంగా ప్రజల్లో విస్తృతమైన ప్రచారం చేయాలి. మోడీ ప్రభుత్వం దీన్ని వెనక్కి తీసుకునే వరకు ప్రతిపక్ష రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ఉపాధ్యాయ-అధ్యాపక సంఘాలు, విద్యార్థి సంఘాలు సంఘటితంగా ఆందోళన చేపట్టాల్సిన చారిత్రక సందర్భం ఇది.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

జాతీయ విద్యా విధానంలో పాఠశాల విద్య

నూతన జాతీయ విద్యా విధానంలో పాఠశాల విద్యకు సంబంధించి నిర్దేశించిన మార్గదర్శకాల్లో స్పష్టత లేదనీ, దీనిపై సరైన చర్చ జరగకుండా ఆమోదించడం సరైనది కాదనీ అంటున్నారు **బి. రామకృష్ణ**

కేంద్ర కేబినెట్ జాతీయ విద్యా విధానం 2020ను 2020 జూలై 29న ఆమోదించింది. నాలుగు భాగాలుగా 27 అధ్యాయాలతో అరవై పేజీల డాక్యుమెంట్ ఇది. మొదటి చివరి పేజీలు తీసేస్తే ఉండేది అరవై పేజీలు. మానవ వనరుల మంత్రిత్వ శాఖ పేరును విద్యామంత్రిత్వశాఖగా మార్చాలన్న ఈ విధాన ప్రతిపాదన అప్పుడే అమల్లోకి వచ్చింది. దీనికి సంబంధించి రాష్ట్రపతి అంగీకారంతో 2020 ఆగస్టు 17న కేంద్ర గజెట్ విడుదల అయింది. ఇది పార్లమెంట్‌లో చర్చించబడలేదు. ఇదే అంతిమం అని అనుకోలేము కానీ కేబినెట్ ఆమోదించింది కనుక కేంద్ర ప్రభుత్వ విధానమని అనుకోవచ్చు.

ఒకప్పుడు ప్రపంచానికి జ్ఞానాన్ని అందించిన విద్యా సంప్రదాయమున్న ఇండియా తిరిగి విశ్వగురువు స్థానాన్ని పొందాలని అన్నారు. భారతీయ కేంద్రిత విలువల ఆధారంగా విద్యావిధానం ఉండాలని చెప్పారు. ప్రాచీన స్కాలర్‌లను, శాస్త్రాలను, కళలను ప్రస్తావిస్తూ బహుళ శాస్త్రాల సమ్మిళిత (మల్టీ డిసిప్లినరీ) విద్య ఒకప్పుడు ఉండేదని వాటిని తిరిగి ముందుకు తేవాలని ప్రాచీన భారతీయ విద్యా విధానం గొప్పదని ప్రస్తుతించారు. ఈ విధాన పత్రం ప్రస్తావించిన వారిలో గౌతమ బుద్ధుడు, చార్వాకులు, లోకాయతలు కనిపించరు. సామాజిక వివక్షతను బలోపేతం చేస్తున్న కుల వ్యవస్థ, పితృస్వామిక బ్రాహ్మణీయ భావజాల వ్యవస్థలను నిరసిస్తూ సమానత్వం, సాధికారత, ఆత్మగౌరవం, సామాజిక న్యాయం కోసం కృషి చేసిన పెరియార్, పూలే, అంబేద్కర్ వంటి వారి ప్రస్తావన లేదు.

సంపన్నమైన ప్రాచీన శాశ్వతమైన భారతీయ జ్ఞానం ఆలోచన విద్యా విధానానికి మార్గదర్శక కాంతిగా ఉంటుందని, ప్రాచీన భారతీయ విద్య లక్ష్యం తనను తాను తెలుసుకోవడం విముక్తి చేసుకోవడం అని ప్రస్తావించారు. భారతీయ సంస్కృతి వారసత్వం సాంప్రదాయాల గురించి పదేపదే గొప్పగా చెబుతూ విద్యా వ్యవస్థ వాటికి అనుగుణంగా ఉండాలని చెబుతారు. భారతీయ విలువలు, మానవ విలువలు, రాజ్యాంగ విలువల గురించి మాట్లాడిన ఈ విధానం రాజ్యాంగంలోని సామ్యవాదం, లౌకికవాదం, సామాజిక న్యాయం, గురించి మాట్లాడదు. సామ్యవాదం, లౌకికవాదం అంటరానివిగా మారాయి. ఆచరణలో చిత్తశుద్ధి లేకుండా ఈ పదాలను చేర్చినా కూడా ఒరిగేదేమి ఉండదనుకోండి. అయితే ఈ విధానం వెనుక పనిచేస్తున్న భావజాలాన్ని అర్థం చేసుకోవడానికి వీటి ప్రస్తావన అవసరం అవుతుంది. రాజ్యాంగ స్ఫూర్తి, వేల ఏళ్లుగా దోపిడీ, పీడనలు, సామాజిక ఆర్థిక వివక్షతలకు, పితృస్వామిక భావజాలానికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమ ఆకాంక్షలు, విలువలు ఇందులో కానరావు. ఈ నేపథ్యంలో సమానత్వం ప్రజాస్వామిక స్ఫూర్తి న్యాయం మొదలగు మరెన్నింటినో ప్రస్తావించినప్పటికి కూడా ఈ విధానం అసలు అంతర్యం ఏమిటో, ఈ విద్యా విధానం ద్వారా ఏ విలువలను ముందుకు తేవాలనుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు.

3–18 సంవత్సరాల వారికి పాఠశాల విద్యను బోధనాభ్యసన క్రమం, పాఠ్య ప్రణాళికగా పునర్నిర్మాణం చేయాలని ప్రతిపాదన చేసారు. దీనినే 5+3+3+4 అని అంటున్నారు. 5 సంవత్సరాల ఫౌండేషన్ దశ : 3–8 సంవత్సరాల వారికి(3 సంవత్సరాల అంగన్‌వాడి పాఠశాల/ పూర్వ పాఠశాల/బాల వాటిక + 3–6 సంవత్సరాలు 6–8 సంవత్సరాల వారికి రెండు సంవత్సరాల 1, 2 తరగతులు), 3 సంవత్సరాల సంసిద్ధత దశ: 8–11 సంవత్సరాల వారికి 3–5 తరగతులు, 3 సంవత్సరాల మిడిల్ దశ : 11–14 సంవత్సరాల వారికి 6–8 తరగతులు, 4 సంవత్సరాల సెకండరీ దశ : 14–18 సంవత్సరాల వారికి 9–12 తరగతులు.

మూడేళ్ల పూర్వ బాల్య దశ సంరక్షణ, విద్యను (ఇసిసిఇ) ప్రస్తుత 10+2 నిర్మాణానికి కలపడం సానుకూలమైన విషయమే. ఆరేళ్లలోపు 85 శాతం మెదడు వికాసం జరుగుతుందని పరిశోధనలు చెబుతున్నాయని ఇ.సి.సి.ఇ ప్రాధాన్యతను గుర్తించారు. అంత ముఖ్యమైనదిగా చెప్పిన వారు ఆ వయస్సులో అందించే గుణాత్మక విద్యా వాతావరణం వరకు వచ్చేసరికి అంగన్వాడీ వర్కర్స్‌కు ఆరు నెలల సర్టిఫికెట్ లేదా ఒక సంవత్సరం డిప్లమా అది కూడా డిస్టెన్స్ లర్నింగ్, డిజిటల్, డిటిహెచ్ ఛానల్స్ స్మార్ట్ ఫోన్ల ద్వారా అందిస్తారని చెప్పే సాహసమూ చేస్తారు.

తెలుగు రాష్ట్రాలలో 1–10 తరగతుల వరకు పాఠశాల విద్యలో ఉన్నాయి. ఇలాంటి సందర్భాలలో పూర్వ బాల్య దశ సంరక్షణ, విద్య(ఇసిసిఇ)ను, 11, 12 తరగతులను ప్రస్తుత పాఠశాలలకు అనుసంధానించడానికి తగిన ప్రతిపాదనలు చేయలేదు. కేంద్రీయ విద్యాలయ, సిబిఎస్ఇ పాఠశాలల్లో 1–12 తరగతులు ఉంటాయి. వీటిలో మూడేళ్ల ఇసిసిఇను అనుసంధానించే విషయంలో స్పష్టత లేదు.

ప్రస్తుతం నడుస్తున్న అంగన్వాడీలు తదితర వ్యవస్థలను బలోపేతం చేస్తారని అన్నారు. కానీ ప్రస్తుత పాఠశాలలో ఎలా అంతర్భాగం చేస్తారో ఆలోచనలు చేయలేదు. సాధ్యమైనంత త్వరలో 2030 లోగా మొదటి తరగతిలో చేరే వారందరికీ గుణాత్మక పూర్వ బాల్య దశ సంరక్షణ, విద్యను సాధించాలి అని చెప్పారు. దీనికి పదేళ్ల కాలం పడుతుందా? 2025 లోగా మూడవ తరగతి లోపు ప్రతి విద్యార్థికి ప్రాథమిక అక్షరాస్యత సామాన్య గణిత ప్రక్రియలు సాధించాలని చెప్పారు. ఇలా చెప్పిన వారు దీన్ని సాధించడానికి సుశిక్షితులైన ఉపాధ్యాయుల నియామకం గురించి శ్రద్ధ పెట్టకుండా పిల్లలు ఒకరికొకరు తోటివారితో స్వచ్ఛందంగా, ఆనందంగా బోధన జరుపుకోవడం, ప్రతి అక్షరాస్యుడు ఒక విద్యార్థికి బోధించడం, సోషల్ వర్కర్స్, కౌన్సిలర్స్ వంటి వారిని వినియోగించుకోవాలని నాసిరకం ప్రతిపాదనలు చేశారు. విద్యార్థి ఉపాధ్యాయ నిష్పత్తి 30:1గా సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన పిల్లలు ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో 25 :1 గా ఉండాలని చెప్పారు. కాని 10/15:1గా ఉండడం సరైనదనే విషయాన్ని దాచి పెడతారు. పోషకాహార లోపం వల్ల అభ్యసనం కుంటుపడుతుందని ఉదయం అల్పాహారం తీసుకోవడం బుద్ధివికాసంపై

ప్రయోజనకర ప్రభావం ఉందని చెబుతూ ఉదయం అల్పాహారం అందించాలని మంచి ప్రతిపాదన చేశారు.

డ్రాపౌట్లను తగ్గించడానికి పాఠశాలల్లో అభ్యసనానుకూల వాతావరణం గురించి మాట్లాడిన వాళ్లే మరోవైపు ఓపెన్ స్కూల్ విధానంలో 3, 5, 8, 11, 2 గ్రేడ్‌లకు సమానమైన వాటిని అందించాలని అంటారు. ప్రభుత్వ దాతృత్వ భాగస్వామ్యంతో కూడిన పాఠశాల నమూనాలకు బాటలు వేయాలని, మౌలిక వసతుల కల్పన కంటే కూడా అభ్యసన ఫలితాలపై శ్రద్ధ పెట్టాలని చెబుతారు. అభ్యసనాన్ని పెంచడానికి పూర్వ విద్యార్థులు, అక్షరాస్యత వాలంటీర్లు, రిటైర్డ్ ఉద్యోగులు, శాస్త్రవేత్తలు, కౌన్సిలర్లు మొదలగు వారిని వినియోగించుకోవాలని చెబుతారు. ప్రత్యేకించి సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన సమూహాలకు అవకాశాలను కల్పించడం కోసం నియత అనియత విద్య అందించాలని చెబుతారు.

పదవ గ్రేడ్ తర్వాత బయటకు వెళ్లిన వారు తిరిగి తర్వాతి దశలో ప్రవేశించి ఒకేషనల్ లేదా11, 12 తరగతులలోని ఏదైనా కోర్సులను పూర్తి చేయవచ్చని చెబుతారు. అంటే సెకండరీ విద్యను పూర్తి చేయకుండానే బయటకు వెళ్లే పరిస్థితి ఉంటుందన్నమాట. పాఠశాల దశలోనే డ్రాపౌట్ అయ్యే అవకాశాన్ని ఈ విధానం ఇస్తుందన్న మాట. దీనిని నివారించడం కోసం రెగ్యులర్ పాఠశాలల్లోనే బ్రిడ్జి కోర్సులు రెసిడెన్షియల్ పద్ధతులను గురించి మాట్లాడరు. తద్వారా గుణాత్మకత, సమానత గురించి చెప్పిందే పలుసార్లు చెప్పినప్పటికీ దాన్ని నీరుగార్చే ప్రయత్నాలు చేశారు.

3–18 సంవత్సరాల వారికి అంటే పూర్వ బాల్య దశ సంరక్షణ విద్య దశ నుండి సెకండరీ స్థాయి వరకు పాఠశాల విద్యగా గుర్తిస్తున్న ఈ విధానం వీరికి విద్యను హక్కుగా ప్రతిపాదించలేదు. 2009లో చేసిన విద్యాహక్కు చట్టం 2010 నుండి అమలులో ఉండి మాత్రం సాధించినదేమున్నది. సగం వరకు విద్యార్థులు ప్రైవేట్ బడిలోకి నెట్టివేయబడుతున్నారు. చదువులు కొనుక్కోబడుతున్నాయి. ప్రభుత్వ బడులు కుచించుకు పోతున్నాయి.

మాతృ భాష/ఇంటి భాషలో జ్ఞాన వికాసం బాగా జరుగుతుందని పరిశోధనలు తెలుపుతున్నాయని చెబుతూ కనీసం 5వ తరగతి వరకు వీలైతే ఎనిమిదవ తరగతి ఆపైనా మాతృ భాష/ఇంటి భాషలో బోధన ఉండాలని చెబుతారు. అది వీలైన చోటనే అంటారు కానీ తప్పనిసరి అని అనరు. అలా చెప్పడం ద్వారా ఇప్పుడు ఉన్నటువంటి ఆంగ్ల మాధ్యమం, ప్రైవేట్ బడులు అలాగే కొనసాగుతాయి.

2–8 ఏళ్ల మధ్య భాషలను త్వరగా నేర్చుకుంటారని పరిశోధనలు తెలుపుతున్నాయని, బహుళ భాషలు నేర్చుకోవడం జ్ఞాన వికాసానికి ప్రయోజనకారిగా ఉంటుందని చెబుతూ ఫౌండేషన్ దశ నుండే అన్ని భాషలు బోధించాలని ప్రతిపాదించారు. తమ చుట్టూ పరిసరాలలో ఉండే భాషలను సహజంగా నేర్చుకునే అవకాశం ఉంటుంది. పాఠశాలల్లోనే నేర్పించాలనేది ఈ దశలో పిల్లలపై అదనపు భారాన్ని వేస్తుంది. పోనీ అలా నేర్పించాలి అనుకుంటే ప్రతి పాఠశాలలో బహుళ భాషలు బోధించే ఉపాధ్యాయులు ఉండాల్సి ఉంటుంది.

ఏకోపాధ్యాయ పాఠశాలలు చిన్నలేదా మిగులు పాఠశాలలను ఉన్నతమైనవిగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని చూపకుండా ఏకీకరణ, రేషనలైజేషన్, స్కూల్ కాంప్లెక్స్‌లను పరిష్కారంగా చెప్పినవారు ఫౌండేషన్ దశలో బహుళ భాషలను బోధించే ఉపాధ్యాయులను ప్రతి పాఠశాలలో నియమిస్తారని అనుకోవడం నవ్వు తెప్పిస్తుంది.

పునాది దశ నుండే త్రిభాషా సూత్రాన్ని అమలు చేయడం ద్వారా వారు చెప్పినట్లుగా పిల్లల్లో రావాల్సిన జ్ఞానాత్మక మానసిక చలనాత్మక రంగాల్లో వికాసం మాట ఏమోగానీ భాషా భారం పెరుగుతుంది. అవసరమైన వారికి అవసరమైన భాషల్లో శిక్షణ ఇచ్చే కేంద్రాలను ఏర్పాటు చేయాలి తప్పిస్తే బహుళ భాషా సామర్థ్యాలు పేరుతో భాషల భారాన్ని మోపడం సరైంది కాదు. మరోవైపు సంస్కృతాన్ని ఫౌండేషన్ దశ నుండి ఉన్నత విద్యా స్థాయి వరకు అన్ని దశలలో బోధించాలనే బలమైన తపన కనిపిస్తుంది. త్రిభాషా విధానంలో ఒక భాషగా సంస్కృతాన్ని ఐచ్ఛిక అంశంగా ఉండేలా ప్రతిపాదన చేశారు. గ్రీకు, లాటిన్ రెండు భాషల్లో కంటే కూడా అధిక సాహిత్యం, జ్ఞానం సంస్కృత భాషలో ఉన్నదని దాన్ని ప్రోత్సహించాలని చెప్పారు. నేడు దేశ వ్యాప్తంగా సంస్కృతం వాడుకలో లేదు. ఉన్నా చాలా చాలా తక్కువ. దాదాపుగా అది ఒక మృతభాష. ఒక సంస్కృతిని సంరక్షించాలి అంటే దానికి సంబంధించిన భాషను పరిరక్షించాలని ఈ విధానం ఒకచోట చెబుతుంది. ప్రాచీన భారతీయ విలువలు, సంస్కృతులు, సాంప్రదాయాలకు సంబంధించిన సాహిత్యం సంస్కృతంలో ఉన్నది. ఈ భాషకు మత వాసనలు ఉన్నాయి. వాటిని ముందుకు తేవడం కోసం సంస్కృతాన్ని ప్రోత్సహిస్తున్నారు.

6–8 తరగతుల్లో ప్రతి విద్యార్థికి స్థానిక నైపుణ్యాలు, అవసరాల రీత్యా వడ్రంగం, విద్యుత్ పని, గార్డెనింగ్, కుండలు చేయడం మొదలగు ఒకేషనల్ క్రాఫ్ట్స్‌కి సంబంధించిన వాటిపై ప్రత్యక్ష అనుభవం కోసం పది రోజుల పాటు సరదా (ఫన్) కోర్సుల్లో పాల్గొంటారని చెప్పారు. అలాగే 6–12 తరగతుల్లో ఒకేషనల్ సబ్జెక్టులను నేర్చుకోవడానికి ప్రత్యక్ష అనుభవం, ఆన్‌లైన్ పద్ధతులను సెలవుల్లో కూడా అందుబాటులో ఉంచుతారని చెప్పారు. పదవ తరగతి తర్వాత బయటకు వెళ్లిన వారు తిరిగి వచ్చి ఒకేషనల్ లేదా 11, 12 తరగతుల్లో ఇతర సబ్జెక్టులను చదవచ్చు అని అనడం ద్వారా 6–10 తరగతుల వారికి అందించబడే ఒకేషనల్‌కు చెందిన వానిని సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన సమూహాలు కొనసాగించే పరిస్థితి కల్పిస్తున్నారు. ఐటిఐ పాలిటెక్నిక్ వంటివి కూడా ఉంటాయని చెబుతారు. ఇవి పదవ తరగతి తర్వాత ఉంటాయి. అంటే అందరు విద్యార్థులు 12వ తరగతి వరకు పాఠశాలలో ఒకే రీతిలో చదువులతో కొనసాగరు. ఎందరినో ఒకేషనల్ వైపుకు తరలిస్తారని అర్థం చేసుకోవచ్చు.

విమర్శనాత్మక ఆలోచన, తెలుసుకోవాలనే ఉత్సుకత, ఆవిష్కరణ, విశ్లేషణాధారిత అభ్యసనలకు అవకాశం ఇవ్వడానికి ప్రతి సబ్జెక్టులో కంటెంట్‌ను తగ్గించాలని ప్రస్తావించారు. చూడడానికి ఇది బాగానే అనిపిస్తుంది అయితే కరోనా నేపథ్యంలో సిబిఎస్ఇ పాఠ్యాంశాల నుండి తొలగించిన వాటిని చూస్తే వాటి డొల్లతనం, ప్రమాదకారి తనం తెలిసిపోతుంది. కంటెంట్‌ను తగ్గించాలనే నెపంతో అవసరమైన శాస్త్రీయ దృక్పథాన్ని కలిగించే విషయాలను తొలగించారు. జాతీయ స్థాయి పాఠ్య పుస్తకాలను ఎన్.సి.ఇ.ఆర్.టి రూపొందిస్తుంది. వీటి ఆధారంగా రాష్ట్రాలు అవసరమైన మేరకు తమ స్థానికతను జత చేస్తూ పాఠ్యపుస్తకాలు రూపొందించుకోవచ్చని, ఎన్.సి.ఇ.ఆర్.టి రూపొందించిన పాఠ్య ప్రణాళికా చట్రం ఆధారంగా రాష్ట్రాలు తమ స్వంత పాఠ్య ప్రణాళికా చట్రాలను తయారు చేసుకోవచ్చని చెబుతారు. అంటే రాష్ట్ర ప్రణాళిక, పాఠ్యపుస్తకాల పై కేంద్ర మంత్రిత్వ శాఖ ద్వారా కేంద్ర ప్రభుత్వ ఆధిపత్యానికి దారితీసే అవకాశాన్ని కాదనలేం.

విద్యాహక్కు చట్టం ప్రకారం 8వ తరగతి వరకు డిటెన్షన్ విధానం ఉండదు. దీన్ని సవరిస్తూ ఐదవ తరగతిలో పరీక్ష పెట్టి డిటెన్షన్‌కు అవకాశం ఇచ్చే వెసులుబాటు ఇస్తూ దీన్ని అమలు చెయ్యాలా వద్దా అనేదాన్ని రాష్ట్రాలకే వదిలేసారు. ప్రస్తుత విద్యా విధానం 3, 5, 8 తరగతుల్లో పరీక్షలను ప్రతిపాదించింది. తద్వారా డిటెన్షన్ విధానాన్ని ముందుకు తీసుకొస్తున్నారు. ఓవైపు సార్వత్రిక అందుబాటును పెంచడము, డ్రాపౌట్‌లను తగ్గించడం, వారిని తిరిగి మెయిన్స్ స్ట్రీమ్‌లోకి కలపడం గురించి చెప్పే విధానం దానికి ప్రతిబంధకంగా మారిన 3, 5, 8 తరగతుల్లో పరీక్షలు పెట్టడం అనే దాని ద్వారా తనకు తానే వ్యతిరేకించుకుంటున్నది. తరగతుల్లో సాధించవలసిన నిర్ణీత ప్రమాణాలను పొందడానికి కావలసిన అభ్యసనా వాతావరణం పై దృష్టి పెట్టడం, అందుకోసం స్పష్టమైన ప్రణాళికతో ముందుకు రావడం కాకుండా వ్యతిరేక ఫలితాలనిచ్చే డిటెక్షన్ విదానాన్ని ముందుకు తెచ్చే ప్రయత్నం తిరోగమన చర్యే అవుతుంది.

ఒకప్పటి సర్వశిక్ష అభియాన్ నేటి సమగ్ర శిక్ష పథకం కింద ప్రతి ఆవాసంలో ప్రాథమిక పాఠశాలలు నెలకొల్పడం వల్ల దాదాపుగా ప్రాథమిక పాఠశాలలు సార్వత్రిక అందుబాటులోకి వచ్చాయని, దాంతోపాటు పాఠశాలలు పెరగడం కూడా జరిగిందని యు-డిఐఎస్ఇ (2016-17) ప్రకారం దేశవ్యాప్తంగా 28 శాతం ప్రాథమిక పాఠశాలలో, 14.5 శాతం ప్రాథమికోన్నత పాఠశాలల్లో 30 మంది విద్యార్థుల కంటే తక్కువ ఉన్నారని, 1-8 గ్రేడ్‌లో ప్రతి తరగతిలో సగటున 14 మందే విద్యార్థులు ఉన్నారని వివరిస్తారు. వీటిల్లో అన్ని రకాల నాణ్యమైన మౌలిక వసతులను అందించడం కుదరదని అది ఎంతో ఆర్థిక భారంతో కూడినదని న్యాయంగా మాట్లాడే ప్రయత్నం చేస్తూ ఉంటారు. అదే సమయంలో చిన్న పాఠశాలలు ఏర్పడడానికి కారణమైన ప్రైవేటు బడులను పెంచి పోషిస్తున్న విషయాన్ని, ప్రభుత్వ బడుల్లో తీవ్రమైన మౌలిక వసతుల లేమిని, సరిపోను ఉపాధ్యాయులను సమకూర్చని ప్రభుత్వ విదానాలను దాచిపెడతారు.

దీనికి పరిష్కారంగా చిన్న పాఠశాలల ఏకీకరణ, రేషనలైజేషన్‌లను, ప్రతిపాదిస్తారు ఇప్పటికే ఈ విధానాల ద్వారా దేశవ్యాప్తంగా లక్షల పాఠశాలలను మూసి వేయడం జరిగింది. ప్రభుత్వ బడులను పాతరేసేవిగా ఏకీకరణ, రేషనలైజేషన్ అనే పదాలను ప్రమాదకరమైనవిగా మార్చి వేశారు. సెకండరీ పాఠశాలకు 5 నుండి 10 కిలోమీటర్ల పరిధిలో ఉన్న అంగన్వాడీలతో సహా అన్ని కిందిస్థాయి బడులను జతచేసి స్కూల్ కాంప్లెక్స్‌గా ఏర్పాటు చేయాలని, చిన్నబడుల సమస్యకు ఇదొక పరిష్కారమని, స్కూల్ కాంప్లెక్స్ ద్వారా అందులోని పాఠశాలల మధ్య టీచర్లను, సోషల్ వర్కర్లను, కౌన్సిలర్లను ఇతర విద్యా వనరులను పంచుకునే వీలుంటుందని చెబుతారు. కాని ప్రతి చిన్న పాఠశాలను ఉన్నతంగా తీర్చిదిద్దే విషయాన్ని దాటేస్తుంటారు. పక్కనే ఉన్న ప్రైవేటు బడులను రద్దు చేసి ప్రభుత్వ బడుల్లో నాణ్యతా ప్రమాణాలను పెంచడం ద్వారా నమోదు పెంచాలి అనే శాస్త్రీయ సత్యాన్ని దాచేస్తుంటారు. మరోచోట ప్రభుత్వ పాఠశాలలు ప్రజలకు ఎంతో ఆకర్షణీయంగా ఉంటాయని మాట్లాడతారు. నోటితో నవ్వుతూ నొసలుతో వెక్కిరించి నట్లుగా ఉంటుంది ఈ వ్యవహారం.

విద్య అనేది ప్రజాసేవ అని, గుణాత్మక విద్య పొందడం ప్రతివారి మౌలిక హక్కు అని, పటిష్టమైన ప్రజాస్వామిక సమాజానికి ప్రభుత్వ విద్యా వ్యవస్థ పునాది వంటిదని చెప్పే ఈ విధాన పత్రం అదే సమయంలో ప్రయోజనకరమైన, ముఖ్యమైన పాత్ర నిర్వహణ కోసం ప్రైవేటు/ధాతృత్వ పాఠశాల రంగాన్ని కూడా ప్రోత్సహించాలని చెబుతుంది. విద్యకు ప్రభుత్వం నిధులు అందించడం ద్వారా గుణాత్మకత సాధించవచ్చని చెప్పే ఈ పత్రం ప్రభుత్వ ప్రైవేటు వాటిని అన్ని విషయాలలో సమానంగా చూడాలని చెబుతుంది. తద్వారా అత్యున్నత, గుణాత్మక, సంపూర్ణ, సమాన విద్య గురించి పదేపదే ప్రస్తావిస్తూ గొప్పగా కనిపించే ప్రయత్నం చేసే ఈ పత్రం మేడిపండు చందమేనని చెప్పకనే చెబుతుంది. అలా వివక్షతల విద్యా వ్యవస్థను యధావిధిగా కొనసాగిస్తూ విద్యా ప్రైవేటీకరణను బాహాటంగానే సమర్థిస్తున్నది.

ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీని ఏర్పాటు చేస్తారు. దీని స్కోరును అనుసరించి ప్రవేశాలు ఉంటాయి. దేశవ్యాప్తంగా ఒకే పరీక్ష అన్నప్పుడు ఆ పరీక్ష సిలబస్ ఒకే విధంగా ఉంటుంది. అన్ని రాష్ట్రాల సిలబస్ దానికనుగుణంగానే రూపొందించాల్సి ఉంటుంది. తద్వారా ఒకే సిలబస్‌ను దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో చెప్పకుండానే ప్రతిపాదిస్తారన్నమాట. ఇది ఎన్.సి.ఆర్.టి. రూపొందించే పాఠ్య ప్రణాళిక, పాఠ్య పుస్తకాలను అన్ని రాష్ట్రాలలు పాటించే పరిస్థితికి దారితీస్తుంది. అయితే నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించే ప్రవేశ పరీక్షలను ఉపయోగించుకునే విషయం విశ్వవిద్యాలయాలకు, కాలేజీలకే వదిలేశారు. విద్యార్థుల మూల్యాంకనంకు సంబంధించి నేషనల్ అసెస్‌మెంట్ సెంటర్‌ను స్థాపిస్తారు. ఇది మూల్యాంకన ప్రమాణాలను మార్గదర్శకాలను నిర్ణయిస్తుంది. తద్వారా విద్యా విషయిక అంశాలు కేంద్రం చేతుల్లో కేంద్రీకృతం అయ్యే అవకాశాలను కాదనలేం.

నేషనల్ కౌన్సిల్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ రూపొందించే నేషనల్ ప్రొఫెషనల్ స్టాండర్డ్స్ ఫర్ టీచర్స్ ప్రకారం ఉపాధ్యాయుల ప్రమోషన్లు, కెరీర్ మేనేజ్మెంట్, జీతాలలో పెరుగుదల వంటి వాటిని మెరిట్ ఆధారంగా నిర్ణయిస్తారని ప్రతిపాదించారు. తద్వారా సామాజిక న్యాయం కొరకు ఉద్దేశింపబడిన రిజర్వేషన్లకు చోటు లేకుండా పోతుంది. సామాజికంగా ఆర్థికంగా వెనుకబడిన వారిని ఉద్దేశించి సమానత్వం, సంలీనత గురించి ఎన్నో పదబంధాలను వాడిన ఈ విధానం అసలు సారం ఇక్కడ బయట పడుతుంది.

వారి సంప్రదాయాలను ప్రత్యామ్నాయ బోధనా క్రమాలను సంరక్షించుకోవడానికి ప్రత్యామ్నాయ పాఠశాలల రూపాలను ప్రోత్సహించాలని, అదే సమయంలో ఈ పాఠశాలల నుండి బయటకు వచ్చేవారు ఉన్నత విద్యలో వెనుకబకుండా ఉండటానికి సాధారణ సబ్జెక్టులను వీటిలో ప్రవేశపెట్టడానికి ఆర్థిక సహాయం చేస్తారని, రాష్ట్ర నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ పరీక్షలకు హాజరు కావడానికి ప్రోత్సహిస్తారు. ప్రత్యామ్నాయ పాఠశాలలు అంటే ఏమిటో స్పష్టం చేయలేదు. అయితే డ్రాఫ్ట్‌లో వీటిని మదర్సాలు, గురుకులాలు, ఇంట్లో నుంచి విద్య నేర్పించడం అని అన్నారు. వీటిని మతపరమైన సంస్థలు అని అనుకోవచ్చు. మతపర బోధనా సంస్థలకు ప్రభుత్వాలు మద్దతివ్వడం, సహాయం చేయడం అనే ప్రస్తావనలు లౌకిక స్ఫూర్తికి వ్యతిరేకంగా ఉంటాయి. విద్యాపరంగా వెనుకబడిన సామాజిక ఆర్థిక సమూహాలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక విద్యా మండలి ఏర్పాటు చేయాలని అన్నారు. ఈ సమూహాలలోని టాలెంటెడ్ మెరిట్ విద్యార్థులకు ఉన్నత విద్యలో ప్రవేశించడానికి ఫీజుల్లో రాయితీ, స్కాలర్‌షిప్‌లు ఇస్తారని చెబుతారు కాని ఉచిత విద్య అనరు. తద్వారా ప్రైవేటు బడులు కొనసాగుతాయని నేటి పరిస్థితి భవిష్యత్తులో కూడా ఉంటుందని చెప్పకనే చెబుతున్నారు.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

పెట్టుబడిదారుల చేతుల్లోకి ఉన్నత విద్య

కేంద్రప్రభుత్వం తీసుకొచ్చిన నూతన విద్యా విధానం వల్ల ఉన్నత విద్య మొత్తం ప్రైవేట్ పరమై సామాన్యులకు అందకుండా పోయే ప్రమాదముందని అంటున్నారు డా. ఎ. పున్నయ్య

ప్రజల కోసం ప్రజల చేత ఎన్నుకోబడిన ప్రభుత్వాలు మేక వన్నెపులిలా వ్యవహరిస్తూ బహుళజాతి పెట్టుబడిదారుల, కార్పొరేట్ల ముందు సాగిలబడి ప్రజా ప్రయోజనాలను ప్రక్కనపెట్టి ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు ఆసక్తి చూపుతున్నాయి. జాతి నిర్మాణానికి దేశ భవిష్యత్తుకు అత్యంత కీలకమైన విద్యావిధానంపై విస్తృత స్థాయిలో చర్చ జరగకుండానే పార్లమెంట్ సాక్షిగా ప్రజాస్వామ్య వ్యవస్థాపక సూత్రాలను బలహీనపరుస్తూ హడావుడిగా, ఏకపక్షంగా 2020 జూలై 29న నూతన జాతీయ విద్యా విధానాన్ని కేబినెట్ ఆమోదించింది. ఈ నిర్ణయం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. అందరికి అందుబాటులోకి సమాన విద్య అనే నినాదంతో 1986లో ప్రవేశపెట్టిన జాతీయ విద్యా విధానం పాలకుల చిత్తశుద్ధి లోపం వలన మూడున్నర దశాబ్దాలుగా ప్రజలందరికి అందనేలేదు. ఈ క్రమంలో విద్యావ్యవస్థ లక్ష్యాలలోని సంక్షోభాలను సమీక్షించి, పరిష్కారాలను ఆవిష్కరించకుండా విద్యా ప్రక్రియలను మార్చి నేడు అందరికి గుణాత్మక విద్య అనే నినాదంతో సరికొత్త జాతీయ విద్యా విధానాన్ని ప్రవేశపెడుతున్నట్లు ప్రభుత్వం పేర్కొనడం విడ్డూరంగా ఉంది.

ఈ కొత్త జాతీయ విద్యా విధానం -2020 నేపథ్యంలో ప్రస్తావించిన అనేక అంశాలకు సంబంధించి ఆకర్షణీయంగా, సృజనాత్మకంగా పొందుపరచబడిన వాక్యానికి, వాక్యానికి మధ్యనున్న నిగూఢ అర్థాన్ని వాక్యానికి ఆవల ఉన్న అసలు ఉద్దేశ్యాన్ని గత అనుభవాల ఆధారంగా నిశితంగా పరిశీలించవలసి ఉంది. ఈ అందమైన పదాల మాటున వాటికి పూర్తి వ్యతిరేక దిశలో ఫలితాలు వచ్చే విధానాలున్నందున అంతర్గతంగా ఉన్న ప్రభుత్వ వ్యూహాలను లోతుగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ విధానం ప్రకారం కేంద్ర ప్రభుత్వం ప్రాథమిక విద్య మొదలుకొని, మాధ్యమిక, వృత్తివిద్యలతో పాటు ఉన్నత విద్య వరకు సంచలనాత్మకమైన మార్పులు చేసే దిశగా వడివడిగా అడుగులు వేస్తుంది. ప్రభుత్వ విద్యను మరుగున పడేసి ప్రైవేట్, కార్పొరేట్‌తో పాటుగా విదేశీ విద్యకు పెద్దపీట వేసే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటుంది. ఆశ్చర్యమేమంటే ప్రైవేట్ విద్యా రంగంలో ఫీజుల నిర్ణయాధికారం వారికే కల్పించాలని చూస్తుంది. ఈ విద్యా విధాన అములకు కాలపరిమితి, కార్యాచరణలో స్పష్టత లేదు. పైగా ఈ జాతీయ విద్యా విధానం ప్రస్తుత తరానికి, భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడేలా ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఉద్యోగాల సృష్టికర్తలను తయారు చేయడానికి ప్రాధాన్యత ఇచ్చిందని, దశాబ్దాలుగా విద్యారంగంలో నెలకొన్న నిరాశా నిస్పృహలను తొలగించి, 21వ శతాబ్దానికి సరితూగే, ప్రపంచ పోటీలో ధీటుగా నిలబడే విధంగా, అందరికీ నాణ్యమైన ఆధునిక విద్యను అందించే భారీ సంస్కరణలను ఆవిష్కరించినట్టు పెద్ద ప్రచారం చేస్తుంది. ఇవి నేడున్న విద్యారంగంలో నెలకొన్న అసమానత, నాణ్యతాలేమి, అభ్యసన సామర్థ్యాల్లో అసంతృప్తి, విశృంఖల విద్యా వ్యాపారం, నిధుల కొరత, బాధ్యతా రాహిత్యం తదితర సమస్యలను పరిష్కరించకపోగా అవి మరింత పెరిగేందుకే ఈ విధానం దోహద పడుతుంది. స్థూలంగా ఇది మార్కెట్ కేంద్రీకృత, కార్పొరేటు బలోపేత విద్యా విధానంగా అర్థమౌతుంది.

విధాన ప్రకటనకు ముందు విద్యారంగ భాగస్వాముల నుండి సూచనలను ఆహ్వానించిన కేంద్ర ప్రభుత్వం ఏ సూచనలనూ పరిగణనలోకి తీసుకున్నట్లు కనిపించడం లేదు. సుమారు రెండున్నర లక్షల సూచనలు వచ్చాయని పేర్కొన్నారు కానీ అవేంటో, వేటిని పరిగణనలోకి తీసుకున్నారో, వేటిని తిరస్కరించారో వెల్లడించలేదు. విద్యారంగంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విషయ నిపుణులతో పాటు, పార్లమెంట్ అభిప్రాయం తీసుకోకుండా విద్యా లక్ష్యాన్ని దెబ్బతీసే విధంగా అత్యంత కీలకమైన విద్యా విధానాన్ని కాబినెట్ ఆమోదించడం ప్రజాస్వామ్య స్ఫూర్తిలేని, ఏకపక్ష, అనాలోచిత, నిరంకుశ విధానానికి నిదర్శనం.

ఈ నూతన జాతీయ విద్యా విధానం స్వరూపంలో అందరికి ఉన్నతమైన, గుణాత్మకమైన విద్యను అందించి తద్వారా దేశాన్ని సుస్థిర సమానత్వంతో కూడిన, ఉత్కృష్ట జ్ఞాన సమాజాలుగా పరివర్తన చెందించే కేంద్రీకృత విద్యా విధానం అమలు చేయాలనే దార్శనికతను ఆహ్వానించాల్సిందే అనిపిస్తుంది కానీ, ఈ విద్యా విధానంలో ఆకర్షణీయంగా ఉన్న ఉపాధి, నైపుణ్యాల అభివృద్ధి అనే భావనలు ఏకంగా పై విద్యా లక్ష్యాన్నే దెబ్బతీస్తున్నాయి. విశాలమైన విద్య లక్ష్యం కేవలం ఉపాధి కల్పించడం కోసమే కాదు, అత్యంత ప్రధానమైన జ్ఞాన సముపార్జనే అని గుర్తించాలి. ఇక ఉన్నత విద్య శాస్త్రీయ దృక్పథాన్ని పెంచి సమసమాజ నిర్మాణానికి దోహదపడే లక్ష్యాలను వదిలిపెట్టి మార్కెట్ డిమాండ్ ఉండే సబ్జెక్టులలో క్రెడిట్స్ పొందడానికి వెంపర్లాట కనిపిస్తుంది. ఈ తరహా మల్టీ డిసిప్లినరీ, మల్టిపుల్ ఎంట్రీ-ఎక్జిట్ అనేవి కోర్ సబ్జెక్టుల సమగ్ర అధ్యయనాన్ని, అవగాహనను, నిశిత పరిశీలనా శక్తిని, పరిశోధనా ఆసక్తులను బాగా దెబ్బతీసి, విద్యార్థులను యంత్రాల వలె పనిచేసే వర్క్ ఫోర్సుగా మారుస్తాయనడంలో ఎలాంటి అనుమానం లేదు.

ఈ నూతన జాతీయ విద్యా విధానంలో ఉన్నత విద్యను మూడు స్వతంత్ర భాగాలుగా ముక్కలు ముక్కలుగా చేసింది. దీని ప్రకారంగా వీటికి ప్రభుత్వం కేటాయించే బడ్జెట్‌లో సహితం వ్యత్యాసాలుంటాయి. మొదటి రకం విద్య ఇది అన్ని స్థాయిల్లో ప్రపంచస్థాయి పరిశోధన, అధిక నాణ్యతగల బోధనపై దృష్టి పెట్టాలని, రెండవ రకం విద్య పరిశోధనకు గణనీయమైన సహకారంతో విభాగాలవారిగా అధిక నాణ్యత గల బోధనపై దృష్టి పెడుతుందని, మూడవ రకం విద్య అండర్ గ్రాడ్యుయేట్ విద్యపై దృష్టి సారించిన విభాగాలలో అధిక నాణ్యత గల బోధనపై దృష్టి పెడుతుందని నివేదికలో స్పష్టపరిచారు. ఈ విభజనలోనే అసమానతలు కన్పిస్తున్నాయి. ఆ అసమానతలు పునాదిగా విద్యార్థులు చెల్లించే ఫీజుల సామర్థ్యం ఆధారంగా ఆయా విభాగాల్లో అడ్మిషన్

పొందుతారు. ఆయా విభాగాల్లో అభ్యసించేవారు పొందే సౌకర్యాల్లో వ్యత్యాసాలుంటాయి. ఇక్కడే సామాజిక న్యాయానికి తూట్లు పొడవడం ప్రారంభమై డబ్బున్న శ్రీమంతులు ప్రతిభ లేకున్నా ఫీజు చెల్లించే సామర్థ్యముంటే ఉన్నత విభాగాల్లో అడ్మిషన్ పొందుతారు. పేదలు బోధన, లేదా కళాశాల విద్యలో కొనసాగుతారు. ప్రతిభ ఉన్న పేదలు ఫీజు చెల్లించే సామర్థ్యం లేకుంటే బోధనా సంస్థలల్లోనో, కళాశాలల్లోనో అభ్యసించు పరిస్థితి నుండే ఆర్థిక విచక్షణ మొదలౌతుంది. వీటన్నిటి పరిష్కారం కామన్ స్కూల్ విద్యా విధానమైతే దాని గురించి నివేదికలో చర్చించకపోవడం ఈ నివేదిక డొల్లతనంగా అర్థం చేసుకోవచ్చు.

నూతన విద్యావిధానం 2020 పాఠశాల విద్యతో పాటుగా ఉన్నత విద్యారంగంలో అనేక సంస్కరణలను ప్రతిపాదించింది. యూనివర్సిటీ ఎడ్యుకేషన్ కమిషన్ (1948-49), సెకండరీ ఎడ్యుకేషన్ కమిషన్ (1952-53), కొఠారీ కమిషన్ (1964-66), నేషనల్ పాలసీ ఆన్ ఎడ్యుకేషన్-ఎన్‌పిఇ (1968), నేషనల్ పాలసీ ఆన్ ఎడ్యుకేషన్ (1986), నేషనల్ పాలసీ ఆన్ ఎడ్యుకేషన్-సవరణ (1992), టిఎస్ఆర్ సుబ్రహ్మణ్యం కమిటీ నివేదిక (మే-2016) వరకు గల విద్యా సంబంధ కమిషన్లను ప్రస్తావిస్తూ, విద్యారంగానికి జాతీయ విద్య విధానం - 2020 ముందడుగుగా ప్రభుత్వం గంభీరంగా ప్రకటించింది.

అండర్ గ్రాడ్యుయేట్ విద్యను అమెరికా తరహాలో నాలుగేండ్లకు పెంచి వాటిలో ప్రవేశాలకు కేంద్రమే కామన్ ఎంట్రెన్స్‌ను నిర్వహించాలని నిర్ణయించడంతో మన ఉపఖండ చరిత్ర సంస్కృతిని జీవించిన అనుభవాలను గుర్తించడంలో ఈ విద్యావిధానం విఫలమైంది. ఒకే పరీక్ష ద్వారా హయ్యర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రవేశానికి తీసుకోవడం మన భౌగోళిక పరిస్థితులకు సముచితం కాదు. భిన్నత్వంలో ఏకత్వం కలిగిన, వైవిధ్యభరితమైన దేశమిది. కులం, మతం, ప్రాంతాలు ఫిజికల్ డిసిబిలీటీ లాంటి భిన్న వ్యత్యాసాలున్న ఈ సమాజంలో ఒక పరీక్షతో అందరిని సమానం చేయడంతో చాలా నష్టం జరుగుతుంది. ఎక్కువ మంది పిల్లలకు మానసికవత్తిడి పెరుగుతుంది. ఇటువంటి ప్రతిపాదనే యుపిఎ-2 హయాంలో కపిల్ సిబాల్ చేసినప్పుడు దానికి తీవ్ర వ్యతిరేకత వచ్చింది.

మోడీ ప్రభుత్వం తొలి విడత అధికారంలోకి రాగానే స్మృతి ఇరానీ విద్యా మంత్రిగా ఉండి ఆ ప్రతిపాదనను వెనక్కి తీసుకున్నారు. అప్పుడది కేవలం ఒక్క ఢిల్లీ యూనివర్సిటీకి మాత్రమే పరిమితంగా చేసిన ప్రతిపాదన. దానిని వెనక్కు తీసుకున్న బిజెపి ప్రభుత్వం ఇప్పుడు ఏ కారణాలనూ వివరించకుండానే ఏకంగా దేశం మొత్తానికే ఆ నాలుగేండ్ల డిగ్రీ కోర్సును విస్తరిస్తూ ప్రతిపాదన చేశారు. ఈ నాలుగేండ్ల డిగ్రీ కోర్సు, క్రెడిట్ల ఆధారంగా, కోర్సు నుంచి వైదొలగడానికి, పాక్షికంగా చదువుకొనడానికి అవకాశం, (మల్టిపుల్ ఎంట్రీ అండ్ ఎగ్జిట్) ఉంది దానికి తగినట్లుగా తొలి సంవత్సరం పూర్తిచేస్తే సర్టిఫికెట్ రెండో ఏడాది పూర్తయితే డిప్లమో మూడో ఏడాది బ్యాచిలర్ డిగ్రీ నాలుగో ఏడాది పరిశోధనతో కూడిన బ్యాచిలర్ డిగ్రీ ఇస్తారు. ఉద్యోగాలకు వెళ్లాలనుకున్న వారికి మూడేళ్ల డిగ్రీ, పరిశోధన రంగం వైపు వెళ్లాలనుకున్న వారికి నాలుగేళ్ల డిగ్రీ ప్రోగ్రాం అమలు చేయనున్నారు. నాలుగేళ్ల డిగ్రీ చేసిన వారికి ఓ ఏడాది పిజి కోర్సు ఉంటుంది. దాని తర్వాత ఎంఫిల్ చేయాల్సిన అవసరం లేకుండానే పిహెచ్‌డికి వెళ్లొచ్చు. మాస్టర్స్‌తో కలిపి అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బ్యాచిలర్ డిగ్రీ అమలు చేస్తారు. ఇక ఎంఫిల్ డిగ్రీని పూర్తిగా తొలగిస్తారు. ఇప్పుడున్న విధానంలో 4 ఏళ్ల డిగ్రీ విద్యార్థి ఆరు సెమిస్టర్ల తర్వాత చదువుకోలేని పరిస్థితి వస్తే పూర్తిగా మానేయాల్సి ఉంటుంది. కొత్త విధానంలో ఒక ఏడాది తర్వాత విద్యార్థి మానేస్తే సర్టిఫికెట్ ఇస్తారు. రెండేళ్ల తర్వాత మానేస్తే డిప్లొమా, 3-4 ఏళ్ల తర్వాత డిగ్రీ అందిస్తారు. అంటే ఈ నూతన విద్యా విధానం డిగ్రీ చదువును మధ్యలో ఆపివేసి అర్ధాంతరంగా వైదొలగడాన్ని అధికారికంగా ప్రోత్సహిస్తున్నదన్నమాట. డ్రాపౌట్లు లేకుండా నివారించడం ఎలా అన్నది వదిలిపెట్టి ఆ డ్రాపౌట్లనే చట్టబద్ధం చేయడానికి పూనుకున్నదన్నమాట. ఆ విధంగా ఆగిపోయేవారికి ఓదార్పుగా ఓ సర్టిఫికెట్ గాని, ఓ డిప్లొమా గాని ఇవ్వనున్నారు. ఆ సర్టిఫికెట్లతో వారికెటువంటి ఉద్యోగాలూ వచ్చేదిలేదు. పూర్తికాలం కాలేజీలో చదవకుండా మధ్యలో ఆగిపోయినందువలన వారికి ఎటువంటి విజ్ఞానమూ అదనంగా లభించదు. కాలేజీ జీవితం ద్వారా వారెటువంటి ప్రయోజనకరమైన అనుభవాన్నీ పొందజాలరు. మొత్తంగా చూస్తే ఈ నూతన విద్యా విధానం వలన చాలా మంది అరకొర చదువుతో ఆగిపోడానికి, తాము చదువుకున్నామనే భ్రమలు వారికి కలగడానికి దారితీస్తుంది తప్ప ఆ చదువు వలన వారికెటువంటి ప్రయోజనమూ ఒనగూరదు. కానీ ఇక్కడ మెలికను అర్థంచేసుకోవాలి. మొదటి సంవత్సరమైన, రెండవ, మూడవ సంవత్సరమైన విద్యకు దూరమయ్యే వారంతా అత్యధికులు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన ఎస్.సి., ఎస్.టి., బి.సి లుంటారు. ఆశ్చర్యంమేమంటే దీనిని డ్రాపౌట్ అనకుండా ఎగ్జిట్ అనిపేరు పెట్టి వీరు ఎప్పుడైనా తిరిగి మరల కోర్సులో ఎంట్రీకి అవకాశముందని పాసు అయిన సబ్జెక్టుల క్రెడిట్స్ నిధి-లా ఉంటాయని వారు తిరిగి జాయిన్ అయినపుడు క్యారీ ఫార్వర్డ్ అవుతాయని వారికీ మరొక బంపర్ ఆఫర్ ఆన్లైన్, మూక్స్ ద్వారా కోర్సులను పూర్తి చేసుకునే అవకాశాలనిచ్చింది. దీనితో 100 శాతం మంది ఉన్నత విద్యను పూర్తిచేస్తారంటూ నమ్మిస్తుంది.

ఈ నూతన జాతీయ విద్యా విధానంలో అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీ సిస్టమ్ మల్టీ డిసిప్లినరీ, మల్టిపుల్ ఎంట్రీ-ఎక్జిట్ విధానం క్రెడిట్ బేస్డ్‌గా కొనసాగనుంది. ఒక క్రెడిట్ అంటే ఒక గంట టీచింగ్ లెక్చర్ లేదా ట్యుటోరియల్ లేదా 2 గంటల ప్రాక్టికల్ వర్క్ లేదా ఫీల్డ్ వర్క్. అమెరికాలో 4 సంత్సరాల డిగ్రీలో 120-128 సెమిస్టరు క్రెడిట్ అవర్స్ ఉంటాయి. క్రెడిట్స్ కోసం ఎన్నుకునే సబ్జెక్టుల్లో ఒక దానికి మరొకదానికి ఎలాంటి సంబంధం లేకపోవడం వల్ల విద్య పరిపూర్ణ విజ్ఞానార్జన లక్ష్యాన్ని కోల్పోతుంది. ఏ ఒక్క సబ్జెక్టులో సంపూర్ణమైన జ్ఞానం సాధించలేక పోతారు. మార్కెట్ డిమాండ్ ఉండే సబ్జెక్టులలో క్రెడిట్స్ పొందడానికి పోటీ ఏర్పడుతుంది. మానవీయ, సామాజిక శాస్త్రాల, విజ్ఞాన, సాంకేతిక శాస్త్రాల మేళవింపుతో పాఠ్యాంశాల ఎంపిక వంటి ప్రతిపాదనలన్ని అభివృద్ధిచెందిన దేశాల్లోని విద్యా విధానాన్ని ప్రపంచీకరణను అనుసరించి చేసినవే. స్థానిక స్వీయ ప్రయోజనాలు స్వయం ప్రతిపాదిత లక్ష్యాలకు తిలోదకాలిచ్చి విదేశీ విద్యా విధానానికి తలొగ్గడం భారతీయ విద్యా విధానానికి చెల్లుచీటి రాసుకోవడం అవుతుంది.

ఈ నూతన జాతీయ విద్యావిధానంలో అనేక విధానపరమైన వైరుధ్యాలు ఆందోళన కలిగిస్తున్నాయి. 2018 గణాంకాల ప్రకారం ఉన్నత విద్యలో 26 శాతం స్థూల నమోదు జరిగింది. దీనిని 2035 నాటికి 50 శాతానికి పెంచి అదనంగా 3.5 కోట్ల సీట్లు కళాశాలల్లో నింపనున్నట్లు ఆదర్శవంతమైన అంశాలు రాసినారు. ప్రస్తుతం ఉన్న 800 విశ్వవిద్యాలయాలు, 40,000 కళాశాలలను మొత్తం కలిపి 15,000 అత్యద్భుతమైన విద్యా వ్యవస్థలను ఏర్పాటు చేస్తామన్నారు. పెరిగే జనాభాకు అనుగుణంగా విద్యాసంస్థలను పెంచకుండా ఉన్న సంస్థల్లో 63 శాతం తగ్గించి కోట్లలో సీట్లు ఎట్లా నమోదు చేస్తారో పైగా ఈ 63 శాతం విద్యాసంస్థల్లో పనిచేసే సిబ్బందిని ఎక్కడ సర్దుబాటు చేస్తారో స్పష్టతలేదు. నేడు ప్రభుత్వ రంగంలో కొనసాగుతున్న ఉన్నత విద్యా సంస్థలను బలోపేతం చేయకుండా, కొత్త విద్యా సంస్థలను ఏర్పాటు

ప్రక్రియ విధానం ప్రస్తావించకుండా ఈ లక్ష్యాన్ని ఎట్లా నెరవేరుస్తుందో స్పష్టంగా చెప్పలేదు. యూనివర్శిటీలను, ఉన్నత విద్యా సంస్థలను, నాలెడ్జ్ హబ్‌లుగా మార్చి 3000 మంది లేదా అంతకు పైగా విద్యార్థులున్న కేంద్రాలను మల్టీ డిసిప్లీనరీ సంస్థలుగా మార్చి వాటికీ స్వయం ప్రతిపత్తి నివ్వాలని నిర్ణయించారు. ఇది గ్రామీణ భారతంలో సాధ్యమౌతుందా?

ఈ మౌలిక మార్పుల వలన దేశంలో ఏవో కొన్ని ఐఐటిలు, కేంద్ర విశ్వవిద్యాలయాలు అలా మారడానికి అవకాశం ఉందేమో కానీ, మిగిలిన వందలాది విశ్వవిద్యాలయాలు వేలాది డిగ్రీ కాలేజీల భవిష్యత్తు కనుమరుగు కానుంది. ఇప్పటికే పేదరికం సామాజిక వెనుకబాటు వలన దశాబ్దాలుగా ఉన్నత విద్యకు దూరమైన 74 శాతం మందికి ఎట్లా విద్యనందిస్తుందో ఈ నివేదికలో అస్పష్టంగా ఉంది. మొత్తంగా ఈ నూతన జాతీయ విద్యావిధానం ఉన్నత విద్యా వ్యాపారాన్ని నియంత్రించక పోగా సామాజిక వెనుకబాటుదారులకు చేయూతనిచ్చే రిజర్వేషన్లకు చెల్లుచీటీ ఇచ్చి విద్యకు దూరం చేస్తుందనడంలో ఎలాంటి సందేహంలేదు.

ఈ విద్యా విధానంలో ప్రధానంగా యువతకు వృత్తి శిక్షణ కార్యక్రమా లు చేపట్టి, ఎంప్లాయబిలిటీ స్కిల్స్ పెంచాలని కమిటీ సూచించింది. ఎన్ఎస్‌డిసి అంచనాల ప్రకారం– 2022 నాటికి 104.62 మిలియన్ల యువత జాబ్ మార్కెట్‌లోకి ప్రవేశించనున్నారు. ఇప్పటి నుంచే వారికి జాబ్ రెడీ స్కిల్స్ అందించాలి. ఎంప్లాయబిలిటీ, ఎంటర్ ప్రెన్యూర్ స్కిల్స్ లభించేలా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహించాలి. శిక్షణ పూర్తి చేసుకున్న తర్వాత సర్టిఫికెట్ అందించాలనే ఆచరణ సాధ్యంకాని హామీలే అధికంగా కన్పిస్తున్నాయి. ఇప్పటికి ఉన్న ఇన్ని కోట్ల సర్టిఫైడ్ నిరుద్యోగులకు ఎట్లా ఉపాధి కల్పిస్తుందో ఎక్కడా ప్రస్తావించలేదు. కానీ చదువుల జ్ఞానం కన్నా యువత సరిఫికేట్స్ కోసమే పోరాడుతుందన్న విషయాన్ని చక్కగా ఈ ప్రభుత్వం అర్థం చేసుకుంది. దీనితో ప్రపంచబ్యాంక్ లక్ష్యానికి అనుగుణంగా అపరిమితంగా ఉన్న భారత శ్రామికులను కారు చౌకగా అంతర్జాతీయ మార్కెట్లోకి సరఫరా చేయడమే నూతన జాతీయ విద్యా విధాన సంస్కరణల లక్ష్యంగా అర్థమౌతుంది.

ప్రపంచ వ్యాప్తంగా అభివృద్ధి చెందిన మార్కెట్ వ్యవస్థను అవలంబిస్తున్న దేశాలు సైతం వారి పౌరులకు ఉచిత, నాణ్యమైన విద్యను కాలేజీ, విశ్వవిద్యాలయాలతో సహా అన్ని స్థాయిలలో అందిస్తుంటే భారత రాజ్యాంగం సాక్షిగా రాసుకున్న అందరికి విద్య లక్ష్యం నీరుకార్చడం విచారకరం. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన తరగతులను ఉన్నత విద్యారంగానికి దూరం చేయడం ఈ నూతన విధానంలో కనపడే పెద్ద వెనకడుగు. సామాజికంగా వెనకబడిన తరగతుల రక్షణ కోసం రూపొందిన రిజర్వేషన్లు వంటి గ్యారంటీ చర్యల గురించిన ప్రస్తావన ఏదీ ఈ విధాన పత్రంలో మనకు కనిపించదు. ఇది క్రమంగా రిజర్వేషన్ల నుండి పక్కకు తప్పుకోవడమే అవుతుంది.. భారతీయ విద్యలో శాస్త్రీయ, లౌకిక, సామ్యవాద, ప్రజాస్వామిక భావనలు పెంపొందించాల్సి ఉండగా బడుగు బలహీనుల ఆకాంక్షలకు భద్రతగా సామాజిక న్యాయం, సమానత్వం కోసం మంచి విద్యను అందించాల్సి ఉండగా మార్కెట్ నిబంధనలపై ఆధారపడే ప్రైవేట్ విద్యను పెంచి పోషించడం ప్రధాన ఉద్దేశంగా కన్పిస్తుంది.

ఉన్నత విద్యలో పరిశోధనలపై పెద్ద ఎత్తున మార్పులు తీసుకు రావాలని, ఇక నుండి కాలం చెల్లిన ఎంఫిల్ కోర్సును ఎత్తివేసి నేరుగా పి.ఎచ్.డి ప్రవేశాలకు అనుమతించి పకడ్బందీగా అమలుచేయాలనే నిర్ణయాన్ని దశాబ్దాలుగా వింటున్నప్పటికీ, నిధుల కేటాయింపులో చిత్తశుద్ధిలేక నేటికీ పరిశోధన రంగము వెనుకబడింది. కేంద్ర ప్రభుత్వం 1991 నూతన ఆర్థిక సంస్కరణల అనంతరం పరిశోధన రంగంలో కొన్ని చర్యలను తీసుకున్నట్లు మాటలు చెప్పడం తప్ప తీసుకుంటున్న చర్యలన్నీ తిరోగమనంలోనే ఉన్నాయి. మనదేశంలో పరిశోధకులను ప్రోత్సాహించకపోగా నిరుత్సాహం కలిగిస్తున్నాయి. యువతలో శాస్త్రీయ ఆలోచనలను రేకెత్తించాల్సిన పాలకులు, వారికి మార్గదర్శకులుగా ఉన్నవారు అశాస్త్రీయ దృక్పథాలతో కాలక్షేపం చేస్తున్నారు.

ఈ నూతన జాతీయ విద్యావిధానంలో సంస్కృత గ్రంథాలలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం మొత్తం నిక్షిప్తమై ఉందని చెబుతున్నారు. వాటిని చూసే అమెరికా నాసా, ఇతర సంస్థలు పరిశోధనల్లో ముందున్నాయని గొప్పలతో పాటు చివరికి కంప్యూటర్ లాంగ్వేజ్‌ను కూడా రాస్తున్నాయనే అభిప్రాయాలను కల్పిస్తున్నారు. శాస్త్రీయ ఆలోచనలు, భావాలను ముందుకు తెచ్చే ఆచార్యుల, సైంటిస్ట్‌ల మీద దాడులు చేస్తున్నారు. యువతలో విద్యార్థుల్లో సృజనాత్మక శక్తులను దూరంచేసి మరమనుషులుగా మార్చనున్నారు. ప్రపంచ పరిశోధనల మదింపులో ఉన్నత ప్రమాణాలున్న నేచర్ ఇండెక్స్ సూచి ప్రకారం అగ్రశ్రేణి పది దేశాల్లో చైనా 6, 183.75 పాయింట్లతో ముందుండగా వరుసగా అమెరికా 5, 371.32, జర్మనీ 1, 673.35, జపాన్ 1, 275.58, బ్రిటన్ 1, 023.58, ఫ్రాన్స్ 671.93, దక్షిణ కొరియా 615.12, భారత్ 501.38, కెనడా 464.62, స్పెయిన్ 460.21 చొప్పున సాధించాయి. మన దేశం తొలి పదింటిలో అతి కష్టంగా స్థానం పొందినప్పటికీ మొదటి స్థానానికి 56182. 37 పాయింట్స్ తో ఎంతో దూరంగా ఉంది. ప్రభుత్వం శాస్త్రీయ పరిశోధన రంగంవైపు పరుగులు తీయకుండా భారతీయ సమాజాన్ని అశాస్త్రీయ, మూఢ విశ్వాసులవైపు పరిగెత్తించడం ఆధునిక సాంకేతిక జ్ఞానమంతా విశ్వాసాల పైననే ఉందని, ఇటీవల ప్రపంచమంతా కోవిడ్ –19 నివారణ కోసం శాస్త్రీయ ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తుంటే తాను మాత్రం చప్పట్లు చరిచి, జ్యోతులు వెలిగించి మూఢ అంధ విశ్వాసాలను ప్రకటించడం చూస్తే ఈ ప్రభుత్వానికి పరిశోధన రంగం కన్నా మూఢ విశ్వాసాలకే ప్రాధాన్యత ఇస్తున్న క్రమంలో ఈ నూతన జాతీయ విద్యావిధానం ఉన్నత విద్యలో పరిశోధనలకు పెద్దపీట వేస్తుందనుకోవడం భ్రమే అవుతుంది.

ఉన్నత విద్యా రంగాన్ని అదుపు చేసే కేంద్రీకృత వ్యవస్థ ఉండాలని కార్పొరేట్ రంగం చాలకాలం నుంచి డిమాండ్ చేస్తుంది. దానికి నూతన జాతీయ విద్య విధానంలో ఉన్నత విద్యా వ్యవస్థ పాలనా అవసరాలకోసం ప్రజాశక్తిని ప్రోత్సహించడానికి, ప్రభావపూరితమైన, సమర్థవంతమైన, స్పందనాత్మకమైన, నియంత్రణ క్రమం, నైపుణ్య ప్రోత్సహాన్ని కలిగించేందుకు అనే సాకుతో 1956 పార్లమెంట్ చట్టం ద్వారా ఏర్పడిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యుజిసి), అల్ ఇండియా కౌన్సిల్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్, నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సిఇఆర్ఇటి) లాంటి సంస్థలను రద్దుచేసి, హయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా ద్వారా అధికార కేంద్రీకరణ చేసి రాజకీయ ఆధిపత్యానికి దారులేసుకుంటున్నారు. సర్వ స్వతంత్రంగా ఉండాల్సిన ఉన్నత విద్యారంగంలో అధికార కేంద్రీకరణతో పాటు, కేంద్రం రాజకీయ పెత్తనం ఉన్నత విద్యలో పెరగనుంది. ఈ ప్రజా ప్రతినిధులను బోర్డు డైరెక్టర్లుగ నియమించడం దీని డొల్లతనాన్ని తెలియచేస్తుంది. ఇందులో వైద్య, న్యాయవిద్యను మాత్రం దీని నుంచి మినహాయించింది.

ఈ హైయ్యర్ ఎడ్యుకేషన్ కమిషన్ ఆఫ్ ఇండియా నామమాత్రంగా నాలుగు స్వతంత్ర విభాగాలుగా పనిచేస్తుంది. అవి నేషనల్ హయ్యర్ ఎడ్యుకేషన్ రెగ్యులేటరీ కౌన్సిల్ (ఎన్ఎచ్ఇఆర్‌సి) అనేది విద్య సంస్థల రెగ్యులేషన్ కోసం, ప్రమాణాలను నిర్దేశిస్తుంది, జనరల్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ (జిఇసి), ఫండింగ్‌కు హయ్యర్ ఎడ్యుకేషన్ గ్రాంట్స్ కౌన్సిల్

(ఎచ్ఇజిసి), అక్రిడిటేషన్‌కు నేషనల్ అక్రిడిటేషన్ కౌన్సిల్ (ఎన్ఎసి) ఏర్పాటు అవుతాయి. రెగ్యులేషన్, అక్రిడిటేషన్, అకడమిక్ ప్రమాణాలకు సంబంధించి పబ్లిక్, ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థలన్నింటికీ ఒకే రకమైన నిబంధనలు వర్తింపచేస్తారు.

కొత్త విద్యా విధానానికి తగినట్లుగా అఫిలియేషన్ పద్ధతిని మార్చి కాలేజీలన్నీ 15 సంవత్సరాల్లో దశల వారీగా స్వయం ప్రతిపత్తి ఉన్న స్థాయికి లేదా కాలేజ్ ఆఫ్ యూనివర్సిటీ స్థాయికి చేరుకోనే వెసులుబాటును కల్పించనున్నారు. ప్రపంచంలోని వంద అగ్రశ్రేణి విదేశీ విశ్వవిద్యాలయాలకు మన దేశంలో క్యాంపస్‌లు నెలకొల్పేందుకు అవకాశాలు సృష్టించి మన సంపదను విదేశాలకు సులభంగా చేరవేస్తారు. దేశంలో డిజిటల్ విద్యను ప్రోత్సహించేందుకు జాతీయ విద్యా టెక్నాలజీ ఫోరమ్ (ఎన్ఇటిఎఫ్) ఏర్పర్చనున్నారు. తొలుత ఎనిమిది ప్రాంతీయ భాషల్లో ఈ కోర్సులను అభివృద్ధి పరుచాలని నిర్ణయించారు. డీమ్డ్ యూనివర్సిటీలు, కేంద్ర యూనివర్సిటీలు, ఇతర ప్రత్యేక సంస్థలకు వేరువేరు నిబంధనలు ఉండకుండా అన్నింటిలోనూ ఒకే విధమైన ప్రమాణాలు పాటించాల్సిందే అన్నారు. కానీ ఇక్కడ బడ్జెట్ గురించి ప్రస్తావనే లేదు. ఇక విద్యాసంస్థల అనుమతులకు ప్రభుత్వ తనిఖీలు ఉండవని ప్రైవేట్ వాళ్ల స్వేచ్ఛకు దారులు వేసినారు. అక్రిడేషన్ ప్రైవేట్ ఏజెన్సీ ద్వారా జరుగనుంది. అక్రిడేషన్‌కు ఆన్‌లైన్‌లో స్వయం ధ్రువీకరణ చేస్తే సరిపోతుందని కితాబిచ్చినారు. దానిని గుర్తింపు పొందిన ప్రైవేట్ ఏజెన్సీలు అక్రిడేషన్ చేస్తాయి. ఇక ప్రైవేట్ ఏజెన్సీ అక్రిడేషన్ అంటే అవినీతి ఎంత ఎత్తుకు ఎగబాకనుందో అర్థం చేసుకోవచ్చు. అక్రిడేషన్ ఏజెన్సీలతో ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు విదేశీ విశ్వవిద్యాలయాలకు లక్ష్యం లాభాలను ఆర్జించి పెట్టడమే ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తుంది. వీటితో పాటు పునాది నుండి పరిశోధన వరకు నియంత్రించడానికి కొత్తగా దాదాపు పది కేంద్ర సంస్థలు ఏర్పాటు కాబోతున్నాయి. ఇవన్నీ కేంద్ర ప్రభుత్వ కనుసన్నల్లో మెలిగే బ్యూరోక్రటిక్ సంస్థలు. ఇవి ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీని బలపరిచే విధానాలనే అమలుచేసే ప్రయత్నం చేస్తాయి. ఇలాంటి ధోరణులు ఉన్నత విద్య మౌలిక భావన అయిన విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని సమూలంగా సమాధి చేస్తాయి. స్వతంత్రంగా విద్యావేత్తలతో ఉండాల్సిన రాష్ట్రీయ శిక్షా ఆయోగ్‌కు ప్రధానమంత్రి అధ్యక్షులు కావడంతో విద్యారంగంలోకి ప్రత్యక్షంగా విజ్ఞానం కాకుండా రాజకీయ విశ్వాసాలు ప్రవేశించే అవకాశాలున్నాయి.

విద్యారంగ వ్యయం జిడిపిలో 6 శాతం పెంచేందుకు చర్యలు

ఏ కార్యక్రమమైనా విజయవంతం కావడానికి ఉదాత్తమైన ఆశయాలతో పాటు సమృద్ధిగా నిధుల కేటాయింపులుండాలి. కానీ గత కమిషన్ల మాదిరిగానే విద్యారంగ వ్యయాన్ని త్వరలో జిడిపిలో 6 శాతానికి పెంచేందుకు చర్యలు ఉంటాయని ఈ నివేదికలో పేర్కొనడం పలురకాల అనుమానాలకు తెరలేపుతుంది. 1964-66 కొఠారీ కమిషన్ ప్రతిపాదించిన జిడిపిలో 6 శాతం నిధులను విద్యకు కేటాయించాలనే సూచన గత 52 సంవత్సరాలుగా అమలుకు నోచుకోలేదు. పైగా నూతన ఆర్థిక సంస్కరణల అనంతరం విద్యారంగానికి కేటాయంపులు మరింతగా తగ్గుతున్నాయి. విద్యపై వెచ్చించే జిడిపిలో కూడా ప్రభుత్వ ఖర్చు, ప్రైవేట్ ఖర్చు రెండూ కలిపి ఉంటాయి. విద్యలో చాలా కాలంగా ప్రభుత్వ ఖర్చు తగ్గుతూ, ప్రైవేట్ ఖర్చు పెరిగిపోవడం జరుగుతోంది. దీనికి కారణం ప్రజలకు విద్యనందించే బాధ్యత నుండి ప్రభుత్వాలు తప్పుకుంటూ ప్రైవేటీకరణను ప్రోత్సహించడంతో ఇప్పటికే పాఠశాల విద్యలో 50 శాతం పైగా, ఉన్నత విద్యలో దాదాపు 70 శాతం ప్రైవేట్ రంగంలోకి పోయింది. ఈ పరిస్థితిలో కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపుల గురించి సూటిగా చెప్పకుండా డొంకతిరుగుడులో జిడిపి ఖర్చు గురించి చెప్పడమంటే మరింత ప్రైవేటీకరణకు దారులు తెరవడమే. ఈ దశలో నిధుల కేటాయింపుపై, ఈ విద్య విధానం అములుపై అనేకానేక వ్యతిరేక, భిన్న విభిన్న చర్చలు రావడం అత్యంత సాధారణమే.

సమాజ వికాసానికి ఉపయోగపడే యువతకు ఉన్నత శ్రేణి విద్యను అందించడానికి అవసరమైన పెట్టుబడి పెట్టడానికి వేనుకాడవద్దని ఈ విద్యావిధానం నొక్కి వక్కాణించింది. ఈ మాటలు కమిటీల్లో రాసుకోవడం పరిపాటి అయింది. జిడిపిలో 6 శాతం నిధులను విద్యాభివృద్ధికి వెచ్చించాలని 1968 పాలసీలో సూచించినా, 1986లో పునరుద్ఘాటించినా ఇంతవరకు అమలు జరగకపోవడం పట్ల ప్రభుత్వాలు విచారం మాత్రమే వ్యక్తం చేసినాయి. ఈ విద్యా విధానంలో చేసిన పలురకాల ప్రతిపాదనలకు అదనపు నిధుల అవసరం పెరుగుతుంది. అందుకోసం ప్రభుత్వ నిధుల కోసమే చూడకుండా ప్రైవేట్ ఫిలాంత్రోఫిక్ సంస్థల భాగస్వామ్యాన్ని, ఆర్థిక సహకారాన్ని తీసుకోవాలని సూచించింది. ప్రైవేట్ సంస్థల ప్రవేశానికి అవరోధంగా ఉన్న ఆంక్షలను సడలించి లైట్ బట్ టైట్ అనే పద్ధతిని పాటించాలని చెప్పింది. దీనిని బట్టి విద్యారంగ అవసరాలకు సరిపడా నిధులను ప్రభుత్వాలు సమకూర్చలేవు గనుక ప్రైవేట్ రంగాన్ని బాగా ప్రోత్సహించాలని విధానపరంగానే నర్మగర్భంగా చెప్పింది. కనుక ఈ విధానంతో ప్రభుత్వరంగ విద్యాలయాలు దివాళా తీయడమేకాదు కనుమరుగయ్యే దుస్థితి దాపురిస్తుంది.

ప్రపంచ బ్యాంకు ప్రభావంతో విద్య కొన్ని దశాబ్దాలుగా ఒక సరుకుగా ఆమోదం పొందింది. సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ నేపథ్యంలో1995 నుండి ప్రపంచ వాణిజ్య సంస్థ ప్రధాన ఒప్పందాలలో ఒకటైన జనరల్ అగ్రిమెంట్ ఆన్ ట్రేడ్ ఇన్ సర్వీసెస్ విద్య ఒక వాణిజ్య సర్వీసు అని, విద్యా సంస్థ ఒక సర్వీసు ప్రొవైడర్ అని, ఉపాధ్యాయుడు సర్వీసు ఫెసిలిటేటర్ అని, విద్యార్థి సర్వీసు వినియోగదారుడు అని నిర్వచించారు. ఇలా వాణిజ్య రూపంలో విద్య ఇంటర్ నేషనలైజేషన్ కావడమే భారతీయ విద్యారంగానికి విషాదం. ఇక పన్నెండో పంచవర్ష ప్రణాళిక (2012- 2017) కాలంలోనే ఉన్నత విద్యలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించే విధానానికి, లాభాలను గడించే బాటకు తెరలేచింది. దేశంలో అనేక రాష్ట్రాల్లో ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు పుట్టుకొచ్చాయి. ఈ కారణంగా ఎన్నో అవాంఛనీయ ధోరణులు చెలరేగాయి. ప్రైవేట్ సంస్థలతో విద్యా ప్రమాణాలలోనే కాదు, విలువలపైనా తీవ్ర ప్రభావం పడింది. ప్రైవేట్ రంగానికి లాభార్జనే ధ్యేయంగా ఉంటుంది కనుక సహజంగానే విలువలు, ప్రమాణాలు పతనమయ్యాయి. ఆధునిక సంక్షేమ ప్రభుత్వాలు ప్రస్తుత పరిస్థితుల్లో నాణ్యమైన విద్య వైద్య సేవలను తమ ప్రజలందరికి సులభతరంగా అందుబాటులోకి తేవాలి. ఎప్పుడైతే విద్యకు ప్రభుత్వ మద్దతు లభించదో, అప్పుడు విద్య బహుళ ప్రజానీకం ఆకాంక్షలకు అనుగుణంగా నిలువలేదు. అందుకే ఈరోజు మన సమాజంలో జరిగే అనేక విపరీత ధోరణలకు విపత్కర, సంక్షోభ పరిస్థితుల నివారణకు మన విద్యారంగంలో గాని, పరిశోధనా రంగంలో గాని పరిష్కారాలు చోటుచేసుకోలేక పోయాయి. కనీసం కళాశాలల్లో, విశ్వవిద్యాలయాల్లో పాఠ్యాంశాలుగా చెప్పుకొనే అవకాశం లేకుండా పోయింది. ఈ నూతన విద్యా విధానం మన దేశ విద్యా వ్యవస్థను ఏ దిశకు తీసుకుపోనుందో సమగ్రంగా చర్చించి అవసరమైన మార్పులకు అందరు కృషి చేయాల్సిన తక్షణ అవసరముంది.

(రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలంగాణ విశ్వవిద్యాలయం) వీ

కశ్మీర్ అస్తిత్వ పోరాటం

***జమ్ము కశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక హోదా, స్వయం ప్రతిపత్తిని రద్దు చేసి, ప్రజలను అణచివేతలకు గురిచేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని అంటున్నారు* రాజేంద్రబాబు అర్విణి**

2019 ఆగస్టు 5న జమ్మూ కశ్మీర్ ప్రత్యేక హోదాను, రాష్ట్ర ప్రతిపత్తిని కోల్పోయి కేంద్ర పాలిత ప్రాంతంగా మారిన కొద్ది గంటలలో 17 ఏళ్ల ప్రాయంలో ఉన్న 'ఒసైబ్ మరాజి' కశ్మీర్ లోయగుండా ప్రవహిస్తున్న జీలం నదిలో పడిపోయి ప్రాణాలు కోల్పోయాడు. వెనక నుండి కేంద్ర రిజర్వ్ పోలీసు బలగాలు తరుముకొస్తుండగా పరుగెత్తి పరుగెత్తి తడబడుతూ నదిలో పడిపోయాడు, నీళ్లల్లో కొట్టుకుపోయాడు. సంవత్సరం అయింది. కనీసం ఆయన శవం కూడా దొరకలేదు. కశ్మీర్‌పై కేంద్ర ప్రభుత్వం తీసుకున్న తీవ్రమైన చర్య తర్వాత తొలి అమరత్వం ఒసైబ్ మరాజిదే! ఆ తర్వాత జరిగిన మరణాలను లెక్కించడానికి ప్రజా సంఘాలు పనిచేసే స్థితిలో లేవు. మీడియా గుక్కతిప్పుకోలేని ఆంక్షల మధ్య నిర్వీర్యమైపోయి ఉంది. ఒసైబ్ ఎందుకు చనిపోయాడని మరాజి కుటుంబమంతా సంవత్సరం నుండి మొరపెట్టుకుంటూనే ఉంది. కోర్టుల చుట్టూ తిరుగుతూనే ఉంది. సుప్రీంకోర్టు తలుపులు కూడా తట్టింది. చనిపోయిన నాలుగు నెలల తర్వాత గాని ఆయన చనిపోయినట్లు పోలీసులు ఒప్పుకోలేదు. రిజర్వ్ పోలీసులు తరుముతూ ఉంటే పరుగెత్తుతూ ప్రమాదవశాత్తూ జీలం నదిలో పడి చనిపోయాడనీ ఒప్పుకోలేదు. మరణ ధృవీకరణ పత్రం ఇంతవరకు ఇవ్వలేదు. సంవత్సరమైనా ఒసైబ్ తండ్రికి సమాధానం దొరకలేదు. ఆయన అడుగుతున్నది ఒకే ప్రశ్న. 'నా కొడుకు మరణానికి కారణమైన వారిని శిక్షిస్తారా లేదా' అని. ఈ ప్రశ్నలను ఒక సంవత్సరంగా కశ్మీర్‌లోని మూల మూల నుండి ఎంతోమంది తండ్రులు, ఎన్నో కుటుంబాల సభ్యులు అడుగుతూనే ఉన్నారు. భారత ప్రభుత్వం నుండి ఈ ప్రశ్నలకు సమాధానం లేదు. సరికదా. ప్రతిధ్వనిస్తున్న ఈ ప్రశ్నల పరంపర దేశంలోని ఇతర ప్రాంతాలకు చేరకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నది.

అరుంధతీరాయ్ అభిప్రాయంలో కశ్మీర్ అంటే బతికి ఉన్న శవాలు, మాట్లాడే సమాధులు ఉండే ప్రదేశం. అన్ని రకాల సమాధులు – పట్టణాలలో ఉండే సమాధులు, గుర్తింపులేని సమాధులు, ఒకదానిపై ఒకటి ఉండే సమాధులు – అన్ని రకాల సమాధులు సంభాషించుకునే దేశం. కొనప్రాణం కొట్టుమిట్టాడుతున్న లౌకికవాదం పట్ల రోదన ఒకపక్క, లౌకిక వాదాన్ని దెబ్బతీశామని విజయ గర్వం మరొకపక్క – ఈ రెండింటి మధ్య కొట్టుమిట్టాడుతున్న దేశం కశ్మీర్ దేశం. 2019 ఆగస్టు 5న భారత రాజ్యాంగంలోని అధికరణం 370 రద్దు అయిన తర్వాత జమ్మూ కశ్మీర్ ఒక పెద్ద జైలుగా మారిపోయిందని ఓ రాజకీయ నాయకుడు వ్యాఖ్యానించాడు. సెక్షన్ 370 రద్దు తర్వాత దేశంలో 'కండబలం చూపించే జాతీయవాదం' కొత్త జవసత్వాలు పుంజుకుందన్న సంగతి స్పష్టమైంది. రాష్ట్ర ప్రతిపత్తి, రాజ్యాంగబద్ధమైన ప్రత్యేక హోదా కోల్పోయిన తర్వాత కశ్మీర్‌లో ఎంతమంది నాయకులు, కార్యకర్తలు జైలు పాలయ్యారో, వారి పేర్లు గాని, వారి సంఖ్య గాని జమ్మూ కశ్మీర్ ప్రభుత్వం ప్రకటించలేదు. కేంద్ర ప్రభుత్వమూ ప్రకటించలేదు. కొంతమంది మాజీ ముఖ్యమంత్రులు గృహ నిర్బంధంలోనో, గెస్ట్‌హౌస్ నిర్బంధంలోనో ఉన్నారు. ఎనిమిది నెలల అరెస్ట్ తర్వాత ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు ఫరూఖ్ అబ్దులా, ఒమర్ అబ్దుల్లాలను ఈ సంవత్సరం మార్చ్‌లో విడుదల చేశారు. మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీతో సహా 16 మంది నేషనల్ కాన్ఫరెన్స్ నాయకులు, మరో ఎనిమిది మంది పిడిపి నాయకులు నిర్బంధంలో ఉన్నారు. లిఖితపూర్వక ఆదేశాలు లేకుండా వందలాది రాజకీయ నాయకులు గృహ నిర్బంధంలో ఉన్నారు.

రాజ్యాంగంలోని 370 అధికరణాన్ని రద్దుచేసి కశ్మీర్‌ను బలహీన పరచాలన్నది దేశాన్ని పరిపాలిస్తున్న భారతీయ జనతా పార్టీకి దీర్ఘకాలంగా ఉన్న ప్రణాళిక. ముస్లిం మెజారిటీ రాష్ట్రంగా కశ్మీర్ ఉండడమే ఇందుకు కారణం. తమ ఎజెండాలో ఉన్న ఈ అంశాన్ని పరిపూర్తి చేసుకోవడానికి రెండవ పర్యాయం అధికారంలోకి వచ్చిన తదుపరి ఇదే అనువైన సమయమని భావించారు. గత సంవత్సరమే హోం మంత్రి అమిత్‌షా రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, 35 (ఎ) సెక్షన్‌ల వల్లనే జమ్మూ కశ్మీర్‌లో ఉగ్రవాదం పెచ్చరిల్లుతుందని, ఉగ్రవాదం మూలాలు ఈ నిబంధనలలోనే ఉన్నాయని పార్లమెంట్‌లోనే అధికారిక ప్రకటన చేశాడు. ఇదే వాస్తవమైతే ఈ నిబంధనలను రాజ్యాంగం నుండి తొలగించిన తర్వాత ఉగ్రవాదం తుదముట్టాలి కదా! కాని అలా జరగలేదు. ఈ సంవత్సర కాలంలో ఉగ్రవాదం ఏమాత్రం తగ్గకపోగా ఇంకా పెరిగింది. ఇందుకు తాజా ఉదాహరణ ఇటీవలి కాలంలో సర్పంచులు, పంచాయితీ సభ్యులు (పంచ్‌లు) కాల్పులలో ప్రాణాలు కోల్పోవడం. మిలిటెంట్లు సర్పంచులపై, పంచ్‌లపై విచ్చలవిడిగా కాల్పులు జరుపుతున్నారు. కాల్పులకు గురవుతున్న రాజకీయ నాయకులు భారతీయ జనాతా పార్టీకి చెందిన వారే అయి ఉండడం గమనించవలసిన విషయం. అందుకే ఈ సంవత్సర కాలంలో చాలా మంది భాజాపా నాయకులు తమ పార్టీని వీడారు. ఆర్టికల్ 370 వల్ల ఉగ్రవాదం రాలేదు. అది తొలగించినందువల్ల ఉగ్రవాదం అంతమవలేదు.

గత కొన్ని దశాబ్దాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీలు కాంగ్రెస్, బిజెపిలు రెండూ ఆర్టికల్ 370 వల్ల కశ్మీర్‌లో అభివృద్ధి ఆగిపోయిందని, ప్రజలు పేదరికంలో మగ్గుతూ మెరుగైన జీవితానికి దూరంగా బతుకుతున్నారని ప్రచారం చేశారు. కాని అది నిరాధారమైన ఆరోపణ అని కశ్మీర్‌లో పరిస్థితులను అవగాహన చేసుకున్నవాళ్లకు తెలుస్తుంది. ప్రభుత్వ గణాంకాలను పరిశీలిస్తే దేశంలోని చాలా రాష్ట్రాల కంటే జమ్మూ కశ్మీర్‌లోనే మెరుగైన పరిస్థితులు ఉన్నాయని అర్థమవుతుంది. 1950 కంటే ముందే కశ్మీర్‌లో భూసంస్కరణలు పటిష్టంగా అమలయ్యాయి. అవి ఇప్పటికీ అవరోధం లేకుండా కొనసాగుతూనే ఉన్నాయి. ఇప్పుడు ఆర్టికల్ 370 అమలులో లేనందువల్ల

భూసంస్కరణలకు విఘాతం కలిగే ప్రమాదం ఉంది. కశ్మీర్ ఒక సమస్య అనుకుంటే రాజ్యాంగంలో పొందుపరచబడిన 370 ఆర్టికల్‌ను పటిష్టంగా అమలు పరచడమే దానికి పరిష్కారం. కాని అది ఇప్పుడు రాజ్యాంగం నుండి తొలగించబడ్డది. ఆ నిబంధనను తొలగించి సమస్యను ఇంకా జఠిలం చేసింది బిజెపి ప్రభుత్వం. 2019 ఆగస్టు 5న కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల కశ్మీర్‌లో శాంతి నెలకొంటుందని, అది అభివృద్ధికి బాటలు వేస్తుందని ఏమాత్రం గ్యారంటీ లేదు.

2019 ఆగస్టు 5న కేంద్ర ప్రభుత్వం తీసుకున్న వివక్షాపూరితమైన రాజకీయ చర్యవలన జమ్మూ కశ్మీర్ మూడు ముక్కలైంది. అవి రాష్ట్ర హోదాను కోల్పోయి కేంద్ర పాలిత ప్రాంతాలుగా కుదించబడ్డాయి. మూడు ప్రాంతాలు కేంద్ర ప్రభుత్వ ప్రత్యక్ష పాలన కిందకు వచ్చాయి. కశ్మీర్ లోయలోని 75 లక్షల మంది ప్రజలు తమకు లోబడి ఉండేలా హిందుత్వ ఎజెండా ప్రధానంగా కలిగిన బిజెపి తన కరవాలం ఝుళిపించింది. 3,900 మంది అదనపు భద్రతా సిబ్బందిని కశ్మీర్ లోయకు తరలించారు. ఏడాది పొడుగునా 144వ సెక్షన్ విధించారు. ఆర్టికల్ 370, 35 (ఎ)లను రద్దుచేసి, ఒక సంవత్సరం అయిన సందర్భంగా నిరసనలు, సమావేశాలు జరగకుండా కశ్మీర్ అంతటా 2020 ఆగస్టు 4, 5 తేదీలలో కర్ఫ్యూ విధించారు. (ప్రపంచ వ్యాప్తంగా విజృంభించిన కోవిడ్ నేపథ్యంలో ఈ భూగోళం మీద ఎక్కడా లేని విధంగా ఒక్క కశ్మీర్‌లోనే కర్ఫ్యూ విధించారు). ఈ సంవత్సర కాలం అంతా జమ్మూ కశ్మీర్‌లో ప్రజలు ప్రాథమిక హక్కులు కోల్పోయారు. హక్కుల పరిరక్షణకు ఏర్పడ్డ అన్ని చట్టబద్ధ కమిషన్‌లను రద్దు చేశారు. ప్రజా భద్రతా చట్టాన్ని విచక్షణా రహితంగా ఉపయోగించారు. ప్రతిరోజు కశ్మీర్ లోయలో కార్డన్ సర్చ్ ఆపరేషన్ నిర్వహించేవారు. కొత్త మీడియా విధానం ప్రకటించారు. దాని ప్రకారం స్వేచ్ఛాయుత మీడియాకు అవకాశం లేకుండా పోయింది.

ఆర్టికల్ 370 కశ్మీర్ అభివృద్ధికి ఆటంకం అన్న బిజెపి వారి ప్రచారం శుద్ధ అబద్ధం అని కశ్మీర్ ఛేంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ వారు ఇటీవల వెల్లడించిన గణాంకాల ప్రకారం రుజువయ్యింది. రు. 40,000 కోట్ల విలువగల ఉత్పత్తి కార్యకలాపాలు నిలిచిపోయాయని, 4 లక్షల 97,000 ఉద్యోగాలు నష్టపోవడం జరిగిందని వారి అధ్యయనంలో వెల్లడైంది. వారి అంచనా ప్రకారం పండ్ల వ్యాపారం, వస్త్రాలు, తివాచీలు, ఐటి కమ్యూనికేషన్, రవాణా రంగాలు తీవ్రంగా నష్టపోయాయి. ఇది ఇలా ఉండగా, ఈ సంవత్సరం (2020) జూలైలో ది ఫోరం ఫర్ హ్యూమన్ రైట్స్ ఇన్ కశ్మీర్ అన్న సంస్థ ఆసక్తికరమైన పరిశోధనా వివరాలు ప్రకటించింది. వారి అధ్యయనం ప్రకారం 2001 నుండి 2013 మధ్య కాలంలో కశ్మీర్ లోయలో ఉగ్రవాద సంఘటనలు 4,522 నుండి 170కి తగ్గిపోయాయి. ఉగ్రవాద దాడుల్లో మిలిటెంట్లు, భద్రతా సిబ్బంది, పౌరులను కలుపుకొని మృతుల సంఖ్య 3,552 నుండి 135కి తగ్గిపోయింది. వారి నివేదిక ప్రకారం 2014 నుండి మరీ ముఖ్యంగా 2017 తర్వాత ప్రభుత్వం అనుసరిస్తున్న కశ్మీర్ వ్యతిరేక విధానాల వల్ల హింసాకాండ పెచ్చరిల్లిపోయింది. 144 మంది మైనర్ బాలలతో సహా 6,605 మంది రాజకీయ కార్యక్రమాలలో పాల్గొంటున్న కార్యకర్తలను పోలీసులు కస్టడిలోకి తీసుకున్నారు. వారిలో అధిక సంఖ్యాకులు ఇంకా నిర్బంధంలోనే ఉన్నారు. ఆంతరంగిక భద్రతా చట్టం కింద 444 కేసులు నమోదయ్యాయి.

జమ్మూ కశ్మీర్ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం, చివరికి సుప్రీంకోర్టు కూడా వాటి ముందు రాజ్యాంగబద్ధమైన, న్యాయ సమ్మతమైన ప్రశ్నలను పరిష్కరించడానికి చొరవ చూపడం లేదు. జమ్మూ కశ్మీర్ పునర్ వ్యవస్థీకరణ చట్టం – దాని రాజ్యాంగ బద్ధత, 4జి సర్వీసెస్ పునరుద్ధరణ, చట్ట విరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టానికి సవరణలు, మానవ హక్కుల నిరాకరణ వంటి అంశాలు సుప్రీంకోర్టు ముందు సంవత్సర కాలంగా విచారణకై ఎదురు చూస్తున్నాయి. భారతదేశంలో ఫెడరల్ స్ఫూర్తి బలహీన పడ్డదనడానికి కశ్మీర్ సమస్య బలమైన తార్కాణం. జమ్మూ కశ్మీర్‌లో ప్రధాన స్రవంతి రాజకీయాలు కనుమరుగైపోయాయి. కశ్మీర్‌ను అసంగతమైన మార్పులకు గురిచేసి ఒక సంవత్సర కాలం గడిచిన పిదప కేంద్ర ప్రభుత్వం అక్కడికి లెఫ్టినెంట్ గవర్నర్‌గా మాజీ కేంద్ర మంత్రి మనోజ్ సిన్హాను నియమించింది. యుక్త వయస్సులోనే ఆర్ఎస్ఎస్, బిజెపిలతో సంబంధం ఏర్పరచుకున్న మనోజ్ సిన్హా రామాలయ ఉద్యమంలో, మండల్ సిఫారసులకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమాలలో చురుకుగా పాల్గొన్న వ్యక్తి. అంటే బిజెపి ప్రణాళికను నియమబద్ధంగా అమలు పరచడానికి వీలుగా ఈయనను ఆ రాష్ట్ర పరిపాలకుడిగా కేంద్రం పంపిందని అనుకోవచ్చు. కశ్మీర్ లోయలో అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య తగ్గించి, ఆ మేరకు జమ్మూలో వాటి సంఖ్య పెంచాలన్న దురాలోచనలో బిజెపి ఉన్నట్లు కనిపిస్తున్నది. అందుకనేమో మనోజ్ సిన్హాను గవర్నర్‌గా నియమించడానికి ముందు ఢిల్లీ ప్రభుత్వం కశ్మీర్‌లో అసెంబ్లీ సీట్ల పునర్విభజన గురించి ప్రస్తావన చేసింది.

కశ్మీర్ ప్రజల అభీష్టాలు, ఆపేక్షలు, అభిప్రాయాలకు వ్యతిరేకంగా వారి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను హరించి బిజెపి తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న సందర్భంలో అంతర్జాతీయ సమాజం ప్రేక్షక పాత్ర వహించడం విషాదకరం. తోటి భారత సమాజంలో కూడా ప్రజాస్వామ్య శక్తులు, ప్రతిపక్షాలు మౌనం వహించడమో లేదా నోరెత్తినా బలహీనమైన స్వరంతో స్పందించడమో జరగడం మరింత విషాదకరం. జమ్మూ కశ్మీర్, లధక్‌లు రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజించి ఒక సంవత్సర కాలం పూర్తయిన సందర్భంలో ఐక్యరాజ్య సమితి సెక్యూరిటీ కౌన్సిల్‌లో ఈ సమస్యను లేవనెత్తడానికి చైనా విఫల ప్రయత్నం చేసింది. గత సంవత్సరం ఆగస్టు 16న కూడా ప్రపంచ వేదికపై ఈ సమస్య చర్చలోకి రావాలని చైనా చేసిన ప్రయత్నం ఫలించలేదు. ఈ నేపథ్యంలో కశ్మీర్, జమ్మూ, లధక్ ప్రజలు తమ అస్తిత్వం నిలుపుకోవడానికి పోరాటం చేస్తున్నారు. వారిది మౌన పోరాటమే అయినా స్థిర చిత్తంతోనే ఉన్నారు. న్యాయవ్యవస్థ తమకు అండగా నిలుస్తుందని కొంతమేరకు ఆశతోనే ఉన్నారు. కశ్మీర్ ఆరిపోని అగ్ని గుండంగా మారకుండా ఉండాలంటే భారత ప్రభుత్వం తీసుకోవలసిన తక్షణ చర్యలు: 1) రాజకీయ ఖైదీలను విడుదల చేయడం, 2) జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించడం.

సెక్యులరిజం గురించి రాస్తూ ది హిందూ దినపత్రికలో రాజీవ్ భార్గవ వేసిన ప్రశ్నతో ఈ వ్యాసం ముగించడం సందర్భోచితంగా ఉంటుందని భావిస్తున్నాను. ఆ ప్రశ్న కశ్మీర్ పోరాటం గురించి కూడా సరిపోతుంది.

'భారతదేశంలో దేనినైనా పూర్తిగా నిర్మూలించడం సాధ్యమా? అది మౌనంగా ఉండవచ్చు. నిజమే. తాత్కాలికంగా అది అజ్ఞాతంలోకి వెళ్లిపోవచ్చు. తలవంచుకొని మరో పేరుతో, మరో రూపంలోకి మారిపోవచ్చు. కాని, ఎప్పటికీ ఏదో శాశ్వతంగా నిష్క్రమించదు'.

(రచయిత జూనియర్ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్) వీ

ఏపి ప్రభుత్వ రాజ్యాంగ ఉల్లంఘనలు

ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం అధికారాన్ని అడ్డం పెట్టుకొని రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతుండడాన్ని హైకోర్టు, సుప్రీం కోర్టు తీర్పులు వెల్లడిస్తున్నాయని అంటున్నారు **చిమ్మె జాన్ బర్నబాస్**

ఆంధ్రప్రదేశ్ ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేసి రిటైర్డ్ అయిన జస్టిస్ ఈశ్వరయ్య ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్నత విద్యాశాఖ నియంత్రణ మండలి ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. రాయచోటిలో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్‌గా పనిచేస్తూ సస్పెండ్ అయిన ఎస్. రామకృష్ణ జస్టిస్ ఈశ్వరయ్య మధ్య ఇటీవల జరిగిన సెల్‌ఫోన్ సంభాషణలు ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ద్వారా దేశ వ్యాప్తంగా ప్రచారంలోకి వచ్చింది. ఇది న్యాయ వ్యవస్థలో జరిగిన, జరుగుతున్న అనేక విషయాలపై ప్రస్తుతం అధికారంలో ఉన్న ఒక రాజకీయ పార్టీకి చెందిన వ్యక్తులు ఏ విధంగా న్యాయ వ్యవస్థపై కుట్ర పన్నుతున్నారో తెలియజేస్తుంది.

ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో రిజిస్ట్రార్ జనరల్‌గా విధులలో ఉంటూ 'కరోనా'తో మరణించిన బి. రాజశేఖర్ మరణంపై కూడా ఇటీవల సుప్రీంకోర్టుకు, రాష్ట్రపతికి ఫిర్యాదు చేసిన నేపథ్యం కూడా ఫోన్ సంభాషణల్లో బహిర్గతమైంది. ఆల్ ఇండియా బి.సి. ఫెడరేషన్ పేరుతో హన్స్‌రాజ్ అనే వ్యక్తి ద్వారా తానే ఈ పిటిషన్‌ను పెట్టించానని ఈశ్వరయ్య ఫోన్ సంభాషణలలో బహిర్గత పరచడం; ఒక రిటైర్డ్ న్యాయమూర్తి ప్రస్తుత చీఫ్ జస్టిస్ పైన పిటిషన్‌లు పెట్టించే అవసరం ఎందుకొచ్చిందనేది మనముందు ఉన్న ప్రశ్న? కేవలం ప్రస్తుతం ఈశ్వరయ్య పనిచేస్తున్న ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా నియంత్రణ మండలి అనే కేబినెట్ ర్యాంక్ పదవిని పొందినందుకు కృతజ్ఞతగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దగ్గర మరింత చనువు పెంచుకునేందుకు రామకృష్ణ అనే వ్యక్తిని ఒక పావుగా వాడుకోదలిచాడు. ఎలాగూ రామకృష్ణ ఇబ్బందులలో ఉన్నాడు కాబట్టి, సానుభూతి వ్యక్తం చేసినట్లూ ఉంటుంది, అట్లానే ఆయనను లొంగదీసుకునే ప్రయత్నం చేయొచ్చనే ఒక కుట్రతో రామకృష్ణతో జస్టిస్ ఈశ్వరయ్య జరిపిన సెల్‌ఫోన్ సంభాషణ ద్వారా ఈ విషయం బహిర్గతమైంది. అవసరమనుకుంటే ముఖ్యమంత్రి వద్దకు తాను తీసుకొని వెళ్లి, ఏదో ఒక రకమైన సహాయం చేయిస్తానని నమ్మబలకడం, ప్రస్తుతం హైకోర్టు – సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు సంబంధించిన రహస్య సమాచారం ఏమైనా ఉంటే తీసుకొని రావాలని కోరడం జస్టిస్ ఈశ్వరయ్య స్థాయికి తగని విషయం అయినా, ఆయన ఎవరి ప్రయోజనాలకొరకు ఈ విధంగా చేశాడనేది తెలియవలసి ఉంది. అంతే కాకుండా ఇటీవల దాదాపు 65–70 కేసులలో రాష్ట్ర హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పులివ్వడంతో; వాటిని దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కూడా ఆమోదించడం ఈ రాష్ట్ర ప్రభుత్వానికి దిక్కుతోచని పరిస్థితి నెలకొనింది. కొన్ని వందల కోట్లను వెచ్చించినప్పటికీ, పేరు ప్రతిష్టలున్న న్యాయ కోవిదులతో వాదనలు వినిపిస్తున్నప్పటికీ ఈ విధంగా తీర్పులు రావడం, అధికారంలో ఉన్న పార్టీ నేతలకు మింగుడుపడడం లేదు. కాబట్టే జస్టిస్ ఈశ్వరయ్య ద్వారా చీఫ్ జస్టిస్‌ను బెదిరించడానికి ఒక ప్రయత్నం చేశారని ఆయన మాటల్లోనే ప్రస్ఫుటమవుతున్నది. అంతేకాకుండా రాష్ట్ర హైకోర్టు న్యాయ మూర్తులనూ, సుప్రీంకోర్టు న్యాయమూర్తులనూ భారత రాష్ట్రపతి నియమిస్తారు కాబట్టి రాష్ట్రపతికి కూడా ఒక ఫిర్యాదు చేశారు. భారత రాజ్యాంగం ప్రకారం నియమించబడిన హైకోర్టు/సుప్రీంకోర్టు న్యాయ మూర్తులనే బెదిరింపులకు గురిచేసే పరిస్థితి ఉన్నదంటే ఈ రాష్ట్రంలో సామాన్య పౌరుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉంటున్నదో అర్థం చేసుకోవచ్చు.

పరిపాలనా పరమైన అంశాలలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చాలా విషయాలలో రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడినట్లు ఇటీవల వచ్చిన కొన్ని హైకోర్టు – సుప్రీంకోర్టు తీర్పులను బట్టి అర్థం చేసుకోవచ్చు. గ్రామ సచివాలయాలకు మూడు రంగులైన వారి పార్టీ రంగులు వేయడం (నీలం–తెలుపు–ఆకుపచ్చ) తిరిగి వాటిపై రాష్ట్ర హైకోర్టు – సుప్రీంకోర్టు చేత చివాట్లు తినడంతో తిరిగి వాటిని తుడిచివేయడానికి కొన్ని వందల కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చింది. అంతే కాకుండా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్‌కుమార్‌పై స్థానిక సంస్థల ఎన్నికలు రద్దుచేశారనే నెపంతో హైకోర్టును ఆశ్రయించి ఆయనను పదవి నుంచి తొలగించి వేయగా, సుప్రీంకోర్టులో నిమ్మగడ్డ రమేశ్‌కుమార్‌ను నియమించాలనే ఉత్తర్వుతో ఖంగుతిన్న రాష్ట్ర ప్రభుత్వం తిగిరి ఆయనను నియమించవలసి వచ్చింది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పదవీ కాలాన్ని 5 సంవత్సరాల నుంచి 3 సంవత్సరాలకు కుదించడం అనే ఆర్డినెన్స్‌పై సంతకం చేయడం ద్వారా ఆంధ్రప్రదేశ్ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ కూడా విమర్శలకు గురికావలసి వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం మాట విని నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ స్థానంలో (చెన్నై) మద్రాస్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ కనకరాజ్‌ను నియమించినందుకు హైకోర్టు కూడా ఆ నియామకాన్ని తప్పుపట్టింది. అంతే కాకుండా పాఠశాల స్థాయిలో బోధనా మాధ్యమంగా 'తెలుగు'ను కొనసాగించాలని రాజ్యాంగం నిర్దేశిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టింది. ఈ విషయంలో కూడా సుప్రీంకోర్టు వరకు రాష్ట్ర ప్రభుత్వం వెళ్లింది. చివరికి పిల్లల/తల్లిదండ్రుల అభీష్టం మేరకు బోధనా మాధ్యమాన్ని కొనసాగించు కోవచ్చని సుప్రీంకోర్టు తీర్పునివ్వడంతో రాష్ట్ర ప్రభుత్వం తన విధానాన్ని మార్చుకోవలసి వచ్చింది. ఈ విధంగా పరిపాలనా పరమైన విషయాలలో రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగ ఉల్లంఘనలకు పాల్పడుతూ ఉన్నత న్యాయ స్థానాల చేత ఛీవాట్లు తింటూ తిరిగి తామే మంచి పనులు చేస్తుంటే కొంతమంది మాకు వ్యతిరేకంగా కోర్టులను ఆశ్రయిస్తున్నారంటూ

దుష్ప్రచారం చేస్తున్నారు. అది ఎంతవరకు పోయిందంటే తీర్పులిచ్చే న్యాయమూర్తులను వివిధ రకాలుగా మానసికంగా హింసించే విధంగా వై.కా.పా. ప్రజా ప్రతినిధులు, వారి 'సోషల్ మీడియా' ప్రతినిధులు సెల్‌ఫోన్‌లలో సంక్షిప్త సమాచారం పంపించారు. కరోనా రోగులున్న గదిలో హైకోర్టు న్యాయమూర్తులను విడిచిపెట్టి బంధించాలని అన్నారు. అంతే కాకుండా వారికి 'కులాన్ని' ఆపాదించారు. అసలు విషయాన్ని పక్కకు పెట్టి న్యాయమూర్తుల కుటుంబ సభ్యులు బాధపడే విధంగా 'ట్వీట్‌లు' పెట్టేశారు. చివరకు హైకోర్టు న్యాయమూర్తుల ఫోన్‌లను 'ట్యాప్' చేస్తున్నారని ఇటీవలే బయటపడింది (2020 ఆగస్టు 15న). దీనిపై రాష్ట్ర హైకోర్టు కూడా విచారణకు ఆదేశించింది.

న్యాయమూర్తుల ఫోన్ల ట్యాపింగ్ వ్యవహారంపై రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఆర్.వి. రవీంద్రన్ నేతృత్వంలో విచారణ కమిటీ ఏర్పాటు చేసింది. సి.బి.ఐ., ఇంటలిజెన్స్ బ్యూరో (ఐబి) ఇందుకు సహకరించాలనీ, నాలుగు వారాలలోగా నివేదిక రాష్ట్ర హైకోర్టుకు సమర్పించాలనీ ఆదేశించింది. ప్రణాళికా బద్ధంగానో, మరో విధంగానో హైకోర్టు ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం జరిగింది. అంతే కాకుండా ప్రస్తుత సుప్రీంకోర్టు జడ్జి ఎన్.వి. రమణపై ఏమైనా సాక్ష్యాధారాలు ఉన్నాయో తనకు తెచ్చివ్వాలని జస్టిస్ ఈశ్వరయ్య, జూనియర్ సివిల్ జడ్జి రామకృష్ణను అడగడం వెనుక ఏదైనా కుట్రకోణం ఉందో బయటపెట్టడానికి, న్యాయ వ్యవస్థ 'విశ్వసనీయత'పై ప్రజలలో నమ్మకం సన్నగిల్లే ప్రమాదం ఉన్నదనే కోణంలో విచారణ జరపాలని హైకోర్టు జస్టిస్ రవీంద్రన్ కమిటీ ఏర్పాటు చేసింది రాష్ట్ర హైకోర్టు.

వాస్తవానికి ఇప్పటికే బెంగుళూరులోని 'ట్రూత్ ల్యాబ్' ఒరిజినల్ ఆడియోను పరీక్షించి, అందులో నమోదైన వాయిస్ వారిరువురివేనని రుజువు పరిచింది. అయినప్పటికీ రాష్ట్ర హైకోర్టు విచారణలో భాగంగా మరోసారి పరిశీలించడానికి జస్టిస్ రవీంద్రన్ కమిటీకి అప్పజెప్పింది. ఇప్పుడు ప్రభుత్వం ఫోరెన్సిక్ లాబొరేటరీ ద్వారా పరీక్షిస్తారు. అంతే కాకుండా ప్రభుత్వ గైడ్‌లైన్స్ – 2006 ప్రకారం వాయిస్‌ను స్క్రిప్ట్ రూపంలో అనగా రాత మూలకంగా, ప్రశ్న – జవాబు రూపంలో ఇరువురికీ ఇచ్చి, వేరువేరు గదులలో కూర్చోబెట్టి ధ్వని (వాయిస్) రికార్డ్ చేస్తారు. మొదటి వాయిస్, ఇప్పుడున్న వాయిస్ ఒక్కటేనా కాదా? అన్నది తేల్చుతారు. ఏమైనా కలిపారా? మొత్తం ట్యాంపరింగ్ చేశారా? అన్నది కూడా పరిశీలిస్తారు. మొత్తం మీద జస్టిస్ ఈశ్వరయ్య హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై తానే హన్స్‌రాజ్ ద్వారా ఫిర్యాదు చేయించానని ఒప్పుకున్నాడు కాబట్టి దానిపై తీవ్రమైన చర్యలు ఉండే అవకాశం లేకపోలేదు. అంతే కాకుండా దీనిపై హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టి తాను రామకృష్ణతో మాట్లాడిన విషయం వాస్తవమేనని ధృవీకరించాడు. కానీ కొన్ని దాటవేత సమాధానాలు ఇచ్చాడు. ఆరోపణలు ఎదర్కొంటున్న మాజీ న్యాయమూర్తి జస్టిస్ నాగార్జునరెడ్డిని 'వాడు ఒక చచ్చిన పాము, ఎంతో మంది జీవితాలతో వాడు ఆడుకున్నా'డంటూ వ్యాఖ్యానించాడు. కాబట్టి జస్టిస్ నాగార్జునరెడ్డిపై ఇప్పటికే రామకృష్ణ ఫిర్యాదు చేసి ఉన్నాడు కనుక ఆ ఫిర్యాదుకు సంబంధించిన విచారణలో అవసరమనుకుంటే జస్టిస్ ఈశ్వరయ్య పైన కూడా విచారణ జరుపవలసి ఉంటుంది. ఎంతో మంది జీవితాలను జస్టిస్ నాగార్జునరెడ్డి నాశనం చేసినాడనే విషయాన్ని జస్టిస్ ఈశ్వరయ్య ఒప్పుకున్నట్లే. అంతే కాకుండా ఇక్కడ రామకృష్ణకు న్యాయం జరగవలసి ఉంది. జస్టిస్ నాగార్జునరెడ్డి బాధితులలో రామకృష్ణ కూడా ఒక్కడు కాబట్టి రామకృష్ణను కాపాడుకోవలసి ఉంది. రామకృష్ణ దళితుడు కాబట్టి అతనిని అనేక విధాలుగా జస్టిస్ నాగార్జునరెడ్డి వేధింపులకు గురిచేశాడు. రామకృష్ణ రాయచోటిలో జూనియర్ సివిల్ జడ్జిగా పనిచేసే సమయంలో జస్టిస్ నాగార్జునరెడ్డి, సోదరుడు కలిసి రామకృష్ణపై దాడి చేసినట్లు ఎస్‌సి/ఎస్‌టి కేసు నమోదయి, విచారణ ఆరంభ దశలోనే తొక్కిపెట్టేసినట్లు రామకృష్ణ నాగార్జునరెడ్డిపై అప్పటి హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి ఫిర్యాదు కూడా చేశాడు.

మొత్తం ఈ వ్యవహారంలో తన ఉద్యోగాన్ని గత 8 సంవత్సరాల నుండి కోల్పోయి కేవలం 30 శాతం జీతంతో తన కుటుంబాన్ని నెట్టుకొస్తున్న జూనియర్ సివిల్ జడ్జి రామకృష్ణ; మొత్తం న్యాయ వ్యవస్థలో కింది స్థాయి న్యాయాధికారులపై హైకోర్టు న్యాయ మూర్తులు ఏ విధంగా ప్రవర్తిస్తుంటారనే విషయం బహిరంగ పరిచాడు. అంతే కాకుండా జస్టిస్ నాగార్జునరెడ్డి హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నప్పుడే పార్లమెంట్ ద్వారా పదవీచ్చుతున్ని చేసే ప్రక్రియను ప్రారంభించారు. రెండుసార్లు పార్లమెంట్‌లో 'అంశం'గా నమోదయి, చర్చకు వచ్చే సందర్భంలో పార్లమెంట్ సభ్యులే మళ్లీ తమ అనుమతులను వెనక్కి తీసుకున్నారు. అనగా చర్చకు రావడానికి సంతకాలు చేసినవారే మళ్లీ తమకు ఇష్టం లేదన్నట్లుగా వద్దనుకుంటున్నట్లు రాజ్యసభలో 'విత్‌డ్రా' చేసుకున్నారు. ఇది భారతదేశ న్యాయ వ్యవస్థ చరిత్రలో ఒక చీకటి కోణం. ఎలాననగా జస్టిస్ నాగార్జునరెడ్డి పార్లమెంట్ సభ్యులను డబ్బుతో కొన్నారనీ, అందులో ముగ్గురు పార్లమెంట్ సభ్యులున్నారనీ, అదేరోజు ఢిల్లీలోని ఒక హోటల్‌లో 60 లక్షల రూపాయల నగదును అక్కడి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు సీజ్ చేసినట్లు కూడా వార్తలలోకి వచ్చింది. డబ్బులతో దొరికిన వారు జస్టిస్ నాగార్జునరెడ్డికి చెందిన వారని కూడా బహిర్గతమైంది. అంతే కాకుండా 8 సంవత్సరాలైనప్పటికీ జూనియర్ సివిల్ జడ్జి రామకృష్ణను ఉద్యోగంలోకి తీసుకోకుండా 'విచారణ' పూర్తికాలేదనే నెపంతో తనకు పూర్తి జీతం ఇవ్వకుండా రాష్ట్ర హైకోర్టు పరిపాలనా విభాగం కూడా ఒక విధంగా తాత్సారం చేయడం వెనుక జస్టిస్ నాగార్జునరెడ్డి ఉన్నాడనేది బహిరంగ రహస్యమే. ఇన్ని విషయాలు బయటికి రావాలంటే జస్టిస్ ఆర్.వి. రవీంద్రన్ గారు సమగ్రమైన విచారణ జరపాలి. జస్టిస్ ఈశ్వరయ్య – రామకృష్ణల మధ్య సంభాషణల నేపథ్యంలో 'నార్కో అనాలిసిస్' టెస్ట్ ఇరువురికీ నిర్వహిస్తే చాలా విషయాలు వెలుగులోకి వస్తాయి. మొత్తం న్యాయ వ్యవస్థలో జరుగుతున్న భాగోతాలన్నీ బహిరంగ పరచబడాలి.

'చట్టం ముందు అందరూ సమానులే' అనే ఆర్టికల్ 14 భారత రాజ్యాంగం కల్పించింది కాబట్టి న్యాయ వ్యవస్థలో జరుగుతున్న లోపాలన్నీ బయటికి రావాలి. ఏయే సమస్యలు న్యాయ వ్యవస్థలో అంతర్గానమై పనిచేస్తున్నాయో, కుల దురహంకారం, ఆర్థిక విషయాలు, అధికార దర్పం, అధికారంలో ఉన్న రాజకీయ పార్టీల జోక్యం ఏ విధంగా ఉందో, ప్రస్తుత పరిస్థితులలో అన్నీ బహిర్గతమవ్వాలి. జస్టిస్ ఈశ్వరయ్య, రామకృష్ణల సంభాషణ మొత్తం సమాజాన్నే ప్రభావితం చేస్తున్నది కాబట్టి, దీనిపై సమగ్ర దర్యాప్తు జరగాలి. సామాన్యునికి ఒక న్యాయం, న్యాయ వ్యవస్థలో భాగమైన వారికి మరో న్యాయంగా ఉండరాదు. అన్నింటికన్నా ముఖ్యంగా భారత రాజ్యాంగం స్ఫూర్తి, విలువలు పరిరక్షించబడాలి.

(రచయిత న్యాయవాది, ఒపిడిఆర్ రాష్ట్ర కమిటీ సభ్యులు) వీ

షికారీ చినబాబుది కులహత్యే

దళితులైన షికారీల భూములను అగ్ర కులస్తులు కబ్జా చేసి, ఎదిరించిన వారిని హత్యలు చేస్తున్నారనీ, ఈ దుర్మార్గాలకు ప్రభుత్వాలు కూడా సహాయం అందిస్తున్నాయనీ అంటున్నారు ఎం.కె. కుమార్

స్వాతంత్ర్యం వచ్చి ఏడు దశాబ్దాలు గడుస్తున్నా భూమి లేని నిరుపేదలు 60 శాతానికి పైగా దేశంలో ఉన్నారు. కొంతమంది దళితులు భూమిని సాగుచేసుకుంటున్నా దళారీలు వారి భూమిని కబ్జా చేస్తున్నారు. వాళ్లను వారి స్వంత భూముల నుండే వెళ్లగొడుతున్నారు. చివరకు దళారీలు, ప్రభుత్వం అండతో దళితులను చంపేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. చిత్తూరు జిల్లాలోను అదే జరిగింది.

భూమి కోసం గిరిజనుడిని దారుణంగా హత్య చేశారు. చిత్తూరు జిల్లా, ఏర్పేడు మండలం, చింతలపాళెం పంచాయతీ మరాఠీపురానికి చెందిన 112 షికారీ కుటుంబాలకు ప్రభుత్వం భూములు కేటాయించింది. 1971 నుంచి మూడు విడతలుగా సుమారు 560 ఎకరాలను ప్రభుత్వం పంపిణీ చేసింది. షికారీలకు చదువు రాకపోవడాన్ని ఆసరాగా చేసుకొని చింతలపాళేనికి చెందిన కొంతమంది ఆ 560 ఎకరాల భూమిని కాజేశారు. ఏకంగా వారి పలుకుబడితో పట్టాలు సంపాదించారు. తర్వాత విషయం తెలుసుకున్న షికారీలు లబోదిబోమంటూ ప్రభుత్వ అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయింది. దీంతో 2006 నుంచి షికారీలు తమ భూమి కోసం పోరాటం చేస్తున్నారు. ఆగస్టు 7న షికారీలు గ్రామ సమీపంలోని పొలాల్లో గుడిసెలు వేశారు. దీన్ని సహించలేని అగ్రకులాల వారు దాడి చేయడంతో 23 మంది షికారీలు గాయపడ్డారు. పోలీసులు ఈ సంఘటనను పట్టించుకోలేదు.

ప్రజా సంఘాలు ఆందోళన చేయడంతో చివరకు పోలీసులు ఆ ఘటనలో 28 మందిపై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసును నమోదు చేశారు. దీంతో షికారీలపై అగ్రకులస్థులు కక్ష కట్టారు. భూ పోరాటంలో కీలక పాత్ర పోషిస్తున్న దబ్బా చినబాబు అలియాస్ బాబ్లీ (36)ని చింతలపాళెం వాసులు లక్ష్యంగా చేసుకున్నారు. ఆగస్టు 11 రాత్రి 7 గంటల ప్రాంతంలో బాబ్లీ బహిర్భూమికని బయటకు వచ్చాడు. అప్పటికే అతని కోసం వేచి ఉన్న చింతలపాళెం గ్రామ అగ్ర కులస్థులు అతన్ని హతమార్చి, పక్కనే ఉన్న చిన్న నీటి గుంతలో పడేశారు. బాబ్లీ సోదరుడు పరుశురామ్ ఫిర్యాదు మేరకు 30 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారిలో అధికార పార్టీ వైసిపి నాయకుడు, మాజీ ఎంపిటిసి సభ్యుడు రమణయ్య యాదవ్‌ను ప్రథమ నిందితుడి (ఎ1)గా పోలీసులు పేర్కొన్నారు.

ఏర్పేడు మండలం, చింతలపాళెం పంచాయితీ, మరాఠీపురం గ్రామంలో 112 కుటుంబాలు ఎస్‌టి షికారులు నివసిస్తున్నారు. 1971లో 560 ఎకరాల భూమిని ప్రభుత్వం వారికి పంచి పట్టాలు కూడా ఇచ్చింది. భూమి మంచి వ్యాపార వస్తువుగా మారడం, రియల్ ఎస్టేట్ పుంజుకోవడంతో ఆ భూముల ధరలకు రెక్కలొచ్చాయి. ఆ ప్రాంతంలో ఎయిర్ పోర్టు, మన్నవరం సెజ్ కూడా ఉండడంతో ఆ భూముల విలువ వందల కోట్లకు పెరిగింది. దాంతో చింతలపాళెం అగ్రకులాల వారు ఆ భూమిని ఎలాగైనా లాక్కోవాలని పథకాలు రంచించారు. వాళ్ల ఉద్దేశం ఏంటంటే, షికారీలు మరాఠీ రాష్ట్రం నుండి వలస వచ్చారు. ఈ ప్రాంతం వారు కాదు. వారికి తెలుగు, ఇంగ్లీషు చదవడం, రాయడం రాదు. కాబట్టి ప్రాంతీయ విబేధాలను రెచ్చగొట్టారు. చుట్టుపక్కల గ్రామాలలోని అగ్రకులస్థులను తమకు మద్దతుగా కలుపుకున్నారు. 14 సంవత్సరాల నుండి అనేక విధాల ప్రయత్నం చేస్తున్నారు. ఆ భూములపై హక్కుదారులను మేమేనని షికారీలు చూపిస్తున్న పత్రాలు, మాటలను ప్రభుత్వ అధికారులు పెడచెవిన పెట్టారు.

విసిగిపోయిన ఎస్‌టిలు 2014లో హైకోర్టులో కేసు వేశారు. కోర్టులోనే కేసు వేసే ధైర్యం షికారీలకు వచ్చిందా అని అగ్రకులస్థులు మరింత రెచ్చిపోయారు. షికారీలను ఇబ్బంది పెట్టడం, వారిపై అడపా దడపా దాడులు చేయడం ప్రారంభించారు. అయినా వారు లొంగలేదు. దీంతో మరింత రెచ్చిపోయిన అగ్రకులస్థులు 2017లో దాదాపు 200 మందిని కూడగట్టుకుని ఎస్‌టి కాలనీపై దాడి చేశారు. ఈ దాడిలో 25 మంది షికారీలకు బాగా దెబ్బలు తగిలాయి. చివరకి ప్రజా సంఘాలు చొరవతో ఏర్పేడు పోలీసు స్టేషన్లో కేసు పెట్టడం జరిగింది. ఎస్‌టి, ఎస్‌టి చట్ట ప్రకారం కేసు కట్టారు. అయినా పోలీసులు ఇప్పటివరకు నిందితులను అరెస్టు చేయలేదు. వారంతా బహిరంగంగా తిరుగుతూ షికారీలపై దాడులు చేస్తూనే ఉన్నారు. నిందితులు అగ్రకులానికి చెందినవారు. పైపెచ్చు అధికార పార్టీ అండదండలు ఉండడంతో పోలీసులు తమ నిస్సహాయితను పరోక్షంగా వ్యక్తం చేశారు.

ఇప్పటికి వారిని అరెస్టు చేయకపోవడం వలన చట్టంపై గౌరవం, భయం లేని అగ్రకులాల వారు మరింత రెచ్చిపోయారు. పోలీసులు అప్పుడే వారిని అరెస్టు చేసి ఉంటే బాబ్లీ హత్య జరిగి ఉండేది కాదు. దీంతో షికారీలు మరింత భయభ్రాంతులకు గురయ్యారు. విధిలేని పరిస్థితుల్లో అమరావతిలో 2019లో ధర్నా చేశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. వినతిపత్రం సమర్పించారు. వెంటనే ముఖ్యమంత్రి స్పందించి న్యాయం చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ అధికార యంత్రాంగం కూడా వెంటనే స్పందించింది. దీనిపై తక్షణం స్పందించాల్సిందిగా 13 జనవరి 2020న చిత్తూరు కలెక్టర్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. ఈ ఆదేశాలను కలెక్టరు ఎంఆర్‌ఓకు పంపించారు. కాని ఎంఆర్‌ఓ

బాధితులకు న్యాయం చేయలేదు. పైపెచ్చు నిందితులకు అనుకూలంగా వ్యవహరించారు. ఇప్పటికి 8 నెలలు అయినా నిందితులైన అగ్రకులాల వారికి కనీసం నోటీసులు కూడా ఇవ్వలేదు.

సమస్యపై ఎంత పోరాటం చేస్తున్నా సమస్య మరింత జఠిలం అవుతోంది. కాని షికారీల భూములపై వారికి హక్కులు రాలేదు. అయినా వారు ప్రజాస్వామ్య బద్ధంగా, న్యాయబద్ధంగా పోరాటం చేస్తూనే ఉన్నారు. భయపడిన షికారీలను చూసి అగ్రకులాల వారు ఎలాగైనా షికారీలపై భౌతిక దాడులు మళ్లీ చేయాలని తీర్మానించుకున్నారు. 2020 ఆగస్టు 9న దాదాపు 250 మంది అగ్రకులాల వారు ఎస్‌టిలపై దాడికి వ్యూహం రచించారు. చింతలపాళెం చెక్ పోస్టు వద్ద ఆటోలలో వస్తున్న ఎస్‌టిలను ఆపి వారిపై భౌతిక దాడికి దిగారు. ఈ దాడిలో దాదాపు 23 మందికి తీవ్రంగా దెబ్బలు తగిలాయి. రక్తపు గాయాలతోనే పోలీసు స్టేషన్‌కు వెళ్లారు. మళ్లీ కేసు పెట్టారు. పాత కేసుకే దిక్కులేదు. అయినా మళ్లీ కేసు పెట్టారు. షికారీలు ఎక్కడా చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోలేదు. రాజ్యాంగాన్ని, చట్టాన్ని గౌరవిస్తూనే ఉన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థపై అత్యంత విశ్వాసాన్ని, నమ్మకాన్ని ఉంచారు. అయినా ప్రభుత్వం ఇక్కడ ప్రజాస్వామ్యం లేదు, నిరంకుశత్వం, కుల పెత్తనం మాత్రమే ఉందని మరోమారు రుజువు చేసింది. కేసు రిజిస్టరు చేసినా నిందితులను ఎవ్వరినీ పోలీసులు అరెస్టు చేయలేదు. ఇంత జరిగినా షికారీలకు రక్షణను కలిపించలేదు.

అగ్రకులాల వారు షికారీలను తీవ్రంగా బెదిరింపులకు గురిచేశారు. 48 గంటలలోపు ఊరు విడిచి పారిపోవాలని ఆదేశించారు. భూములను ఉన్నపళంగా విడిచిపోవాలని, లేనిపక్షంలో అందర్నీ చంపేస్తామని బెదిరించారు. అయినా పోలీసులపై, ప్రభుత్వంపై నమ్మకాన్ని కోల్పోలేదు. పోలీసులను తమ రక్షణకు రమ్మన్నారు. పోలీసులు పట్టించుకోలేదు. 48 గంటలు గడిచిన వెంటనే అగ్రకులాలు తమ బెదిరింపులకు కార్యరూపం ఇచ్చారు. 2020 ఆగస్టు 11న అతి కిరాతకంగా ఎస్‌టి షికారి గిరిజనుడు డబ్బా చినబాబును దారుణంగా నరికి చంపారు. మరాఠీపురం సమీపంలో ఉన్న సోమశిల స్వర్ణముఖి కాల్వ పక్కన ఈ హత్య జరిగింది.

రాష్ట్రంలో దళితులపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. పేదలైన దళితులకు ప్రభుత్వం ఇచ్చిన భూములను దళారీలు లాక్కుంటున్నారు. ప్రశ్నిస్తే, దళితులకు భూములెందుకని ఎద్దేవా చేస్తున్నారు. లక్ష్మింపేట లోనూ ఇదే జరిగింది. శిరోముండనం కేసులో దళితుడు తనకు న్యాయం జరగలేదని, తాను మావోయిస్టుల్లో చేరడానికి అనుమతి ఇవ్వాలని రాష్ట్రపతికి లేఖ రాశారు. అమరావతిలో రైతులు తమకు అన్యాయం చేశారని, తీవ్రవాదుల్లో చేరతామని లేఖలు రాస్తున్నారు. వీటన్నిటిపై ప్రభుత్వాలు తగిన విధంగా స్పందిచడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో షికారీలకు న్యాయం జరుగుతుందా అనే ప్రశ్నకు లేదనే జవాబు చెప్పాలి. ప్రజా సంఘాలు ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఉద్యమిస్తున్నా పాలకులకు చీమ కుట్టినట్టు లేదు. హైకోర్టునే ధిక్కరిస్తున్న ప్రభుత్వానికి ఈ అంశం చాలా చిన్నది. కాని ప్రజల దృష్టిల్లో ప్రజాస్వామ్య మనుగడకు సంబంధించిన విశ్వాసం క్రమంగా సన్నగిల్లడానికి ప్రభుత్వపు ప్రేక్షకపాత్ర ఊతమిస్తుంది.

సర్వే నంబర్ 377లో మూడు విడతలుగా ప్రభుత్వం 112 మంది షికారీ కుటుంబాలకు డికేటి పట్టాలు ఇచ్చింది. మొత్తం 560 ఎకరాలు ఇచ్చారు. చింతలపాళెం మాజీ ఎంపిటిసి రమణయ్య యాదవ్ అనుచరులు, ఇతర పెత్తందారులు ఆ భూములను కబ్జా చేసేశారు. తప్పుడు రికార్డులు సృష్టించి అమ్ముకున్నారు. అగ్రకులాల దాష్టీకం వల్లే షికారీ బాబ్జీ దారుణ హత్యకు గురయినా ప్రభుత్వం పట్టించుకోలేదు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపి, హంతకులను అరెస్టు చేయాలని దళిత, ప్రజా సంఘాలు డిమాండ్ చేశాయి. ఎస్‌టి యువకుడు దారుణ హత్యకు గురైతే కలెక్టర్ గానీ, ఎస్‌పి గాని ఎందుకు రాలేదు. అదే అగ్రకులాల వారికి జరిగి ఉంటే ఆగమేఘాలపై వచ్చి అండగా ప్రభుత్వం నిలుస్తుంది. ఈ భూములకు సంబంధించి కలెక్టర్ ఆగస్టు 13న ఆర్డర్ ఇచ్చారు. ఇంతవరకు రెవెన్యూ వారు ఎందుకు స్పందించలేదని సంఘాలు ప్రశ్నించాయి. గత కొన్ని సంవత్సరాలుగా షికారీలపై దౌర్జన్యాలకు పాల్పడుతున్నా పోలీసులు ఎందుకు పట్టించుకోలేదన్నారు. అగ్రకులస్థులు దాడి చేసి బాబ్జీని చంపేస్తే, పోలీసులు దాన్ని షికారీల మధ్య గొడవలుగా చిత్రీకరించడానికి ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

ప్రభుత్వం షికారీలకు 1980లో భూములు ఇచ్చింది. అయితే ప్రభుత్వమే వాటిని తిరిగి రద్దు చేసింది. ఆ రద్దు చేసిన భూములను యాదవులైన రైతులకు ఇచ్చింది. దాన్ని కొంతమంది అమ్ముకున్నారు. మరి కొంతమంది సాగుచేసుకున్నారు. అయినా షికారీలు ఆ భూములు మావే అంటున్నారు.

1975 ప్రాంతంలో షికారీలు ఈ ప్రాంతానికి వచ్చారు. వారిని ఆధరించింది మా ముందరి తరం వారే. కొన్ని వందల సంవత్సరాలుగా మేము చింతలపాళెంలోనే నివసిస్తున్నాం. మా తాతల నాటి నుండి వ్యవసాయం చేసుకుంటున్నాం. అయినా షికారీలతో మేము సఖ్యతతోనే ఉన్నాం. షికారీల భూములను ప్రభుత్వం వెనక్కి తీసుకుంది. అయినా వారు హైకోర్టుకు పోయారు. తీర్పు ఇంకా రావలసి ఉంది. మేము హైకోర్టు తీర్పుకు కట్టుబడి ఉంటాం.

షికారీలకు ప్రభుత్వం 1980లో భూములు ఇచ్చింది వాస్తవమేనని ప్రభుత్వ అధికారులు చెప్పారు. అనంతరం ఈ భూములను రద్దు చేసి చింతపాళెంకు చెందిన యాదవులకు (రైతులకు) ప్రభుత్వం పంపిణీ చేసింది. హత్య భూవివాదంలో జరిగిందా, లేక షికారీల మధ్య గొడవలతో జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తారు. మృతుని తలకు బలమైన గాయాలున్నట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని తీసేది లేదని షికారీలు ఆర్డీవోను అడ్డుకుంటే భూములిచ్చేట్టు చూస్తామని ప్రభుత్వం చెప్పింది. ఆర్‌డిఓ, కలెక్టర్ నారాయణ భరత్‌గుప్తా ఆదేశాల మేరకు ఆగస్టు 17న రెవెన్యూ అధికారులు భూములను పరిశీలిస్తారని చెప్పారు. కాని చేయలేదు. హత్యకు భూ వివాదం కారణమా, ఇరు వర్గాల మధ్య ఉన్న ఘర్షణలు కారణమా అనే అంశం దర్యాప్తులో తేలవలసి ఉంది.

అసలు సమస్యకు కారణం భూమి అని రూపంలో కనిపిస్తుంది. పేదలకు వ్యవసాయ భూమి లేదు. మరోవైపు ప్రభుత్వమే ల్యాండ్ బ్యాంకులను ఏర్పాటు చేస్తోంది. చిత్తూరు జిల్లాలో ఇప్పటికే 3 లక్షల ఎకరాలను ప్రభుత్వం సేకరించింది. వీటిలో కొంత భాగాన్ని ప్రభుత్వం వైఎస్ఆర్ హౌసింగ్ స్కీము కింద పేదలకు ఉచితంగా ఇవ్వాలను

కుంటోంది. ఇది కూడా వివాదాస్పదమవుతోంది. ఇక ఏర్పేడు చట్టుపక్కల ప్రాంతంలో మన్నవరం సెజ్ ఉంది. అంతర్జాతీయ ఎయిర్ పోర్టు ఉంది. ఏర్పేడులోనే రెండు జాతీయ విద్యా సంస్థలను కేంద్రం ఏర్పాటు చేసింది. ఈ నేపథ్యంలో అక్కడ భూముల రేట్లు విపరీతంగా పెరిగిపోయాయి. ఉన్న భూమంతా రియల్ ఎస్టేటు వ్యాపారులు, ప్రభుత్వం లాక్కున్నది. ఇంక పేదలకు భూములు లేవు. సాగు చేసుకోవడం సంగతి అటుంచితే, నివాసానికే భూములు లేని పరిస్థితి నెలకొంది. ఇంక మిగిలింది షికారీల భూములైన 560 ఎకరాలు. మార్కెట్లో దీని విలువ వందల కోట్లు. అందుకే అధికార పార్టీ అండదండలతో ఈ భూములను కాజేయాలని బిసిలైన యాదవులు కుట్రలు పన్నారు. అట్లనీ ఈ ప్రాంత బిసిలందరు భూములు కాజేయాలని అనుకోలేదు. వారిలో చాలా మంది పేదలు ఉన్నారు.

బిసిల్లోని ధనికవర్గం ఈ కుట్రలకు పాల్పడింది. బిసిలందరిలో ప్రాంతీయ తత్వాన్ని, కులతత్వాన్ని రెచ్చగొట్టి సుమారు 250 మందిని పోగు చేయగలిగారు. ఈ కులతత్వమే ఎస్టిలపై దాడులు చేయగలిగింది. అంటే ఇక్కడ భూమిపై పట్టుకోసం కన్నా కులతత్వమే ఎక్కువ పనిచేసింది. దీన్ని కుల హత్యగానే పరిగణించాలి. కాని ప్రభుత్వం దీన్ని భూ తగాదాగా చూడడం లేదు. కేవలం ఘర్షణగానే చూస్తోంది. అదే బిసిలకు ఈ భూములు ఇచ్చి ఉంటే, వారిపై ఎవరైనా దాడులు చేసేవారా. ప్రభుత్వ భూములు తీసుకున్న వారు ఎస్టి షికారీలు కాబట్టే ఈ దాడులు జరిగాయి. చివరకి అగ్రకులస్థులు మారణ హోమాన్ని జరిపారు. 50 సంవత్సరాలకు పైగా నివసిస్తున్న షికారీలు భయంతో, అభద్రతా భావంతో తమ స్వంత స్థలాలలోనే నివసించాల్సి వస్తోంది. దీనికి పూర్తి కారణం ప్రభుత్వమే కులతత్వాన్ని ప్రోత్సహించడం. మరోవైపు కేంద్రం సిఎఎ, పిఎన్ఆర్ లాంటి చట్టాలతో షికారీల వాంటి వారిని ఏకంగా విదేశీయులనే చేసే కుట్రలు పన్నుతోంది.

భూ సంస్కరణలు అమలు కాకపోవడం వల్ల పేదల హత్యలు జరుగుతున్నాయి. ఈ హత్యలకు ప్రభుత్వాలు బాధ్యత వహించాలి. భూమిలేని నిరుపేదలైన దళితులను ఏకంగా అగ్రకులస్థులు కుల దురహంకారంతో ఏకంగా చంపేస్తున్నారు. ప్రభుత్వమే దళితులకు భూములు ఇచ్చినా, వారిని చంపి మరీ అగ్రకులస్థులు భూములు లాక్కుంటున్నారు. 101.4 మిలియన్ల గ్రామీణ భారతీయ కుటుంబాలకు వ్యవసాయ భూమి లేదు. భారతీయ రైతులలో 95.1 శాతం మందిని దిగువ మధ్యతరగతి, సన్నకారు, పేద రైతులు అని పిలుస్తారు. అంటే వారు వరుసగా 2.47, 4.94, 9.88 శాతం ఎకరాల భూమిని కలిగి ఉన్నారు. ఈ రైతులు 68.2 శాతం సాగు భూమిని కలిగి ఉన్నారు. 4.9 శాతం మంది ధనిక రైతులు 24.71 శాతం సాగు భూమిని కలిగి ఉన్నారు. 2011-12 వ్యవసాయ జనాభా లెక్కల ప్రకారం రైతులు 31.8 సాగు భూమిని మాత్రమే కలిగి ఉన్నారు. 2011-12 వ్యవసాయ జనాభా లెక్కలు, 2011 సామాజిక - ఆర్థిక కుల జనాభా లెక్కల నుండి సేకరించిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. భారతదేశ వ్యవసాయ భూములలో 32 శాతం రైతులు 4.9 శాతం కంటే ఎక్కువ కాదు. భారతదేశంలో ఒక ధనిక రైతుకు పేద రైతుకంటే 45 రెట్లు ఎక్కువ భూమి ఉంది.

101.4 మిలియన్లు (56.4 శాతం) గ్రామీణ కుటుంబాలకు వ్యవసాయ భూమి లేదు. గ్రామీణ భారతంలో భూమిలేని వారికి ఇచ్చిన సగటు భూమి 2002లో 0.95 ఎకరాల నుండి 2015 లో 0.88 ఎకరాలకు పడిపోయింది. ఇది 13 సంవత్సరాలలో 7.4 శాతానికి పడిపోయింది. 2015 డిసెంబర్ నాటికి, భారతదేశం అంతటా 'మిగులు' (అంటే భూస్వాముల నుండి తీసుకోవాల్సిన) అని ప్రకటించిన భూమి 6.7 మిలియన్ ఎకరాలలో ఉంది. ప్రభుత్వం 6.1 మిలియన్ ఎకరాలను స్వాధీనం చేసుకుంది. 5.1 మిలియన్ ఎకరాలను - హర్యానాలో సగం కంటే తక్కువ లేదా గోవా విస్తీర్ణంలో ఐదున్నర రెట్లు 5.78 మిలియన్ల ప్రజలకు పంపిణీ చేసింది. అదే విధంగా ప్రకటించిన భూమి మిగులు సంవత్సరాలుగా పడిపోయింది. 1973, 2002 మధ్య సగటున 150,000 ఎకరాలు మిగులు భూములుగా ప్రకటించబడ్డాయి. ప్రతి సంవత్సరం సగటున 140,000 ఎకరాలు పంపిణీ చేయబడ్డాయి. దీనికి విరుద్ధంగా 2002, 2015 మధ్య ప్రతి సంవత్సరం మిగులు 4,000 ఎకరాలుగా ప్రకటించారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న, పంపిణీ చేయబడిన భూమి వరుసగా 29,000 ఎకరాలు (2002), సంవత్సరానికి 24,000 ఎకరాలు (2015)కు క్షీణించింది.

2007, 2009 మధ్య 920,000 ఎకరాల నుండి 1.14 మిలియన్ ఎకరాలకు వ్యాజ్యం కింద ఉన్న మిగులు భూమి 23.4 శాతం పెరిగింది. కేరళ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర వంటి కొన్ని రాష్ట్రాలు ఇటువంటి కేసులను త్వరగా పరిష్కరించడానికి భూ ట్రిబ్యునళ్లను ఏర్పరిచాయి. కాని వాటి పనితీరు పేలవంగా ఉంది. హెచ్చు తగ్గులతో సంబంధం లేకుండా, 2015 వరకు ప్రకటించిన భూమి 51.9 మిలియన్ ఎకరాలలో 12.9 శాతం దాదాపు గుజరాత్ రాష్ట్ర పరిమాణమంత ఉంటుంది. ఇది భూస్వాముల నుండి తీసుకోవలసిన భూమి. మిగులుగా ప్రకటించాల్సిన 51.9 మిలియన్ ఎకరాలలో ప్రభుత్వ ఆధీనంలో పంపిణీ చేయబడిన భూమి కేవలం 9.8 శాతం మాత్రమే.

భూమి లేకపోవడం వల్లే పేదలు హత్యలకు గురౌతున్నారు. ఈ హత్యలకు గురైన వాళ్లల్లో 90 శాతం మంది దళితులు, గిరిజనులు ఉన్నారు. భారతదేశంలో కులతత్వం ఎక్కువగా ఉంది. అందువల్ల కులతత్వ హత్యలు ఎక్కువ పెరుగుతున్నాయి. అయితే వీటిని భూ, ఆస్తి తగాదాల ఘర్షణలో జరిగిన హత్యలుగా ప్రభుత్వం చిత్రీకరిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం పేదలందరికీ సాగు భూములను కేటాయించాలి. భూస్వాముల దగ్గర చట్ట వ్యతిరేకంగా ఉన్న భూములను లాక్కోవాలి. చినబాబు హంతకులపై ఎస్సి, ఎస్టి చట్టం ప్రకారం కేసు నమోదు చేసి చట్ట ప్రకారం శిక్షించాలి. కబ్జాకు గురికాబడ్డ షికారీ భూములను తిరిగి వారికి ఇప్పించాలి. మృతుని కుటుంబానికి నష్టపరిహారం కింద కోటి రూపాయలు ఇవ్వాలి. మృతుని పిల్లలకు చదువుకు అయ్యే ఖర్చులను ప్రభుత్వమే భరించాలి. సంఘటనపై హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలి. ఈ సంఘటనలో నిర్లక్ష్యం వహించిన పోలీసు, ప్రభుత్వ ఉన్నతాధికారులను విధుల నుండి తొలగించాలి. లేనిపక్షంలో జరుగబోయే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుంది.

(రచయిత పౌరహక్కుల సంఘం సభ్యులు) వీ

తెలంగాణ సోయి మర్శిందెవలు?

***నగరాల్లో కబ్జాలకు గురైన నాలాలు, చెరువులు, కుంటల ప్రాంతాలు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నీట మునిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వానికి సోయి లేకుండా పోయిందని అంటున్నారు* వాడపల్లి అజయ్‌బాబు**

వీక్షణంలో సాధారణంగా కవిత్వం, కథ, సాహిత్య విమర్శ వంటి సాహిత్య ప్రక్రియలకు స్థానం ఉండదు. సమాజాన్ని చిత్రించే సాహిత్యం గురించి ఎప్పుడైనా అరుదుగా రావచ్చు. ప్రధానంగా వీక్షణం సామాజిక, రాజకీయార్థిక విశ్లేషణా వ్యాసాలకు మాత్రమే పరిమితం అవుతుంది. గల్పిక అనేది కథకు దగ్గరగా ఉండే సాహిత్య రూపమే అయినప్పటికీ, కొడవటిగంటి కుటుంబరావు వంటి విశ్లేషకులు దాన్ని సామాజిక విమర్శకు ఉపయోగించారు. ఇక్కడ ఈ రచయిత కూడా తెలంగాణలో అతివృష్టి అనే సామాజిక అంశం మీద విమర్శగా రాసిన ఈ గల్పికను ఒక మినహాయింపుగా ప్రచురిస్తున్నాం. – సం.

ఆనరాకుంటె తిప్పలేనాయె! బగ్గానలత్తె సుత తిప్పలేనాయె! యేహే! యెంత పాటి ఆన కావాల్నో కాంటేషి షెప్పేదేమన్న వున్నదాంటె! ఏ కాలం ముచ్చటాకాలందే! ఆనలచ్చే కాలం ఆటి మానాన అవచ్చి పోతయి. అత్తె తిప్పలేముంటది!, ఆనత్తె మాగ సంబురమేగని! ముప్పు తిప్పలు బెట్టేతీర్గ పద్దినాలసంది ఆనదంచి గొట్టబట్టె! ఎన్కటి గొల్సుకట్టు శెరువులు బగ్గ నిండి, కుంటలు, అలుగుబారి బగ్గ వర్దలాయె! ఆడాడ కొన్ని శెరువులు, ఆగులు కట్టతెగి వూళ్లకూళ్లు కొట్టుకబోవట్టె! వూళ్లె పొంటి యవుసం మంట్లె గలిశింది. పట్నాల పొంటి షిమ్టిరోడ్లు సుత పగిలి పర్రెలు వాశి తొవ్వలు బందాయె! వాడలకు వాడలు మునిగి ఇండ్ల సుట్టు శెరువులు బుట్టుకచ్చె! పట్నం మద్దెన పడ్వలు శెక్కరు గొడ్తానయి! 'రామసక్కదనాల' బిడ్జిలు, కల్వట్లు మట్టి గోడలోలిగె కూలుతాంటె పట్నాలపొంటి సుత జనం గాయ్ గాయ్ గాబట్టిరి!

గిసొంటప్పుడే సర్కార్ పనితీరు యే పాటిదో జనం సరిగ్గ జూడాలె! 'ఇగురం ఇంట్లె గూసుంటె పనితనం పట్నం పయనమైందట'! గట్నే కానత్తాంది. పతిపక్షాల జోరేపాటిదో కానత్తది! దేశవంత యేట్ల బోయినా మన కాడ మాత్రం అవ్వల్ దర్జాసర్కారున్నది. రాష్ట్రవంత మునిగి ముద్దయింది.

ఆనల పట్నం, పల్లెనకుంట నీట కొట్కవోవట్టినయి,యేంది రాములా! అని సర్కార్ అటో, యిటో బోయి అర్సుకుందా వనేటి ఆత్రం గింతనన్న లేకుంటున్నది. రైతులెట్లున్నరు! పంటలేమైనయి! ? కట్టలు తెగవట్టె! పట్నాలల్ల రోడ్లు తెగవట్టె! జనం అరిగోస పడుకుంట సాయం కోసం జూడవట్టె! ఎలచ్చన్ల ఓటేషిన గెలిపిచ్చిన జనం దుక్కమర్సుకునే సోయి జరంత సుత లేకుంట ఎమ్మెల్లేలు, మంత్రి సార్లంత ఇంట్లకేలి మంచం దిగుతలేరు. గల్మ దాటుతలేరాయె! రేపుమాపు మున్సిపాలిటీ ఎలచ్చన్లుండె! పోకుంటె జనం జాడిచ్చి తన్నెగిట్లెనని అన్ని శాఖలు జూషేటి షిన్న పోశెట్టి వరంగల్ పట్నం జూడబోయిండు. యెంబటున్న లట్టర పొట్టర లీడర్లు ఎటమటంగ మాట్లాడెసరికె జనం గయ్యిన లేషిండ్లు. బుడ్డ ముఖ్యమంత్రి తీర్గ షాన్గ షిన్న పోషెట్టి యేందో జేయెబోతే యేందో అయింది. నడిమిట్ల జిల్లా మంత్రి జనం మీద నోరు జారి దొరీర్కం జూపబోతె జనం పొల్లుపొల్లు దీవెనార్తు లిచ్చి మాగనే అర్సుకున్నరు. గాలికి బోయేటి కంప లాగుకు తగిలిచ్చుకునుడు గిదేం కొత్త గాదు మరి! వుచ్చితార్తంగ జనం మీదికి మాటిడిషి వున్నది లేనిజ్జత్ తీసుకున్నడు.

పొయినేడు కరువేనాయె! ఆనల్లేక పత్తులెండినయి. ఈ యేడు గీ పద్దినాలకే షెరువు కట్టలు తెగేటి ఆనలచ్చినయి. సుంకేసుల, జూరాల, శ్రీశైలం, సాగర్ గొంతులదాంక నిండినయి. గణపురం, రామప్ప, పాకాల షెరువులు మత్తళ్లెగిషి దూంకబట్టినయి. జంపన్న వాగు నిండి సమ్మక్క గద్దెల్ని ముంచినయి. వాగు మీది బిడ్జి వంకర్లబోయి కూలవడ్డది. సర్కారు ములుగు నాగరం, వర్ధన్నపేట తొవ్వలు మునిగి దారులు బందైనయి. బద్రాచలం సగం గోదాట్లె మునిగింది.

వరంగల్, ఆదిలాబాద్, నారాయణపేట్, హైదరాబాద్ పెద్ద పట్నంల కాల్నీలన్ని కాట గల్శినయి. చిన్నపాటి దందాలన్ని లాపత్తయినయి. ఓపెన్ కాస్టులల్ల బొగ్గు మునిగి తిప్పలాయె! పట్నాలల్ల కాల్వలు లేక వాడలన్ని మునిగి ఇండ్లల్ల మనిషెత్తు వరదచ్చె! నాలాలు, షెరువులు, కుంటలను కబ్జా బెట్టి బంగుళలు లేపుతాంటె నీళ్లేడబోతయి.

సర్కార్ ఈ యేడు నియత సాగనేదో కొత్త కతలు వడి గూసుంటె లచ్చలల్ల అప్పులు జేషి మిర్చి, పసుపు, పత్తులు వెట్టిన రైతులిప్పుడు నిండ మునిగి భోరువనబట్టె! మొత్తం సాగు భూమిల సగం సాగు పత్తులే యేషినోళ్ల గోస దేవునికి ముడ్తాండె! జప్పున చేతికచ్చే పెసరు తీర మునిగి కోత ల్లేకుంటనే మొలుకలెత్తబట్టె! గద్వాల, ఆలంపూర్ మొకాన ఇత్తనం కోసం పత్తు లేషినోళ్లు మునుగుడు రేపట్కి కష్టకాలమే! అధికార గణమేవన్న వారం దినాల సంది రైతుల తిప్పలేమన్న అర్సుకున్నరా అంటే యేం గానత్తలేదు. 'దమ్మిడి మే లాల్ లాల్' తీర్గ పంట నష్టం అంచనా లెక్కలు ఏడు జిల్లాల నుంచి బయిటికచ్చినయని గాలి ముచ్చటోటి ఇనరాబట్టె! ధనిక రాష్ట్రమని జెప్పుకుంటానం గాబట్టి ఏపాటి అర్సుకుంటదో మన సర్కారని ఆశ రైతులకున్నది. ఏకాలంల సుత పంటబీమాలు నోటి మాటలుగ మిగిలిపోయే తీర్గ రొండు సర్కార్లు కతలు కానత్తానయి. జాతీయ వ్యవసాయ బీమా పథకం' చిక్కులల్లబడి మూడ్రోజుల ముచ్చటాయె! 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన', 'వాతావరణ ఆధారిత పంటల బీమా పథకం' గీ రొండు అదే తొవ్వల వుల్లెక్కాల ముచ్చట్లయినై. 'ప్రధానమంత్రి ఫసల్ యోజనా' ఇస్సా కిస్తీలు ఎవలు గట్టాలనే లెక్కలేషి రైతుల తాన ముందు గాల్నే వసూల్ జేయా లంటిరి. గీ కిర్కిరేందని దాని జోలి ఇడిషిపెట్టిండ్లు. బీమాలు ఓటు పండుగప్పటి నోటి మాటల హామీలె గని ఆపతిల ఆదుకునేటియి గావు.

తెలంగాణ ఎప్పటి తీర్గుంటెనె జరంత బాగుండు, తీరు మారుతదని పోరు జేషి పొంకనాల పోశెట్టిని గద్దె మీదుంచితె పొక్కిలి పొక్కిలి జేషి పెట్టె! గీ బేయిమాన్ సర్కార్ తీర్ తోని జనం గాయ్ వడుడు జూషి

ప్రాంతీయం

పీడితుల ఆవేదనే వివి వ్యక్తీకరణ

పీడిత, అణగారిన వర్గాల కోసం పాలకవర్గాలను ప్రశ్నించినందుకే వరవరరావును పాలకులు జైలు గోడల మధ్య బంధించారనీ, అయితే ఆయన ఆలోచనల్నీ, కళాన్నీ ఆపే శక్తి వారికి లేదనీ అంటున్నారు **ఎం. శ్రీనివాస్**

నిజమే వరవరరావు, సాయిబాబాలను బతికించుకోవాల్సింది ప్రజలే. ప్రజా ఉద్యమమే. భారత పౌరసమాజంపై ఈ బాధ్యత మరింతగా ఉంది. ఇది పీడిత జననివేదన. కేంద్ర బీజేపీ సర్కార్ జాతీయ, అంతర్జాతీయంగా వచ్చే విజ్ఞప్తులను బేఖాతరు చేసింది. కుటుంబసభ్యుల విన్నపాలను తిరస్కరించింది. దేశ రాజ్యాంగాన్ని దాని ఆధారంగా వచ్చిన పౌర చట్టాలను, గత న్యాయస్థానాల తీర్పులను తృణీకరించింది. కవులు, రచయితలు, హక్కుల కార్యకర్తలు, మేధావులు, ప్రజాస్వామికవాదులు ప్రభుత్వానికి అనేక విజ్ఞప్తులు చేశారు, లేఖలు రాశారు, న్యాయస్థానాలకు తమ ఆవేదనను నివేదించారు. కానీ శంకరాచార్య అద్వైతకులకు ఇదంతా మిథ్యనే. బెయిల్ అనేది విచారణ ఖైదీ హక్కు. దాన్ని నిరాకరించడం చట్టవిరుద్ధం. రాజ్యాంగ ఉల్లంఘన. జీవించే హక్కుపై ప్రత్యక్ష దాడి. ప్రజాక్షేత్రంలో ఉండి, సామాజికన్యాయ దృక్కోణంతో చూసే న్యాయకోవిదులు వ్యక్తిగతస్వేచ్ఛకు భంగం కలిగించే విధంగా బెయిల్ నిరాకరించడం తప్పు అంటూ గతంలో చేసిన వ్యాఖ్యానాలు మన ముందున్నాయి. వరవరరావు, సాయిబాబా విషయంలో బెయిల్ నిరాకరణ కేవలం వ్యక్తిగత స్వేచ్ఛకే కాదు, ఒక మనిషిగా జీవించే హక్కుకే ప్రమాదంగా మారుతుందని ప్రజల ఆవేదన.

భారత ప్రజలను వెంటాడుతున్న సాంఘిక, ఆర్థిక, రాజకీయ అసమానతలను నిరసిస్తూ నిర్మూలించబడాలనీ కోరుకున్నందుకే భగత్‌సింగ్‌ను ఆయన సచహర బృందాన్ని టెర్రరిస్టులన్నారు వలస పాలకులు. వలసపాలన పునాదుల మీద ఆవిర్భవించిన కాంగ్రెస్ నాడు మౌనం దాల్చింది. కాషాయపు కంకణదారులు ఆంగ్లేయులకు విధేయులుగా నిలిచారు. భారత ప్రజాకోర్టు అన్యాయమని నిరసిస్తున్నా వలసపాలకులు వారిని హత్యచేశారు. జాతీయోద్యమ ఆకాంక్ష, భగత్‌సింగ్ సహచర బృందం స్వప్నించిన లక్ష్యాల్నే తెలుగునేల గర్వించదగ్గ సుప్రసిద్ధ విప్లవ ప్రజాకవి వరవరరావు ఎలిగెత్తి చాటాడు.

వరవరరావు సాహిత్య రంగానికే సామాజిక బాధ్యతను గుర్తింపచేసి ఆ వైపు మళ్లించినవాడు. నిజానికి వరవరరావు అసమానతలతో ఉన్న వ్యవస్థకు, ఒక జాతి మరొక జాతిని, ఒక వ్యక్తి మరొక వ్యక్తిని పీడించే, అణచివేసే సాంఘిక న్యాయానికి వ్యతిరేకం. ఈ పరిస్థితి మారాలని కోరుకునే వారిలో ప్రథముడు వరవరరావు. ప్రజల సంపద ప్రజలకే దక్కాలని భావించి అందుకోసం కృషిచేసే వాళ్లల్లో అగ్ర పీఠాన ఉన్నవాడు. వరవరరావు నిజమైన శాంతికాముకుడు. ప్రజాస్వామికవాది. పీడిత ప్రజాహక్కుల ప్రేమికుడు. అణగారిన సామాజిక వర్గాల శ్రేయస్సును, అభ్యున్నతిని ఆకాంక్షించే వాడు. నేరాన్ని నిరోధించే ప్రజాహితం ఆయన నైజం. అణిచివేతకు మాత్రమే ప్రతిఘటన ఆయన ఉపదేశం. ఆర్థిక, రాజకీయ, సామాజిక అసమానతలు నిర్మూలించబడాలన్న కార్యచరణలో అవిశ్రాంత కృషీవలుడు. నిత్య శ్రామికుడు. సహజ న్యాయసూత్రాల ఆధారంగా న్యాయం జరగాలన్నా నీతిని, రీతిని వదులుకున్న పాలకులు వారి దృష్టిలో దోషులు ఎవరన్నది చెప్పడానికి ఆధారం అక్కరలేదు. అనుమానం వస్తే చాలు నేరస్తుడయిపోతాడు. అందుకే 'నాడు నిన్ను తెల్లవాడు భగత్‌సింగ్ అంటే నేడు నిన్ను నల్లవాడు నక్సలైటు' అన్నాడు.

వరవరరావు విషయంలో జరిగింది ఇదే. పాలకులు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రక్రియ ఇది. రాజ్యం అమానవీయ స్వభావం, అమానుషమైన అటవిక దుర్నీతి వరవరరావు విషయంలో మరోసారి ప్రదర్శించుకున్నది. కనీస కనికరం లేని కాషాయపు కర్కశత్వాన్ని మళ్లీ రుజువు చేసుకున్నది. నిరూపణ లేని ఆరోపణలతో, శాసించే హక్కుతో పాలకులు జీవించే హక్కును కాలరాస్తున్నారు. కుట్రదారులే కుట్రలకు తెరలేపే 'పవిత్ర' కర్తవ్యాన్ని ఎంచుకున్న నేపథ్యమిది.

వరవరరావు జీవించే హక్కుపై నిరంతర దాడి అంటే ఒక కవిత, ఒక పాట, ఒక సందేశం, ఒక నినాదం మీద దాడి మాత్రమే కాదు అది ఒక భావజాలం మీద దాడి. ఆ భావజాలానికి ప్రతినిధి వరవరరావు. అందుకే వరవరరావును బంధిస్తే వాటిని నియంత్రించవచ్చునని పాలకుల కల. కానీ కల కల్లగా మారుతుందని, పీడిత జనహృదయాల్లో ఆ భావజాలం నిరంతర లావా లాగా ప్రవహిస్తుందని, కవిత, పాట వేల వేల గొంతులై ఆలపిస్తాయని, సందేశం భిన్న సామాజిక జన శ్రేణులను జాగృత పరుస్తుందని, నినాదం భౌతిక ఉద్యమశక్తిగా ఎదుగుతుందని ఊహించలేకపోయారు పాలకులు. సమాజం గురించి చేసే ఆలోచన,

---

జీవిడిషిన పోరల్ల ఆత్మలెంత తండ్లాట పడవట్టినయో! మనోడే మనల గిట్ల దోసుకునుడు సయించద్దురా! వారీ! అని కాళోజీ జెప్పిన సుద్దులు ఎవలి షెవు మీద సుత పేను వారుతలేదాయె! పొయిలకేలి పెనంల వడ్డ బతుకాయె. నీళ్లు, నిధులు, కొల్వులని మర్లవడి మనరాజ్జెం మనకచ్చెనని పడ్డ సంబురం దొరీర్కపు గడీల కట్టేషిన కచ్చీరైంది. నిజామోడి ఘోరి గట్టిన వూరూరి గుత్పలు మళ్ల మోపయ్యేటి దినం యే పొద్దునత్తదో గని బతుకు సావుమర్నమై గాలవడ్డది. రాజ్జెం వర్దల మునుగుతె పోశెట్టి ఫామవుజుల తెలుతాండె! జనం తిప్పలు జనం కుండె! సర్కారేమో అసలు కానరాకుండె! కానరాకుంటె మాయెగని ఆనలచ్చి రాజ్జెం ఆగమైతాందనె సోయి సుత లేకుంట బాయె! సాగు బతుకుల గోస సాగుడెట్లనే సోయి గద్దె మీదోళ్లకు జరంత సుత లేదాయె! మన్ను బిసికి బతికెటోళ్లం మనకన్న వుండాలె గద! నెత్తి నోరు గొట్టుకోని కర్మనుకునేటి బతుకైతె మనదిగాదు! గరిక పోసలు కత్తులు దూషి కలవడ్డ నేల మన తెలంగాణ! అసోంటి నేల మీద జనం ఆపతిల ఆగమవుడు ఇచ్చంత్రంగ కానత్తాంది. ఎసోంటి కాలానికైనా ఎదురువోయినోళ్లం! ఎదురు వోకుంటెనే బతుకు ఎటమటమైతాందంటె ఏం జేయకుంట వుట్టిగెట్లుంటం!?

(రచయిత ఉపాధ్యాయులు) వీ

ప్రజల గురించి మాట్లాడే ఓ గొంతు, నిరంతరం ప్రజా క్షేత్రంలో తిరగాడే ప్రజా సేవకుడు నాలుగు గోడల మధ్య బంధించి ప్రజా క్షేత్రంలో నుంచి వేరు చేశామని ప్రజాకంటకలు స్వప్న తీరాల్లో విహరించవచ్చు. కానీ వరవరరావు ఆలోచనలకు పునాది పీడిత ప్రజలు. ఆయన గళానికి జీవం ప్రజా సమూహాల మౌలిక సమస్యలే. ఆయన సైద్ధాంతిక విశ్వాసానికి మూలం మార్క్సిజం. ఆయన నిస్వార్థత, నిజాయితీకి ప్రాతిపదిక ప్రజా పక్షం నిలవడమే. ఆయనకున్న ప్రాపంచిక దృక్పథానికి కేంద్రబిందువు ప్రజలే. అలుపెరుగని ఆ ప్రజా సైనికుడు అందరి గురించి ఆలోచిస్తాడు, మాట్లాడుతాడు. కష్టాలకు, కన్నీళ్లకు, సామాజిక అంతరాలకు, ఆర్థిక అసమానతలకు మూలాలను పట్టుకొని వాటి నిర్మూలనకు తన భావాలను ప్రజలకు పంచి వారిని భౌతిక ఉద్యమశక్తిగా మలుస్తున్నవాడు. అందుకే పట్టాల చదువును, నాలుగు రూకలు వచ్చే కొలువును వదులుకున్నాడు. సమాజమనే విశ్వవిద్యాలయంలో ప్రజలనే పాఠ్యాంశాల అధ్యయనానికి నడుంబిగించాడు. తిరోగమన భావజాలంతో నిండి ఉన్న విశ్వవిద్యాలయాన్ని ప్రక్షాళన చేయడానికి, పాఠ్యాంశాలను ఉన్నతీకరించడానికి పూనుకున్నాడు.

వరవరరావు 81 ఏళ్ల వయోవృద్ధుడు. ఆయనను వెంటాడుతున్న తీవ్ర అనారోగ్యానికి తోడు 'కరోనా పాండమిక్' వ్యాధి సోకడంతో ఆరోగ్యం మరింత క్షీణించింది. వరవరరావు ఎనభై ఒక్క ఏళ్ల వయోవృద్ధుడే, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవాడే, కరోనా వైరస్‌వల్ల ఆరోగ్యం మరింత క్షీణించవచ్చు. కానీ మడమ తిప్పని, ఆలోచన చెదరని, చక్ర బంధాన్ని ఛేదించుకుని రాగలిగే విప్లవ అభిమన్యుడు. ఇది ఆయన జీవనమరణ సమస్య. అయినా బయట పడతాడు. తిరిగి ప్రజాక్షేత్రంలో నడయాడుతాడు. గొంతెత్తి ప్రశ్నిస్తాడు. నిలదీస్తాడు. నిజాల్ని నిగ్గు తేలుస్తాడు. ఎందుకంటే పీడిత ప్రజా సమూహాల, శ్రామిక వర్గాల కోసమే ఆయన నిరంతర తపన కనుక. నిజమే వరవరరావు జీవన్మరణ సమస్యతో పోరాడుతున్నాడు. ఆయన పోరాటలక్ష్యం మరింత కాలం పీడిత ప్రజల కోసం సేవ చేయాలన్న సంకల్పమే. తన నిర్దోషతత్వానికి అంటగట్టిన తప్పుడు అభియోగాల దండకాన్ని నివేదించాలన్న పట్టుదలే పోరాటానికి పునాది. పౌర, మానవ హక్కులు హననం అవుతున్నప్పుడు, బతుకులు విధ్వంసం అవుతున్నప్పుడు ఆదరించి, నిలబడేవారు ఉండాలి. వారి పక్షాన మాట్లాడే, ప్రశ్నించే గొంతుకలు ఉండాలి. నిస్సహాయులకు నిర్భాగ్యులకు అండగా నిలబడి భరోసా ఇచ్చే త్యాగనిరతి కలిగిన వారు ఉండాలి. నిరుపేద ప్రజలు, అణగారిన సామాజిక వర్గాలు వరవరరావు, సాయిబాబాల పట్ల విశ్వసనీయతను కలిగి వారు తమతోనే ఉండాలను కుంటున్నారు. అందుకే వారి కోసం గొంతెత్తి విడుదల కోసం నినదిస్తున్నారు. వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారు. వదిలే వరకు ఈ పోరు ఆగదు అంటూ ముందుకు సాగుతున్నారు. ఒక తెలుగు నేలపైనే కాదు, యావత్ భారతావనిలోనూ విశ్వవ్యాప్తంగా ఈ ప్రక్రియ కొనసాగుతోంది. 'పాలిటిక్స్' అంటే అసహ్యించుకునే వారు సైతం ప్రేమించే, గౌరవించే వ్యక్తి వరవరరావు. ప్రజాసేవ పట్ల ఆయనకున్న నిజాయితీ, నిస్వార్థత, కమిట్‌మెంట్, ప్రజల స్థితిగతులు మౌలికంగా మారాలన్న దృఢ ఆశయమే అందుకు కారణం. అయినా బ్రాహ్మణీయ మనువాద శక్తులు నిరాధారమైన అభియోగాలు, తప్పుడు డాక్యుమెంట్లు సృష్టితో 'మనుస్మృతి' సాక్షిగా దోషిగా నిలబెట్టే ప్రయత్నాలు సాగిస్తూనే ఉన్నారు.

అవును వరవరరావు విప్లవం గురించి మాట్లాడుతాడు. విప్లవం కుట్రకాదు. అది నూతనత్వానికి సంకేతం. మార్పుకు మార్గనిర్దేశం. చారిత్రికంగా భిన్న సామాజిక రంగాల్లో వచ్చిన ఆవిష్కరణలన్నీ నూతన మార్పులే. అంటే విప్లవాలే. విప్లవమంటే అర్థం చేసుకోలేని వారు భయపడతారు. విప్లవం అంటే మార్పు. మార్పు లేకుండా జీవితం లేదు. జీవితాన్ని ఉన్నతీకరించుకోవడం. నిజమైన జీవితానికి అర్థం పరిపూర్ణమైన, సమగ్ర వ్యక్తిత్వం కలిగిన మానవుడిగా ఎదగడమే. ఇది కోరుకోవడం, అందరూ ఆ విధంగా ఎదగాలని భావించడం నిజమైన దేశభక్త పౌరుడిగా వరవరరావు కోరుకోవడం నేరమైతే విప్లవం కూడా 'నేరమే'. మార్పును ఆశించిన వాడు వరవరరావు. మార్పు అంటే తమ ప్రజలు బానిసత్వం నుంచి తప్పించ బడాలి. వారికి నిజమైన స్వేచ్ఛ సమానత్వం సిద్ధించాలి. ఇదే పాలకుల దృష్టిలో నేరమైంది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల పేరుతో దేశాన్ని బహుళజాతి కంపెనీలకు అప్పగించే వారే కుట్రదారులు. ప్రజల కష్టార్జితం నుండి నిర్మాణమై క్రమంగా అభివృద్ధి చెందుతూ నిలకడగా కొనసాగుతున్న ప్రభుత్వ రంగ వ్యవస్థను బహిరంగంగా వేలం వేసేవారే దేశద్రోహులు. దేశాన్ని తెగనమ్మే కుట్రలకు తెరతీసిన పాలకుల కుటిల దేశభక్తి జపంలోని నిజాన్ని విప్పిచెప్పడం, వాణిజ్య ఒప్పందాల పేరిట పచ్చటి పంట పొలాలతో విలసిల్లాల్సిన పల్లె భూములన్నీ ఎడారి భూములుగా మార్చే మహా కుట్ర దారుల గురించి చెప్పడం నేరమైతే విప్లవం కుట్రే. చారిత్రకంగా అనేక ప్రజా ఉద్యమాల ద్వారా ఫలించిన వారసత్వ సంపదను, జీవన సంస్కృతులను కాపాడుకోవాలనుకోవడం, దేశ ప్రజల ప్రయోజనాలను భూమితో ముడిపడిన సుసంపన్నమైన జీవన వైవిధ్యాన్ని పరిరక్షించుకోవాలని కోరుకోవడం నేరమైతే విప్లవం కుట్రే.

ఎరుపంటే కొందరికి భయం. ఎందుకంటే ఎరుపును నమ్ముకున్నవాళ్ళు అపాయాన్ని తొలగించే ఉపాయాన్ని బోధిస్తారు. సత్యానికి, అసత్యానికి మధ్య ఉన్న తేడాని వివరిస్తారు. కష్టాలకు కన్నీళ్ళు పరిష్కారం కాదని నిలబడి కొట్లడటమే మార్గమని సూచిస్తారు. శ్రమకు ప్రతిఫలం కోరడం తప్పు కాదు. కనుకనే సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని రాజ్యాంగ చట్టంలోని ఆర్టికల్ 39 క్లాజ్(డి) నిర్దేశిస్తుంది. ఆత్మగౌరవంతో గౌరవప్రదంగా జీవించడం ఆర్టికల్ 21 నిర్దిష్ట లక్ష్యం. ఈ విషయాలను అడగడం, ప్రశ్నించడం నేరమైతే భావప్రకటనా స్వేచ్ఛను ప్రాథమిక హక్కుగా ప్రకటించిన ఆర్టికల్ 19 కూడా నేరపూరితమే అవుతుంది. వాస్తవానికి 1950వ దశకంలోనే ప్రాథమిక హక్కు అయినా భావప్రకటనా స్వేచ్ఛ నిరాకరణకు కుట్ర జరిగింది. దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు దెబ్బ తగిలే ఏ విషయంలోనైనా చట్టం చేయవచ్చుననే పేరుతో రాజ్యాంగానికి తొలి సవరణ చేశారు. అదే 19వ ఆర్టికల్‌కు సవరణ. "పబ్లిక్ ఆర్డర్", "రక్షణ" పేరుతో చట్టాలు చేయవచ్చునన్నదే దాని సారాంశం. పాలకులు ఎవరైతేనేం వారంతా కుట్ర దారులే. నాటి సవరణ వెనుక ప్రజా ఉద్యమాల భయం ఉన్నది. కాశ్మీరీ ప్రజల అలజడి, ఈశాన్య రాష్ట్రాల కల్లోలం, దక్షిణ భారతంలో పీడిత రైతాంగ సాయుధ పోరాటాల వంటి సమరశీల ప్రజాఉద్యమాల ప్రభావం ఉన్నది. ఈ పరిస్థితులే నాటి పాలకవర్గం ప్రజల హక్కుల హననానికి, కుట్రపూరిత పథక రచనకు పూనుకున్నది. పర్యవసానమే ఆర్టికల్ 19 సవరణ. పాలకవర్గాల సైద్ధాంతిక దృక్పథానికి ప్రత్యామ్నాయంగా ఏ విధమైన సైద్ధాంతిక దృక్పథం ఉన్నవారు ఉండకూడదనే దీని ఉద్దేశమే. ఈ విధానాన్నే మనువాద శక్తులు మరింత నిర్మాణాత్మకంగా కొనసాగిస్తున్నారు. ఇవాళ పాలకులు తెచ్చిన నల్ల చట్టాలైన టాడా, ఉపా, కశ్మీరీలోనూ ఈశాన్య రాష్ట్రాల్లోనూ అమలవుతున్న చట్టాలు ఈ సవరణ ఆధారంగా వచ్చినవే.

వరవరరావును ఇప్పుడు ప్రజల నుండి భౌతికంగా దూరం చేయాలన్న కుట్ర జరుగుతుంది. కొన్ని భావాల పట్ల, ఆలోచనల పట్ల నిక్కచ్చిగా

ఓడా! నువ్వెళ్ళిపోకే.. మాకాడే! నువ్వుండిపోవే..

ప్రజా వాగ్గేయకారుడు వంగపండు ప్రసాదరావు శ్రామికుల గొంతుగా మారి జానపద కళల ద్వారా ప్రజా సమస్యలపై గళమెత్తారంటూ ఆయన కృషిని గుర్తు చేసుకుంటున్నారు **బి.ఎస్. రాజు**

కవి మరణించదు. గాయకుడు మరణించదు. కవి గాయకుడు మరణించదు. వాగ్గేయకారుడు మరణించదు. నాటక రచయిత, నటుడు, కళాకారుడు, ఆటపాటల విన్యాసకుడు మరణించదు. రైతుకవి, జానపదకవి, కార్మిక కవి, సాంకేతిక జ్ఞానకవి, శ్రామికవర్గ అన్నమయ్య మరణించదు.

అద్భుత వాగ్గేయ కళాకారుడు వంగపండు భౌతికంగా మరణించాడు. ఓ ఆటపాటల ఆర్కెస్ట్రా ఆగిపోయింది. శ్రమశక్తి గీతాల తెలుగు ఓడ తీరం దాటి వెళ్లిపోయింది. అపార వాగ్గేయ కళాఫలసాయాన్ని తెలుగు జాతికి మూటకట్టి అందించి వెళ్ళిపోయింది.

వెళ్లిపోయాకా, ఇపుడు వేడుకుంటున్నాం.. మా ఓడా! నువ్వెళ్ళిపోకే, మాకాడే! నువ్వుండిపోవే అని. నువ్వు మాకాడే ఉన్నపుడు నీ మీద మాకు ధ్యాసలేదు. నువ్వెళ్ళిపోతే ఇపుడు మాకేడుపు, దుఃఖం. ఇది మా బుద్ధి. మా తెలుగు బుద్ధి. ఏం చేద్దాం? అదంతే..

వృత్తిపరంగా నేను ఇంజనీర్ని. సాంకేతికనిపుణ్ణి. 'యంత్రమెట్టా నడుత్తు ఉందంటే' అనే పాట మొదటిసారిగా ఇంజనీరింగ్ వృత్తిలో నిమగ్నమై ఉన్న రోజుల్లో విన్నాను. రాసిందెవరో, పాడిందెవరో అప్పుడు తెలియదు. యంత్రం, శ్రమ, యంత్ర నిర్మాణ క్రమం... వీటిపై పాట కట్టినవాడు ఆనాడు లేడు, ఈనాడూ లేడు. అదీ, అంత అద్భుతంగా పాట కట్టి పాడినవాడు అంతకన్నా లేడు. అలా చేసిన, చేయగలిగిన మేటి కళాకారుడు, నాకు తెలిసి వంగపండే. అలానే 'ఓడాను వెళ్ళిపోకే' అనే పాట కూడా!

వంగపండు రాసిన 'యంత్రమెట్లా నడుస్తు ఉందంటే' అనే గేయం గాని, 'ఓడా నువ్వెళ్ళిపోకే' అనే గేయం గాని వంగపండు సాంకేతికతసు నిశిత జ్ఞాన కవిత్వానికి మచ్చు తునకలు. యంత్ర నిర్మాణంలో శ్రమపాత్రను, ఆ శ్రమ వేగాన్ని అత్యద్భుతంగా మేళవించి, బాణీ కట్టి ఆయన గానం చేసిన తీరు బహుశా ప్రపంచంలోనే అరుదని నేను భావిస్తున్నాను.

మొదటి యాంత్రిక విప్లవం తర్వాత యూరోప్‌లోనూ, అమెరికాలోనూ యంత్రానికి, శ్రమకు మధ్య ఏర్పడ్డ వైరుధ్యం పట్ల, తద్వారా ఏర్పడ్డ దుర్భర శ్రామిక జీవనస్థితి గతుల పట్ల స్పందించి ఆనాడు ఎందరో కవులు, కవి గాయకులు సాహిత్య ప్రపంచంలోకి వచ్చారు. మిగతా భాషల గురించి నాకు తెలియదు గాని, ఆంగ్ల భాషలో ఇటువంటి సాహిత్యం చాలానే కనిపిస్తుంది. శ్రీశ్రీ వంటి కవులు ఈ దేశంలో ఇటువంటి సాహిత్యం సృష్టించారు.

కఠినంగా ఉంటామని భారత రాజ్యాధిపతుల ప్రతి సందేశం. ఇది వరవరరావు, సాయిబాబాలతోనే ఆగిపోదు. మన వరకు వస్తుంది. కరోనా వైరస్ కంటే వేగంగా వ్యాపించే ప్రజా అభివృద్ధి నిరోధక రాజకీయ ఆధిపత్య వైరస్ ఇది. ఈ వైరస్ ప్రభావ లక్ష్యం ప్రత్యామ్నాయ భావజాల వ్యవస్థను విధ్వంస పరచడం. కానీ ప్రజా ఉద్యమం అందించే వందల కొద్ది ఉద్యమ కారుల భౌతిక కార్యాచరణలో వరవరరావు, ఆయన ఆలోచన విధానం ఉంటుందన్న విషయాన్ని విస్మరిస్తున్నారు. నిజాన్ని నిర్భయంగా అంగీకరించలేని స్వభావం బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిస్టు పాలకులది. 'బంచ్ ఆఫ్ థాట్స్' అనుకూలురు అనుకునేది భూమిలోని చెట్టును ధ్వంసం చేశామని భావిస్తుంటారు. అయితే మట్టికి, నీళ్లకు శ్రమతోడైనపుడు పుట్టే మిలియన్ల కొద్దీ మొక్కలు వృక్షాలుగా పరివర్తన చెందుతాయన్న జ్ఞానం లేని అజ్ఞానులు వాళ్ళు. ప్రజాస్వామ్య విలువలు సహజ న్యాయం వంటి నాగరిక విషయాలు వారికి గిట్టవు. ప్రజల పక్షాన నిలబడడం, మాట్లాడడం, ప్రశ్నించడం రాజ్యానికి గిట్టదు. పాలకులు అంగీకరించనిది ఇదే. అందుకే ఆయన జీవితమే ఒక బందీఖాన. నిత్య నిర్బంధాలు మధ్యనే ఆయన సహజీవనం. డెత్‌వారెంట్లతో జీవనయానం. అటువంటి వరవరరావును బంధించి భౌతికంగా బాహ్య ప్రపంచానికి దూరంగా ఉంచవచ్చు. కానీ ఆయన ఆలోచనలను బంధించలేరు. ఆయన భావజాలం తాలూకు కార్యాచరణ ప్రజాక్షేత్రంలోనే ఉంటూ ప్రజా సమూహాల్లో ప్రవహిస్తూనే ఉంటుంది. వివిధ ప్రజా ఉద్యమాలకు కార్యాచరణగా బాధిత వర్గాలకు భరోసాగా ఉంటుంది. భీమా కోరేగావ్ సంఘటనతో సంబంధం ఉన్నదని, భారత ప్రధానిని హత్య చేయడానికి 'కుట్ర పన్నాడని' వరవరరావుపై ఉన్న అభియోగం. ఈ అభియోగం పచ్చి అబద్ధం. పాలకులు ఉద్దేశపూర్వకంగా ఆపాదించబడిన ఆరోపణిది. తప్పుడు అభియోగాలతో డాక్యుమెంట్ల సృష్టించి ప్రజాబాహుళ్యం ముందు పోలీసులు ఆడిన నాటకం. కాదు, కాదు ఇది పోలీసుల చేత పాలకులు ఆడించే నాటకం. ఈ నాటకం కొనసాగింపు ప్రక్రియలో భాగమే వరవరరావు విషయంలోనూ వ్యక్తమైంది. నిర్దోషి అయిన వరవరరావును దోషిగా నిలబెట్టడానికి బంధించే సమయంలో ఆయన నిర్బంధాన్ని సైతం నవ్వుతూ ఆహ్వానిస్తూ... పాలకులకు సవాల్ విసిరే సందర్భంలో కుటుంబ సభ్యులు, ఉద్యమ సహచరులు, ప్రజాహితాన్ని కోరుకునే ప్రజాస్వామిక వాదులు, మేధావులు బిగించిన పిడికిళ్లతో ఆయనవెన్నంటే ఉన్నారు. పాలకుల తొలి ఓటమి వరవరరావుపై మోపిన తప్పుడు అభియోగాల సందర్భంలోనే ఉన్నది. 22 నెలలుగా అక్రమంగా నిర్బంధంలో ఉంచడమే కాక, బెయిల్ పిటిషన్లు తిరస్కరించడంలో రెండవ ఓటమి ఉన్నది. భారత పౌర సమాజమే కాదు విశ్వ మానవ సమాజపు విజ్ఞప్తులను, విన్నపాలను తోసిపుచ్చడంలో మూడో ఓటమి ఉన్నది. ఈ మూడు సందర్భాల్లో వరవరరావు నిర్దోషి అని తేలిపోయింది. అబద్ధాలను అల్లవచ్చు. ఆవిష్కరించలేరు. కానీ నిజాలు ఆవిష్కరించబడాతాయి. అబద్ధాలు తాత్కాలికమే. నిజాలే శాశ్వతం. కాలగమనంలో మానవ నాగరికత రుజువుపరిచిన సత్యమిది.

(రచయిత ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) వీ

అయితే వారి సాహిత్యానికి లేని కొత్త కోణాలు, అద్భుతశక్తి వంగపండు జానపద శ్రామిక సాంకేతిక జ్ఞాన కవిత్వానికి, దానికి మించి, వేగంతో కూడిన ఆయన గానరీతికి ఉన్నాయి. ప్రపంచంలో ఇటువంటి గేయ సాహిత్యానికి ధీటైన సాహిత్యం ఉందో లేదో బహు భాషా సాహిత్య దిగ్గజాలే చెప్పాలి. నాకైతే ధీటులేదనే అనిపిస్తుంది.

ప్రపంచంలో మొట్టమొదటిసారి అమెరికాలో, ఫోర్డ్ కార్ల ఉత్పత్తి పరిశ్రమలో ఆటోమేషన్ ప్రవేశించింది. కన్వేయర్బెల్ట్ ఎసెంబ్లీ లైన్ పద్ధతిలో కార్ల ఉత్పత్తిని ఫోర్డ్ ప్రవేశపెట్టాడు. అప్పటివరకు ఉన్న సింగిల్ యూనిట్ ఉత్పత్తి విధానం ఆటోమొబయిల్ తయారీ రంగంలో క్రమేణా రద్దయింది. దానిస్థానంలో ఆటోమేషన్ విధానం వచ్చింది. విప్లవీకరించబడ్డ ఈ ఉత్పత్తి విధానంతో మనిషిలో, శ్రామికునిలో, గుప్తమై ఉన్న అపారమైన ఉత్పత్తి శక్తిని అత్యంత వేగంగా తోడుకోవడానికి మార్గం తెరుచుకుంది. మొట్టమొదటిగా దీన్ని పసిగట్టిన ప్రతిభావంతుడు, తెలివైన పెట్టుబడిదారు హెన్రీఫోర్డ్.

అప్పటికే సంఘటిత శ్రామికశక్తి, కార్మిక యూనియన్లు, పెట్టుబడిపై పోరాట ఆయుధాన్ని ఎక్కుపెట్టాయి. వాటిని కట్టడి చెయ్యాల్సిన అవసరం పెట్టుబడిదారీ వర్గానికి ఏర్పడింది. ఈ అవసరమే ఆటోమేషన్‌కు దారితీసింది. అలా ఉత్పత్తిరంగంలో మొదలైన ఈ ఆటోమేషన్ అనతికాలంలోనే, సాంకేతిక విప్లవ వెల్లువగా పోటెత్తి ఇప్పుడు 4వ, 5వ సాంకేతిక విప్లవ రూపాల్లో మానవాళిని కమ్మేసింది.

ఎసెంబ్లీ లైన్ ఉత్పత్తి విధాన ప్రవేశంతో కార్మికుడు తన శరీర అవయవాల కదలిక వేగాన్ని హఠాత్తుగా పెంచవలసిన అగత్యం ఏర్పడింది. ఊపిరిసలపనీయని, నుదిటి చెమటను కూడా తుడుచుకునే అవకాశం లేని ఆనాటి దుర్భరస్థితిని వర్ణిస్తూ, ఆ వేగం తనను ఎలా అమానవీయం చేస్తున్నదో ఓ శ్రామిక కవి ఆంగ్లంలో గొప్ప కవిత్వం రాసాడు. (ఈ కవితను అనువదించి 'శ్రామికనేస్తం' బులెటిన్లో నేను ప్రచురించాను. అది అందుబాటులో లేక ఇక్కడ ఇవ్వలేకపోతున్నాను). చెప్పేదేమంటే, ఆ కవితకు ఎంతో విలువ ఉన్నప్పటికీ వంగపండు రాసిన 'యంత్రమెట్లా...', 'ఓడానువ్వెళ్ళిపోకే...' అనే గేయాలకున్న వేగం, లోతు, ఊపు అప్పటి ఆ కవితకు లేదు. ఆ ఆంగ్ల కవి రాసిన సందర్భం వేరు. స్పందించి రాసిన ఇతివృత్తం వేరు. ఉత్పత్తి విధానంలో, ఉత్పత్తి క్రమంలో వచ్చిన మార్పు శ్రమను ఎలా దుర్భరం చేసిందో, ఆ మార్పు కార్మికుణ్ణి ఎలా కుదిపివేసిందో అనేదే అక్కడ వస్తువు.

వంగపండు యంత్ర నిర్మాణపు మూలాల్లోకి వెళ్ళాడు. కొండల్లోకి దూరిపోయాడు. ఆ కొండల నుండి ఖనిజాలను తన కలం పాణీతో కుళ్లగించి, పెళ్లగించి ఖార్ఖానాలోకి, మిల్లులోకి, ఇంజనీరు దగ్గరికి, టెక్నీషియన్ దగ్గరకి, కార్మికుని వద్దకు మోసుకొచ్చాడు. యంత్రం రూపుదిద్దమని, మరలు బిగించి నడపమని, ఆ క్రమమంతా వంగపండు యంత్రవేగంతో ఆడి పాడి ఉర్రూతలూగించాడు. సకల జనరంజకం చేసాడు. కాలికిగజ్జ, చేతివేలికి అందెలు (గుండ్రటి చిడతలు), మెరుపుతీగ వంటి శరీర జానపద విన్యాసం, జడివానగళం, సెలయేటిపదం.. ఇలా సాగిపోతుంది ఆయన వాగ్గేయఝరి. ఆయన వాగ్గేయ కళాకృతికి ఇదో పార్శ్వం మాత్రమే! మరో పార్శ్వం విప్లవోద్యమ సంస్కృతీ రంగం.

ఇక ఆ విప్లవోద్యమ పార్శ్వానికి వస్తే...

దేశంలో నక్సల్బరీ ఉద్యమం ఓ ప్రభంజనంలా వీస్తున్న రోజులు. ఆ ఒరవడిలో, శ్రీకాకుళ గిరిజనోద్యమం, సాయుధ పోరాట రూపంగా కొనసాగిన కాలం. ఓట్ల-నోట్ల రాజకీయాలకు ప్రత్యామ్నాయంగా సాగిన ఉద్యమ వెల్లువ. ఆ వెల్లువ నుండి వీచిన విప్లవ సాహిత్య సాంస్కృతికోద్యమ పవనాలు.

ఆ పవనాలు తిరిగి విప్లవోద్యమానికి ఆజ్యం పోశాయి. అభ్యుదయ సాహిత్యంలో ఓ దిగ్గజ పాయ ఈ కొత్త పవనం కొమ్ము కాసింది. ఈ నూతన సాంస్కృతిక ఉద్యమం వైపు సహజ సిద్ధంగా, ఓ జానపద కళాకారునిగా, ఓ శ్రామిక కవి గాయకునిగా వంగపండు ప్రవహించాడు. రమారమి రెండు దశాబ్దాల పాటు ఆ సాంస్కృతికోద్యమంలో ప్రధాన భూమిక పోషించాడు.

జననాట్యమండలి వ్యవస్థాపకుల్లో తాను ఒకణ్ణి అని చెప్పుకున్నప్పటికీ, ఆయన ఆ తొలినాళ్లలో కాక, మలినాళ్ళలో ఆ సంస్థకు కొత్తశక్తిని, నూతనోత్తేజాన్ని అందించాడు. లెక్కకు మించిన జనసభల్లో గేయ కళాప్రదర్శనల్లో పాల్గొని శ్రోతలనుర్రూత లూగించాడు. ఆయన ఓ సహజ కవి గానే ఈ పాత్ర నిర్వహించాడు.

పీడితవర్గ ప్రజారాశుల దైనందిన జీవితాల్లో ఉండే శ్రమ, కష్టాలు, కన్నీళ్లు, వారు ఎదుర్కొనే దోపిడీ, పీడన, అణచివేత, పేదరికం వంటి సమస్యలపై వారిలో ఒకనిగా వంగపండు స్పందించాడు. ఓ జానపదునిగా, జానపదుల బాణీలను ఎంచుకుని, వాటిని విప్లవాత్మకంగా తన సొంతశైలిలో వైవిధ్యభరితంగా గేయ రూపకాలుగా మలచి, తిరిగి ప్రజలకు ఆయన అందించిన తీరు అమోఘమైనది.

ఈ వ్యాస రచనా క్రమంలో జననాట్యమండలిలో ప్రముఖ పాత్ర పోషించిన మరో కళాకారుని ద్వారా నేను తెలుసుకున్న సమాచారం ఇక్కడ ఇస్తున్నాను.

"సుత్తీ కొడవలి గుర్తుగ వున్నా ఎర్రని జెండా! ఎగురుతున్నదీ! ఆకాశంలో అరుణబింబమై! పీడిత జనానికండ దండగా!" అనేపాట వంగపండు రాసిందేనని... అప్పటి నక్సల్బరీ ఉద్యమం, ఎం-ఎల్‌పార్టీ, పీపుల్స్‌వార్, వాటికి ఏర్పడ్డ ప్రాథమిక సైన్యం ప్రతి జండావందన కార్యక్రమంలో, దినచర్యలో ఈ పాటే పాడేవారని, ఇప్పుడు మావోయిస్టు పార్టీ ఆధ్వర్యంలో ఉన్న ప్రజా విముక్త గెరిల్లా సైన్యపు శ్రేణులు... జండా వందన కార్యక్రమానికి అన్ని రాష్ట్రాల్లో, వివిధ భాషల్లో ఇదే పాట పాడతారని, ఈ గౌరవం వంగపండుకే దక్కిందని ఆయన చెప్పాడు.

విషాదమేమంటే వంగపండు తనకు దక్కిన ఆ గౌరవాన్ని తనకు సమకూరని దైనందిన సౌఖ్యాలతో, చేకూరని కనీస వసతులతో తూకమేసుకున్నట్లు కనిపిస్తుంది. బహుశా, వంగపండు ఓ అసంతృప్తునిగా బూర్జువా పార్టీల్లో, సంస్థల్లో చోటు వెదుక్కునే బాట పట్టాడనుకుంటా!.

ఆయన అమాయకత్వం, ట్రిక్కులు తెలియని ఆయన సీదాసాదా వైఖరి అక్కడ పని చేయలేదు. ఆయన కోరుకున్న కనీస వసతులు అక్కడా సమకూరలేదు. ఆయన అటూ ఇటూ కాక చనిపోవడం అత్యంత బాధాకరం.

విప్లవోద్యమం ఆయన్ను ఎందుకు నిలబెట్టుకో లేకపోయిందో, ఆయన ఆ ఉద్యమంలో ఎందుకు కొనసాగలేకపోయాడో నాకు తెలియని విషయాలు.

హిందూ పురాణాల్లో పరమశివుడు కైలాస పర్వత శిఖరాగ్రాన శంఖమూది తాండవం చేస్తాడు. భూమ్మీదకు దిగి వచ్చి భిక్షాటనం చేసుకుంటాడు. పరమ శివుడు జంగమదేవర అవుతాడు. శివశంకరుడు, భోళాశంకరుడౌతాడు. ప్రజల ప్రేమ పొందుతూనే ఉంటాడు. శివుడు శివుడే!

తెలుగు నాట శివమెత్తిన వంగపండుకు వందనం. వంగపండు ఫలసాయానికి, సృష్టించిన గేయ కళా సంపదకు బహువందనం.

(రచయిత శ్రామిక నేస్తం సంపాదకులు) వీ




ఎ. సావిత్రి మృతి

వీక్షణం కలెక్టివ్ సీనియర్ సభ్యుడు, ఉపాధ్యాయ ఉద్యమ నాయకుడు ఎ. నర్సింహారెడ్డి సహచరి సావిత్రి గారు జులై 25 ఉదయం కన్ను మూశారు. రెండు సంవత్సరాలుగా కాన్సర్ వ్యాధి పీడితురాలిగా చికిత్స తీసుకుంటూ, రెండు మూడు సార్లు శస్త్రచికిత్స కూడ జరిగి, కోలుకుంటున్నారనుకున్న దశలో ఈ ఉదయం ఆమె తుదిశ్వాస విడిచారు. వీక్షణం కుటుంబానికి ఇది పెద్ద లోటు. సావిత్రి గారికి జోహార్లు.



సూర్యావతి కన్నుమూత

నాగ్‌పూర్ సెంట్రల్ జైలులో జీవితఖైదు అనుభవిస్తున్న ఆచార్య జిఎన్ సాయిబాబా తల్లి గోకరకొండ సూర్యావతి(74) బంజారాహిల్స్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆగస్టు 1న మరణించారు. ఆమె గత కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. ఆమె స్వస్థలం తూర్పుగోదావరి జిల్లా అమలాపురం. సూర్యావతి క్యాన్సర్ క్యాన్సర్ చికిత్స చేయించుకుంటున్న సమయంలో తన కొడుకు సాయిబాబాకు పెరోల్ అయినా ఇవ్వాలని ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించినా ఫలితం దక్కలేదు. కొడుకుతో మాట్లాడాలని కొద్దిరోజుల క్రితం నాగ్‌పూర్ జైలుకెళ్లినా నిరాశే మిగిలింది.



వంగపండు ప్రసాదరావు మృతి

ప్రజా వాగ్గేయకారుడు వంగపండు ప్రసాదరావు ఆగస్టు 4న విజయనగరం జిల్లా పార్వతీపురంలోని వైకెఎం నగర్‌లో స్వగృహంలో గుండెపోటుతో కన్నుమూశారు. పార్వతీపురం మండలం పెదబొండపల్లి గ్రామంలో 1943లో వంగపండు జన్మించారు. చదువుకునే రోజుల్లోనే ఉద్యమ ప్రభావానికి గురయ్యారు. ఉత్తరాంధ్ర ఉద్యమ నాయకులతో ఏర్పడిన పరిచయంతో ఆయన కళారంగంవైపు మళ్లారు. 1972లో జననాట్యమండలిని ఏర్పాటు చేశారు. ఉద్యమానికి సమయం ఇవ్వలేకపోతున్నాననే ఉద్దేశంతో 1993లో ఉద్యోగానికి స్వచ్ఛంద విరమణ ప్రకటించారు. వంగపండు 300కు పైగా పాటలు రాసి పాడారు. ఆయన రచనల్లో 'భూమి బాగోతం' నాటిక చాలా ప్రాచుర్యం పొందింది. 'ఏం పిల్లడో ఎల్దమొస్తవా' అనే పాట ఉమ్మడి రాష్ట్రంలోని కష్టజీవుల నాలుకల్లో ఆడింది.



జిఎల్ఎన్ మూర్తి మృతి

పౌరహక్కుల సంఘం సీనియర్ సభ్యుడు, పాత్రికేయుడు గురజాడ లక్ష్మీనరసింహమూర్తి(67) ఆగస్టు 8న గుండెపోటుతో మరణించారు. లక్ష్మీనరసింహమూర్తి స్వస్థలం కృష్ణా జిల్లాలోని కైకలూరు గ్రామం. ఆయన హైదరాబాద్ విశ్వవిద్యాలయంలో సీనియర్ ల్యాబ్ అసిస్టెంట్‌గా 2012లో ఉద్యోగ విరమణ చేశారు. మూడు దశాబ్దాల పాటు సెంట్రల్ యూనివర్సిటీ నాన్ టీచింగ్ స్టాఫ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి, అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించారు. పౌరహక్కుల సంఘంలో చురుగ్గా పాల్గొనేవారు. ఆంధ్రజ్యోతి, ఈనాడు, ఆంధ్రభూమి తదితర పత్రికల్లో సాంస్కృతిక కళా రంగాలకు సంబంధించిన రిపోర్టర్‌గా పనిచేశారు.



ఇలినా సేన్ మృతి

రచయిత్రి, సామాజిక కార్యకర్త ఇలినా సేన్ ఆగస్ట్ 9న మరణించారు. ఆమె గత కొంతకాలంగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నారు. ప్రముఖ మానవ హక్కుల కార్యకర్త డా. బినాయక్ సేన్ సహచరి ఇలినా సేన్. ఇలినా ఛత్తీస్‌గడ్‌లో మానవ హక్కుల కోసం ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్నారు. వివిధ ట్రేడ్ యూనియన్లు, ఆదివాసీ సంఘాలతో కలిసి పనిచేశారు. ఆదివాసీలు, ఛత్తీస్‌గడ్‌లోని వలస మహిళా కులీలపై పుస్తకాలు రాశారు. మహారాష్ట్రలోని మహాత్మా గాంధీ ఇందర్నేషనల్ హిందీ విశ్వవిద్యాలయంలో ఉపాధ్యాయురాలుగా పనిచేశారు.



నర్సింగరావు మృతి

ఆదివాసి తుడుందెబ్బ వ్యవస్థాపకుడు డబ్బకట్ల నర్సింగరావు(50) ములుగు జిల్లా రాయినిగూడెంలోని తన స్వగృహంలో ఆగస్టు 25న మృతిచెందారు. బ్రెయిన్ స్ట్రోక్ గురై శస్త్రచికిత్సచేసినా కోలుకోక మృతిచెందారు. ఆదివాసీ సంఘాలు విడివిడిగా ఉండడంకన్నా ఒకటిగా ఉండడమే బలమని భావించిన నర్సింగరావు 1996 ఆగస్టు 6న అన్ని ఆదివాసి సంఘాలను ఒకే గొడుగు కిందకు తెచ్చి తుడుందెబ్బ (ఆదివాసీ హక్కుల పోరాట సమితి)ని స్థాపించారు. ఆదిలాబాద్ నుంచి శ్రీకాకుళం వరకు ఉద్యమాన్ని విస్తరింపజేసి ఆదివాసీ ప్రాంతాల్లో స్వయం పాలనకోసం పోరాడారు. కంతనపల్లి ప్రాజెక్టుకు వ్యతిరేకంగా పోరాడి విజయం సాధించారు.



చల్లపల్లి శ్రీనివాసరావు మృతి

రైతుకూలీ ఉద్యమ నాయకుడు చల్లపల్లి శ్రీనివాసరావు (94) అనారోగ్యంతో ఆగస్టు 26న మృతి చెందారు. శ్రీనివాసరావు కృష్ణా జిల్లా కోడూరు మండలం దింటిమెరక గ్రామంలో మరణించారు. పేదలకు బంజరు భూములు పంచాలంటూ ప్రభుత్వంపై పోరాటం చేశారు. విప్లవకారుడిగా చివరివరకు తన ఆశయాలకు కట్టుబడి ఉన్నారు. దివిసీమ ప్రాంత ప్రజలకు పులిగడ్డ, పెనుమూడి వారధి, డెల్టా పరిరక్షణ వంటి పోరాటాల్లో ఆయన ముందు నిలిచారు. ఉల్లిపాలెం-భవానిపురం వంతెన నిర్మాణానికి ఆయన పోరాడారు. 2004లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నక్సలైట్ పార్టీలకు మధ్య జరిగిన చర్చల్లో జనశక్తి పార్టీ తరపున ప్రతినిధిగా పాల్గొన్నారు.



పి. జస్వంత రావు మృతి

సిపిఐ (ఎంఎల్) కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు పి. జస్వంతరావు ఊపిరితిత్తుల వ్యాధితో ఆగస్ట్ 27న మరణించారు. 'జనశక్తి', క్లాస్ స్ట్రగుల్ పత్రికల సంపాదకులుగా ఉన్నారు. తరిమెల నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 'తాకట్టులో భారతదేశం' పుస్తకానికి సంపాదకులుగా వ్యవహరించారు.

సంస్మరణ

అపార దయామయి ఇలినా సేన్

***ఇటీవల మరణించిన మహిళా అధ్యయనాల అధ్యాపకురాలు, మహిళా, కార్మిక, పౌరహక్కుల ఉద్యమాల నాయకురాలు ఇలినా సేన్ విద్యార్థిగా తన అనుభవాలను పంచుకుంటున్నారు* స్రవంతి దాసరి**

ప్రపంచం ఇలినా మేడమ్‌ను కోల్పోయిందనే వార్తతో ఇవాళ నేను మేలుకున్నాను. నా గుండె పగిలిపోయింది. ఆగ్రహం కలిగింది. దుఃఖం కలిగింది. అటువంటి వ్యక్తి అంతగా వేదన పడి, పోరాడి, చివరికి వెళిపోవలసి వచ్చిన ఈ ప్రపంచపు అపసవ్యత నాకు అర్థం కావడం లేదు.

ఇలినా మామ్ నాకు ఎంఫిల్‌లో సూపర్వైజర్. మా పరిశోధనా, విద్యా ఆసక్తులలో ఏకీభావం కనబడి ఆమె నన్ను తన విద్యార్థిగా తీసుకున్నారు. ఈ ఏకీభావానికి చేరడానికి ముందు నా జీవితంలో ఎన్ని సంబంధం లేవనిపించిన దారుల్లో నేను నడిచానో. ఆ దారులన్నిటికీ నేను ఎప్పటికీ కృతజ్ఞురాలినై ఉంటాను. అలా ఆమెను, నా అధ్యాపకురాలిని, నా మార్గదర్శిని, నా ప్రేరణను నేను చేరుకున్నాను.

ఆమె బోధించిన రెండు పాఠ్యాంశాలకూ విద్యార్థిని కావడం నా అదృష్టం. ఆ బోధనలో ఆమె తరగతి గది అవసరాలను బట్టి అప్రయత్నంగా హిందీలోకీ ఇంగ్లిష్ లోకీ మారుతుండేవారు. సంక్లిష్టమైన సైద్ధాంతిక విషయాలను ఆమె అత్యంత సులభమైన, ఎవరైనా తమతో అనుసంధానించుకోగలిగిన పద్ధతిలో బోధించేవారు. మా విద్యార్థుల పనిని, మా పరీక్షపత్రాలను, మా ఆలోచనలను ఆమె చాల విలువైనవిగా చూసేవారు. ఆమె సుదృఢంగా ఉండేవారు, అపార ప్రజ్ఞతో ఉండేవారు. ఆమె అధ్యయనం అనంతం. చాల అందంగా ఉండేవారు. నమ్మలేనంత దయతో ఉండేవారు. ఆమె జీవితమూ కృషీ తరగతి గదుల గోడలు దాటి చాలదూరం విస్తరించాయి. అయినా ఆమె మమ్మల్ని మేం గొప్ప మేధావులుగా భావించుకునేలా చేసేవారు. మేం మా పరీక్ష పత్రాలను అరకొరగా రాసేవాళ్లం. చదవవలసినవన్నీ చదవలేకపోయేవాళ్లం, గంభీరమైన వ్యాఖ్యలు చేసేవాళ్లం. అయినా ఆమె వాటిని చాల జాగ్రత్తగా పరిశీలించేవారు. ఆమె రోజంతా ఏ పనీ లేకుండా ఏదో ఒక చెట్టు కింద కూచుని, మాకు బోధించడం కన్న అదే మంచి పని అనుకోవచ్చునని నా స్నేహితురాలు ఆంచల్, నేనూ పరిహాసం ఆడుకునేవాళ్లం. అయినా, మేం ఇలా అనుకున్నామని తెలిసినా సరే, ఆమె గట్టిగా అది తప్పని వాదించేవారు.

ఆమె మాకు దక్షిణాసియాలో మహిళల రచనలు, రాజకీయాలు అనే పాఠ్యాంశాన్ని బోధించారు. అలా మేం సరిహద్దులను అధిగమించి ఎన్నో కథలూ నవలలూ చదివాం. ఆ పాఠాలలో నాకు బాగా ఇష్టంగా గుర్తుండిపోయిన పాఠం ఒకటి ఆమె చెప్పిన ఒక కథ. ఆ కథలో పురుష పాత్ర గురించి మాట్లాడుతూ ఆమె ఒక బూతు మాట వాడారు. అది విని నేను దిగ్భ్రాంతి తోనూ, సంతోషంతోనూ ఎగిరి గంతేశాను. ఆమె అలా నా హృదయాన్ని తాకేలా చెప్పగలిగారన్నమాట.

మాట్లాడడం, తన భావాల్ని వ్యక్తీకరించడం ఆమెకు ఎంతో సులభంగా ఉండేది. విద్యారంగంలో నాకేవో కొరతలున్నాయనే భావన రాకుండా నేను వ్యవహరించగలిగింది ఆమె ఒక్కదానితోనే. నేను ఉన్నట్టుగా ఉండవచ్చు. నా శక్తి సామర్థ్యాలు సరిపోతాయి. నా అనుభవాలు సరిపోతాయి. అలా అనిపించేలా చేయడమంటే నాకు ఇవ్వవలసిందాని కన్న ఎక్కువ దయ ఇవ్వడమన్నమాట. నేనేమీ ఉత్తమ విద్యార్థిని కాను. నేను తరగతులు ఎగ్గొట్టి, నెలల తరబడి కనబడకుండా పోతుండేదాన్ని. అర్థరహితమైన పద్ధతులలో వాయిదాలు వేస్తుండేదాన్ని. (నా సిద్ధాంత వ్యాసం సమర్పణ చిట్టచివరి క్షణంలో జరిగిందని అన్నారామె). అయినా, ఆమె తనంతట తానే తన మెత్తని శైలిలో, సుహృద్భావంతో నా కోసం కబురు పంపేది. నేను ఎలా ఉన్నానని కనుక్కునేది. నేనేమి చేస్తున్నానో అడిగేది. నా పనిలో ఏమన్నా సాయం కావాలా అని అడిగేది. ఇవాళ మళ్లీ ఒకసారి ఆమె ఇమెయిల్స్ చూస్తుంటే, ఒకదానిలో ఆమె, "స్రవంతీ, నేను నిన్ను వెంటాడుతున్నానని అనుకోకు..." అని ప్రారంభించింది. ఇదంతా ఇంకా ముఖ్యమైనది ఎందుకవుతుందంటే, సరిగ్గా ఇదంతా జరుగుతున్నప్పుడే ఆమెకు కాన్సర్ వ్యాధికి చికిత్స జరుగుతుండింది. ఆ వ్యాధి తిరగబెడుతుండింది. ఆమె ఒక భయానకమైన శారీరక వేదనను అనుభవిస్తున్నారు, అయినా నా పనికిరాని సిద్ధాంతపత్రానికి ఆమె అంత ప్రాధాన్యత ఇచ్చారు. నేను నా సిద్ధాంతపత్రం రాస్తున్నప్పుడు ఆమె వెల్లూరు సిఎంసి ఆస్పత్రిలో రేడియేషన్ చికిత్స తీసుకుంటున్నారు. శరీరానికి తగిలించిన యంత్రాలతోనే ఆమె నా సిద్ధాంతపత్రపు అధ్యాయాలు చదివారు, దిద్దారు. ఇది నమ్మగలరా?

ఆమె దగ్గర నాకెప్పుడూ బెరుకుగా ఉండేది. కాని ఆమె ఔదార్యమూ, దయా విస్తారమైనవి. ఆమెకు తన విద్యార్థులందరూ గుర్తుండేవాళ్లు. నేను ఆమెతో నిత్య సంబంధంలో లేనని, మధ్యమధ్య తప్పిపోతున్నానని, అవసరం వస్తేనే వెళ్లి కలుస్తున్నాననీ ఆమె ఎప్పుడూ కోపం పెట్టుకోలేదు. నేనామెతో నా మానసిక ఆందోళనల గురించి కూడ మాట్లాడాను. నాకొక రాజకీయ లక్ష్యాన్ని ఏర్పరచుకోవడం గురించీ, రాజకీయ పరమైన వేదన గురించీ (2016లో) మాట్లాడాను. నా తరానికి రాజకీయంగా క్రియాశీలంగా ఉండడం చాల చాల కష్టతరంగా మారిందని ఆమె నన్ను ఓదార్చారు. మాకు అందిన నయా ఉదారవాద ప్రపంచంతో మా పోరాటాలను ఆమె అర్థం చేసుకున్నారు. నాకంటూ ఒక సమూహాన్ని, మిత్ర బృందాన్ని ఏర్పరచుకొమ్మని ఆమె సూచించారు. ఆ సలహానే నేనింతవరకూ పాటిస్తున్నాను. నన్ను రక్షించిన ఏకైక సలహా అది. అలాగే విద్యాసంబంధమైన రచనలో నా సమస్యల గురించి కూడ నేనామెతో మాట్లాడాను. "నేనూ సులభంగానే రాస్తాను. అంటే తేలికపరచడమేమీ కాదు. నువ్వు కూడ అలా సులభంగా రాయవచ్చుననుకుంటాను" అన్నారామె. తాను చేస్తున్న కోటానుకోట్ల పనుల మధ్య నుంచి ఆమె 2017లో ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ విమెన్స్ స్టడీస్ సదస్సుకు ఒక పత్రం సమర్పించడం వీలవుతుందా అని నాకొక ఉత్తరం రాశారు.

భారత్ - చైనా సరిహద్దు వివాదం

ప్రముఖ గాంధేయవాది, స్వాతంత్ర్య సమరయోధుడు, భారత–చైనా మిత్రమండలి నాయకుడు **పండిట్ సుందరలాల్** *1962 భారత–చైనా యుద్ధం సందర్భంలో భారత–చైనా సరిహద్దు వివాదంపై వివరమైన వ్యాసం రాశారు. ఆంధ్రప్రదేశ్ భారత–చైనా మిత్రమండలి 1981లో ఆ వ్యాసం తెలుగు అనువాదాన్ని చిన్న పుస్తకంగా ప్రచురించింది. భారత–చైనా మిత్రమండలి రాసిన ముందుమాటతో సహా ఆ వ్యాసాన్ని పాఠకుల అవగాహన కోసం పునర్ముద్రిస్తున్నాం. – సం.*

(**జూ**న్ మూడవ వారంలో సోషలిస్టు చైనా ప్రభుత్వ విదేశాంగ మంత్రి భారతదేశానికి వస్తున్నాడు. భారత–చైనా దేశాల మధ్య స్నేహ పూర్వక సంబంధాలు మెరుగుపరుచుకోవడానికి ఆయన మన దేశానికి వస్తున్నాడు. ఈ సమస్యపై మన ప్రభుత్వంతో సంప్రదింపులకు వస్తున్నాడు. భారత–చైనా సరిహద్దు తగవు దగ్గరి నుండి రెండు దేశాల మధ్య ఆర్థిక, రాజకీయ, మైత్రీ సంబంధాలు మెరుగు పరుచుకొనే లక్ష్యంతోనే చైనా ప్రభుత్వ విదేశాంగ మంత్రి మన దేశం వస్తున్నాడు. చైనా ప్రభుత్వ చొరవతోనే ఈ సమావేశం జరుగు తున్నది.

దీనిని సాకుగా తీసుకొని మన దేశంలోని కొన్ని అభివృద్ధి నిరోధక శక్తులు, సోవియట్ అనుకూల శక్తులు మన ప్రజల్లో చైనా వ్యతిరేక దుమారం రెచ్చగొట్టడానికి పూనుకున్నాయి. చైనా భారత భూభాగాన్ని సైనికంగా ఆక్రమించి ఉన్నదని దుమారం రేగ్గొడుతున్నారు.

1962 భారత–చైనా సరిహద్దు వివాదం

1962లో భారత–చైనా సరిహద్దు సమస్య పై వివాదం తలెత్తింది. మిలిటరీ ఘర్షణకు దారితీసింది. ఈ ఘర్షణకు కారకులెవ్వరు?

1947లో బ్రిటిష్ సామ్రాజ్యవాదం భారతపాలక వర్గాలకు అధికారాన్ని మార్పిడి చేసింది. భారతబడా బూర్జువా - బడా భూస్వామ్య పాలక వర్గాల తరపున కాంగ్రెస్ అధికారం చేపట్టింది.

చైనాలో 1949లో చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన దీర్ఘకాల ప్రజాయుద్ధం సాగింది. అర్ధవలస, అర్ధ భూస్వామ్య వ్యవస్థ సాయుధ పోరాటంతో కూల దోయబడింది. నూతన ప్రజాస్వామిక ప్రభుత్వాన్ని స్థాపించుకున్నారు. భూస్వామ్య వ్యవస్థను బద్దలు చేశారు. దున్నే వాడికే భూమి సూత్రం అమలు జరిపారు. పెద్ద, కోటీశ్వరుల, పెద్ద భూస్వామ్య దోపిడి వ్యవస్థను అంతంచేశారు. సోషలిస్టు సమాజ నిర్మాణానికి పూనుకున్నారు.

టిబెట్ చారిత్రికంగా చైనాకు చెందింది. కాని అక్కడ అధికారం లామాల చేతిలో ఉండింది. వారు ఛ్లనాటి ఫ్యూడల్ వ్యవస్థను కాపాడుకొనుటకు కుట్రలు సాగించారు. కాని సోషలిస్టు చైనా ఈ కుట్రలు సాగనివ్వలేదు. 1959లో టిబెట్‌లో కూడా భూస్వామ్య వ్యవస్థను బద్దలు చేయుటకు పూనుకుంది. దున్నే వాడికి భూమి సూత్రం అమలు పరుచుటకు పూనుకుంది.

ఏమి చేయాలో తెలియకుండా అర్థం లేకుండా గాలిలో తిరుగులాడే ఒకానొక విద్యార్థినైన నన్ను ఒక రచన అడగడం! ఆ పత్రం రాసి అక్కడ సమర్పించడం నాకొక సంతోషం. ఆమెను నేను కలవడం అదే చివరిసారి.

నేనామెకు కృతజ్ఞురాలిని. ఎంతగానో కృతజ్ఞురాలిని. ఆమె నాకు తన దయనే కానుకగా ఇచ్చింది. ఆ దయ ఒక రాజకీయపరమైన దయ. అది సాధ్యమే అని ఆమె నాకు చూపింది. ప్రతి రోజూ ప్రతి స్థలంలోనూ దయ ఉంటుందని ఆమె నాకు చూపింది. భిన్నాభిప్రాయాలున్న చోట కూడ దయకు అవకాశం ఉందని ఆమె నాకు చూపింది. మనందరికీ ఎటువంటి ఉపాధ్యాయులు, ఎటువంటి ప్రోత్సాహకులు కావాలో ఆమె నాకు చూపింది. ఇవాళ విద్యాసంబంధమైన ప్రోత్సాహకుల్లో గాని, ఇతర ప్రోత్సాహకుల్లో గాని నేను చూసే ఏకైక, అత్యంత ప్రధానమైన లక్షణం దయ మాత్రమే. ఆమె నుంచి నాకది అందింది. అందువల్ల ఇప్పుడు అన్ని స్థలాల నుంచీ అటువంటి దయనే ఆకాంక్షించవచ్చుననీ, ఆశించవచ్చుననీ నాకిప్పుడు తెలుసు. విద్యావ్యవస్థలో చేరితే నేను ఎటువంటి వ్యక్తిగా ఉండాలో నాకిప్పుడు తెలుసు. నా జీవితకాలంలో నేను ఆమెలా ఉండలేనని నాకు తెలుసు. కాని అధ్యాపకురాలిగానూ, వ్యక్తిగానూ ఆమె ఎటువంటి మనిషో అందులో ఒక చిన్న భాగాన్నయినా నా జీవితం సార్థకమైనట్టే.

వీడ్కోలు, మామ్, మీరందించిన అన్నిటికీ కృతజ్ఞతలు.

(భారత మహిళా, కార్మిక, పౌరహక్కుల ఉద్యమాల కార్యకర్తగా సుప్రసిద్ధురాలైన ప్రొఫెసర్ ఇలినా సేన్ ఆగస్ట్ 9న మరణించారు. 1970ల చివరా, 1980ల మొదటా ఢిల్లీ జెఎన్‌యులో సమాజశాస్త్ర విద్యార్థిగా, పరిశోధకురాలిగా ప్రజా ఉద్యమాలతో సంబంధంలోకి వచ్చిన ఇలినా అప్పటి మధ్యప్రదేశ్‌లో విద్యారంగంలో ప్రయోగాలు జరిపిన కిశోర్ భారతితో కొంతకాలం పనిచేశారు. ఆ తర్వాత శంకర్ గుహ నియోగి నాయకత్వంలోని కార్మికోద్యమంతో ప్రభావితమై, దల్లీ రాజ్ హరాలో చత్తీస్‌గడ్ మైన్స్ శ్రామిక్ సంఘ్ కార్యకర్తగా మారారు. ఆమె సహచరుడు డా. బినాయక్ సేన్‌తో కలిసి అక్కడ కార్మికుల కోసం ఆస్పత్రి నెలకొల్పారు. పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్‌లో పని చేశారు. తర్వాతి కాలంలో వార్ధా లోని మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయంలోనూ, బొంబాయిలోని టాటా ఇన్ స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ లోనూ సమాజ శాస్త్ర, మహిళా అధ్యయనాల అధ్యాపకురాలిగా పనిచేశారు. కొంతకాలం సహచరుడు బినాయక్ సేన్ నిర్బంధంతో, ఆ తర్వాత కాన్సర్ వ్యాధి తో గత పది సంవత్సరాలుగా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ, చివరిదాకా ప్రజానుకూల ఆలోచనాపరురాలిగా, ప్రజాఉద్యమాల కార్యకర్తగా పనిచేస్తూనే ఉన్నారు).

(రచయిత్రి పరిశోధక విద్యార్థి) వీ

దీనిని అక్కడి లామాలు వ్యతిరేకించారు. అమెరికా సామ్రాజ్యవాదం వ్యతిరేకించింది. భారతదేశంలోని అభివృద్ధి నిరోధకులు వ్యతిరేకించారు. లామాల తిరుగుబాటును ప్రోత్సహించారు. కాని టిబెట్ ప్రజలు ఈ తిరుగుబాటును ఓడించారు. లామాల ఆటకట్టించబడింది. దీనితో దలై లామా మత గురువు నాయకత్వంలో లామాలు టిబెట్ వదలి భారతదేశంలో మకాం పెట్టారు. ఆనాటి నుండి వీరు సోషలిస్టు చైనాకు వ్యతిరేకంగా కుట్రలు సాగించుటకు పూనుకున్నారు. ఆ లామాల తిరుగుబాటు ఓడిపోవటంతో అమెరికా సామ్రాజ్యవాదం ప్రోత్సాహంతో మన దేశంలో చైనా వ్యతిరేకత రెచ్చగొట్టుటకు అభివృద్ధి నిరోధకులు కొత్త కుట్రలు వెతికారు. చైనాకు చెందిన అక్సాయ్ చిన్ ప్రాంతంలో చైనా రోడ్డు వేసిందన్నారు. ఇది భారతభూభాగమన్నారు. చైనా దురాక్రమణ అని గగ్గోలు ప్రారంభించారు.

చైనా సోషలిస్టు సమాజ నిర్మాణంలో పురోగమిస్తున్న రోజులు. అదే సమయంలో భారతదేశంలో పెద్ద కోటీశ్వరుల, పెద్ద భూస్వాముల దోపిడి కొనసాగుతోంది. ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోంది. విప్లవోద్యమం పెరుగుతోంది. ఈ ప్రజా పోరాటాలు పక్కదార్లు పట్టించటానికే ఆనాడు భారతఅభివృద్ధి నిరోధకులు, అమెరికా ప్రోత్సాహంతో చైనా వ్యతిరేక దురహంకారం రెచ్చగొట్టుటకు పూనుకున్నారు.

ఈ పరిస్థితుల్లో ఈ సరిహద్దు తగువు పరిష్కరించడానికి ఆనాటి చైనా ప్రధాన మంత్రి భారతదేశానికి ఆనాడు వచ్చాడు. ఆనాటి భారతప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ, తదితర ప్రభుత్వ నాయకులతో సంప్రదింపులు సాగించాడు. ఇచ్చి పుచ్చుకునే పద్ధతిలో ఈ సమస్యను పరిష్కరించుకొనుటకు ఆనాడు చైనా గట్టిగా ప్రయత్నించింది. వెంటనే రాజీకుదరలేదు. వివాదాస్పదమైన భూభాగంలో నూతనంగా ఎవ్వరూ ప్రవేశించకూడదని భారత–చైనాలు రెండూ ఒక అంగీకారానికి వచ్చాయి.

ఈ అంగీకారాన్ని ఉల్లంఘించింది ఆనాటి నెహ్రూ ప్రభుత్వం. వివాదాస్పద భూభాగాల్ని సైనికంగా ఆక్రమించుటకు ప్రయత్నించింది. నెహ్రూ ప్రభుత్వం. తిరిగి వివాదాస్పద భూభాగాన్ని వదిలి వెళ్లింది చైనా ప్రభుత్వం. పట్టుకున్న సైన్యాలను, ఆయుధాలను ఎలాంటి షరతులు లేకుండా భారతప్రభుత్వానికి అప్పచెప్పింది చైనా ప్రభుత్వం.

ఇవన్నీ 1962 నాటి ఘటనలు. ఈ వాస్తవాన్ని ఆ యుద్ధంలో పాల్గొన్న జనరల్ కౌల్ "అన్‌టోల్డ్ స్టోరీ" అనే గ్రంథంలో వివరంగా రాశాడు. భారతదేశమే 'దురాక్రమణకు' పూనుకుందని రుజువుపర్చాడు. దానినే బ్రిటిష్ రచయిత మాక్స్‌వెల్ "ఇండియాస్ చైనా వార్" అనే గ్రంథంలో గవర్నమెంటు డాక్యుమెంట్ల ఆధారంగా రుజువుపర్చాడు.

భారతదేశమే చైనా పై 'దురాక్రమణకు' పూనుకున్న వాస్తవాన్ని స్వర్గీయ పండిట్ సుందర్ లాల్ రాసిన వ్యాసంలోనూ రుజువుపర్చాడు. ఆయన కమ్యూనిస్టు కాదు. గాంధేయవాది. నెహ్రూకు అతి సన్నిహితుడైన మిత్రుడు. ఈ సమస్యపై చైనా–భారతరష్యాలతో సంప్రదింపులు సాగించిన ముఖ్యుడు. ఆయన వ్యాసంలో "భారతదేశంపై చైనా ఆక్రమణగా చెప్పబడే ఆ విషయంగా నిజంగా భారతదేశంపై ఆక్రమణ కానేకాదని చైనా సైన్యాలు భారతదేశ పాలనలోవున్న ఏ భాగంలోకి, ఎప్పుడూ అడుగు పెట్టలేదని" స్పష్టంగా ప్రకటించాడు.

ఈనాటి పరిస్థితి

ఈనాడు పండిట్ సుందర్ లాల్ మనకు లేడు. ఆయన ఇటీవలే కొద్ది రోజుల క్రితం చనిపోయారు. అయినా భారత–చైనా సరిహద్దు వివాదానికి సంబంధించిన వాస్తవాలను ఆనాడు ఆయన ప్రకటించాడు. దానినే ఇక్కడ మేము ప్రకటిస్తున్నాం.

చైనా–భారతదేశాలు ఆసియా ఖండంలో గొప్ప దేశాలు. ఈనాడు ప్రపంచ పెత్తనం కొరకు అమెరికా, సోవియట్ సామ్రాజ్యవాదులు పోటీపడుతున్నారు. దక్షిణ ఆసియా దేశాలపై పెత్తనం కొరకు పోటీ పడుతున్నారు. ఈ పోటీలో భాగంగా రష్యా సోషల్ సామ్రాజ్యవాదుల సైన్యాలు ఇప్పటికే ఆఫ్ఘనిస్తాన్‌ను ఆక్రమించుకొని ఉన్నాయి. ఇది పాకిస్తాన్‌కు భారతదేశానికి రెండింటికి ప్రమాదకరమైన ఘటన. అలాగే అమెరికా డిగోగార్షియాలో సైనిక స్థావరాన్ని నిర్మించుకుంటుంది. ఇది భారతదేశంతో పాటు హిందూ మహాసముద్రంలోని దేశాలకన్నింటికీ ప్రమాదకరమైంది.

ఈనాడు ఆసియా దేశాలన్నీ ముఖ్యంగా దక్షిణ ఆసియా దేశాలన్నీ, రెండు అగ్రరాజ్యాల దురాక్రమణల కుట్రలను ఐక్యంగా ఎదుర్కొని ఓడించాల్సిన అవసరం ఉంది. ఈ లక్ష్య సాధనకే ఈనాడు సోషలిస్టు చైనా ప్రభుత్వ విదేశాంగ మంత్రి మన దేశానికి వస్తున్నాడు. చైనాకు చెందిన ఆక్సాయ్ చిన్ ప్రాంతం చైనాకు వదలడం, మెక్ మోహన్ రేఖ ప్రాంతం మొత్తం తగాదా భూమిని భారతదేశానికి వదలడం – ఈ విధంగా ఇచ్చి పుచ్చుకునే పద్ధతిలో భారతచైనా సరిహద్దు వివాదాల్ని పరిష్కరించుకుందామని చైనా ప్రతిపాదిస్తున్నది. ఒక వేపు సరిహద్దు సమస్య వెంటనే పరిష్కరించలేకపోయినా, ఇతర అంశాలలో స్నేహపూర్వక సంబంధాలు పెంచుకుందామని ప్రతిపాదిస్తూ వుంది. భారత–చైనా మైత్రీ సంబంధాలు కోరే వారందరూ హర్షించతగ్గ ప్రతిపాదనలు ఇవి.

కాని బారత దేశంలోని పాలకవర్గాలలో కొన్నిటికి ఇది గిట్టదు. ఈ శక్తులు ఇప్పటికీ భారత–చైనా సరిహద్దు తగాదాను రావణాసురుడి కాష్టం లాగా అట్టి పెట్టడానికే కుట్రలు సాగిస్తున్నాయి. ఇప్పటికే కొన్ని పత్రికలలో చైనా వ్యతిరేక దుమారం ప్రారంభించారు.

దీనికి సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదులు భారతదేశంలోని మిత్రులు ముఖ్యంగా కమ్యూనిస్టులమని చెప్పుకునే పాత, కొత్త రివిజనిస్టు చైనా వ్యతిరేక దుష్ప్రచారానికి కంకణం కట్టుకొని ముందుకు వస్తున్నారు. పాత రివిజనిస్టులు భారతభూభాగంలో ఒక్క అంగుళం కూడా చైనాకు ఇవ్వకూడదని రంకెలు వేస్తూ వుంటే, ఇక మార్క్సిస్టు పార్టీ నాయకులు "చైనా–పాకిస్తాన్–అమెరికాలు భారతవ్యతిరేక కుట్రలు సాగిస్తున్నాయని" పచ్చి అబద్ధపు ప్రచారానికి దిగారు.

వాస్తవమేమంటే, ఇప్పటికీ సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదులు ఇతర సామ్రాజ్యవాద దేశాలకంటే పైచేయి సంపాదించుకున్నారు. మన పబ్లిక్ రంగ పరిశ్రమలపై ఆధిపత్యం వారిది. మన ఎగుమతి–దిగుమతి వ్యాపారంలో పైచేయి వారిది. మన సైన్యానికి అవసరమైన ఆయుధాలు సరఫరా చేయడంలో గుత్తాధిపత్యం వారిది. దీనికి తోడుగా ప్రభుత్వంతో ఒక మిలిటరీ ఒడంబడిక చేసుకుంది. ఇప్పుడు ఆఫ్ఘనిస్తాన్‌లో 2 లక్షల సైన్యాన్ని కేంద్రీకరించి ఉంది. దీనితో మన దేశం రష్యా నయావలసగా మారే ప్రమాదం పెరిగింది.

దక్షిణాసియా దేశాలపై పెత్తనం సంపాదించుకొనుటకు కుట్రలు సాగిస్తున్న రెండు అగ్రరాజ్యాలు- అమెరికా-రష్యాల పథకాలను ఓడించవలసిన అవసరం ఉంది. ఇందుకు అమెరికా పైన, రష్యా పైన ఆధారపడటం తెలివి తక్కువ. ఇందుకు సోషలిస్టు చైనా, పాకిస్తాన్, బంగ్లాదేశ్, భారతదేశం ఈ దేశాలు మధ్య ఐక్యత ఒక్కటే మార్గం. దీనిని గుర్తించిన సోషలిస్టు చైనా చిత్తశుద్ధితో కృషి చేస్తూ ఉంది. ఈ కృషిలో భాగంగానే ఇటీవల చైనా ప్రధాన మంత్రి పాకిస్తాన్, నేపాల్, బంగ్లాదేశ్‌లు సందర్శించాడు. ఇప్పుడు చైనా విదేశాంగ మంత్రి మనదేశానికి వస్తున్నాడు.

సోవియట్ దురాక్రమణ పథకాలను ఓడించడానికి సోవియట్ వ్యతిరేక ఐక్య సంఘటన ఏర్పరచడం తమ కెలాంటి లక్ష్యం లేదని చైనా ప్రధానమంత్రి ఇటీవల చేసిన ప్రకటన గుర్తుంచుకోవడం అవసరం. సోవియట్ దురాక్రమణ పథకాలను ఓడించడమంటే సోవియట్ ప్రజలకు ఎంతమాత్రము వ్యతిరేకం కాదు' అనుభవంలో సోవియట్ ప్రజలు కూడా ఈనాటి సోవియట్ పరిపాలకుల దురా(కమణ పథకాలను ప్రతిఘటించి తీరుతారని మా గాఢమైన విశ్వాసం.

ఆసియాలో శాంతిని కాపాడటానికి, దక్షిణాసియాలో శాంతిని కాపాడటానికి ఈ దేశాలు సంపూర్ణ సార్వభౌమాధికారాన్ని సంపాదించు కోవడానికి, రెండు అగ్రరాజ్యాల కుట్రలను ఓడించడానికి భారత-చైనా మైత్రి అవసరమని మేము గాఢంగా నమ్ముతున్నాం. ఇందుకు దేశంలో బలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించవలసిన అవసరం ఉంది. సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదుల, వారి మిత్రులు అభివృద్ధి నిరోధక పాలకవర్గాలు, రివిజనిస్టు, నయా రివిజనిస్టుల కుట్రలను ఓడించవలసిన అవసరం వుంది.

ఈ అభివృద్ధి నిరోధక శక్తులు చైనాపై సాగిస్తున్న దుష్ప్రచారానికి చెంప పెట్టుగా ఆనాడు పండిట్ సుందర్ లాల్ రాసిన వ్యాసాన్ని ఇక్కడ ప్రచురిస్తున్నాం. భారత-చైనా సరిహద్దు వివాదానికి సంబంధించిన వాస్తవాలను ఈ వ్యాసం బహిరంగ పరుస్తుంది. - భారత-చైనా మిత్ర మండలి.)

❖ ❖ ❖

భారతచైనా దేశాలు రెండూ, ప్రపంచంలోని అత్యంత పురాతనమైన దేశాలు. అంతే కాకుండా ఈ రెండూ, ప్రపంచంలో కెల్లా పెద్ద దేశాలు గూడా. కొంచెం తక్కువగా భూగోళం మీది సగం జనాభా ఈ రెండు దేశాల్లోనే ఉంది. ఇవి ఒక సుదీర్ఘమైన సహజమైన సరిహద్దును కలిగి ఉన్నాయి. ఒక పాశ్చాత్య రచయిత చెప్పినట్టు బలమైన రెండు నాగరికతల గురించి నొక్కిచెప్పడం కొరకే హిమాలయాలు రెంటినీ విభజిస్తున్నాయి. ఈ వ్యాసంలో ఇరుపక్షాలు సగర్వంగా అనుభూతి చెందగలంత భద్రంగా ఈ రెండు దేశాల గత సంబంధాలను గురించి చెప్పడం నా అభిమతం కాదు.

చారిత్రక శక్తుల క్రియా క్రమంలో, సుమారు 25 సం॥రాల క్రితం భారతదేశం బ్రిటిష్ ప్రభుత్వ పాలనలో ఉంటే, చైనా, ఆచరణరీత్యా అమెరికా ప్రయోజనాలను కాపాడి పెట్టే చాంగ్ కై షేక్ నాయకత్వం వహిస్తున్న కొమింటాంగ్ పార్టీ పెత్తనం కింద ఉంది. రెండు దేశాలు గూడా కొంతకాలం క్రితం, తమను తాము విదేశీ ఆధిపత్యం నుండి విముక్తి చేసుకోవడానికి పోరాటం చేసినవే భారతదేశం, బ్రిటిష్ అధికారం నుండి బైటపడడానికి ప్రయత్నించినట్టే-చైనా, అమెరికా అధిపత్యం వహించే కొమింటాంగ్ పార్టీ పెత్తనం నుండి విమోచన పొందడానికి ప్రయత్నం చేసింది. చైనా విముక్తి గురించి మాట్లాడుతూ బ్రిటిష్ పాలన నుండి భారతదేశం విముక్తి పొందిన సందర్భాన్ని పురస్కరించుకొని మహాత్మ గాంధీ తన అభిప్రాయన్ని ఇట్లా వ్యక్తంచేశాడు. "తమ క్షేమం కొరకు, ఆసియా క్షేమం కొరకు, ప్రపంచ క్షేమంకొరకు, స్వతంత్ర భారతదేశం, విముక్తి చైనా దేశం పరస్పర సహకారంతో, స్నేహంతో కలిసి పనిచేసేరోజు రావాలని నేను కోరు కొంటున్నాను."

-ఇండియా 1947లో స్వతంత్రమైంది. చైనా 1949లో విముక్తమైంది. 1961లో జవహర్ లాల్ నెహ్రూ మరికొందరు స్నేహితులు కలిసి, గాంధీ కోరిక నెరవేర్చడం కొరకు చైనాకు భారత సుహృద్భావ సంఘం(ఇండియన్ గుడ్‌విల్ మిషన్) పంపించాలని నిర్ణయించడం జరిగింది..

జవహర్లాల్ ఆ కమిషన్‌కు నాయకత్వం వహించమని నన్ను కోరాడు. నేను, అతడు కూర్చొని అందులోని మిగతా సభ్యులను ఎన్నుకున్నాం. వాళ్లు : (1) డా. జె. సి. కొమరప్ప, (2) పొ. వి. కె. ఆర్ .వి. రావు, (8) ఆర్. కె. కరంజియా, (4) డా. ముల్క్ రాజ్ ఆనంద్, (5) ఖ్వాజా అమ్మద్ అబ్బాస్, (6) జి. పి. హథీసింగ్, (7) పొ. మహ్మద్ హబీబ్ ఆఫ్ ఆలీగడ్, (8) ప్రొ. మహ్మద్ ముజీబ్ ఆఫ్ జామియా మిలయా, (9) శ్రీమతి హన్నా సేన్ . (10) ప్రొ. నిర్మల్ బి. భట్టాచార్య, (11) మాతాదీన్ బాఘేరియా, (12) ప్రొ. త్రిపురారి చక్రవర్తి వీరుగాక పురుషోత్తం ప్రసాద్, వి. కళ్యాణం కార్యదర్శులుగా నిర్ణయించబడ్డారు.

మా ప్రతినిధి వర్గానికి చైనాలో ఎంతో ఘనమైన హృదయపూర్వకమైన స్వాగతం లభించింది. చైనాలోని భారత రాయబారి కె.ఎం. ఫణిక్కర్ ఆయన కార్యాలయ సభ్యులు, చైనా ప్రభుత్వోద్యోగులేకాక, చైర్మన్ మావో సేటుంగ్, ప్రధాని చౌ ఎన్ లై , కొ-ము-జో, డా. టిన్ - సి-లిన్‌లు ఇంకా తదితరులు మమ్మల్ని ఆహ్వానించిన వారిలో ఉన్నారు.

మా ప్రతినిధి వర్గం చైనా సందర్శన ఫలితంగా చైనాలో డా. టిన్ - సి - లిన్ అధ్యక్షతన చైనా - భారత స్నేహ సంఘం, ఇండియా - చైనా స్నేహ సంఘం ఏర్పడ్డాయి. రెండు దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలు స్థాపించుకొని వృద్ధి చేసుకొనే పనిలో భాగంగా, కొందరు యువకులు భారతదేశ చరిత్రను పెకింగ్ యూనివర్సిటీలో బోధించడానికి చైనాకు పంపించబడ్డారు. అదే విధంగా చైనా నుండి కొంత మంది యువ మేధావులు, శాంతినికేతనం మరికొన్ని విద్యాలయాల్లో చైనా భాషను, జీవితాన్ని బోధించడానికి వచ్చారు. నేను భారతదేశా నికి తిరిగి వచ్చాక 1967లో 'చైనా టుడే' అనే పుస్తకం రాశాను. ఈ పుస్తకం పై పైనే అమ్ముడుపోయింది. నాలాగే డా. కుమారప్ప గూడా చైనా మీద గ్రంథాలు రాశాడు. కొన్ని సంవత్సరాలపాటు ఎంతో సవ్యంగా ఉత్సాహంగా నడిచింది. భారత గగనసీమ 'హిందీ-చీనీ భాయి భాయి' నినాదాలతో ప్రతిధ్వనించింది.

ఈ రెండు దేశాల మధ్య వృద్ధిపొందుతున్న ఈ సంబంధాలను, అమెరికా (యుఎస్ఏ) వంటి దేశం, ప్రశాంత చిత్తంతోని స్వీకరించి, సహించలేకపోయింది. భారతదేశం అప్పటికే రెండుగా ఇండియా-పాకిస్తాను చీల్చబడి ఉంది.

నేను 'చైనా టుడే' అన్న నా పుస్తకంలో, కొంత కాలం కింద, అమెరికన్

కుట్రదారులు టిబెట్‌లోకి ప్రవేశించి ఏమేమి చేస్తున్నారో వివరాలు ఇచ్చాను. చైనాలో భారత రాయబారి సర్దార్ ఫణిక్కర్ ఇచ్చిన సమాచారం ఆధారంగానే నేనా వివరాలు యివ్వగలిగానుగూడా. అమెరికా ఇంకొక సారి చియాంగ్ – కై – షేక్‌ను పెకింగ్ సింహాసనం మీద కూచుండ పెడుదామని నిశ్చయించుకుని ప్రణాళికలు సిద్ధం చేసుకుంది. ఈ ఉద్దేశంతోనే పాకిస్తాన్‌లో అమెరికా సైనిక స్థావరాలు నిర్మించబడ్డాయి. ఈ ఉద్దేశం నెరవేర్చు కోవడానికి టిబెట్ మొదటి అడుగుగా పనిచేస్తుందని గూడా అమెరికా నిర్ణయించుకొని ఉంది. టిబెట్ అప్పుడు, రాజకీయంగా, మతపరంగా – లామాల ఆధిపత్యంలో ఉంది. తమ దేశ పరిపాలనా వ్యవహారాల్లో ప్రజల మాటకు చాలా తక్కువ ప్రాధాన్యత అక్కడ. ఈ ప్రణాళికలో భాగంగానే దలైలామా సోదరుడు అమెరికాకు ఆహ్వానింపబడ్డాడు.... ఈ పనిమీద దాదాపు ఆయన అక్కడనే ఉండిపోయాడు.

జవహర్లాల్ నెహ్రూ ఇవన్నీ చాలా స్పష్టంగా చూస్తూనే ఉన్నాడు. మా వ్యక్తిగత సంభాషణల్లో నేనీ విషయం ఎన్నోసార్లు ప్రస్తావించాను. పాకిస్తాన్‌లో అమెరికన్ స్థావరాలు, టిబెట్‌లో అమెరికన్ల పెత్తనం చైనా కెంత ప్రమాదమో, ప్రపంచ శాంతికి గూడా అంతే ప్రమాదమని ఆయన గమనిస్తూనే వచ్చాడు. ఆ సమయంలో టిబెట్‌లో అమెరికన్ల ప్రమాదాన్ని భారతదేశం ఏమీ చేయలేదని గూడా ఆయన అభిప్రాయపడ్డాడు. నేనింతకన్నా ఎక్కువగా చెప్ప లేను. చైనా టిబెట్‌ను విముక్తి చేసింది. నేను నిష్కపటంగా ఒప్పుకొనే విషయం ఏమిటంటే, ఇది చైనా ప్రయోజనాల కెంత అవసరమో, భారతదేశ ప్రయోజనాలకి గూడా అంతే అవసరం. జవహర్లాల్ దీన్ని పూర్తిగా అర్థం చేసుకున్నాడు. అప్పుడు ఒకవేళ టిబెట్‌లో అమెరికన్ కుట్రదారులే గనుక విజయం పొంది ఉంటే, భారత–చైనా–టిబెట్ దేశాల పరస్పర సంబంధాల మొత్తం చరిత్రను ఆనాటి నుండి వేరు విధంగా రాయాల్సి వచ్చేదనేది పూర్తిగా స్పష్టమౌతున్న విషయం

దలైలామా భారతదేశంలోకి రావడం నెహ్రూ ఇష్టపడ లేదన్నది గూడా వాస్తవమే – సద్భావంగల వాళ్లే ఐనప్పటికీ, పెదదార్లు పట్టించబడ్డ మిత్రులు కొందరు, దలైలామా పక్షం వహించడమేగాక, వాళ్ల హ్రస్వదృష్టితో తిరిగి అతణ్ణి టిబెట్ సింహాసనం మీద కూచుండబెట్టాలని గూడా వాదించారు. ఈ కారణం కొరకు ఢిల్లీలో బహిరంగ సభలు జరుగుతున్నప్పుడు జవహర్‌లాల్ నాకు రాసిన ఒక ఉత్తరంలో పరిస్థితిని పూర్తిగా వివరిస్తూ "దుర దృష్టవశాత్తు" '–' మరికొందరు మన ఇబ్బందుల్ని ఎక్కువ చేస్తున్నారు. జవహర్ లాల్ నెహ్రూ తన ఉత్తరంలో పేర్కొన్న ప్రసిద్ధి పొందిన ఆ భారతరాజకీయ నాయకుడు (నేనాయన పేరును వదిలివేస్తున్నాను) దలైలామాను నడుము కట్టించడానికి ఆనాడు సభలు సమావేశాలతో నిర్విరామ కృషి సాగిస్తున్నాడు. ఇది జరిగిన కొద్దిరోజులకే సిలోన్ వెళ్తున్న నెహ్రూకు వీడ్కోలివ్వడానికి అధికారులు అనధికారులైన 10–12 గురు ముఖ్యులు విమానాశ్రయానికి హాజరయ్యారు. వాళ్లలో దలైలామా గూడా ఒకడు. జవహర్‌లాల్ దలైలామాను చూడడంతోనే దాదాపు అరిచినట్టుగా అన్నాడు. "అతణిక్కడికి ఎవరు తీసుకవచ్చారు? –నేనతనితో మాట్లాడదల్చుకోలేదు'' నిజంగానే దలైలామాతో మాట్లాడడాన్ని అతడు తిరస్కరించాడు.

కొంతకాలం తర్వాత, అక్సాయ్‌చిన్ ప్రాంతంలో చైనీస్ సైనిక స్థావరం నిర్మించుకున్నారు. కొంతమంది పార్లమెంట్ సభ్యులు, ఈ విషయాన్ని లోక సభలో నెహ్రూ దృష్టికి తీసుకవచ్చారు. వాళ్ల ఆరోపణ ఏమిటంటే – చైనావాళ్లు ఒక వైపు చైనా – భారత మైత్రి గురించి మాట్లాడుతూనే, ఇంకొకవైపు, భారతదేశ ప్రశాంత సరిహద్దుల్లో, బలమైన – సైనిక స్థావరం నిర్మించుకొన్నారని వాళ్లు చైనా ప్రయత్నాన్ని అనుమానించారు. జవహర్ లాల్ తక్షణం చైనా ప్రభుత్వానికి రాశాడు. జవాబు గూడా వెంటనే వచ్చింది. "మీకీ విషయం మీద ఏవైనా అనుమానాలు –ఎందుకు ఉన్నాయి?" అని వాళ్లు ప్రశ్నించారు. "అక్సాయ్ చిన్‌లో మేం నిర్మిస్తున్న మిలిటరీ స్థావరం, అవతల వైపు నుండి మేం సంభవించవచ్చు ననుకొంటున్న అమెరికా దాడిని తట్టుకొనడానికి ఉద్దేశింపబడినది. మీకు తెల్సు ఆవతలివైపున కేవలం, రాయినిసిరితే అందెంత దూరంలో పాకిస్థాన్ భూభాగంలో అమెరికన్ల సైనిక స్థావరం ఉంది–మా సైక సన్నహాలు కేవలం ఆవలి వైపు పొంచి ఉన్న అమెరికా ప్రమాదాన్ని ఎదుర్కొనడానికి మాత్రమే, భారతచైనా సంబంధాలకు ఇది చేసేదేమీ లేదు... భారతచైనా మైత్రి ఇందువల్ల ఎంతమాతం చెడిపోదు. మేం చేస్తున్న దానిలో మన ఇద్దరి ప్రయోజనాలూ ఇమిడివున్నాయని మేం నమ్ముతున్నాం" అనిగూడా వాళ్ల సమాధానంలో తెలిపారు.

చైనా సమాధానం నెహ్రూను సంతుష్టి పర్చినట్లే కన్పించింది. దీని తర్వాత కొంతమంది పార్లమెంటు సభ్యులు, సుదీర్ఘమైన భారత చైనాల సరిహద్దుకు చెందిన పాత పటాలు, వెతికి తిరగేయడం ప్రారంభించారు. చివరికి వాళ్లు ఆక్సాయిచిన్ ఇండియాలో భాగంగానే చూపే పటం సంపాదించారు. ఆక్సాయ్ చిన్ భారత భూభాగంలోనే ఉంది – అంటూ వాళ్లు కొత్తగా కనిపెట్టిన విషయాన్ని అదేసభ్యులు పార్లమెంటులో, నెహ్రూ దృష్టికి, భారత ప్రభుత్వ దృష్టికి తీసుకొచ్చారు. ఇక్కడ మనమొక విషయం గుర్తించవలసి ఉంది. అదేమిటంటే మొదట ప్రభుత్వ దృష్టిని మరల్చినపుడు ఇదే పెద్ద మనుష్యులు అక్సాయ్ చిన్‌లో చైనా సైనిక స్థావరం ఏర్పరచు కొంటున్నదనే అన్నారు తప్ప, 'భారత భూభాగంలో' చైనా వాళ్లు మిలటరీ స్థావరాన్ని నిర్మిస్తున్నారనేది వాళ్ల ఆరోపణ కాదు. ఇది ఆ తర్వాత కనిపెట్టబడింది. పార్లమెంటులో ఈ ప్రశ్న లేవనెత్తబడ్డ పిదప నెహ్రూ ఇంకొకసారి చైనా ప్రభుత్వానికి "మీరు నిర్మిస్తున్న సైనిక స్థావరం భారత భూభాగంలో ఉంది" అంటూ రాశాడు.

వెంటనే ఈ కింది విధంగా జవాబు వచ్చింది. ''అక్సాయ్ చిన్ భారత భూభాగమేనని మాకేమాత్రం తెలవదు. లాసాలో లభ్యమైన పటాలను మేం మళ్లీ ఒకసారి పరిశీలించాం. ఆ పటాల ప్రకారం అక్సాయ్ చిన్ చైనా భూభాగం. దీన్ని బట్టి మీ దగ్గర ఉన్న పటాలు విభిన్నమైనవిగా కన్పిస్తున్నాయి. మేం చైనా వాళ్లం అక్సాయ్ చిన్‌లోకి అడుగు పెట్టినపుడు, ఇది ఇండియా భూభాగం అని చెప్పడానికి అక్కడ ఒక పౌరుడుగాని, సైనికుడుగానీ, అధికార్లుగానీ లేరనేది గూడా మీరు గుర్తించాలి. ఏ విధంగానైతేనేం, మేం మాతోని పూర్తిగా భిన్నమైన పటాలను కలిగి ఉన్నామనేది స్పష్టంగా కన్పిస్తున్నది. కనుక రెండు దేశాల ప్రధాన మంత్రులూ, అధికారులూ కూర్చొని మొత్తం చైనా భారత సరిహద్దుల గురించి ఇరుపక్షాల సంతృప్తి కొరకు ఒక నిర్ణయానికి రావల్సిన అవసరం ఉందని గూడా ద్యోతకమౌతున్నది" ఈ రెండో జవాబు గూడా నెహ్రూకు,

అతని సహచరులకు అప్పటివరకు సంతృప్తి కలిగించినట్టే అన్పించింది. ఆ విధంగా, నెహ్రూ లోకసభలో మాట్లాడిన ఉపన్యాసాల్లో, ఒకసారి, అక్సాయ్ చిన్ పూర్తిగా నిర్మానుష్యమైన ప్రదేశం అంటూ వివరిస్తూ, ఆయన స్వంత పదాల్లో "అక్కడ ఒక చిన్న గడ్డిపరక గూడా మొలవదు" అన్నాడు.

ఇక ఇపుడు రెండు పక్షాలు ఒక పరస్పరాంగీకారానికి వచ్చాయి. సంప్రదింపులకు కూచునేలోపల ఇరు పక్షాలు తమ తమ పాత పటాలను పూర్తిగా అధ్యయనం చేయాలనీ, తమతమ వాదనలను వినిపించడానికి అనువుగా సంసిద్ధం కావాలనీ, అట్లా తయారైన తర్వాత ప్రధాని చౌ-ఎన్-లై, ప్రధాని నెహ్రూ న్యూఢిల్లీలో సమావేశమై ఇరుపక్షాల హక్కుల్ని పరిశీలించి, ఇరువురూ సంతృప్తి చెందేవిధంగా ఒక నిర్ణయానికి రావాలని అనుకొన్నారు. ఆదేవిధంగా జరిగింది కూడా.

ప్రధాని చౌ-ఎన్-లై ఈ పనికొరకే కొత్త ఢిల్లీ వచ్చాడు. నేను అతన్ని విమానాశ్రయంలోనేగాక, ఢిల్లీలో ఆయన ఉండగా ఆయన విడిదిలో గూడా అనేకసార్లు కల్సుకొన్నాను. సమావేశాలకు భారత ప్రధాని నెహ్రూ ఆయన సహచరులూ, ముఖ్యమైన ఉన్న తాధికారులూ చైనా ప్రధాని చౌ-ఎన్-లై ఆయన సహచరులూ, ఉన్నతాధికారులూ కూడా హాజరయ్యారు, స్థూలంగా మాట్లాడినపుడు, ఒక విస్తృతమైన భూభాగం, సుమారు 50,000 చ. మై. ప్రాంతం రెండు దేశాలకు మధ్య వివాదాస్పదమైన భూభాగం అని కనుక్కోబడింది. ఈ 50,000 చ. మై. లో 18,000 చ. మైళ్ల భూభాగం సుప్రసిద్ధమైన మేక్ మో హన్ రేఖకు దక్షిణంగా, భారత ప్రభుత్వ పరిపాలనలో ఉంది. 20,000 చ. మైళ్ల భూభాగం మెక్ మోహన్ రేఖకు ఉత్తరంగా "ఎవరికీ చెందని భూమి"గా ఉంది. అక్సాయ్ చిన్ పేరున పిలువబడే మిగిలిన 12000 చ. మై. భూభాగం పైన పేర్కొన్న విధంగా ఇటీవలి కాలంలో చైనా పరిపాలన కిందికి వచ్చింది. మనుషులు లేని భూమిగా చెప్పబడే ఈ భూభాగాన్ని అధికార్లు కొన్ని డజన్ల విభాగాలుగా విభజించి తమ తమ వాదనలతో ఇరుపక్షాల వాళ్లు సమావేశం ముందు ఉంచారు. ఒక ప్రభుత్వానికి చెందిన అధికార్లు ఫలాని ఫలాని ప్రాంతాల్లో తమ తహశీల్దార్ 1827 సం॥లో వెళ్లి శిస్తులు వసూలు చేశాడని అంటే ఇంకొక ప్రభుత్వానికి చెందిన అధికార్లు ఫలాని ఫలాని ప్రాంతాల్లో 1904లో తమ సర్వేయర్లు వెళ్లి భూమి కొలతలు చేశారని వాదించారు.

ఈ విధంగా వాదనలు-వ్యతిరేక వాదనలు సుమారు 3 రోజులపాటు నడిచాయి. చివరికి, మూడో రోజునో లేక నాలుగో రోజునో చౌ-ఎన్-లై "ఈ వాద ప్రతివాదాలతో చివరికి ఏ ఒక సివిల్ కోర్టు ఆర్నెల్ల లోపల కూడా తన నిర్ణయం తెలుపలేదు" అన్నాడు. కనుక రెండు దేశాల మధ్యనున్న మొత్తం సరిహద్దు సమస్య కేవలం స్నేహితంగా ఇచ్చి పుచ్చుకోవడమనే సూత్రాల మీద మాత్రమే ఆధారపడి నిర్ణయింప బడుతుందని గూడా ఆయన సూచించాడు.

అతడు స్వయంగా ముందుకు వచ్చి, భారతదేశపు ఆధిపత్యంలో ఉన్న 18000 చ.మై. ప్రాంతం పూర్వం నుండి గూడా భారతదేశానిదిగానే గుర్తించాలని, మిగిలిన 20000 చ.మై. భూభాగం ఇకముందు నుండి భారతదేశం భూభాగంగానే గుర్తించాలనీ, ఇక మిగిలిపోయిన 12,000 చ. మై విస్తీర్ణంగల అక్సాయ్ చిన్ ప్రాంతాన్ని మాత్రం చైనా భూభాగంగా పరిగణించాలనీ, ఎందుకంటే సైనిక వ్యూహరీత్యా చైనాకు. ఆ భూభాగం అవసరమని ఆయన (చౌ-ఎన్-లై) సూచించాడు.

ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ చౌ-ఎన్-లై చేసిన సూచనతో వ్యక్తిగతంగా సంతృప్తి చెందినట్టుగానే కన్పించడంగాక దాదాపు అంగీకరించ డానికి కూడా సంసిద్ధుడయ్యాడు- ఐనా, అతడు తన సహచరులతో ఈ విష యమై సంప్రదింపులు చేసి చివరకు చౌ-ఎన్-లైకు ఈ విధంగా జవాబు చెప్పాడు. "కాని మేం మా ప్రజల్ని సంతృప్తి పరచాల్సి ఉంటుంది". దానికి ప్రతిగా చౌ ఎన్ లై వెంటనే "కాని ప్రధాన మంత్రిగారూ, మేం గూడా మా ప్రజల్ని సంతృప్తి పరచాల్సి ఉంటుంది" అన్నాడని తర్వాత తెల్సింది.

ఇరుపక్షాలకు చెందిన అధికార్లకు కొంత సమయం ఇవ్వాలనీ, ఈ సమయం లోపల వివాదాస్పద భూభాగంమీద వాళ్లు మరింత పరిశీలనలు చేసి తమ తమ వాదాలను పూర్తి రూపంలో తయారు చేయాలనీ అప్పుడు, ఉభయ దేశాల ప్రధానులు తిరిగి సమావేశమై ఇరుదేశాల మధ్యనున్న మొత్తం సరిహద్దుల్ని నిర్ణయించాలనీ అక్కడ నిర్ణయించుకోవడం జరిగింది. ఇట్లా ఇరుదేశాల అధి కార్లూ సమగ్ర నివేదికలు తయారుచేసి వాదనలకు సంసిద్ధులయ్యేవరకూ, వాళ్లు సకాలంలో ఉభయ దేశాల ప్రధానులూ తిరిగి కూర్చుని మొత్తం సరిహద్దు సమస్య మీద ఒక పరిష్కారానికి వచ్చేవరకు, ఉభయ పక్షాలలో ఎవరూ ఆ "ఏ ఒక్కరికి చెందని భూమి"లోకి అడుగు పెట్టరాదని నిర్ణయించుకున్నారు. ఈ ఒప్పందంమీద ఇద్దరు ప్రధానులు సంతకాలు చేశారు. చౌ-ఎన్-లై వెళ్లి పోయిన తర్వాత ఎంతో శ్రమకు ఓర్చి, పాత రికార్డులన్నీ వివరంగా పరిశీలించి రెండు దేశాల అధికార్లు తమ తమ వాదనలను పరస్పరం పంపించుకున్నారు.

ఈ రెండు వాదనలనూ భారతప్రభుత్వం ప్రచురించింది నేను వెంటనే ఆ రెండు వాదనలనూ సాకల్యంగా అధ్యయనం చేశాను. ఆ తర్వాత రెండు దేశాల వాదనలను పూర్తి సరిహద్దు తగాదాను వివరిస్తూ, దేశంలో ఉన్న కొన్ని శక్తులు విదేశీ శక్తులు భారత ప్రభుత్వాన్ని ఎట్లా ఈ సమస్యమీద లొంగదీసుకుంటున్నాయో కూడా వివరిస్తూ నేను నికితాకృశ్చేవ్‌కు ఒక ఉత్తరం రాశాను.

"కనుక ఈ సమస్యను ప్రపంచంలోని ఏ సివిల్ కోర్టు ఏ కొద్ది కాలంలోనూ పరిష్కరించజాలదు. మా దేశాలు రెండూ ఇరుగు పొరుగున ఉన్న రెండు మహా దేశాలు. ఈ వివాదం పరిష్కారం కావాలంటే, మొత్తం పరిష్కారం బాధ్యతను భారతదేశం చైనాకైనా వదలాలి. లేదా చైనా భారతదేశానికైనా వదలాలి. ఒకవేళ గాంధీ బతికివుంటే పూర్తి పరిష్కారం బాధ్యత చైనాకే వదలి ఉండేవాడు. గాంధీలేడిప్పుడు. అంతర్బహిర్ శక్తుల దిగలాగుళ్లు, ఒత్తిళ్ల కారణంగా ఏ ఒక నిర్ణయానికి రాగల శక్తి భారతదేశానికి లేదు. కనుక మీరు ఈ విషయంలో మొత్తం సమస్యను భారతదేశానికి అప్పచెప్పేలా సమ్మతింప చేయగలరని ఆశిస్తున్నాను" అని గూడా నేను రాశాను. కొంతకాలానికి నాకు కృశ్చేవ్ నుండి సమాధానం అందింది. ఆ ఉత్తరంలో సారాంశం ఇలా ఉంది. 18000 చ.మై. భారత ప్రభుత్వం ఆధీనంలో ఉన్నట్టి ప్రాంతం భారత దేశానిదిగానే పరిగణించాలి. 20000 చ. మై. "ఏ ఒక్కరికి చెందని భూమి" ఇకనుండి భారతదేశానికే దఖల్ పర్చాలి. ఇక మిగిలిన అక్సాయ్ చిన్ 12000 చ. మై. ప్రాంతం, ప్రస్తుతం చైనా స్వాధీనంలో ఉన్నట్టు దానిని చైనాకే ఉండాలి. ఎందుకంటే, వ్యూహరీత్యా అది చైనాకు నిజంగానే చాలా

అవసరం. ఐతే చైనా, రెండు దేశాల మధ్యన సరిహద్దు నిర్ణయం ఈ ప్రాతిపదిక మీద జరిగిన పిమ్మట, తన ప్రాంతంగా ఉన్నట్టి భూమిలో నుండి భారతదేశం కోరుకున్న చోట 12000 చ. మై. భూభాగాన్ని అక్సాయ్ చిన్‌కు బదులుగా ఇవ్వాలి. దీనితో భారతదేశానికి 50000 చ.మై. భూభాగం ఉండిపోతుంది. ఐతే ఈ ప్రతిపాదన ఉభయ పక్షాల ముందు, ఇంకెవరైనా మూడో వాళ్లు సూచించాలి. అని కృశ్చేవ్ నాకు రాశారు. తానీ విషయాన్ని ధ్వనించేలా చైనాకు సూచన చేశాననీ బహుశా వారు తప్పక అంగీకరిస్తారనే అనుకుంటున్నానని గూడా కృశ్చేవ్ నాకు తెలిపాడు. 'ఈ విషయం మొత్తంగా నెహ్రూకు తెలిపి, ఈ ప్రతిపాదన ఆయనకు అంగీకారమైందీ లేనిదీ తనకు తెలిపితే ఇరుపక్షాల ముందు తానే ఈ సూచన చేస్తాననీ– ఈ ప్రతిపాదన ఎటువంటి దురభిమానాల తోని కూడుకొని లేదని – ఒకవేళ ఈ సూచన ఇద్దరు అంగీకరిస్తే ఒప్పందం మీద సంతకాలు చేయించడం ద్వారా సమస్యకొక ముగింపు ఉంటుందనీ' గూడా ఆయన రాశాడు.

నేను వెంటనే నెహ్రూను కల్సుకొని, నా ఉత్తరం ప్రతీ, నేను అందు కున్న జవాబూ చూపించాను. అతను నా ఉత్తరం, దాని సమాధానానికి ఎంతో సంతోషించినట్లు కన్పించింది. ఎంతో ఉత్సాహంతో మేం మరికొంత చర్చించుకొన్న తర్వాత నెహ్రూ నాతో "అక్సాయ్ చిన్‌కు సమానమైన భూభాగం మన కెక్కడ ఇస్తారో కదా" అన్నాడు. అందుకు నేను "బహుశా 99 పాళ్లు వాళ్లు, ప్రదేశాన్ని ఎన్నుకొనే స్వేచ్ఛ ఇండియాకే వదుల్తారు – నా ఉద్దేశంలో మీరు చెప్పినట్లు గడ్డిపరక గూడా మొలవని అక్సాయ్ చిన్ కన్నా, మానస సరోవరం దాని పరిసర ప్రాంతాలు మనకు తగినట్టుగానూ ఉపయోగకరంగాను ఉంటాయని" సూచించాను. కొద్ది క్షణాల పాటు నెహ్రూ ఎంతో తృప్తితో సంతోషంతో ఉన్నట్లు కన్పించాడు. కాని వెంటనే అతని ముఖం పాలిపోయింది అతడు హిందూస్తానీలో ఎంతో వేదనతోని "ఏమి చేయాలో నా బుద్ధికి తోచడం లేదు– ఆత్మహత్య చేసుకుందునా? – వాళ్లేమి కోరుకొంటున్నారో అదే నెహ్రూ ఇచ్చేశాడు. మిగతా విషయాలెందుకు? అని వాళ్లు (ఈ సమస్య తేలకుండా అడ్డుపడుతున్న వాళ్లు – అను) అంటారు. కమ్యూనిస్టులలోనే కల్సిపోయాడు..."

నేనెంతో బాధపడడమే కాదు, తీవ్రాఘాతానికి గురైనట్లుగా అయ్యాను అతని నోట నుండి ఈ మాటలు వినడంవల్ల : "మరైతే నికితాకృశ్చేవ్‌కు ఏమని సమాధానం పంపేదని" ప్రశ్నించాను. అతడొకటి రెండు నిముషాలు మౌనంగా ఉండి–ఒకటి రెండు రోజులాగమనీ. ఈలోపల ముఖ్యులైన తన సహచరులతో ఈ విషయం సంప్రదించిన పిమ్మట తెలుసుకొని ఈ విషయం నేను కృశ్చేవ్‌కు సమాధానంగా రాయొచ్చుననీ అన్నాడు. ఐతే నేను జవాబుగా "నేనై నేను ప్రస్తావనతేను– ఒకవేళ మీరు కోరితే ఏ క్షణాన్నైనా దాని గురించి నా సహకారం అందించడానికి సిద్ధంగా ఉంటాను" అన్నాను. ఆ తర్వాత ఎన్నోసార్లు నేనూ నెహ్రూ కలుకున్నాంగాని మేం భారత–చైనా సరిహద్దు వివాదం ప్రసక్తి ఎప్పుడూ తేలేదు. నేను నెహ్రూ నీవిషయమై కల్సుకొన్న 4–5 రోజుల తర్వాత, యు.పి.కి చెందిన ముఖ్యుడైన ఒక పార్లమెంటు సభ్యుడు ఎంతో దయతో నా ఇంటికి వచ్చి 'నెహ్రూ గోవిందవల్లభ్ పంత్ తో ఈ విషయం మాట్లాడాడనీ, నెహ్రూ నాతోని ఏమంటారనైతే భయపడ్డాడో అదే సమాధానం వచ్చిందనీ' చెప్పాడు.

నేననుకుంటాను–అక్కడితో ఆ విషయం ముగిసిపోయింది– ఇప్పటిదాకా ఇంకా అలాగే ఆ సమస్య మిగిలిపోయి ఉంది.

1962 చైనీస్ దురాక్రమణ అని చెప్పబడే– ఆ సమయంలో నేను మాస్కోలో ఉన్నాను. నేనంతకుముందు పేరాల్లోనే చెప్పాను– చౌ ఎన్–లై భారతదేశం నుండి పోవడానికి ముందు, ఉభయ ప్రధానులూ కూర్చొని, సరిహద్దు సమస్య మీద ఒక నిర్ణయానికి వచ్చేవరకూ, ఇరుపక్షాలకు చెందిన ఎవరూ వివాదాస్పదమైన ఆ 'ఎవరికి చెందని భూమి'లోకి అడుగు పెట్టగూడదనే ఒక ఒప్పం దాన్ని కుదుర్చుకున్నారని, జనరల్ కౌల్ రాసిన ది అన్ టోల్డ్ స్టోరీ, మాక్స్ వెల్ రాసిన ఇండియాస్ చైనా వార్, గ్రంథాలు రెండూ మనకు, పై ఒప్పందాన్ని చైనా ఉల్లంఘించి భగ్నం చేయలేదనీ, ఏదో ఒక విధంగా కొన్ని కారణాలవల్ల నెహ్రూ ఆదేశాల మేరకు భారతదేశమే అతిక్రమించిందని తెలుపుతున్నాయి. దీని మీద చైనా ప్రభుత్వం భారత ప్రభుత్వానికి, 'ఒప్పందాన్ని ఉల్లంఘించుతున్నారని తెలుపుతూ 3 ఉత్తరాలు రాసింది. చివరి రెండు ఉత్త రాలలో ఇండియా కనుక అటువంటి ఆతకమణలను వెనుకకు తీసుకొని, నిలిపి వేయకపోతే, చైనా తప్పనిసరిగా వెనక్కి నెట్టవలసి వస్తుందని గూడా చైనా తెలిపింది. ఈ ఉత్తరాలన్నీ భారతప్రభుత్వ ప్రచురణల్లో మనకు కన్పిస్తాయి'.

భారతదేశం వెనక్కి తీసుకోవడం, అతిక్రమణలు నిలిపివేయడం చేయ లేదనే మనకు కన్పిస్తున్నది. కౌల్, మాక్స్‌వెల్‌ల ప్రకారం, కొన్ని డివిజన్ల భారతసైన్యం గూడా ఆ 'ఏ ఒక్కరికి చెందని భూమి'లో అప్పటికే ఉంది. అప్పుడిక చైనా సైన్యం గూడా ఆ "ఏ ఒక్కరికీ చెందని భూమి"లోకి ప్రవేశించింది. వాళ్లు ఆ ప్రాంతానికి తగిన ఆయుధాలతో బలమైన సంఖ్యలో వచ్చినట్లు మనకు తెలుస్తూనే ఉంది. వాళ్లు మన మొత్తం సైన్యాన్ని ఖైదీలుగా పట్టుకున్నారు. మన ఆయుధాలు, మందుగుండు స్వాధీనం చేసుకున్నారు. పిదప తిరిగి ఏ సరిహద్దు రేఖనైతేవారు దాటివచ్చారో అక్కడికి వాళ్లు ఉపసంహరించుకున్నారు. (తమ భూభాగంలోనికి వెళ్లిపోయ్యారని అర్థం–అను. వాళ్లు సరిహద్దులు దాటిరాదు. భారతసరిహద్దుల్ని గూడా దాటిరాలేదని మనకు కన్పిస్తున్నది.

చైనా వాళ్లు వెనక్కు వెళ్లిపోయిన తర్వాత, శాంతి పునః స్థాపించడం కొరకు చర్చలు జరిగాయి. అప్పుడు వాళ్లు మళ్లీ ఒకసారి ఆ 'ఏ ఒక్కరికీ చెందని భూమి'లోకి వచ్చి, మన సైన్యానికి చెందిన ప్రతి ఖైదీని, ప్రతి ఆయుధాన్నీ వాళ్లు స్వాధీనం చేసుకున్న ప్రతిదాన్నీ వాపస్ ఇచ్చి, వాళ్లు దాటి వచ్చిన రేఖ అవతలికి తిరిగి వెళ్లిపొయ్యారు. నేనిక్కడ రాసిన ఈ విషయాలు పైన పేర్కొన్న రెండు గ్రంథాల్లోనూ స్పష్టంగా ఉన్నాయి. కనుక మనకు ఇక్కడ అతి స్పష్టంగా తెలుస్తున్న విషయమేమిటంటే – భారతదేశంపై చైనా ఆక్రమణగా చెప్పబడే ఆ విషయం నిజంగా భారతదేశంపై ఆక్రమణ కానే కాదనీ, చైనా సైన్యాలు భారతదేశ పాలనలో ఉన్న ఏ భాగంలోకి ఎప్పుడూ అడుగు పెట్ట లేదనీ– వాస్తవ వివాదం ఎప్పటివలెనే యథాతథంగా ఉండిపోయిందని, రెండు ప్రభుత్వాలు "ఏ ఒక్కరికి చెందని భూమి"గా దాన్ని అప్పటికీ ఎప్పటికీ ప్రకటించే ఉన్నాయని చౌ–ఎన్–లై, నెహ్రూల ఒప్పందం ప్రకారం ఏ ఒక్కరూ ప్రవేశించ గూడదని నిర్ణయించుకున్న "ఎవరికీ చెందని భూమి"లోకి మొదట భారతసైన్యాలే ప్రవేశించడంవల్ల ముందుగా భారతదేశమే ఒప్పందాన్ని ఉల్లంఘించిం దని చానా ప్రచురణల వల్ల, పై రెండు ప్రచురణల వల్ల మనకు తెలుస్తున్నది. వీ

నియంతృత్వపు అంచుల్లో శ్రీలంక

***ప్రజల్లో ఒక వర్గానికి వ్యతిరేకంగా భావోద్వేగాలు రెచ్చగొట్టి అధికారంలోకి వచ్చిన రాజపక్సే పాలన శ్రీలంకను నియంతృత్వం వైపు తీసుకెళ్లే ప్రమాదం ఉందని అంటున్నారు* సతీష్ బైరెడ్డి**

ఆగస్టు 5న శ్రీలంక పార్లమెంట్‌కు జరిగిన ఎన్నికల్లో ఏడు దశాబ్దాలకు పైగా ఆ దేశ రాజకీయ వ్యవస్థను శాసిస్తున్న రెండు ప్రధాన పార్టీలైన యునైటెడ్ నేషనల్ పార్టీ (యుఎన్‌పి), శ్రీలంక ఫ్రీడం పార్టీ (ఎస్ఎల్ఎఫ్‌పి) మట్టి కరుచుకుని పోయినవి. 4 సంవత్సరాల క్రితం పురుడు పోసుకున్న శ్రీలంక పోడు జన పరమున ఎస్ఎల్‌పిపి 225 సీట్లకు గాను మిత్రపక్షాలతో కలిసి 150 సీట్లను గెలుచుకున్నది. యుఎన్‌పి నుండి విడిపడి సజిత్ ప్రేమదాస నాయకత్వంలో ఏర్పడిన సమాగి జన బలవేగయ (ఎస్‌జెపి) 54 సీట్లను దక్కించుకుంది. తమిళులు ఇతర మైనార్టీ తెగలకు ప్రాతినిధ్యం వహించే టిఎన్ఏ 16 నుండి 10 సీట్లకు పడిపోయింది. నేటి అధికార, ప్రతిపక్ష పార్టీలు కొత్తవి కావొచ్చు కానీ ఆ పార్టీల నాయకత్వాలు పాత పార్టీల నుండి వచ్చిన వారే. 2005 నుండి 2015 వరకు ఎస్ఎల్ఎఫ్‌పి నుండి శ్రీలంక అధ్యక్షుడుగా మహేంద్ర రాజపక్సే పనిచేశాడు. 2019 నవంబర్‌లో జరిగిన శ్రీలంక అధ్యక్ష ఎన్నికల్లో యుఎన్‌పి నాయకుడిగానే సజిత్ ప్రేమదాస నిలబడ్డాడు. ఈ ఎన్నికలతో శ్రీలంక దేశం యావత్తు ఇద్దరి వ్యక్తుల చేతుల్లోకి, ఒక కుటుంబం నియంత్రణలోకి వెళ్లినట్లయింది.

2015లో ఎస్ఎల్ఎఫ్‌పి, యుఎన్‌పి నాయకులైన మైత్రిపాల సిరిసేన, విక్రమ సింఘేల నాయకత్వంలో ఏర్పడిన సంకీర్ణ ప్రభుత్వం అంతర్గత కుమ్ములాటలు, ఆధిపత్య పోరుతోనే 5 ఏళ్ల కాలం వెళ్లదీసినవి. తమిళ టైగర్ల అణచివేత పేరుతో మహేంద్ర రాజపక్సే సింహళ మెజారిటీ ఆధిపత్యంతో సాగించిన నియంతృత్వ పాలనకు వ్యతిరేకంగా 'సుపరిపాలన, ప్రజాస్వామ్య పాలన' అందిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన సంకీర్ణ ప్రభుత్వం ఒకింత ప్రజాస్వామిక వాతావరణం ఏర్పడేందుకు శ్రమించినప్పటికీ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించడంలో వైఫల్యం చెంది, ఆర్థిక వ్యవస్థ తిరోగమనానికి కారణమయ్యింది.

విదేశీ పెట్టుబడులు, ఉదార విధానాలతో దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ చితికిపోయి ప్రజలు, అప్పుల ఊబిలో కూరుకొని పోయినారు. 19వ రాజ్యాంగ సవరణ తీసుకురావడం ద్వారా దేశ అధ్యక్షుడికి ఉన్న విశేష, విస్తృత అధికారాలను కత్తిరించడమే కాకుండా, ఒక వ్యక్తి రెండు పర్యాయాలు మాత్రమే అధ్యక్షుడిగా పోటీ చేసే పరిమితిని విధించారు. రాజపక్సే పదేళ్ల కాలంలో మిలటరీ సహాయంతో తమిళ పులుల అణచివేత పేరుతో సాగించిన మారణకాండ, మానవ హక్కుల ఉల్లంఘనలపై అనేక కమిటీలను కూడా ఏర్పరిచారు. న్యాయవ్యవస్థ స్వతంత్రతను కాపాడేలా కూడా చర్యలు తీసుకున్నారు. కార్యనిర్వాహక వ్యవస్థ కంటే శాసన వ్యవస్థకే అధిక ప్రాధాన్యత ఉండేలా కూడా సంకీర్ణ సర్కారు వ్యవహరించింది. మొత్తం మీద పాలనలో జవాబుదారీతనం తెస్తున్నట్టు వ్యవహరించినప్పటికీ అంతర్గత కలహాలు, చితికిన ఆర్థిక వ్యవస్థ, విచ్చలవిడి అవినీతి, పెరిగిపోతున్న నిరుద్యోగం, అస్థిర ప్రభుత్వంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరిగిపోయింది. మధ్యలో ప్రధానమంత్రిని తొలగించిన ఎపిసోడ్‌లో ప్రజల దృష్టిలో సంకీర్ణ ప్రభుత్వంపై విశ్వాసం మరింతగా సన్నగిల్లిపోయింది. వీటన్నింటికీ తోడు 2019లో ఈస్టర్ డే రోజు జరిగిన బాంబు పేలుళ్ల విధ్వంసంలో 250 మందికి పైగా మృతి చెందిన విషాదకర సంఘటనతో ప్రజల్లో ప్రభుత్వంపై అసంతృప్తి, ఆగ్రహం తారా స్థాయికి చేరుకొంది. దాడులు జరగబోతున్నాయనే ముందస్తు సమాచారం ఇంటిలిజెన్స్ వర్గాలు అందించినప్పటికీ సకాలంలో స్పందించి, ప్రభుత్వం కట్టుదిట్టంగా వ్యవహరించి చర్యలు తీసుకోలేదన్న భావన బలంగా నాటుకు పోయింది. ఆనాటి నుండి సంకీర్ణ ప్రభుత్వంపై వ్యతిరేక పవనాలు మొదలయ్యాయి. అది 2019 నవంబర్‌లో జరిగిన అధ్యక్ష ఎన్నికల్లోనే తేటతెల్లం అయింది.

అధ్యక్షుడిగా పోటీచేసే అవకాశాన్ని రెండు సార్లకే పరిమితం చేయడంతో సింహళ పాపులర్ లీడర్‌గా తమిళ ఉద్యమాన్ని అణచివేసిన 'బలమైన' నాయకుడిగా పేరుబడిన మహేంద్ర రాజపక్సే పోటీ చేసే అవకాశం కోల్పోవడంతో ఆయన తమ్ముడు, మంత్రివర్గంలో రక్షణ మంత్రిగా పనిచేసి మిలటరీనీ నడిపించిన గోటబయ రాజపక్సే అధ్యక్షుడిగా గెలిచాడు. అనంతరమే పార్లమెంట్ ఎన్నికలు ప్రకటించడంతో గెలుపు దృశ్యం కూడా స్పష్టమయింది.

గత ప్రభుత్వ ఘోర వైఫల్యమే నేడు రాజపక్సే ద్వయం అధికార పీఠం మీద కూర్చునేలా చేసినప్పటికీ, అంతకు మించిన కార్యాచరణ క్షేత్రస్థాయిలో సింహళ మెజార్టీ ఆధిపత్య శక్తులు పేర్చుకుంటు వచ్చాయి. ఒకవైపు ప్రజాస్వామ్య పునరుద్ధరణ, జవాబుదారీతనం, అన్ని వర్గాలకు న్యాయం, అవినీతిలేని సుపరిపాలన, శాసన వ్యవస్థ ఆధిక్యం వంటి సూత్రబద్ధ అంశాల కంటే సింహళ జాతీయ శక్తుల ప్రచార ప్రభావం బలంగా పడింది. బలమైన నాయకత్వం, పాపులిజం, స్థిరమైన ప్రభుత్వం, శాంతి భద్రతలు, సంక్షేమం, దేశ భద్రత, అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ట వంటి సెంటిమెంటల్ అంశాలను రాజపక్సే సోదరులు బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. ఉన్మాద బుద్దిస్ట్ సింహళ సంస్థలు భారతదేశంలో సంఘ్‌పరివార్ వలె శ్రీలంకలో ముస్లింలపై విపరీతమైన విద్వేషాన్ని ప్రచారం చేస్తూ, వారి దేశభక్తిని ప్రశ్నిస్తూ వచ్చాయి. ఈస్టర్ డే బాంబు పేలుళ్ల విధ్వంసం, మారణకాండ అనంతరం ఇది మరింతగా

పెరిగిపోయి, సింహళ మెజార్టీ పోలరైజేషన్ జరిగింది. కశ్మీర్ ప్రజల స్వతంత్ర ఆకాంక్ష పట్ల సంఘపరివార్ దేశ సమగ్రత, అఖండత పేరుతో ఎంతటి వ్యతిరేకతను కలిగి ఉంటుందో ప్రత్యేక తమిళ రాజ్య భావన పట్ల అంతటి విద్వేషం, వ్యతిరేకత సింహళ ఆధిపత్య శక్తులకూ ఉన్నది.

శ్రీలంకలో తమిళుల దుస్థితి, వారి హక్కుల గురించి మాట్లాడడం అంటే దేశభక్తి లేనితనంగానే పరిగణిస్తారు. 2005-15 మధ్య కాలంలో తమిళ టైగర్ల ఉద్యమ అణచివేత కాలంలో 20 వేలకు పైగా సాధారణ తమిళ పౌరులు, జర్నలిస్టులు, హక్కుల కార్యకర్తలు కనిపించకుండా పోయారు. వేలాది మందిని సైన్యం ఊచకోత కోసింది. లక్షలాదిగా కాన్‌సెంట్రేషన్ క్యాంపుల్లో బందించింది. వేలాది హెక్టార్ల తమిళుల జీవనాధారమైన సాగు భూమిని శ్రీలంక సైన్యం ఆక్రమించుకున్నది. గత 5 ఏళ్ల కాలంలో దేశంలో అస్థిరత నెలకొని ఉన్నదని, శాంతి భద్రతలకు భంగం వాటిల్లి దేశ భద్రత ప్రమాదంలో పడిందని, దీనికంతటికీ బలహీనమైన నాయకత్వం, అస్థిర ప్రభుత్వం శ్రీలంక జాతీయత పట్ల గౌరవం లేకపోవడమే అనే ప్రచారం ప్రబలంగా జరుగుతూ వచ్చింది. గోటబయ అధ్యక్షుడు అయ్యాక కరోనా కష్ట కాలాన్ని మిలటరీ సహాయంతో అధిగమించాడని, డ్రగ్ మాఫియాపై యుద్ధంలో సఫలీకృతుడయ్యాడు అనే పాజిటివ్ ప్రచారం బాగా కలసి వచ్చింది.

ముస్లింలు అధికంగా నివసించే ప్రాంతాల్లో ఈస్టర్ డే బాంబు దాడుల నేపథ్యంలో బుద్దిస్ట్ సింహళ మూకలు అనేక భౌతిక దాడులకు పాల్పడ్డాయి. ఒకవైపు అనధికారికంగా ఇవి జరుగుతున్న క్రమంలోనే గోటబయ అధ్యక్షుడయ్యాక ఎన్‌కౌంటర్ల పేరుతో అనేక మంది తమిళుల ఊచకోతకు కారణమైన వాళ్లు, ఆయా కమిటీల ద్వారా వారి పాత్రను నిర్ధారించి వారిపై అనేక కేసులు పెట్టినప్పటికీ, జైళ్లల్లో ఉన్న చాలా మంది సైనికులను, సైనికాధికారులను నిర్దోషులుగా విడుదల చేశారు. ఎన్‌కౌంటర్ హత్యలపై, మానవ హక్కుల ఉల్లంఘనపై ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల విభాగం, అంతర్జాతీయంగా ఒత్తిళ్ల నేపథ్యంలో శ్రీలంకలో అంతర్గతంగా ప్రభుత్వం వేసిన కమిటీలను సైతం రద్దుపరిచారు. వారిపై ఉన్న కేసులు కూడా ఎత్తి వేశారు. అంతర్జాతీయ కమిటీ ఏర్పాటును కూడా అంగీకరించలేదు. తమిళ ఉద్యమ అణచివేత పేరుతో తమిళులను ఊచకోత కోసిన అనేకమంది సైనికాధికారులు పదోన్నతులు పొంది సాహస వీరులుగా చలామణి అవుతున్నారు. అందరికీ నాయకత్వం వహించిన రాజపక్సే సోదర ద్వయం దేశాన్ని రక్షించే పెద్ద దిక్కయ్యారు. ఎటువంటి జవాబుదారీతనం లేకుండా, ఏ ప్రజాస్వామిక సూత్రాలకు గౌరవం ఇవ్వకుండా, దేశంలో ఉన్న అనేక స్వతంత్ర సంస్థలను నిర్వీర్యపరిచి, ఇద్దరు వ్యక్తుల, ఒక కుటుంబ నాయకత్వమే బలమైన నాయకత్వంగా ప్రచారం పొందుతున్నది. సింహళ మెజారిటీ సాంస్కృతిక వాదమే శ్రీలంక సాంస్కృతిక భావజాలంగా సమ్మతిని పొందే బలవంతపు కార్యాచరణ అనేక రూపాల్లో కొనసాగుతున్నది. దాని ఫలితమే ఇవాళ సంపూర్ణ మెజారిటీగా గుర్తింపు పొందుతున్నది. కొత్త రాజ్యాంగం తీసుకొస్తాం అని గోటబయ పార్లమెంట్‌లో ఇప్పటికే ప్రకటించాడు.

శ్రీలంకలో 25 శాతం ఉన్న అనేక మైనారిటీ ప్రధానంగా తమిళ, ముస్లిం ప్రజానీకం భవితవ్యం మరింత ప్రమాదంలోకి నెట్టబడింది. సింహళ జాతి ముద్ర దేశ రాజ్యాంగంపై ఉంటుంది. సింహళ భాషా అధిపత్యంతో పాటు సాంస్కృతిక ఆధిపత్యం మరింత వ్యవస్థీకృతం అయ్యే ప్రమాదాన్ని ఊహించడం పెద్ద కష్టమేమీ కాదు. బలమైన నాయకత్వం, స్థిరమైన ప్రభుత్వం అనే నినాదం వెనుక పార్లమెంటరీ ప్రభుత్వ విధానాన్ని రద్దు పరిచి, ఏక వ్యక్తికి సంపూర్ణ అధికారం అప్పగించే అధ్యక్ష తరహా పాలన తప్ప మరేమీ కాదు. శాసన వ్యవస్థకు కాకుండా కార్యనిర్వాహక అధ్యక్షుడికి విశేష అధికారాలు కట్టబెడతారు. కార్యనిర్వాహక వ్యవస్థలో మిలటరీ జోక్యం, పాత్ర మరింతగా పెరిగి పౌర సమాజంపై గతంలో కంటే ఎక్కువ నిర్బంధం, అణచివేత అమలయ్యే ప్రమాదం మరింతగా కనబడుతున్నది.

అధ్యక్షుడికి ఇచ్చే అధికారాలతో న్యాయవ్యవస్థ బలహీనపడి పౌర స్వేచ్ఛలు ప్రమాదంలో పడతాయి. ప్రజలకు ఉండే కొద్దిపాటి రాజ్యాంగ రక్షణలు ప్రధానంగా మైనారిటీల రక్షణల భవితవ్యం ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. దీనికితోడు తమిళుల గొంతుకగా ఉన్న తమిళ నేషనల్ అలయన్స్ లాంటివి కూడా బలహీనపడడంతో తమిళ వాణి మరింతగా మూగబోయే ప్రమాదం ఉన్నది. స్థానిక ప్రభుత్వాలు, దేశ అధికార వ్యవస్థ, మిలటరీ వ్యవస్థ సమస్తం ఒకే పార్టీ చెప్పుచేతుల్లో ఉండడంతో ఎస్ఎల్‌పిపి "సౌభాగ్య దక్కమ" ఎన్నికల ప్రణాళికను సునాయాసంగా అమలు చేస్తారు. దీనికితోడు కొన్ని ప్రజాకర్షక నినాదాలు, హామీలు ఎలాగు ఉన్నాయి. ప్రభుత్వ విధానాల విషయంలో భయంతో అయినా, సమ్మతితో అయినా సమీప భవిష్యత్తులో ప్రజల నుండి నిరసనలు, వ్యతిరేక ఆందోళనలు ఉండకపోవచ్చు. ప్రజాస్వామ్యం, పౌరుల స్వేచ్ఛా హక్కుల కంటే 'అభివృద్ధి' ప్రధానమనే భావనను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లడంలో ఎస్ఎల్‌పిపి బుద్దిస్ట్ సింహళ సంస్థలు సఫలీకృతమైనాయి. పౌర జీవనం పైన మిలటరీ నిఘాతో పాటు నియంత్రణ కూడా పెరుగుతుంది.

మొత్తం దేశ జనాభాలో తమిళ ముస్లింల, ఇతర మైనారిటీ తెగల జనాభా 25 శాతం అయినప్పటికినీ, రాజ్య యంత్రాంగ కీలక విభాగాల్లో వారికి ప్రాతినిధ్యం అంతంత మాత్రమే. 90 శాతం మిలటరీ అధికారులు, సాధారణ సైనికులు సింహళ మెజారిటీకి సంబంధించిన వారే. ఎన్నికలు ప్రజాస్వామికంగా, చట్టబద్ధంగా, కరోనా కష్టకాలంలో కూడా జరిగినవని కనిపిస్తున్నప్పటికీ సంపూర్ణ మెజారిటీతో పాటు అన్ని స్థాయిల్లో ఒకే పార్టీ, ఒకే కుటుంబం చేతుల్లో కేంద్రీకృతం కావడం వాంఛనీయం కాదు. బలమైన నాయకత్వం, స్థిరమైన ప్రభుత్వం కంటే మానవీయమైన ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల హక్కుల్ని గుర్తించి, రక్షించే ప్రభుత్వమే శ్రీలంకకు కావాలి. బహుశా అలా కోరుకోవడమే నేడు అక్కడున్న పరిస్థితుల్లో అత్యాశేనేమో! అయినను యుఎన్‌పి నుండి చీలిపోయి సొంత పార్టీ పెట్టుకున్న సజిత్ ప్రేమదాస పార్టీ 54 సీట్లతో పాటు మరికొన్ని ఇతర పార్టీ సభ్యులతో కలసి ప్రభుత్వంపై సూత్రబద్ధంగా వ్యవహరించే అవకాశం ఉన్నది. అక్కడి పౌర సమాజంలోని ప్రజాస్వామిక, ప్రగతిశీల శక్తులు కూడా ఎప్పటికప్పుడు తమ గొంతుకు, కార్యాచరణకు పదును పెడుతూ శ్రీలంక సమాజం నియంతృత్వపు ప్రమాదంలో పడకుండా చూడాల్సిన చారిత్రక కర్తవ్యం వారిపైన ఉన్నదని గుర్తించి నిరంతర జాగరూకతతో వ్యవహరించాలి.

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

బీరూట్ పేలుళ్లతో కుదేలైన లెబనాన్

లెబనాన్‌లో అమలవుతున్న ప్రపంచీకరణ ఆర్థిక విధానాలు, నాయకుల అవినీతితో తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న స్థితిలో బీరూట్ పేలుళ్లు ఆ దేశాన్ని తీవ్ర అగాథంలోకి నెట్టాయని అంటున్నారు సంతోష్

లెబనీస్ కావడమంటే విషాద జీవితాన్ని భరించడమే నంటాడు ఆ దేశ రచయిత, రాజకీయ వ్యాఖ్యాత అంటౌన్ ఇస్సా. ఎందుకంటే అక్కడ నిత్య విషాద భరితాలే. ఆగస్టు 4న సంభవించిన వినాశకర పేలుడు లెబనీయుల విషాదగాథలో మరొకటి. లెబనాన్ రాజధాని బీరూట్‌లో ఆకాశానికి ఆవరించిన బహుళ అంతస్తుల భవనాలకు అత్యంత కీలకమైన ఓడరేవు ప్రాంతంలో ఉన్న పోర్టు గిడ్డంగిలో జరిగిన రెండు భారీ పేలుళ్లు తీవ్ర విధ్వంసం సృష్టించాయి. నగరాన్ని అతలాకుతలం చేశాయి. ఈ ఘోర విస్ఫోటనం ప్రపంచాన్ని కలచివేసింది. తెగిపడ్డ శరీర భాగాలు, ముక్కలు ముక్కలైన వాహనాలు, శిధిలాలుగా మారిన భవనాలతో సంఘటన స్థలంలో పరిస్థితి భీతావహంగా మారింది. రాజధాని నగరం మూడువంతులకు పైగా నాశనమైపోయింది. గతంలోని అంతర్యుద్ధం కలిగించలేని నష్టాన్ని క్షణాల వ్యవధిలో ఇప్పుడు బీరూట్‌లో విస్ఫోటనం కలిగించింది. ప్రకృతి వైపరీత్యాలు, శత్రుదాడులు బీరూట్ విధ్వంసానికి కారణం కాదు. ఈ విపత్తుకు మూలం ప్రభుత్వ అసమర్థత, నిర్లక్ష్యం కారణమని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు. అధికార వ్యవస్థల నిర్లక్ష్యాలు ఎంతటి వినాశనాన్ని సృష్టిస్తాయో అన్ని దేశాలూ ప్రత్యక్షంగా చూశాయి.

ఆరేళ్లుగా బీరూట్ ఓడరేవులో నిల్వచేసివున్న రెండువేల ఏడు వందల యాబది టన్నుల ఆమ్మోనియం నైట్రేట్ ఒక్కసారిగా పేలి, 200 మంది మరణానికి కారణమైంది. ఈ దుర్ఘటనలో ఐదు వేల మంది క్షతగాత్రులైనారు, రెండు లక్షల మంది నిలువనీడ కోల్పోయారు. అంతర్యుద్ధాలను, మిసైల్ దాడులను సైతం తట్టుకొని నిలిచిన భవంతులు పేకమేడలా కుప్పకూలిపోయాయి. ఆస్పత్రుల ప్రాంగణాలన్నీ మృతులు, క్షతగాత్రుల కుటుంబ సభ్యులతో నిండిపోయాయి. పది కిలోమీటర్ల దూరం వరకు పలు భవనాల కిటికీలు, అద్దాలు, పైకప్పులు దెబ్బతిన్నాయి. ఓడరేవు సమీపంలో ధాన్యం నిల్వకు ఏర్పాటు చేసిన గిడ్డంగులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. వినియోగానికి పనికి రానంతగా ధాన్యం మొత్తం చెల్లాచెదురుగా పడిపోయింది. ఘటనాస్థలికి 240 కిలోమీటర్ల దూరంలో ఉన్న సైప్రస్‌లోనూ పేలుడు శబ్దం వినిపించిందంటే… బీరూట్ నగరం ఏ స్థాయిలో దద్దరిల్లి ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

విస్ఫోటన శబ్దాలు, వెలువడిన పొగతో కండ్ల మంటలు, ఆక్సిజన్ చాలక శ్వాస ఆడక అల్లాడుతూ అణుదాడి జరిగిందేమోనన్న ఆందోళనలో ప్రజలు కకావికలయ్యారు. ప్రభుత్వం కూడా అదే అనుమానం వ్యక్తం చేసింది. లెబనాన్ దేశ అధ్యక్షుడు మైఖేల్ అవూన్ మాత్రం బయటి శక్తుల జోక్యాన్ని తోసిపుచ్చలేమన్నారు. క్షేత్రస్థాయిలో జరిపిన దర్యాప్తులో అమ్మోనియం నైట్రేట్ నిల్వలే భారీ విస్ఫోటనానికి కారణమని అధికారులు తేల్చారు. విభిన్న మతాల నాయకుల మధ్య అధికార పంపకం జరిగినప్పటికీ, పరస్పర కుట్రల్లో భాగంగానే ఈ విస్ఫోటనం జరిగిందని కొందరి అనుమానం. ఈ విస్ఫోటనంలో తనపాత్ర ఏమీలేదని ఇజ్రాయెల్ ప్రకటించింది. పేలుళ్ల వెనుక కుట్ర ఉంటే ఉండవచ్చును కానీ, సులువుగా భగ్గుమనే ఒక ప్రమాదకర రసాయనాన్ని ఏళ్లపాటు గోడౌన్‌లో నిర్లక్ష్యంగా వదిలేయడం క్షమార్హం కాని నేరం.

బీరూట్ పేలుళ్ల ప్రమాదం తీవ్రత ఊహకు అందనిది. డెబ్బయ్ ఐదేళ్ల నాటి హిరోషిమా, నాగసాకి విషాదాన్ని యావత్ ప్రపంచమూ గుర్తు చేసుకుంటున్న సందర్భంలో, దాదాపు అదే రకమైన దృశ్యాలతో, ఒక అణువిస్ఫోటనం మాదిరిగా ఈ ఘటన జరిగింది. ఒకవైపు షియా, సున్నీల వైరుధ్యం, మరోవైపు షియా మిలీషియా(హిజుబుల్లా) క్రిస్టియన్ మిలీషియా మధ్య ఘర్షణలతో రాజకీయ అస్థిరత, ఆర్థిక సంక్షోభం నెలకొంది. అవినీతి, ఆహారకొరత, కరోనా వైరస్ దేశాన్ని కుదిపేస్తున్న తరుణంలో లెబనాన్‌కు అదనంగా కష్టం వచ్చిపడింది. లెబనాన్‌లో ప్రధానమైన ఓడరేవు దెబ్బతినడంతో ఎగుమతులు, దిగుమతులు స్థంభించిపోయాయి. ఇప్పుడప్పుడే అక్కడ తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొనే అవకాశాలు లేవు. ఇప్పటికే కరెన్సీ సంక్షోభంతో లెబనాన్ ప్రజలు ఆర్థికంగా దెబ్బతిన్నారు. చాలామంది ఉద్యోగాలు కోల్పోయారు. పొదుపు చేసుకున్న సొమ్మంతా ఆవిరైపోయింది. ఒకదాని తరువాత మరొకటిగా ఏదో ఒక సంక్షోభంతో ఇక్కట్లు పడుతున్న లెబనాన్‌లో ఈ పేలుడు సంభవించడంతో కోలుకోలేని దెబ్బ తగిలింది. ఆహార పదార్థాల దిగుమతికి అత్యంత కీలకమైన పోర్టు నాశనమైపోవడంతో ఆహార సంక్షోభం తప్పదని ప్రజలు భయపడుతున్నారు. పది లక్షల మంది సిరియా శరణార్థులు లెబనాన్‌లో ఆశ్రయం పొందుతున్నారు.

చాలకాలంగా లెబనాన్ సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఆర్థిక విధానాలను అనుసరిస్తున్న దేశం. ఆ విధానాల ఫలితంగా ఆ దేశ ఆర్థిక వ్యవస్థ ప్రపంచ ఆర్థిక వ్యవస్థతో విడగొట్టుకోలేని పరిస్థితి ఏర్పడింది. దేశ రుణం విపరీతంగా పెరిగిపోయింది. రుణాలు చెల్లించలేని పరిస్థితి ఏర్పడి దివాళ దేశంగా ముద్ర పడింది. కరోనా కంటే ముందే దేశ ఆర్థిక వ్యవస్థ చాల దయనీయమైన పరిస్థితిలో ఉంది. అన్నిటికి దిగుమతులపై ఆధారపడి ఉండటం వలన విదేశీ మారక ద్రవ్యకొరత ఏర్పడింది. ఫలితంగా దేశపు కరెన్సీ విలువ 80 శాతం పడిపోయింది. విదేశీ రుణాలు చెల్లింపు చేయలేని దుస్థితిలో పడింది. నిత్యావసరాల కొరత ఏర్పడి ప్రజానీకం నానా అవస్థలు పడుతున్నది. ఆహార పదార్థాల ధరలు 247 శాతం పెరిగినట్లు చెబుతున్నారు.

ప్రధాని హసన్ దియాబ్ మార్చి నుండి తమ దేశానికి అత్యవసరంగా 1500 కోట్ల డాలర్ల రుణం కావాలని ఐఎంఎఫ్‌ను కోరుతున్నాడు. కొత్తగా

రుణం ఎవరు ఇవ్వడం లేదు. అప్పులు ఇచ్చేందుకు ఐఎంఎఫ్ షరతులు విధిస్తుంది. ప్రజలు ఆర్థిక సంస్కరణలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మరోవైపు ప్రభుత్వం తీవ్ర అవినీతిలో కూరుకుపోయి, ప్రజల కనీస అవసరాలు కూడా తీర్చలేని దారుణ పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ప్రజల విశ్వసనీయత కోల్పోయింది. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం తర్వాత విదేశీ పెట్టుబడులపై ఆధారపడి తన ఆర్థిక వ్యవస్థను నిర్మించింది. అధిక వడ్డీరేట్లను ఇచ్చింది. దీంతో విదేశీ పెట్టుబడిదారుల దోపిడీకి లెబనాన్ నిలయంగా మారింది. ఒక్క మాటలో చెప్పాలంటే లెబనాన్ ఆర్థిక వ్యవస్థ విదేశీ పెట్టుబడులపై ఆధారపడింది.

బీరూట్ విస్ఫోటనంతో అప్రమత్తమైన దేశాలు

బీరూట్‌లోనే కాదు ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాల్లో అమ్మోనియం నైట్రేట్ పెద్ద ఎత్తున నిల్వ ఉంది. ఇప్పుడు చాలా దేశాల్లో ఈ నిల్వలపై ఆందోళన పెరుగుతోంది. భారత్, యెమెన్, ఇరాక్, ఆస్ట్రేలియా, బ్రిటన్ వంటి దేశాలలో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమ్మోనియం నైట్రేట్ వల్ల చాల ప్రయోజనాలు ఉన్నప్పటికీ దానికి నిప్పు, చమురు తోడైతే ప్రమాదం సంభవిస్తుంది. వ్యవసాయ అవసరాల కోసం దీనిని అధికంగా వాడుతారు. దీనితో బాంబులు కూడ తయారు చేస్తారు. అమ్మోనియం నైట్రేట్‌ను ఎరువుగా కూడ వాడుతారు. బీరూట్ అయినా చెన్నై అయినా కథ ఒక్కటే. వ్యవసాయం నుంచి తీవ్రవాద దాడుల వరకూ వివిధ గ్రేడ్లను బట్టి ఉపయోగపడే ఈ పదార్థాన్ని వేరే అవసరాల పేరిట దిగుమతులు చేసుకోవడం, అవి పోర్టు తనిఖీల్లో పట్టుబడి, కేసుల్లో చిక్కుకొని సంవత్సరాల తరబడి అక్కడే ఉండిపోవడం జరుగుతున్నదే.

బీరూట్‌లో పోగుబడిన నిల్వలు రష్యాకు చెందిన ఓ వ్యాపారివనీ, అతడు వేరే అవసరం చూపించి, ప్రమాదకర గ్రేడ్‌ను దిగుమతి చేసుకుంటే, సరుకు లెబనాన్ అధికారులకు చిక్కింది. మొజాంబిక్‌లో మైనింగ్ పేలుళ్ల కోసం నిర్దేశించిన ఈ పదార్థం జార్జియా నుంచి వెళ్తుంటే మార్గమధ్యంలో ఇక్కడ చిక్కుబడిందన్న వాదనా ఉన్నది. కారణం ఏదైనప్పటికీ, సులువుగా మండే ఒక రసాయనం ఏళ్లతరబడి తమ దగ్గర మగ్గుతున్నదని పోర్టు అధికారులందరికీ తెలుసు. కోర్టు వివాదాల్లో చిక్కుబడి, పరిష్కరించలేని స్థితి ఉన్నప్పటికీ, అది సురక్షితంగా ఉన్నదీ లేనిదీ ఎప్పటికప్పుడు తనిఖీ చేయవలసిన బాధ్యత వారిపై ఉన్నది. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు సంభవించవచ్చు కనుక గోడౌన్లు జనావాసాలకు దూరంగా తరలించాలి. పూర్తి స్థాయి భద్రతా ప్రమాణాలను పాటించేలా సంబంధిత అధికారులు తక్షణం చర్యలు చేపట్టాలి.

బీరూట్ దుర్ఘటన మనకు కూడా ఒక హెచ్చరికే! మన దేశమంతటికీ అమ్మోనియం నైట్రేట్ ఎగుమతి, దిగుమతులు విశాఖ పోర్టు నుండే జరుగుతాయి. నిల్వ చేసే ప్రదేశం అటు పోర్టు, ఇటు విమానాశ్రయం, అంతకన్నా కీలకమైన తూర్పు నావికాదళ స్థావరం మధ్యలో ఉండడం ఆందోళనకరమైన విషయం. చుట్టూ జనావాసాలు ఉండడంతో మరింత భయం కలుగుతోంది. ఇప్పటికే ఎల్.జి పాలిమర్స్ ప్రమాదం, ఆ తరువాత ఫార్మా సిటీ, సాల్వెంట్ పరిశ్రమలో అగ్ని ప్రమాదాలతో విశాఖ జిల్లా వాసులు భీతిల్లిపోతున్నారు. అలాగే చెన్నై గిడ్డంగుల్లోనూ 700 టన్నుల అమ్మోనియం నైట్రేట్ నిల్వలు ఐదేళ్లుగా ఉన్నాయన్న వార్తలు రావడంతో చెన్నైలో కలకలం రేగింది. అధికారులు అప్రమత్తమయ్యారు. అమ్మోనియం నైట్రేట్ నిల్వలు నిబంధనలకు లోబడిన పరిమితిలో మాత్రమే అనుమతించాలి.

లెబనాన్ విషాద పరంపర

బీరూట్ విధ్వంస, విషాధ జాబితాకు సుదీర్ఘ చరిత్రే ఉంది. లెబనాన్ చిన్నదేశం 1944లో ఫ్రెంచ్ వలస నుండి స్వాతంత్య్రం పొందింది. వివిధ జాతులు, మతాలతో కూడిన వైవిధ్య దేశం. జాతుల మధ్య పోరాటాలు, విద్వేషాలు, అంతర్యుద్ధం, ఇజ్రాయెల్ దాడులు, సిరియా దాడులు, ఆత్మాహుతి బాంబు దాడులు, రాజకీయ హత్యలతో రక్తసిక్తమైన చరిత్ర లెబనాన్‌ది. క్రిస్టియన్ మిలీషియా, ముస్లిం షియా మిలీషియాల మధ్య 15 సంవత్సరాలు (1975–1990) సాగిన అంతర్యుద్ధం దేశ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసింది. నిత్యం మతాల మధ్య కొట్లాటలే. ఆధిపత్య భావన, కరడుగట్టిన అవినీతి నిత్య సంఘర్షణలకు కారణం. లెబనాన్ నేడు ఘోరమైన ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటుంది. ఫలితంగా విదేశీ రుణాలపై ఆధారపడవలసి వచ్చింది. దీంతో దేశం ఆర్థికవ్యవస్థ మరింత క్షీణించింది. లెబనాన్ ప్రధాన ఆర్థిక వనరులు టూరిజం, గల్ఫ్‌నుండి లెబనాన్ పౌరులు పంపే సొమ్ము ద్వారా వస్తుంది. కరోనా కారణంగా రెండు ఆదాయ వనరులు నిలిచిపోయాయి.

అక్టోబర్ 2019లోనే ఆనాటి ప్రధాని సాద్ హరిరి పొగాకు, గాసోలిన్, వాట్సాప్ కాల్స్‌పై పన్నులు పెంచడంతో ప్రజల్లో ఆగ్రహం పెరిగింది. మరోవైపు విద్యుత్, నీరు, పారిశుద్ధ్యం అందించడంలో హరిరి ప్రభుత్వం విఫలమైంది. దేశవ్యాప్తంగా పెంచిన పన్ను ఉపసంహరించుకోవాలన్న డిమాండ్‌తో దీర్ఘకాల ఉద్యమం జరిగింది. ఈ ఉద్యమంలో విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాలలు, కాలేజీలు మూతపడ్డాయి. ప్రభుత్వం నిర్బంధం పెంచినా ఉద్యమం చల్లారలేదు. సాద్ హరిరి పాశ్చాత్య దేశాలకు అనుకూలంగా విధాన నిర్ణయాలు చేస్తున్నాడన్న ఆరోపణలు మిన్నంటాయి. ప్రభుత్వంలో, అధికారులలో అవినీతి పెరిగిపోయింది. దీంతో ఆగ్రహించిన ప్రజలు ప్రభుత్వ పాలన వైఫల్యం, సెక్టేరియన్ పాలన, ధరల పెరుగుదల, నిరుద్యోగం, అవినీతికి వ్యతిరేకంగా బీరూట్ వీధుల్లో పెద్ద ఎత్తున పోరాటాలు చేశారు. పర్యవసానంగా నాటి ప్రధాని సాద్ హరిరి గత అక్టోబర్‌లో రాజీనామా చేయవలసి వచ్చింది.

హరిరి తదుపరి 2019 డిసెంబర్‌లో కొత్తగా ఏర్పడిన మిచెల్ హసన్ డియాబ్ ప్రభుత్వానికి ఆర్థిక వ్యవస్థను నిలబెట్టడం ప్రధాన కర్తవ్యమైంది. అయితే, వివిధ కారణాల మూలంగా విత్త వ్యవస్థ ఇంకా దిగజారుతోంది. కరోనా మహమ్మారితో మరింత దెబ్బ తగిలింది. దేశంలో నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరిగాయి. నిరుద్యోగం 48 శాతానికి పెరిగింది. 2019–2020 సంవత్సరంలో స్థూల జాతీయోత్పత్తి పన్నెండు శాతం క్షీణిస్తుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. కరోనా వైరస్ అరికట్టడం సాకుతో దేశంలో అత్యవసర పరిస్థితిని ఈ మార్చిలో ప్రకటించింది. లెబనాన్ ప్రభుత్వం ఇరాన్‌కు అనుకూలమైనందున మిలటరీ చర్యలకు దిగుతామని ఇజ్రాయిల్ హెచ్చరించడంతో ఇజ్రాయెల్ సైన్యానికి హిజ్బుల్లాల మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. అనేక ఇబ్బందుల మధ్యనున్న లెబనాన్‌కు ఈపేలుళ్లతో వెన్ను విరిగినంత పనైంది.

లెబనాన్ ప్రస్తుత పరిస్థితికి కారణం ఆ దేశం అనుసరించిన ప్రపంచీకరణ ఆర్థిక విధానాలే అయినప్పటికీ ప్రభుత్వంలో, రాజకీయ

నాయకులలో, అధికారులలో నెలకొన్న అవినీతి కారణంగానే ప్రస్తుత దుస్థితి ఏర్పడిందన్న ప్రచారం సాగుతోంది. ఈ అవినీతి గురించిన ప్రచారం కొత్తదీ కాదు, అవాస్తవమూ కాదు. కాని దేశ ఆర్థిక వ్యవస్థ ఈ దుస్థితిలో ఉండడానికి మూల కారణం ప్రపంచీకరణ ఆర్థిక విధానాలే అన్న వాస్తవాన్ని, ఉద్యమకారులు గుర్తించడం లేదు. నిజానికి మూడో ప్రపంచ దేశాల్లో చాలా ప్రభుత్వాలు అవినీతికి పాల్పడేవే. అయితే ఈ అవినీతి వల్లే ప్రస్తుత సంక్షోభం ఏర్పడిందనడం పొరపాటు వాదన. ప్రస్తుత సంక్షోభం కేవలం మూడో ప్రపంచ దేశాలకే పరిమితం కాలేదు. అభివృద్ధి చెందిన, సంపన్న దేశాలలోనూ సంక్షోభం తీవ్రంగానే ఉంది. అంతేకాదు, మితిమీరిన అవినీతి అనేది ప్రపంచీకరణ ఆర్థిక వ్యవస్థల్లో ఉండే ఒక లక్షణం. అసలు సంక్షోభానికి అంతర్జాతీయ ద్రవ్య సంస్థల దోపిడీ విధానాలన్నది ఉద్యమకారులు గుర్తించాలి.

మార్కెట్‌కు స్వేచ్ఛనిచ్చే ప్రభుత్వ విధానాలు అమలు చేసేటప్పుడు సులువుగా అవినీతికి పాల్పడే అవకాశం ఉంటుంది. అయితే పెద్ద ఎత్తున ప్రైవేటీకరణకు పూనుకునేటప్పుడు, కార్పొరేట్లకు భారీగా రాయితీలను కల్పించేప్పుడు అంతకన్నా ఎక్కువ స్థాయిలో అవినీతికి ఆస్కారం ఏర్పడుతుంది. అందుకే ప్రపంచీకరణ దశలో అవినీతి రికార్డు స్థాయిలో పెరిగిపోతుంది. ఆర్థిక అసమానతలు అనూహ్యంగా పెరిగిపోతున్నాయి. అంతేకాదు నిరుద్యోగం కూడ అదే స్థాయిలో పెరిగిపోతోంది. సంక్షోభంలో చిక్కుకున్న దేశంలో ప్రభుత్వాలు దిగిపోవాలంటూ ఆందోళనలు జరగడం ఆశ్చర్యాన్ని కలిగించే విషయం ఏమీ కాదు, ఇటువంటి ఆందోళనలు గతంలోనూ చాలా చోట్ల జరిగాయి. ఈ సందర్భాన్ని సామ్రాజ్యవాద దేశాలు ఏ విధంగా తమకనుకూలంగా మలుచుకుంటున్నాయనేదే ఇప్పుడు కొత్తగా మనం గమనించాల్సిన అంశం.

బీరూట్ పేలుడు జరిగిన వెంటనే అక్కడికి చేరుకున్న మొట్టమొదటి సంపన్న దేశ ప్రతినిధి ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయెల్ మాక్రాన్. రెండవ ప్రపంచ యుద్ధానికి ముందు కాలంలో లెబనాన్ ఫ్రాన్స్ దేశపు వలసగా ఉండేది. రాజకీయ, ఆర్థిక సంస్కరణలు తాము చెప్పిన విధంగా చేపడితే లెబనాన్‌కు ఆర్థిక సహాయం చేస్తామని అతగాడు ప్రకటించాడు. ఆ వెంటనే అమెరికా రంగంలోకి దిగింది. ప్రస్తుత ప్రధాని హసన్ దియాబ్ ఇరాన్ అనుకూలస్తుడైనందున ఆందోళనకారులకు అమెరికా మద్దతు ప్రకటించింది. లెబనీయులిప్పటికీ చాలా ఇబ్బందులు పడ్డారని ట్రంప్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఆర్థికాభివృద్ధి కోసం, అవినీతిలేని, జవాబుదారీతనం కలిగి ఉండే ప్రభుత్వం ఏర్పడాలని, విదేశీ వత్తిడి ఉండరాదని లెబనాన్ ప్రజలు చేస్తున్న పోరాటానికి అమెరికా అండగా ఉంటుందని ప్రకటించడం ఆశ్చర్యం కలిగించక మానదు.

'రాజకీయ, ఆర్థిక సంస్కరణలు' కావాలని మాక్రాన్ అన్నా, 'అవినీతి లేని, జవాబుదారీతనం ఉన్న ప్రభుత్వం' ఏర్పడాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అన్నా సారాంశం ఒక్కటే. లెబనాన్‌లో సామ్రాజ్యవాదులకు అనుకూలంగా ఉండే ప్రభుత్వం ఏర్పడాలన్నదే అసలు విషయం. ఇప్పుడున్న ప్రభుత్వం ఇరాన్ బలపరుస్తున్న హిజ్‌బుల్లాకు అనుకూలంగా ఉంది. అది ఇజ్రాయెల్ ప్రయోజనాలకు వ్యతిరేకం. అందుచేత ఆ స్థానంలో ఇజ్రాయెల్‌కు అనుకూలంగా వ్యవహరించే ప్రభుత్వం ఏర్పడాలన్నదే అమెరికా, ఫ్రాన్స్ కోరుకుంటున్నాయి. అటువంటి ప్రభుత్వం సామ్రాజ్యవాద అనుకూల ప్రపంచీకరణ ఆర్థిక విధానాలను అమలు చేయాలని అవి వాంఛిస్తున్నాయి. అలాగే పశ్చిమాసియాలో ఇజ్రాయెల్ ద్వారా తమ ప్రభావాన్ని నిలుపుకోవాలని ఆశిస్తున్నాయి.

ప్రభుత్వ వైఫల్యానికి వ్యతిరేకంగా ప్రజాగ్రహం

లెబనాన్ రాజధాని బీరూట్‌లో జరిగిన భారీ పేలుళ్లతో అక్కడి ప్రజలు ముఖ్యంగా యువకులు ప్రభుత్వ అసమర్థతపై నిప్పులు చెరుగుతున్నారు. లెబనాన్‌లో గత మూడు దశాబ్దాలుగా అవినీతి రాజ్యమేలుతుందని, వ్యవస్థ మారాలని నూతన వ్యవస్థ కోసం విద్యార్థులు గొంతెత్తారు. శాంతియుత నిరసనలతో మార్పు అసాధ్యమని విద్యార్థులు మండిపడుతున్నారు. లెబనాన్ రాజధాని బీరూట్‌లో ప్రభుత్వ సంస్థలపై దాడి చేశారు. అమరవీరుల స్క్వేర్ వద్ద నిరసనకారులు ప్రభుత్వ అవినీతికి, నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా నినదించారు. ప్రభుత్వ అధికారులు రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అవినీతి అధికారులను ఉరితీయండి అన్న నినాదాలు మిన్నంటాయి. భద్రతా దళాలపై నిరసనకారులు రాళ్లు రువ్వారు. దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున జరుగుతున్న నిరసనలలో భాగంగా ఆగస్టు 8న పార్లమెంట్‌ను ముట్టడించేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంలో భద్రతాదళాలకు నిరసనకారులకు మధ్య జరిగిన ఘర్షణలో వందలాది మంది గాయపడ్డారు. దీంతో ఉద్యమం మరింత ఉధృతమైంది. ప్రధాని హసన్ దియాబ్ ఆగస్టు 10న తన పదవికి రాజీనామా చేయక తప్పలేదు. ఆయన టివీలో మాట్లాడుతూ 'లెబనాన్‌లో ప్రభుత్వం కన్నా అవినీతి శక్తివంతమైందన్నారు'. ప్రజలతో కలిసి మార్పు కోసం పోరాడుతానన్నారు.

ముగింపు

గత తరాల మాదిరిగానే మేము విధ్వంసాన్ని, విషాధాన్ని అనుభవిస్తున్నాం. నిత్యం కన్నీటితో జీవితం గడుపుతున్నామని, మాది అంతంలేని, అంతులేని విషాదమని తీవ్ర ఆవేదనను బీరూట్ ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. మాకు రాజకీయ, ఆర్థిక, ఆహార, ఆరోగ్య, ఉపాధి సమస్యలు ఉన్నాయి. ఇప్పుడు విస్ఫోటనం తోడైంది. ఈ విషాదమే మా బతుకుల్ని, మమ్మల్ని ఛిద్రం చేస్తున్నదని అంటౌన్ ఇస్సా వ్యాఖ్యానించడం అక్కడి ప్రజల విషాదానికి, వేదనకు అద్దం పడుతున్నది. లెబనాన్‌లోని సున్నీ, షియా మత విద్వేషాలకు స్వస్తి పలకాలి. వీలున్నంత త్వరగా ఆ దేశంలో సాధారణ స్థితి నెలకొనేందుకు అంతర్జాతీయ సమాజమూ శక్తికొద్దీ తోడ్పాటునందించాలి. ఇప్పటికే చాల దేశాలు ముందుకు వచ్చాయి. ఈ విషణ్ణ నేపథ్యంలో వేలాది మంది క్షతగాత్రులను, లక్షల మంది నిరాశ్రయులనూ ఆదుకోవడం ప్రపంచ ప్రజలందరి బాధ్యత. బీరూట్ దుర్ఘటన నుంచి ప్రపంచ దేశాలన్ని పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉన్నది. అమ్మోనియా నైట్రేట్ వంటి ప్రమాదకర రసాయనాలు ఎగుమతి దిగుమతులు జరిగే ప్రాంతాల్లో మరింతగా భద్రతా చర్యలు చేపట్టడం అవసరం. ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడడం ప్రభుత్వాల బాధ్యత, చేతులు కాలాక ఆకులు పట్టుకోవడం కాకుండా ముందుగానే జాగ్రత్త పడాలి.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

మార్క్సిజం కాదు నవీకరించబడ్డ కాపిటలిజం

ఇటీవల కాలంలో తెలుగు మేధో చర్చలోకి వస్తున్న మార్క్సిజానికి భిన్నమైన ధోరణుల సారాంశాన్ని విశ్లేషిస్తున్నారు

పి. ప్రసాద్

వేల సంవత్సరాల మానవజాతి చరిత్ర సారాన్ని కాచి వడపోసిన అసాధారణ కృషి ఫలమే మార్క్సిజం! దాని ఆవిర్భావం వెనక మానవ జాతి కార్చిన కన్నీటి సముద్రాలనూ, చిమ్మిన నెత్తుటి సముద్రాలనూ శోధించి మథింపు చేసిన సుదీర్ఘ, ప్రగాఢ చరిత్ర దాగి ఉంది. దాని వెనక భూగర్భ పోరాటం నుంచి తవ్వితీసిన మానవుల శవాల దిబ్బలనూ, ఎముకల గుట్టలనూ పరిశోధించిన చరిత్ర దాగి ఉంది. ఈ దుఃఖభరిత మానవజాతి చరిత్రకు గల కారణాలను అన్వేషించిన చరిత్ర దాగి ఉంది. వర్గం, మతం, తెగ, (కులం) ప్రాంతం, లింగం పేరుతో ఒక మనిషిని వేరొక మనిషి దోపిడీ చేయకూడదని సమున్నత సమాజ స్థాపనకై అన్వేషించిన చరిత్ర దాగి ఉంది. ఈ రకరకాల ఆర్థిక, సామాజిక, రాజకీయ దోపిడీ, పీడనలు లేని సమాజం కోసం సాగిన తాత్విక, సిద్ధాంత కృషి దాగి ఉంది. మార్క్సిజం కేవలం మార్క్స్, ఎంగెల్స్‌ల మెదళ్లలో తయారైన పదార్థం కాదు. పైన పేర్కొన్న మానవజాతి చరిత్రలన్నింటి సారం మార్క్స్, ఎంగెల్స్ మెదళ్లలో మథించబడ్డ ఫలితమే మార్క్సిజం!

పైన పేర్కొన్న మార్క్సిస్టు సిద్ధాంతం 1848లో కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక ద్వారా ఒక నిర్మాణ రూపం ధరించింది. అది జరిగి నేటికీ 172 ఏళ్లు నిండింది. ఈ సుదీర్ఘ కాలంలో మార్క్సిజాన్ని దెబ్బతీయాలని నిరంతర దాడులు సాగాయి. అది కేవలం భౌతిక దాడుల రూపానికే పరిమితం కాలేదు. రాజకీయ, తాత్విక దాడులు కూడా సాగాయి. నేటికీ కొనసాగుతున్నాయి. ఇలాంటి బహుముఖ దాడుల మధ్యే మార్క్సిజం పురోగమిస్తూ ఉంది.

మార్క్సిజం బయటి నుండి అంటే తన శత్రువర్గాల నుండి ఎదుర్కొన్న దాడులకూ గురి కాలేదు. ముఖ్యంగా ప్రపంచ పెట్టుబడిదారీ వర్గం నుండి యూరప్ నుండి ఆసియా వరకూ మార్క్సిజం పైన పేర్కొన్న రకరకాల దాడులకు గురవుతూ వచ్చింది. అవి బయటి నుండి శత్రు వర్గాల దాడులకు గురవ్వడానికే పరిమితం కాలేదు. అది మార్క్సిజం పేరుతో లోపలి నుండి కూడా దాడులకు గురవుతూ వచ్చింది. కొన్ని దశల్లో బయటి దాడులకంటే లోపలి దాడులవల్లనే మార్క్సిజం ఎక్కువ మూల్యం చెల్లించాల్సి వచ్చింది. బయటి నుండి జరిగిన భౌతిక దాడులకంటే, లోపలి నుండి ఎదురైన బౌద్ధిక దాడుల వల్ల మార్క్సిజం ఎక్కువ నష్టపోయిన కొన్ని నిర్దిష్ట సందర్భాలున్నాయి. ఇవి మార్క్సిజం పేరుతో మార్క్సిజం మీద జరిగే రకరకాల తాత్విక దాడులు!

మొదటి ఇంటర్నేషనల్ కాలంలో అంటే మార్క్స్, ఎంగెల్స్‌ల జీవిత కాలంలో 'మార్క్సిజం పేరుతో మార్క్సిజం' మీద జరిగిన దాడులు చాలా తక్కువగానే సాగాయని చెప్పాలి. ఆనాడు సోషలిజం పేరుతో 'మార్క్సిజం' మీద ఎక్కువ స్థాయిలో సాగాయి. ఇవి మార్క్సిజం పేరుతో జరగనందున బయటి నుండి జరిగిన దాడులుగా భావించాలి. ప్రధానంగా పెటీ బూర్జువా సోషలిజాల నుంచి మార్క్సిజం మీద తాత్విక, సైద్ధాంతిక దాడులవి. ప్రూడనిజం, బ్లాంక్వియిజం, బకునినిజాల పేరిట అవి సాగాయి. ముఖ్యంగా 'పారిస్ కమ్యూన్' వాటికి ఒక ముఖ్య క్షేత్రంగా మారింది. మార్క్స్ మరణానంతరం సాగిన ఎంగెల్స్ జీవిత కాలం నాటికి వాటి తీవ్రత బాగా తగ్గుముఖం పట్టింది.

రెండవ ఇంటర్నేషనల్ కాలంలో ఈ దాడులు కొత్తరూపం ధరించాయి. అవి ప్రధానంగా 'మార్క్సిజం పేరిట మార్క్సిజం' మీద జరిగాయి. అవి ఫ్రాన్స్‌లో 'మిల్లిరిజం'తో ప్రారంభమై, జర్మనీలో బెర్న్ స్టెయిన్‌తో తీవ్రరూపం ధరించింది. అదంతా 19వ శతాబ్ది ముగింపు నాటికి జరిగింది. 20వ శతాబ్దిలో మరింత ఉధృతి రూపం తీసుకున్న పరిస్థితి ఉంది.

రెండవ ఇంటర్నేషనల్ చరిత్రను పరిశీలిస్తే అందులో రెండు దశలుంటాయని అర్థమవుతుంది. 'కాలం' రీత్యా కొలిస్తే 1889 నుండి 1899 వరకూ ఒక దశాబ్ది కాలం 19వ శతాబ్ది విభాగంగా వర్గీకరించాల్సి ఉంది. 1900వ సంవత్సరం నుండి దాని పతనం వరకూ 20వ శతాబ్ది విభాగంగా పేర్కొనాల్సి ఉంది. ఇలా 'కాలం' రీత్యానే కాకుండా 'యుగం' రీత్యా కూడా రెండు దశలుంటాయి. లెనిన్ చేసిన వర్గీకరణ ప్రకారం పాత పెట్టుబడిదారీ దశ, కొత్త పెట్టుబడిదారీ దశలుగా ఉంటుంది. ఇది ఒకే పెట్టుబడిదారీ వ్యవస్థలో రెండు దశలుగా భావించాలి. ఈ రెండో దశ (కొత్త పెట్టుబడిదారీ దశ)నే సామ్రాజ్యవాద యుగమంటారు. ఈ యుగ విభజన కూడా ఇంచుమించు శతాబ్ది విభజనతో సమానీకరించబడుతుంది. అంటే 20వ శతాబ్ది ప్రారంభమూ, సామ్రాజ్యవాద యుగ ప్రారంభమూ దాదాపు ఒకటే కావడమూ గమనార్హం! ఈ సామ్రాజ్యవాద యుగంలో మార్క్సిజం పేరుతో మార్క్సిజం మీద జరిగిన తాత్విక దాడులు తీవ్రతరమయ్యాయి.

సామ్రాజ్యవాద యుగంలో రెండవ ఇంటర్నేషనల్ రెండవ దశ గూర్చి తొలుత సింహావలోకనం చేద్దాం. ఈ నిర్దిష్ట దశలో మార్క్సిజం పేరుతో మార్క్సిజం మీద సాగిన తాత్విక, సిద్ధాంత దాడులు రివిజనిజంగా పేరొందింది. ఈ రివిజనిజం రెండు ఉపదశలుగా సాగింది. తొలి ఉపదశలో బెర్న్ స్టెయినిజం మార్క్సిజాన్ని నగ్న వక్రీకరణకు దిగింది. అప్పుడు 'మధ్యస్థవాదం' (సెంట్రిజం) పేరిట కాట్స్కీయిజం మార్క్సిజాన్ని సంరక్షించడంలో మద్దతు ఇచ్చింది. ముఖ్యంగా రెండో ఇంటర్నేషనల్ ఏడవ మహాసభ (1907లో స్టుట్‌గార్డ్‌లో) నుండి బెర్న్ స్టెయినిజంతో లెనిన్, రోజాలక్సెంబర్గ్‌ల నేతృత్వంలో జరిగిన సైద్ధాంతిక పోరాటాన్ని పరిమితులతో కాట్స్కీయిజం బలపరిచింది. అవి 1912లో బాసెల్ ప్రత్యేక మహాసభ వరకూ కొనసాగింది. రానున్న సామ్రాజ్యవాద యుద్ధాన్ని

కార్మికవర్గం వ్యతిరేకించాలనే తీర్మానాన్ని రెండవ ఇంటర్నేషనల్ ఆమోదించడం మార్క్సిజానికి గొప్ప సైద్ధాంతిక విజయమే! అంతవరకూ కాట్స్కీ నేతృత్వంలోని సెంట్రిజం సహకరించింది.

మొదటి ప్రపంచ యుద్ధం సమీపించే కొద్దీ బాసెల్ ప్రణాళికకు లోపలి నుండే ఉల్లంఘనలూ, అతిక్రమణలూ పెరుగుతూ వచ్చాయి. ముఖ్యంగా యుద్ధారంభంతో ఇంటర్నేషనల్‌లోని మెజార్టీ సభ్య పార్టీలు బాసెల్ ప్రణాళికకు విరుద్ధంగా బూర్జువా జాతీయవాదాన్ని బలపరిచాయి. అంతవరకూ మధ్యస్థవాదం (సెంట్రిజం) ముసుగు కప్పుకున్న కాట్స్కీ, యుద్ధారంభంతో దాన్ని తొలగించుకున్నాడు. ఆ తర్వాత మార్క్సిజం మీద రివిజనిజం సాగించిన ఆంతరంగిక దాడి రూపం మారింది. బెర్న్‌స్టెయినిజం రెండవ వరసలోకి వెళ్లింది. మొదటి వరసలో 'కాట్స్కీయిజం' ఆసీనురాలైంది. అంతిమంగా రెండవ ఇంటర్నేషనల్ పతనానికి కాట్స్కీయిజం కారకురాలిగా పేరొందింది.

రెండవ ఇంటర్నేషనల్ చివరి జీవిత కాలంలో కాట్స్కీయిజానికీ, మార్క్సిజానికీ మధ్య ఇంటర్నేషనల్ వేదికగా సాగిన తీవ్రమైన ఆంతరంగిక సైద్ధాంతిక పోరాటం నుండే 'లెనినిజం' ఉద్భవించింది. దానికి 'లెనినిజం'గా ఎప్పుడు నామకరణం జరిగిందనేది సాంకేతిక అంశం మాత్రమే. అదో ప్రత్యేక మార్క్సిస్టు సిద్ధాంత ధోరణిగా రూపొంది, దానికి పూర్వ రంగం మాత్రం రెండవ ఇంటర్నేషనల్ వేదికే అవుతుంది. ఈ 'లెనినిజం' వెలుగులోనే బాసెల్ ప్రణాళిక వెలుగులో లెనిన్ నేతృత్వాన రష్యా పార్టీ (ఆర్ఎస్‌డిఎల్‌పి) సామ్రాజ్యవాద యుద్ధాన్ని అంతర్యుద్ధంగా మార్చడం జరిగింది. ఫలితమే 1917లో రష్యాలో రెండు విప్లవాలు జరిగాయి. ముఖ్యంగా ప్రజాతంత్ర విప్లవ దశ (ఫిబ్రవరి విప్లవం) పూర్తి అయ్యాక కేవలం 8 నెలల వ్యవధిలో అదే ఏడాది అక్టోబర్ (నవంబర్)లో సోషలిస్టు విప్లవం విజయవంతమైనది. నిజానికి తాత్విక భాషలో చెప్పాలంటే, కాట్స్కీయిజంపై లెనినిజం సాగించిన తాత్విక యుద్ధ ఫలితమే భౌతికంగా, రాజకీయంగా సాధించిన రష్యన్ సోషలిస్టు విప్లవం! దాని విజయం కాట్స్కీయిజాన్ని చరిత్ర హీనురాలిని చేయగలిగింది. అయితే రివిజనిజం మరో రూపంలో తలెత్తింది. అదే ట్రాట్స్కీయిజం! మరో విధంగా చెప్పాలంటే, రష్యా విప్లవానికి ముందున్న కాట్స్కీయిజమే రష్యా విప్లవానంతరం ట్రాట్స్కీయిజంగా రూపాంతరం చెందింది.

కాట్స్కీయిజం వంద తార్కిక వాదనలు చేసినా దాని సారాంశాన్ని కాచి వడపోస్తే ఏక వాక్యంలో 'ఒకే దేశంలో సోషలిజం సాధ్యం కాదు' అని చెప్పవచ్చు. దాన్ని బద్దలు కొట్టి విజయవంతమైన సోషలిస్టు రష్యాను నిలదొక్కుకోనివ్వకుండా అస్థిరపరిచే నాటి ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ లక్ష్యానికి కాట్స్కీయిజం పెద్దగా ఉపయోగపడకుండా పోయింది. రివిజనిస్టు మార్కెట్‌లో కాట్స్కీయిజానికి గిరాకీ పడిపోయింది. అలాంటి నేపథ్యంలో ముందుకొచ్చిందే 'ట్రాట్స్కీయిజం'!

1919లో లెనిన్ నేతృత్వంలో స్థాపించబడ్డ మూడవ ఇంటర్నేషన్‌కు లెనినిజం తాత్విక పునాదిగా మారింది. లెనినిజమంటే సామ్రాజ్యవాద యుగంలోని మార్క్సిజం! మూడో ఇంటర్నేషనల్‌కు కాట్స్కీయిజం బయటి శత్రువు అవుతుంది. కానీ ట్రాట్స్కీయిజం ఆంతరంగిక శత్రువుగా మారింది. ట్రాట్స్కీ శాశ్వత విప్లవ సారాన్ని ఒక్క మాటలో చెప్పాలంటే, 'ఒకే దేశంలో సోషలిజం నిలబడదనేదే'!

లెనిన్ జీవిత కాలంలోనే 'ట్రాట్స్కీయిజం' సోషలిస్టు విప్లవ నిర్మాణ క్రమానికి ఆటంకకారిగా మారింది. లెనిన్ మరణానంతరం అది మరింత ప్రమాదకర సైద్ధాంతిక ధోరణిగా రూపొందింది. నిజానికి ట్రాట్స్కీయిజానికి తాత్విక పునాది వేసిన చరిత్ర కాట్స్కీయిజానికి దక్కుతుంది. కాట్స్కీయిజం లేకుండా ట్రాట్స్కీయిజం లేదు. ఈ రెండు వాదాల మిశ్రమ పదార్థమే మూడో ఇంటర్నేషనల్ కాలంలోని రివిజనిజంగా చెప్పొచ్చు. అది నేటికీ ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమాన్ని వెంటాడుతూ ఉంది. నూరేళ్లు గడిచినా నేటికీ కాట్స్కీయిజం, ట్రాట్స్కీయిజం ప్రపంచ వ్యాపిత ధోరణులుగానే కొనసాగుతున్నాయి.

ఇటీవల కాలంలో మన తెలుగు నేలమీద కూడా కాట్స్కీయిజం, ట్రాట్స్కీయిజం వంటి రివిజనిస్టు ధోరణులు క్రమంగా తలెత్తుతున్నాయి. అయితే ఈనాటికీ అది ఆంతరంగిక ధోరణులుగా ఆయా కమ్యూనిస్టు నిర్మాణ సంస్థలలో తలెత్తకపోవడం ఒక సానుకూల అంశమే. రెండో, మూడో ఇంటర్నేషనల్ వేదికలలో ఆంతరంగిక సైద్ధాంతిక పోరాటంగా సాగింది. ఆ పరిస్థితి నేడు భారతదేశ విప్లవ క్రమంలో లేకపోవచ్చు. కానీ విప్లవ సాధన కోసం పనిచేస్తున్న విప్లవ పార్టీల నిర్మాణాలకు బయట (ఆవల) కాట్స్కీయిజం, ట్రాట్స్కీయిజాలు నెమ్మదిగా, క్రమక్రమంగా ఒక 'మేధోధార'గా రూపం తీసుకుంటున్నాయి. అది నేడు సెమినార్లు, బోధనా తరగతులు, అధ్యయన బృందాలు (స్టడీ సర్కిల్స్), గ్రంథ రచనలు, వ్యాస రచనలు, చర్చా గోష్ఠుల రూపాలలో బలపడే ప్రయత్నంగా ఉంది. ఇది ఈనాటికీ క్షేత్రస్థాయి ఉద్యమ ధోరణిగా లేదు. క్షేత్రస్థాయి నిర్మాణ రూపం కూడా తీసుకోలేకపోవచ్చు. కానీ ఆయా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణ సంస్థలలో సైద్ధాంతిక, రాజకీయ అస్థిరతను సృష్టించడానికి తగిన పాదార్థిక పునాది ఉంది. ఈ భౌతిక వాస్తవాన్ని గుర్తించకతప్పదు.

పైన పేర్కొన్న 'మేధోధార'కు నిర్మాణ సామర్థ్యం లేకపోవచ్చు. కానీ నిర్మాణాలను అస్థిరపరిచే సామర్థ్యం ఉంది. రష్యా విప్లవ చరిత్రలో కూడా ట్రాట్స్కీయిజానికి 'నిర్మాణ చరిత్ర' లేదు. కానీ 'విచ్ఛిన్న చరిత్ర'ను అది మూటగట్టుకోగలిగింది. పై 'మేధోధార'కు నిర్మాణ సామర్థ్యం లేదని సంతృప్తి చెందడం నేటి మార్క్సిస్టు, లెనినిస్టు సంస్థలకు ఎంతమాత్రం తగదు. దానికి ఆయా మార్క్సిస్టు, లెనినిస్టు సంస్థలను అస్థిరపరిచే సామర్థ్యం ఉన్న వాస్తవాన్ని అవి గుర్తించాలి. ఈ 'మేధోధార' వెనకగల ప్రమాదాన్ని తాత్వికంగానే జోడించడానికి అవి సిద్ధపడాలి. అవి మాటల యుద్ధాలతో సాధ్యం కాదు. ఖచ్చితంగా సైద్ధాంతిక పోరాట ప్రక్రియ ద్వారానే ఓడించడం సాధ్యపడుతుంది.

ఆయా మార్క్సిస్టు – లెనినిస్టు సంస్థల నిర్మాణాలను అస్థిరపరచడానికి ఈ 'మేధోధార'కు పాదార్థిక పునాది ఉందని పైన పేర్కొన్నాను. అందుకు దానికి కొన్ని సానుకూల అంశాలున్నాయి. వాటిని అంశాల వారీగా వివరించకపోయినా, సంక్షిప్త సారంలో ఉదహరించుకుందాం.

మొదటి అంశం ఏమంటే ఈ ట్రాట్స్కీయిజం, కాట్స్కీయిజం ధోరణులకు ప్రాతినిధ్యం వహిస్తున్నవారు కొత్తగా నిర్మాణాలకు ఆవల ఉద్భవించింది కాదు. ప్రధానంగా ఆయా కమ్యూనిస్టు సంస్థల నిర్మాణాల ద్వారా ఎదిగినవాళ్లే. ఉదాహరణకు నేడు ఈ ధోరణులకు ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యాసాగర్ గారి రాజకీయ నేపథ్యం చూద్దాం. ఆయన చారిత్రాత్మక శ్రీకాకుళ సాయుధ పోరాటంలో అమరత్వం పొందిన ఆదిభట్ల కైలాసం కుటుంబీకుడు కావడం గమనార్హం! విప్లవ దార్శనికతతో పనిచేసిన ఒక ఉపాధ్యాయ ఉద్యమ నిర్మాత కొడుకు కావడం గమనార్హం! పైగా విద్యార్థి జీవితంలో ఒక విప్లవ విద్యార్థి సంస్థ ఆర్గనైజరుగా పనిచేసిన నేపథ్యం కూడా ఆయనకు ఉంది. అది ఆయనలో మారిన నేటి మేధో ధోరణి పెరుగుదలకు ఒక పాదార్థిక వనరుగా ఏదో మేరకు ఉపయోగపడుతుంది. దానిని తాను వినియోగించుకుంటున్నాడా లేదా అనేది ఇక్కడ సమస్య కాదు. నాటి నేపథ్యం ఆయనకి ఉపకరిస్తుందనేది ఒక భౌతిక సత్యం. అదే విధంగా విజయవాడ కేంద్రంగా మరో మార్క్సిస్టు

మేధావుల బృందం బహిరంగంగానే ట్రాట్స్కీయిజాన్ని బలపరుస్తున్నది. ఈ బృందానికి ప్రొఫెసర్ ఎన్. అంజయ్య గారు నేతృత్వం వహిస్తున్నారు. వీరు గతంలో సిపిఐలో రాజకీయ లబ్ధ ప్రతిష్టులుగా ఉన్న నేపథ్యం ఉంది. ఇలాగే మరికొందరున్నారు. గత రాజకీయ నిర్మాణాల ద్వారా లభించిన ఆధరణ, ప్రతిష్టలు వారికొక సహాయక అంశాలుగానే ఉపయోగపడతాయి.

రెండవ అంశంలోకి వద్దాం. ప్రస్తుతం కమ్యూనిస్టు సంస్థలు నిర్మాణ రీత్యా బలహీనంగా ఉన్నాయి. వర్గ పోరాటాలు బలహీనంగా ఉన్నాయి. స్థూలంగా కమ్యూనిస్టు ఉద్యమం బలహీనంగా ఉంది. ఈ పరిస్థితి కూడా పైన పేర్కొన్న ట్రాట్స్కీయిజం, కాట్స్కీయిజం వంటి రివిజనిస్టు ధోరణులకు సహకరిస్తాయి.

మూడవ అశంలోకి వద్దాం. ఆయా కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణ సంస్థలు బలహీనంగా ఉన్నప్పటికీ, అవి అలా ఉన్నమేరకైనా వాటి నాయకత్వ శ్రేణుల సైద్ధాంతిక, రాజకీయ స్థాయి లేదు. ముఖ్యంగా ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి కాట్స్కీయిజం, ట్రాట్స్కీయిజాలు చేసిన ద్రోహం గూర్చి తెలియదు. ఈ దృష్ట్యా తగిన ఎడ్యుకేషన్ లేదు. దీనివల్ల పై మేధావులు అన్యాపదేశంగా బోధిస్తున్న ట్రాట్స్కీయిజం, కాట్స్కీయిజాల ప్రమాదాన్ని ఆయా కమ్యూనిస్టు సంస్థల ప్రస్తుత నాయకత్వ శ్రేణులు పసిగట్టలేని బలహీనత ఉంది. ఇది కూడా పైన పేర్కొన్న 'మేధోధార'కు బలాన్నిస్తుంది.

నాలుగో అశంలోకి వద్దాం. మార్క్సిస్టు – లెనినిస్టు సిద్ధాంత ప్రాతిపదికగా ఏర్పడ్డ ఆయా కమ్యూనిస్టు నిర్మాణ సంస్థల ప్రధాన కమిటీలు కూడా ఈ ప్రమాద స్థితిని గుర్తించడంలో వెనకబడి ఉన్నాయని చెప్పక తప్పదు. ఇతర ప్రాధమ్యాల మీద కేంద్రీకరించడం వల్ల గానీ; ఇతర పనుల వత్తిళ్లలో మునిగిపోవడం వల్ల గానీ; రాజ్య నిర్బంధం చేత ఈడ్చుబడే పరిస్థితి వల్ల గానీ ట్రాట్స్కీయిజం, కాట్స్కీయిజాల ప్రమాదాల తీవ్రతను అవి గుర్తించలేకపోతున్నాయి. ఈ స్థితి కూడా పై 'మేధోధార' బలపడడానికి కారణమౌతున్నది.

నా పరిమితులలో గుర్తించిన నాలుగు అంశాలను పైన పేర్కొన్నాను. ఇదే తెలుగు సీమలో క్రమంగా కాట్స్కీయిజం, ట్రాట్స్కీయిజాలు పెరుగుతూ ఉండడానికి ఒక పాదార్థిక పునాదిగా మారింది. నిజం చెప్పాలంటే, పైన పేర్కొన్న మేధావుల బృందాల గోష్టులు, సెమినార్లు, స్టడీ సర్కిల్స్, తరగతులకు హాజరవుతున్న ప్రేక్షకులలో ఎక్కవ శాతం మంది ట్రాట్స్కీయిజం, కాట్స్కీయిజాలను సైద్ధాంతికంగా వ్యతిరేకిస్తున్న సంస్థలకు చెందినవారే కావడం గమనంలో ఉంచుకోవాలి. వారికి లభించే ఆధరణకు ప్రధాన కారణం కూడా అదే కావడం గమనార్హం! అయితే కేవలం నిర్మాణ క్రమశిక్షణతోనే ట్రాట్స్కీయిజం, కాట్స్కీయిజాలను నియంత్రించాలని అనుకుంటే సరిపోదు. వాటిని సైద్ధాంతికంగా, తాత్వికంగా ఓడించాల్సిందే. అదే ముఖ్య కర్తవ్యం కావాలి.

నేడు తెలుగు సీమలో కాట్స్కీయిజం, ట్రాట్స్కీయిజాలు క్రమంగా చాపకింద నీరులా విస్తరిస్తున్నాయి. అయితే వాటి వకాల్తాదారులు ఈనాటికీ తాము పై ధోరణులకు ప్రతినిధులుగా చెప్పుకోవడానికి ధైర్యం చేయడం లేదు. అంజయ్య గారి నేతృత్వంలోని మేధో బృందం నిజాయితీగా తాము ట్రాట్స్కీయిజానికి మద్దతు ఇస్తున్నట్లు చెప్పుకున్నది. కాని విద్యాసాగర్ గారి నేతృత్వం, సహచర్యంతో గల బృందాలు అలాంటి నిజాయితీని ప్రదర్శించలేదు. పైగా లెనినిజం మీద తమ దాడికి కూడా లెనిన్‌నే ఉపయోగించుకుంటున్న పరిస్థితి ఉంది. తెలుగు సీమలో మార్క్సిజం, లెనినిజం మీద బహిరంగంగా సైద్ధాంతిక దాడికి దిగడానికి వెనకాడే పరిస్థితి ఉండడం నేటికీ వారి బలహీన స్థితిని వెల్లడిస్తున్నది. అయితే వారి ముసుగును తొలగించడం నేటి కర్తవ్యంగా ఉంటుంది. వారు లెనినిజానికి వ్యతిరేకులనీ, మార్క్సిజానికి వ్యతిరేకులనీ సైద్ధాంతిక పోరాటం ద్వారా బహిర్గత పరచాల్సి ఉంది. మార్క్సిజం, లెనినిజం సిద్ధాంత ప్రాతిపదిక మీద ఏర్పడ్డ నిర్మాణ సంస్థల నేటి తక్షణ కర్తవ్యమిది. ఈ సైద్ధాంతిక, తాత్విక, రాజకీయ కర్తవ్యం పట్ల అశ్రద్ధ, నిర్లక్ష్యం వహించకుండా అవి తక్షణం స్పందిస్తాయని ఆశిద్దాం.

ఈ వ్యాసంలో తెలుగు నేలమీద కాట్స్కీయిజం, ట్రాట్స్కీయిజాలకు వకాల్తా పుచ్చుకున్న మేధో శక్తుల వాదనల వివరాలలోకి వెళ్లలేదు. అవి అంశాల వారీగా నిర్దిష్టంగా ఎడ్యుకేట్ చేసుకోవాల్సి ఉంది. అది కూడా అనివార్యమైన అవసరమే. అయితే పై ధోరణులు క్రమంగా విస్తరిస్తున్న క్రమం వెనక నేపథ్య స్థితిని వివరించడంతో పాటు ప్రమాద హెచ్చరిక చేయడమే ఈ వ్యాస లక్ష్యం!

ఈ విధంగా మార్క్సిజం ముసుగు ధరించిన కాట్స్కీయిజం, ట్రాట్స్కీయిజాలు క్రమ క్రమంగా తమ సైద్ధాంతిక ప్రచార ప్రక్రియను కొనసాగిస్తున్నాయి. ఫలితంగా తొలుత మావో పాత్రను వికృతపరచ జూసిన నేపథ్యం ఉంది. మావో తర్వాత వారు తమ దాడిని స్టాలిన్ మీద ఎక్కు పెట్టారు. ఇప్పుడు లెనిన్ మీదికి గురిపెట్టారు. వారు ఇప్పటికీ మార్క్స్, ఎంగెల్స్‌లను ఉపయోగించుకుంటున్నారు. అయితే లోతుగా పరిశీలిస్తే అది కూడా నిజం కాదు. మార్క్స్‌లో రెండు దశలున్నాయి. 'తొలి మార్క్స్', 'మలి మార్క్స్'లు మనకు కనిపిస్తారు. (ఎంగెల్స్‌కు కూడా ఇంతే). కార్మిక వర్గ నియంతృత్వం, రైతాంగ సమస్య, జాతుల సమస్య వంటి అంశాలలో 'తొలి మార్క్స్' నుండి 'మలి మార్క్స్' కొంతవరకు వేరు పడతారు. వీరిప్పుడు 'మలి మార్క్స్'ను వదిలేశారు. చారిత్రక పరిణామ క్రమంలో 'తొలి మార్క్స్' కంటే 'మలి మార్క్స్' మరింత ఉన్నతుడు! వారి దాడి కేవలం మావో, స్టాలిన్, లెనిన్‌ల మీదే పరిమితం కాదు. వారు ఇప్పటికే 'మలి మార్క్స్' మీద, దాడికి 'తొలి మార్క్స్'ను, 'మలి ఎంగెల్స్' మీద దాడికి, 'తొలి ఎంగెల్స్'ను సాధనంగా వాడుకుంటున్నారు. ఇదే సూత్రం కాట్స్కీ విషయంలో తలకిందులైనది. 'తొలి కాట్స్కీ' గొప్ప మార్క్సిస్టు సిద్ధాంత వేత్తగా చరిత్రలో నిలుస్తాడు. ప్లెఖనోవ్ కూడా అంతే! వీరి విషయానికి వస్తే చరిత్ర చెత్తకుప్పకు చేరిన 'మలి కాట్స్కీ', 'మలి ప్లెఖనోవ్'లు వీరికి ఆదర్శమయ్యారు. వీరి అంతిమ లక్ష్యం మార్క్సిజం మీద దాడి తప్ప మరొకటి కాదు.

తాము ముసుగు ధరించలేమనీ, తాము మార్క్సిజాన్నీ, దాన్ని కొనసాగింపు సిద్ధాంతమైన లెనినిజాన్ని తు.చ. తప్పక బలపరుస్తున్నామని ప్రకటించదలచుకుంటే, వారికి ఇప్పటికీ అవకాశం ఉంది. అదే నిజమైతే, అట్టి బహిరంగ ప్రకటన చేయడానికి వారికి ఎలాంటి ఆటంకాలు లేవు. ఇలాంటి ప్రశ్నలు ఇటీవల వారికి ఎదురయ్యాయి. అయినా బహిరంగ ప్రకటనలు చేయడం లేదు. ఒకవేళ అలాంటి రాజకీయ దురుద్దేశాలు లేవనుకుంటే, ఇకనైనా ప్రకటించి తదనుగుణంగా సైద్ధాంతిక, తాత్విక, రాజకీయ రంగాలలో వ్యవహరిస్తే స్వాగతించవచ్చు.

ఏది ఏమైనా ఈ ప్రమాదకర కాట్స్కీయిజం, ట్రాట్స్కీయిజాలకు వ్యతిరేకంగా సైద్ధాంతిక పోరాటాన్ని కొనసాగించక తప్పదు. అదో తక్షణ కర్తవ్యంగా మార్చుకుందాం.

(రచయిత ఇఫ్టూ జాతీయ కార్యదర్శి) వీ

విప్లవం 'ఒంటరిగా' చేయొచ్చు.. నిలపొచ్చు!

తాత్విక బలంలేని పెట్టుబడిదారీ విధానం ఒంటరిగా పోరాడి, నిలబడగా లేనిది, తాత్విక సుగుణం, శ్రామిక బలం ఉన్న కమ్యూనిస్టు విధానం ఒంటరిగా పోరాడి, నిలబడ లేదా అని ప్రశ్నిస్తున్నారు **నన్నూరి వేణుగోపాల్**

భూమి మీద ఎలాంటి మార్పు అయినా, అది అన్ని చోట్లా, ఒకే సారి, ఒకే తరహాలో జరగలేదు. జరగదు. అదిగుణం లోనైనా, పరిమాణం లోనైనా. ఆహార సేకరణ కావొచ్చు; ఆహార ఉత్పత్తి కావొచ్చు; ఆదిమ వ్యవస్థయినా, బానిస వ్యవస్థయినా, భూస్వామ్య వ్యవస్థయినా, పెట్టుబడిదారీ వ్యవస్థయినా ఏదైనా కావొచ్చు. అది ఒకే మూసలో, ఒకే సమయంలో జరగదు. అంటే; చరిత్రలో అలా జరగలేదు.

'ఉత్పక్తి శక్తులకీ, ఉత్పత్తి సంబంధాలకూ మధ్యన ఒక వైరుధ్యం ఉంటుందనీ, ఆ వైరుధ్యం వాటి మధ్యన ఒక ఘర్షణను ఏర్పాటు చేస్తుందనీ, అప్పుడు వాటి స్థానంలోకి (సమాజంలోకి) కొత్త ఉత్పత్తి సంబంధాలు వొస్తాయని చెప్పే 'చారిత్రక భౌతికవాద నిర్వచనం' కూడా అన్ని చోట్లా ఒకేసారి అమలు కాలేదు. అలా కాకపోవడం అనేది అదొక 'వస్తుగత సత్యం.'

(బైబిల్ వేరు. 'భూమి బల్ల పరుపుగా ఉంది' అంటే అది ఈ భూమి ఉన్నంత వరకూ ఉంటుంది. 'ఆదాము – అవ్వ కథ' ఎన్ని వేల ఏళ్లైనా, ఎన్ని వేల రీ ప్రింటులు అయినా ఆ కథ అలానే ఉంటుంది. ఆ మాట చెక్కు చెదరదు.)

ఏ తిరుగుబాటైనా, ఏ విప్లవమైనా అంతే. అది అంతటా 'ఒకేసారి' మొదలవ్వదు. 'వలస పాలన' మీద నిరసన అయినా ఆ వలసలన్నిటి లోనూ; దాని పరిపాలన మీద; ఒకేసారి ఆ 'నిరసన' మొదలవ్వదు. (ఎక్కడో ఒకటీ అరా జరిగేది దానంతట అది ఒక సూత్రం అవ్వదు.)

కాబట్టి ఎలాంటిదైనా మొదట ఒంటరిగానే మొదలవుతుంది. (చరిత్రలో అలాగే మొదలయ్యింది. భవిష్యత్తులో కూడా అలాగే మొదలు కావొచ్చు.) ఒంటరిగా మొదలయ్యింది ఒంటరిగానే ఆగి పోకుండా అనేక దేశాలకు అది విస్తరిస్తుంది.

పాత ఉత్పత్తి విధానాలన్నీ కూడా తాను కాలు పెట్టె ప్రతీ చోటా 'విప్లవ రూపంలోనే ఉండాలి' అనే నియమం ఏమీ లేదు. అది ఒక చోట నించీ మరొక చోటకు 'దిగుమతి రూపం' లోనూ, లేదా 'వలస పాలనల ద్వారా జరిగే మార్పుల రూపా'ల్లోనూ (ఇండియా లాగా) కూడా జరగవొచ్చు. కానీ మార్క్స్ చెప్పిన సోషలిస్టు ఉత్పత్తి విధానం గానీ, కమ్యూనిస్టు ఉత్పత్తి విధానం గానీ వేరు. వస్తుగతంగానే అవి వేరు. అవి 'దిగుమతి' చేసుకునేవో, 'సంస్కరించు'కునేవో కాదు. అవి పూర్తిగా విప్లవాత్మకమైనవి.

ఉత్పక్తి శక్తులకూ, ఉత్పత్తి సంబంధాలకూ మధ్యన పొసగని పరిస్థితులు వొచ్చే వరకూ వేచి, అవి వొచ్చాయోలేవో తూకం వేసుకొని మొదలెట్టాల్సిన అవసరం లేదు. ప్రపంచ కార్మికులంతా ఏకం అయ్యి, ప్రపంచం అంతటా 'ఒకేసారి విప్లవించాల్సిన పని' అంతకన్నా లేదు.

ఫ్రాన్స్‌లో ఒంటరిగానే విప్లవం జరిగింది. రష్యాలో ఒంటరిగానే జరిగింది. చైనాలో ఒంటరిగానే జరిగింది. రేపు ఇండియాలో కూడా ఒంటరిగానే జరుగుతుంది.

ఉత్పత్తి శక్తులు ఎక్కడ 'ఏ స్థాయిలో' ఉన్నాయో, ఉత్పత్తి సంబంధాలు ఎక్కడ 'ఏ స్వభావంతో' ఉన్నాయో అక్కడినించే 'శ్రామిక సమీకరణ' జరుగుతుంది. 'శ్రామిక విప్లవం' జరుగుతుంది.

ఎందుకు 'ఇలాగే జరుగుతుంది' అంటే; గత కాలపు ఉత్పత్తి విధానాల్లో జరిగిన మార్పులకు 'భౌతిక నియమం' (ఉత్పత్తి శక్తులకీ, ఉత్పత్తి సంబంధాలకీ పొసగని నియమం) ఒక్కటే ఉండింది. ఆ నియమం సమాజాన్ని నడిపించింది. ('నియమం నడిపించింది' అంటే 'యాంత్రికంగా నడిపించింది' అని కాదు; ఒక ఉత్పత్తి విధానం పోయి, దాని స్థానంలోకి ఇంకో ఉత్పత్తి విధానం రావడానికి చోదక శక్తి 'వర్గ పోరాటమే.' ఆ వర్గ పోరాటానికి చోదక శక్తి శ్రామిక వర్గమే.)

మార్క్స్ ఎంగెల్స్ లొచ్చాక, ఆ నియమానికి తోడు, ఒక సిద్ధాంతాన్ని ఇచ్చారు. సిద్ధాంతం శ్రామిక వర్గం చేతిలోకి వొచ్చాక, నియమం 'ద్వితీయ స్థానానికి' వెళ్లి పోతుంది. శ్రామిక వర్గ చైతన్యమూ, దాని సంకల్పమూ ఈ రెండూ 'ప్రథమ స్థానానికి' వొచ్చి, భవిష్యత్తుకూ, లేదా కొత్త ఉత్పత్తి విధానానికి ఇవి మాత్రమే 'చోదక శక్తి' అవుతాయి.

కాబట్టి, విడిగానే, ఒంటరిగానే విప్లవాలు చెయ్యొచ్చును. ఇది ఒక భౌతిక వాస్తవమే. 'విప్లవం ఒంటరిగానే చెయ్యొచ్చు. 'అనేది ఎంత 'భౌతిక వాస్తవమో' 'సోషలిస్టు స్థాపన, కమ్యూనిస్టు స్థాపన' అనేవి కూడా అంతే 'భౌతిక వాస్తవాలు.' అవి కూడా వాటి ప్రారంభాలలో ఒంటరిగానే మొదలవుతాయి. ఒంటరిగానే నిలబడతాయి. అలా అని దాన్ని 'గతి తార్కికంగా' ఎలా రుజువు చెయ్యగలమంటే; రష్యా, చైనాలు సోషలిస్టుగా నిలబడలేక పోవడానికి అవి 'ఒంటరిగా ఉండడం' అనేది ఏరకంగానూ ఒక కారణం కాదు కాబట్టి.

'సోషలిస్టు స్థాపన వైఫల్యం' అనే దానికి కారణాన్ని 'ఒంటరి తనంలో' కాకుండా దాని నాయకత్వంలోనూ, దాని నిర్మాణంలోనూ చూసి, అదే నిజమని వొప్పుకుంటూ 'కమ్యూనిస్టు స్థాపన' మాత్రం అలా 'ఒంటరిగా, విడిగా' ఒక దేశం లోనో, లేదా ఒక ప్రాంతం లోనో జరగడాన్ని అనితర సాధ్యమని భావించే వాళ్లు ఉన్నారు. మార్క్సిజానికి వెలుపలే కాదు; లోపల కూడా ఉన్నారు.

శక్తి కొద్దీ పని చేసి, అవసరం కొద్దీ తీసుకోవడం' అనేది కమ్యూనిస్టు వ్యవస్థకు 'అంతిమ ఆదర్శం'గా చెప్పుకునే పని అయితే; అలాంటి నిర్మాణాన్ని విడిగా ఒక దేశం ఎందుకు సాధించ కూడదు? అంతర్గత

డిసెంబ్రిస్ట్ సైనిక తిరుగుబాటు పరిణామాలు - 7

జారిజం మీద 1825 డిసెంబర్‌లో జరిగిన తిరుగుబాటు రెండు వందల సంవత్సరాల తర్వాత కూడా ప్రభావం చూపుతున్నదంటున్నారు **ఎన్.వి.యస్. నాగభూషణ్**

(గత సంచిక తరువాయి)

ఇక పెస్తెల్ సంగతికి వస్తే, తన దక్షిణాది యూనియన్‌ని తన స్వంత కార్యక్రమాల ఆధారంగా కొనసాగించాడతడు. ఆ కార్యక్రమాలను అనుసరించే అతడి యూనియన్‌ని ప్రత్యేకంగా 'దక్షిణాది సొసైటీ'గా గుర్తించడం అందరికీ తెలిసిందే. అతడు రష్యాకు ఒక రాజ్యాంగాన్ని సూచిస్తూ పలు దేశాల రాజ్యాంగాల్ని మథించి, రష్యాకు తన మేథో జనితమైన ఒక సమగ్ర రాజ్యాంగాన్ని రచించాడు. గొప్ప మేధావియైన పావెల్ పెస్తెల్ బహు భాషాకోవిదుడు. అతని ఇంటి నిండా వేలాది గ్రంథాలుండే లైబ్రరీతో నిండి ఉండేది. అనేక దేశాల రాజ్యాంగాలు అతడి లైబ్రరీలో ఉండేవి. అతని మేథో జనితమైన రష్యన్ రాజ్యాంగానికి 'రష్యన్ న్యాయం' అని పేరు పెట్టాడు. ఈ రాజ్యాంగం రష్యాకు రిపబ్లికన్ ప్రభుత్వం అవసరమని ప్రజలకు పిలుపునిచ్చింది. అలాగే బానిస రైతాంగానికి స్వేచ్ఛను కల్పిస్తూ, బానిసత్వాన్ని రద్దు చేయాలనీ, అలాగే వారు సేద్యం చేసే భూమిని కూడా వారికే ఇవ్వాలనీ కోరింది. పెస్తెల్‌కు ఆర్థిక రంగంపై కూడా గట్టి పట్టున్నది. ఆ ఆర్థిక వ్యవస్థను ప్రభువర్గం వారికి వదిలెయ్యకుండా ప్రభుత్వమే దానిపై పర్యవేక్షణ సాగించాలనీ, అలాగే రష్యన్ ప్రజలంతా రష్యా జాతీయులే అనే భావనను కలిగించాలనీ పెస్తెల్ కోరాడు. దేశాన్ని రిపబ్లిక్‌గా మార్చడంలో అవసరమైతే జార్ కుటుంబాన్నంతా హతమార్చాలని చెప్పాడు. ఈ పుస్తకంలో మరో విశేషమేమంటే, భూమి హక్కుని పరిమితం చేయాలని కోరడం. ప్రభుత్వ, ప్రైవేట్ వ్యక్తుల భూమి నిధులను ఏర్పరచాలని చెప్పింది. అలాగే ఉన్నత వర్గం వారి ప్రత్యేక హక్కుల్ని రద్దు చేయాలని కోరింది. 20 సంవత్సరాలు దాటిన ప్రతి పురుషునికి రాజకీయ హక్కులివ్వాలని కోరింది.

పెస్తెల్ గట్టిగా రిపబ్లిక్ కోసం వాదిస్తాడు, అలాగే కేంద్రీకృత రాజ్యం కావాలని కూడా రస్కాయ ప్రౌడ లఘు స్వరూపాన్ని రాజ్యాంగం అని పిలుస్తాడు. ఈ రాజ్యాంగం ప్రజల పెద్ద గది (బాచా) కావాలనే నిబంధన ఉండాలంది. ఇదే రష్యా శాసన సభ. ఇదే (బాచా) రాజ్యాంగ సంబంధమైన 'డూమ' (డూమ = అసెంబ్లీ) శాసన సభే ఉద్యోగ వర్గాన్ని నియమిస్తుంది. ఒక ఉన్నత కౌన్సిల్‌కు న్యాయాధికారం ఉంటుంది. పెస్తెల్ రాసిన రస్కాయ ప్రౌడలోని విషయాలు ఆ తర్వాత డిసెంబ్రిస్టు సొసైటీ చేత ఆమోదింపబడ్డాయి. ఆ తర్వాత ఈ పుస్తకం దిత్వీయ ముద్రణలో పెస్తెల్ భావాలు మరింత ప్రజాస్వామ్యం వైపు ప్రసరించాయి.

5) డిసెంబ్రిస్టు ఉద్యమంలో దక్షిణాది సొసైటీకి గల ప్రాధాన్యత, ఉక్రేన్‌లో వేళ్లూనుకున్న స్వాతంత్ర్య భావనలూ

1820 ప్రారంభంలో విప్లవ సొసైటీలన్నీ ఉత్తరాది సొసైటీ సెయింట్ పీటర్స్ బర్గ్‌లోనూ, ఉక్రేన్‌లో దక్షిణాది సొసైటీ గుర్తింపు పొందిన సొసైటీలు. 1825 డిసెంబర్ 26న జరిగిన డిసెంబ్రిస్టు తిరుగుబాటు ద్వారా సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో అధిక సంఖ్యలో సైన్యాలు (3000 మందికి పైగా) తిరుగుబాటు చేసి, తిరుగుబాటులో ప్రముఖ స్థానాన్ని పొందిన మాట నిజమే. అంతమాత్రం చేత తిరుగుబాటులో దక్షిణాది సొసైటీని తక్కువ చేయడానికి వీలులేదు. దక్షిణాది సొసైటీ చేసిన తిరుగుబాటులో 800 మంది సైనికులే పాల్గొని ఉండవచ్చు. కానీ దాదాపు అంతా మరణించారు. నిజానికి ఇంత తక్కువ మంది, సెయింట్ పీటర్స్ బర్గ్‌లో జరిగిన తిరుగుబాటులో పాల్గొన్న 3000 మందితో పోల్చుకున్నప్పుడు పాల్గొనడానికి కారణం ఆయా సైనిక స్థావరాలలో గల సైన్యాల సంఖ్యే. సెయింట్ పీటర్స్ బర్గ్ దేశ రాజధాని గనుక అక్కడున్న సైనిక గారిసన్‌లో ఉండే సైనికుల సంఖ్య అధికంగా ఉంటుంది. మరి దక్షిణాది సొసైటీ స్థావరం 'తుల్‌చిన్'లో అతి చిన్న గారిసన్ ఉంది. ఇదే ప్రధానంగా ఈ తేడాకి కారణం. నిజానికి తిరుగుబాటు భావనలు సెయింట్ పీటర్స్ బర్గ్ నగరంలోని యువతరంలో వేళ్లూనుకొని నిలదొక్కుకోవడానికి పట్టిన కాలం కంటే అధిక కాలం దక్షిణాది సొసైటీ చుట్టు పక్కల ప్రాంతాలలో, అనగా ఆ సొసైటీని ఆవరించి ఉన్న విశాల భూభాగం ఉక్రేన్‌లోని యువతరంలో ఆ తిరుగుబాటు భావాలకు మరింత ఎక్కువ కాలం నుంచీ నిలదొక్కుకుని వ్యాపించి ఉన్నాయి.

తిరుగుబాటులో ఉక్రేన్‌కు ఒక ప్రత్యేక స్థానం ఏర్పడడానికి కారణం

సరుకు ఉత్పత్తి విధానాన్ని తీసెయ్యవొచ్చు. విలువ కొలతల్నీ, మారకాల్నీ, డబ్బునీ తీసెయ్యవొచ్చు. విదేశీ మారకం ఉంటుంది. ఆ మారకం కోసం బంగారం, డబ్బు, బ్యాంకులు ఉంటాయి. సైన్యం ఉంటుంది. అది ప్రజా సైన్యం. ఆయుధాలు ఉంటాయి. కోర్టులు ఉంటాయి. జైళ్లు ఉంటాయి. అవి ఆ కమ్యూనిస్టు దేశాన్ని బైట నించీ రక్షించు కోవడానికి మాత్రమే ఉంటాయి. పెట్టుబడిదారీ సంస్కృతి ఈ కమ్యూనిస్టు సంస్కృతిని పాడుచెయ్యని రక్షణ ఉంటుంది. ఇలాంటి కమ్యూనిస్టు ప్లానింగ్‌తో అలాంటి నిర్మాణం 'ఒంటరిగా' ఎందుకు జరగకూడదు? ఒక నిర్మాణం జరిగింది. అది లోపల కారణాల వలన కాకుండా 'బైట కారణాల (యుద్ధాల) వలన కూలింది' అనుకుందాం. మళ్లీ నిర్మించు కుంటామా లేదా?

ఇదీ అంతే. తాత్విక బలం లేని పెట్టుబడిదారీ విధానం ఒంటరిగా పోరాడి, ఒంటరిగా నిలబడగా లేనిది; తాత్విక సుగుణం, శ్రామిక బలం ఉన్న కమ్యూనిస్టు విధానం ఒంటరిగా పోరాడి, ఒంటరిగా నిలబడ లేదా?

(రచయిత మార్క్సిస్ట్ విశ్లేషకుడు) వీ

– ఈ ఉద్యమంలో 'సంయుక్త స్లావ్ సొసైటీ' భాగస్వామ్యం కలిగి ఉండడం వల్లనేనని చెప్పాలి. ఈ సంయుక్త స్లావ్ సొసైటీని 1823లో నొవోగ్రోడ్, – వోలిన్స్కీ ప్రాంతంలో నివసించే ఎ. బొరిసోవ్, పెత్రోవ్ బొరిసోవ్, మధ్యరకం భూస్వాములైన 'స్లొబోడిస్కో ఉక్రేనే' ప్రాంతంలోని వారూ, అక్కడ పనిచేస్తున్న కొంతమంది జూనియర్ అధికారులూ, పొల్టొమియాన్ ప్రాంత ప్రభు వంశానికి చెందిన 'యు. లియుబ్లిన్స్కీ లాంటివారు స్థాపించారు. 1825 నాటికి ఈ సొసైటీలో 50 మంది యువ రష్యన్ ఆఫీసర్లున్నారు. వీరంతా ఉక్రేన్ ఎడమ తీరంలో గల, ఉక్రెయిన్ దక్షిణాదిలోనూ పనిచేసేవారు. వీరిలో ఇవాన్ హర్వచేవేస్కీ, యకీవ్ డ్రహోమనోవ్, ఇవాన్ సుఖినివ్‌లు కూడా ఉన్నారు. ఈ సంయుక్త స్లావ్ సొసైటీ కార్యక్రమం నిరంకుశత్వానికీ, బానిసత్వానికీ వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడం, స్లావిక్ జాతీయుల సంఘం ఫెడరేటివ్ స్లావిక్ రిపబ్లిక్‌ని ఏర్పరచడం, ఇదంతా ప్రజాస్వామిక విధానం, అవకాశాలనూ, జాతీయ ఆచారాలను ప్రతి జాతికీ అందించడం. ఈ 'సంయుక్త స్లావ్ సొసైటీ' దక్షిణాది సొసైటీలో విలీనమైంది 1825 సెప్టెంబర్‌లో మాత్రమే. అంటే తిరుగుబాటుకి కేవలం మూడు నెలల ముందు మాత్రమే. అయినప్పటికీ తిరుగుబాటులో అత్యంత చురుకైన పాత్ర వహించిన వారిలో వీరి సంఖ్యే అధికం. దక్షిణాది సొసైటీ ముఖ్య నాయకుడూ, సిద్ధాంత కర్త అయిన పావెల్ పెస్తెల్‌ని, ఉత్తరాది సొసైటీ తిరుగుబాటు చేసిన తేదీకి ఒకరోజు ముందే, అనగా 13వ తేదీన అరెస్టు చేసినప్పటికీ, దక్షిణాది సొసైటీలో మరికొందరు ముఖ్యుల్ని కూడా అరెస్టు చేసినప్పటికీ, ఈ ఐక్య స్లావ్ సొసైటీయే ఆ అరెస్టు చేసిన వారిని విడిపించి, (అప్పటికే పెస్తెల్‌ని సెయింట్ పీటర్స్‌బర్గ్‌కి పంపేశారు. అందువల్ల అతణ్ని జైలు నుంచి విడిపించడం సాధ్యం కాలేదు) తిరుగుబాటుని ముందుకు నడిపించింది.

అయితే డిసెంబ్రిస్టు ఉద్యమంలో ఉక్రేన్ ప్రాంతం భాగస్వామ్యం వహించడం అనేది పరిపూర్ణ రష్యా ఉద్యమంలో భాగంగానే అయినప్పటికీ, ఇక్కడ ఈ ఉద్యమం దాని స్వంత విలక్షణమైన కారణాలను కలిగి ఉంది. డిసెంబ్రిస్టు భావాలూ, ధోరణులూ ఉక్రేనియన్ చరిత్రలో లోతైన వేర్లను కలిగి ఉన్నాయి. దీని భావాలైన జాతీయ స్వాతంత్ర్యం అనే భావనను పెంచి పోషించింది – అనేక శతాబ్దాల పాటు ఈ ప్రాంతం పైన ఆధిపత్యం కోసం పోలండ్, రష్యాలు పరస్పరం యుద్ధాలు చేస్తూ ఎవరో ఒకరు ఈ ప్రాంతంపై పెత్తనం చెలాయించడమే. అంచేత ఉక్రేనియన్ జాతీయ స్వాతంత్ర్య భావన ఉక్రేనియన్ దేశభక్తి సంఘాల నుంచి వారసత్వంగా వచ్చింది. అలాంటి దేశభక్తి సంఘాలలో ఒకటి 'నొవో – సివిరెస్కీయ్ దేశభక్త బృందం' – ఇది 18వ శతాబ్ది అంతంలోనే ఏర్పడింది. ఇంకా పొల్తావా ప్రాంతంలో, దక్షిణ ఉక్రేన్‌లో, మరికొన్ని ఉక్రేన్ కుడివైపు తీరంలో ఉన్నాయి. ఇవన్నీ విప్లవోద్యమానికి అనుకూలమైన ఆనవాయితీలను సృష్టించాయి. తద్వారా జాతీయ కోణంలో యువతరంలో రాజకీయ వాంఛల్ని ఏర్పరచాయి.

పైన చెప్పిన 'నొవో హొరోడ్ – సివిరెస్కీయ్ దేశభక్త బృందం' లోని పలువురు సభ్యులు పలు అకాడమిల్లోనూ, పలు విదేశీ విశ్వ విద్యాలయా ల్లోనూ ఉన్నత విద్యను గడించినవారు. ఈ సర్కిల్ లక్ష్యం ఉక్రేన్ ప్రాంతానికి స్వయం ప్రతిపత్తి, ఉక్రేనియన్ సంస్కృతికి పునర్జన్మ నివ్వడం. వీరు తమ లక్ష్యాలను ప్రచారం చేయడం, విదేశీ పరిశోధక, విద్యావేత్తలను రప్పించి ఉక్రేనియన్ చరిత్రను గురించి అంశాలను ప్రోది చేయడం చేసేవారు. ఉక్రేనియన్ ప్రభు వంశాల, కొసక్కుల హక్కుల్ని పరిరక్షించడం, అలాగే ఉక్రేనియన్ సైనిక శక్తిని పెంపొందించడం, చివరి లక్ష్యం రష్యన్ల ఆధిక్యాన్ని ఎదుర్కోవడం.

పై ఉక్రేనియన్ దేశభక్త బృందాల్లో ప్రాంతీయ తత్వం ఉన్నప్పటికీ, మిగిలినవన్నీ అందరికీ కావలసిన అంశాలే. అందువల్ల ఉక్రేనియన్ డిసెంబ్రిస్టులు మిగిలిన అంశాలన్నింటినీ గ్రహిస్తూనే, ప్రాంతీయ భావనను సవరించి, రష్యన్ విప్లవకారుల నుండి కేంద్రీకృత భావాలను అందిపుచ్చుకోవడం విశేషం. ఈ కారణంగా సాధారణ డిసెంబ్రిస్టు ఉద్యమంపై ఉక్రేనియన్ల ప్రభావం ప్రముఖంగా ఉండి, గుర్తింపు పొందింది.

దక్షిణాది సొసైటీ 1823లో మూడు శాఖలుగా చీలింది. 1) తుల్‌చిన్, 2) కమియాంక, 3) వాసిల్కివ్ అనే శాఖలుగా. 1825 సెప్టెంబర్‌లో 'సంయుక్త స్లావ్ సొసైటీ' దక్షిణాది సొసైటీలో విలీనమవుతూ, ఈ మూడో శాఖ అయిన 'వాసిల్కివ్' దక్షిణాది సొసైటీలో విలీనమైంది. చిర్నిహివ్ రెజిమెంట్ సెర్గీ మురావియేవ్ అపొస్తోల్ నాయకత్వంలో, వాసిల్కివ్ కౌన్సిల్ చేత తిరుగుబాటు నడిచిన తర్వాత అణిచివేయబడింది. దక్షిణాది సొసైటీ సభ్యులు అరెస్టు అయ్యారు. ఈ దక్షిణాది సొసైటీకి చెందిన ముగ్గుర్ని, మొత్తం డిసెంబ్రిస్టు తిరుగుబాటుకి చెందిన అయిదుగురిలోనూ ఉరి తీయడం జరిగింది. 1) పావెల్ పెస్తేల్, 2) మురావియేవ్ – అపొస్తోల్, 3) బెస్తుఝెవ్ – ర్యూమిన్ అనే ఈ ముగ్గురూ దక్షిణాది సొసైటీ వారే కావడం గమనార్హం! ఇక సైబీరియాలో యావజ్జీవిత ప్రవాసమూ, కఠిన శ్రమ నరకాన్నీ విధించబడిన 124 మందిలో కూడా పలువురు దక్షిణాది సొసైటీకి చెందినవారున్నారు. ఇక ప్రసిద్ధ సెర్గీవోల్కోన్స్కీ రాకుమారుడు కూడా దక్షిణాది సొసైటీలో సభ్యుడే, పావెల్ పెస్తెల్‌కు సన్నిహితుడే కావడం గమనార్హం. దక్షిణాది సొసైటీ అభివృద్ధికీ, దాని శాఖల విస్తరణకీ సెర్గీవోల్కోన్స్కీ ఎనలేని కృషి చేశాడు. అతడికీ మొదట ఉరిశిక్షను విధించినప్పటికీ, జార్ నికోలస్1 జోక్యం చేసుకుని (అతడి మీద పనిచేసిన ఒత్తిడులు కారణంగా), ఆ ఉరిశిక్షకు బదులుగా యావజ్జీవ ప్రవాస శిక్షా, 20 సంవత్సరాల కఠిన శ్రమ నరకాన్నీ విధించడం తెలిసిందే.

ఇక ఈ డిసెంబ్రిస్టు ఉద్యమంలో ఉత్తరాది, దక్షిణాది సొసైటీల ఐక్య భావాన్ని గురించి చెప్పాల్సిన మరొక విషయం ఉన్నది. అదేమిటంటే, రష్యన్ డిసెంబ్రిస్టు ఉద్యమం మొత్తంగా – ఉక్రేన్ జాతీయ ఆసక్తులకు భిన్నమైనది కాకపోవడం! సాధారణ ఊహలకు భిన్నంగా, ఉక్రేనియన్ విముక్తి ఉద్యమానికి అనుకూలంగానే, ఉత్తరాది సొసైటీలో గల లక్ష్యాలు నిర్ణయించబడ్డాయి. (ఇందులో ఉక్రేనియన్ సభ్యుల ప్రభావం ఉంది), అలాగే దక్షిణాది సొసైటీ ఉక్రేన్ ప్రాంతంలో ఉన్నప్పటికీ, ఈ సొసైటీ కేంద్రీకృత రిపబ్లిక్‌నే బలపరిచింది తప్ప, ప్రాంతీయ భావాలను బలపరిచే ఫెడరల్ రిపబ్లిక్‌ని కాకపోవడం గమనార్హం!

ఉక్రేనియన్ డిసెంబ్రిస్టులు వివిధ జాతుల, విదేశాల విప్లవ సంస్థల తోనూ సంబంధాలు కలిగి ఉండడం, వారి విశాల రాజకీయ దృక్పథానికి నిదర్శనం. 'రహస్య జార్జియన్ కకేషియన్ సొసైటీ' (1818–20) అనే సంస్థతో పాటు, పోలిష్ విప్లవకారులకు చెందిన పలు రహస్య సంఘాలతో, ముఖ్యంగా 'పోలిష్ దేశ భక్తుల సంఘం'తోటీ, అలాగే 'జాతీయ గ్రీకు ఉద్యమ సంస్థ'తోటీ కూడా వారు సంబంధాలను నెరపారు.

(ఇంకా ఉంది)

(రచయిత రష్యన్ విప్లవాల, లెనిన్ జీవిత చరిత్ర పరిశోధకుడు, సాహిత్యకారుడు, విమర్శకుడు) వీ

సింగరేణి బొగ్గు గని కార్మికుల సమ్మె

బొగ్గు గనుల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ సింగరేణి కార్మికులు, ఉద్యోగులు జూలై 1 నుండి 3 వరకు చేపట్టిన మూడు రోజుల సమ్మె విజయవంతమైంది. బొగ్గు గనులను వేలం వేయడాన్ని నిరసిస్తూ జాతీయ కార్మిక సంఘాలైన ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, సిఐటియుసి, హెచ్‌ఎంఎస్, బిఎంఎస్‌తో పాటు ఐఎఫ్‌టియు కార్మిక సంఘాల నేతలు సమ్మెకు నాయకత్వం వహించారు. దేశ వ్యాప్తంగా 50 బొగ్గు గనుల వేలాన్ని నిలిపివేయాలని, కార్మిక చట్టాల సవరణను వెనక్కి తీసుకోవాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు.

దళితుడికి పోలీస్ స్టేషన్‌లో శిరోముండనం

తూర్పుగోదావరి జిల్లా మునికూడలి గ్రామంలోని రోడ్డు మీద జూలై 18న ఓ ఇసుక లారీ దళిత యువకుడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆయన కాలికి గాయమైతే కొద్దిమంది దళిత యువకులు గుమికూడారు. అదే సమయంలో వైసిపి నాయకుడు కారులో వచ్చి హారన్ కొట్టడంతో అక్కడి వారు కొద్దిసేపు ఆగమని చెప్పినా ఆయన వినలేదు. ప్రసాద్ అనే యువకుడు కారు పక్కకు వెళుతుండగా అప్పుడే వైసిపి నాయకుడు కృష్ణమూర్తి డోర్ తీయడంతో ప్రసాద్‌కు గాయమైంది. దీంతో ఆగ్రహించిన ప్రసాద్ కారు అద్దాలు పగులగొట్టాడు. దీంతో వాగ్వివాదం జరిగి పెద్దల జోక్యంతో ఇరువురు వెళ్లిపోయారు. కృష్ణమూర్తి ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు వెనక్కి తీసుకొమ్మని దళితులు అడిగారు కాని ఆయన వినలేదు. ఆగస్టు 20న సీతానగరం పోలీసులు ప్రసాద్ ఇంటికి వెళ్లి ఆయన్ను కొట్టుకుంటూ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి మళ్లీ కొట్టి క్షురకుడిని పిలిపించి పోలీసులు దగ్గరుండి శిరోముండనం చేయించారు.

ఉస్మానియా ఆస్పత్రి ముందు ఔట్ సోర్సింగ్ నర్సుల ధర్నా

కరోనా సోకినవారికి ప్రాణాలకు తెగించి సేవలందిస్తున్న నర్సులకు నాలుగు నెలలుగా జీతం లేక అధికారులకు చెప్పినా స్పందించకపోవడంతో ఉస్మానియా ఆస్పత్రి ముందు ధర్నాకు దిగారు. రు. 25 వేలు వేతనం చెల్లిస్తామంటూ ఉస్మానియా ఆస్పత్రిలో నర్సులను ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా నియమించారు. వారికి జీతాలు ఇప్పటివరకు ఇవ్వలేదు. 88 మంది స్టాఫ్ నర్సులు జూలై28న ఉస్మానియా సూపరింటెండెంట్ ఛాంబర్ ముందు ధర్నా నిర్వహించారు. జీతాలు చెల్లించేవరకు ఆందోళన విరమించబోమని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ ఎస్ఇసిగా రమేశ్‌కుమార్ పునర్నియామకం

రాష్ట్ర హైకోర్టు, సుప్రీం కోర్టు తీవ్ర వ్యాఖ్యాల నేపథ్యంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిమ్మగడ్డ రమేశ్‌కుమార్‌ను తిరిగి రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నియమించింది. జూల్ 30న దీనికి సంబంధించిన జిఓను జారీ చేసింది. కరోనా నేపథ్యంలో రమేశ్‌కుమార్ స్థానిక ఎన్నికలను వాయిదా వేయడం ప్రభుత్వానికి ఆగ్రహం తెప్పించి ఆయన్ను సంస్కరణల పేరిట ఎస్ఇసి పదవికాలాన్ని కుదిస్తూ ఆర్డినెన్స్ జారీచేసి మీ పదవికాలం ముగిసిందన్నారు. దీంతో ఆయన న్యాయపోరాటానికి దిగి విజయం సాధించారు.

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ కార్మికుల నిరసన

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్మికులు ఆగస్టు 20న విజయవాడలోని సీతారామపురంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పని గంటల పెంపు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాలను కేంద్ర ప్రభుత్వం విడనాడాలని డిమాండ్ చేశారు. కరోనా కాలంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు వైద్య సహాయం అందించడం లోనూ, ప్రత్యేక అలవెన్సులు చెల్లించడంలోనూ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు.

ఇసుక లారీ ఆపినందుకు రైతు బలి

మహబూబ్‌నగర్ జిల్లాలోని రాజాపూర్ మండలం తిరుమలాపూర్ గ్రామానికి చెందిన గుర్రంకాడి నరసింహులు(38) ఇసుక లారీ గుద్ది చనిపోయారు. వాగులో మట్టిని ఫిల్టర్ చేసి తరలిస్తుండడంతో వాగంతా వట్టిపోయి బోర్లు ఎండిపోతున్నాయని, ఇసుకను తీయవద్దంటూ తన పొలం మీదుగా లారీని వెళ్లనివ్వనని నరసింహులు అడ్డం తిరిగాడు. లారీ డ్రైవర్ ఇవేవి లెక్కచేయకుండా అతనిపై నుంచి లారీని తీసుకుపోవడంతో అక్కడికక్కడే మరణించాడు.

ఖాన్ లతీఫ్ మహమ్మద్ ఖాన్ కన్నుమూత

ప్రముఖ ఉర్దూ దినపత్రిక మున్సిఫ్ చీఫ్ ఎడిటర్ ఖాన్ లతీఫ్ మహమ్మద్ ఖాన్(80) అమెరికాలోని షికాగో నగరంలో ఆగస్టు 7న కన్నుమూశారు. ఆయన 15 రోజుల క్రితం షికాగో వెళ్లారు. ఆగస్టు 6న ఆకస్మాత్తుగా అనారోగ్యానికి గురయ్యారు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించారు. ఆయన ఫలక్‌నుమా, జంగమ్మెట్‌లో జన్మించారు. 33 ఏళ్ల క్రితం మున్సిఫ్ పత్రికను కొనుగోలు చేసి అప్పటి వరకు ఉర్దూ పత్రికల్లో ఎడిటోరియల్ పేజీలు, కాలమ్స్ ఉండేవి కావు. వాటిని ఆయనే పరిచయం చేశారు. దశాబ్దం క్రితం మున్సిఫ్ టివి ఛానల్‌ను కూడా ప్రారంభించారు. సుల్తాన్ ఉల్ ఉలూం ఎడ్యుకేషనల్ సొసైటీకి చైర్మన్‌గా వ్యవహరించిన ఆయన కెజి నుంచి పిజి వరకు విద్యా సంస్థలను నెలకొల్పి పేదలకు ఉచిత విద్య అందించారు.

సేవ్ ఇండియా పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు

'క్విట్ ఇండియా' ఉద్యమ స్ఫూర్తితో దేశాన్ని కాపాడుకోవాలని ప్రజా, కార్మిక, ఉపాధ్యాయ సంఘాలు పిలుపునిచ్చాయి. క్విట్ ఇండియా 78వ వార్షికోత్సవం సందర్భంగా ఆగస్టు 9న తెలంగాణ వ్యాప్తంగా 'సేవ్ ఇండియా' పేరుతో ప్రదర్శనలు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలు అమలుచేస్తున్నాయంటూ హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్ రోడ్‌లో ప్రజా సంఘాల సమన్వయ కమిటీ నిరసన తెలిపింది. ఎన్‌డిఏ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచిపెడుతోందనీ, ప్రభుత్వ రంగ సంస్థలను విదేశీ సంస్థలకు, దేశీయ బడా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర చేస్తున్నాయనీ విమర్శించారు.

విజయవాడ కోవిడ్ కేర్ సెంటర్‌లో అగ్ని ప్రమాదం

విజయవాడ రమేష్ ఆస్పత్రి అనుబంధంగా స్వర్ణ ప్యాలెస్ హోటల్‌ను కొవిడ్ కేర్ సెంటర్‌గా ఉపయోగిస్తున్నారు. ఈ సెంటర్‌లో 31 మంది కొవిడ్ బాధితులు చికిత్స పొందుతున్నారు. ఆగస్టు 9న అగ్నిప్రమాదం కారణంగా 10 మంది మరణించగా 21 మంది సురక్షితంగా బయటపడ్డారు. హోటల్‌లోని సర్వర్ రూంలో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయని అగ్నిమాపక సంచాలకుడు జయరామ్ నాయక్ తెలిపారు.

శ్రీశైలం భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో ప్రమాదం

శ్రీశైలం ఎడమగట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో ఆగస్టు 21న జరిగిన అగ్ని ప్రమాదంలో ఐదుగురు ఇంజనీర్లతో సహా తొమ్మిది మంది మరణించారు. దట్టంగా కమ్ముకున్న పొగ కారణంగా దారి కనిపించక పొగవల్ల ఊపిరాడక ఉక్కిరిబిక్కిరై ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం జరిగిన సమయంలో లోపలే ఉన్న మరో పది మంది అత్యవసర ద్వారం ద్వారా బయటకు వెళ్లి ప్రాణాలు దక్కించుకున్నారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురు ఉద్యోగులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. 900 మెగావాట్ల సామర్థ్యం గల హైడల్ పవర్ ప్రాజెక్ట్ పూర్తిగా దగ్ధమైపోయింది. కంట్రోల్ యూనిట్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగి ఐదు యూనిట్‌లకు మంటలు అంటుకున్నాయి.

బలపరీక్షలో నెగ్గిన మణిపూర్ ముఖ్యమంత్రి

మణిపూర్ అసెంబ్లీలో ఆగస్టు 10న జరిగిన బలపరీక్షలో మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్. బీరేన్ సింగ్ నెగ్గారు. అసెంబ్లీలో విశ్వాసం పొందేందుకు బీరేన్ సింగ్ తీర్మానం ప్రవేశపెట్టారు. మూజువాణి ఓటుతో బలపరీక్షలో బీరేన్ సింగ్ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వం గెలుపొందింది. మణిపూర్‌లో బిజెపి మిత్రపక్షం నేషనల్ పీపుల్స్ పార్టీ ఎంఎల్ఏలతో పాటు మరికొందరు ఎంఎల్ఏలు ప్రభుత్వానికి తమ మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు జూన్‌లో ప్రకటించడంతో రాజకీయ సంక్షోభం నెలకొని విశ్వాస పరీక్షకు దారితీసింది. ఆగస్టు 11న ఆరుగురు కాంగ్రెస్ ఎంఎల్ఏలు తమ పదవులకు రాజీనామా చేశారు. కాంగ్రెస్ పార్టీ విప్‌ను ధిక్కరించి, ఈ విశ్వాస పరీక్షకు దూరంగా ఉన్నారు.

ప్రముఖ ఉర్దూ కవి రాహత్ ఇండోరి కన్నుమూత

ప్రముఖ ఉర్దూకవి, రిటైర్డ్ ఉర్దూ ప్రొ. రహత్ ఇండోరి (70) ఆగస్టు 11న గుండెపోటుతో మరణించారు. ఇటీవలే ఆయనకు కరోనా పాజిటివ్ నిర్ధారణతో ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతూ గుండెపోటుతో మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో మరణించారు. ఉర్దూలో ఎం.ఏ. పిహెచ్‌డి చేసిన ఇండోరి ఉర్దూ ప్రొఫెసర్‌గా పనిచేశారు. ముఖ్యంగా ఉర్దూలో ద్విపదలను తనదైన శైలిలో రచించారు. పలు హిందీ చిత్రాల్లో ప్రధానమైన పాటలను రాశారు. ఇండోరి రచించిన 'బులాతా హై, మగర్ జానే కా నహీ', 'సభీకా కానూన్ హై షామిల్ యహాకీ మిట్టీ మే' తదితర కవితలు ఎంతో ప్రాచుర్యం పొందాయి.

బెంగుళూరులో ఆందోళనలు

బెంగళూరులోని కాంగ్రెస్ ఎంఎల్ఏ బంధువు సోషల్ మీడియాలో పెట్టిన ఒక వివాదాస్పద పోస్ట్ ఉద్రిక్తత పరిస్థితులకు దారితీసింది. సున్నితమైన మత విశ్వాసాలను దెబ్బతీసేలా ఉన్న ఈ పోస్ట్‌కు నిరసనగా ఆగస్టు 11న రాత్రి ఆందోళనకారులు కవాల్ భైరసంద్ర, డిజె హళ్లీల్లో విధ్వంసాన్ని సృష్టించారు. ఈ ఘర్షణలను అదుపుచేసేందుకు పోలీసులు కాల్పులు జరపడంతో ముగ్గురు మృతిచెందారు. ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సందర్భంగా జరిగిన ఘర్షనల్లో 60 మంది పోలీసులు, ఒక విలేకరి కూడా గాయపడ్డారు. ఘర్షణ సందర్భంలో ముస్లింలు ఆందోళనలు చోటుచేసుకున్న ప్రాంతంలోని దేవాలయానికి రక్షణగా మానవహారం చేపట్టి మత సామరస్యాన్ని చాటారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లాలో ఆగస్టు 12న జరిగిన ఎన్‌కౌంటర్‌లో నలుగురు మావోయిస్టులు మృతిచెందినట్లు ఎస్‌పి శలభ్ సింహ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం సుక్మా జిల్లాలోని జేగురుగొండ అటవీ ప్రాంతంలో పోలీసు భద్రతా బలగాలు. కోబ్రా ప్రత్యేక పోలీసులు కలిసి కూంబింగ్ నిర్వహిస్తుండగా మావోయిస్టులు తారసపడడంతో ఎదురుకాల్పులు జరిగాయన్నారు. ఈ ఘటనలో నలుగురు మావోయిస్టులు మృతిచెందారన్నారు.

విశ్వాస పరీక్ష నెగ్గిన రాజస్థాన్ సర్కార్

రాజస్థాన్‌లో అశోక్ గెహ్లోత్ ముఖ్యమంత్రిగా ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో విశ్వాస పరీక్ష నెగ్గింది. ఆగస్టు 14న ప్రారంభమైన శాసన సభ సమావేశాల్లో మూజువాణి ఓటుతో ప్రభుత్వం విశ్వాస పరీక్షను నెగ్గినట్లు స్పీకర్ ప్రకటించారు. గెహ్లోత్‌పై తిరుగుబాటు చేసిన సచిన్ పైలెట్ తన వర్గం ఎంఎల్ఏలతో కలిసి తిరిగి సొంతగూటికి రావడంతో సమస్య పరిష్కారమైంది. ఈ తీర్మానంపై జరిగిన చర్చలో భాగంగా గెహ్లోత్ తన ప్రభుత్వాన్ని కూలదోసేందుకు బిజెపి కుట్ర చేసిందంటూ అటువంటి కుట్రలను తాను సాగనివ్వబోనన్నారు.

'అప్నాఘర్' షెల్టర్ హోమ్ అమ్మాయిలను ఎత్తుకెళ్లిన పోలీసులు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బిలాస్‌పూర్ జిల్లాలో, మహిళా- శిశు అభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు, అధికారులు సర్కండా పోలీస్ స్టేషన్ సిబ్బందితో 'అప్నాఘర్' షెల్టర్ హోమ్‌కు వచ్చి ముందస్తు హెచ్చరికలేమీ లేకుండా హెచ్ఐవి సోకిన మైనర్ బాలికలను తీవ్రంగా కొట్టారు. 14 మంది బాలికలను, 'అప్నాఘర్' షెల్టర్ హోమ్ న్యాయ సలహాదారైన న్యాయవాది ప్రియాంక శుక్లాను ఆగస్టు 17న అజ్ఞాత ప్రదేశానికి ఎత్తుకెళ్లి పోయారు. అయితే క్రితం సంవత్సరం మాత్రమే ప్రభుత్వ సహాయం కోసం విజ్ఞప్తి చేశారు. మహిళా- శిశు సంక్షేమాధికారి పార్వతి శర్మ, ప్రభుత్వం మంజూరు చేసే నిధులలో 30 శాతం కమీషన్ ఇవ్వాలని అడిగింది. 'అప్నాఘర్' నిర్వాహకులు అందుకు నిరాకరించి ఈ విషయాల్ని ఎన్‌డిటివిలో బహిర్గతం చేయడంతో వారిని వేధించడం మొదలుపెట్టింది.

తబ్లిగీ యాత్రికుల కేసు కొట్టివేసిన ముంబై హైకోర్టు

తబ్లిగి జమాత్‌కు హాజరయిన విదేశీయులు 29 మందిపై మహారాష్ట్ర ప్రభుత్వం పెట్టిన కేసులు చెల్లవని ముంబై హైకోర్టులో ఔరంగాబాద్ బెంచ్ ఆగస్టు 21న తీర్పు వెల్లడించింది. కరోనా వ్యాప్తికి కారణమవుతున్నారంటూ మర్కజ్ యాత్రికులను బలిపశువులను చేశారని న్యాయమూర్తులు అభిప్రాయపడ్డారు. కరోనా నిర్వహణలో వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఈ దుష్ప్రచారం చేశారని, యాభై ఏళ్లుగా ఏటా జరుగుతున్న తబ్లిగీ సమావేశాలపై లేనిపోని ఆరోపణలు చేశారని తీర్పులో తెలిపారు. దేశంలో ప్రస్తుతం నెలకొని ఉన్న పరిస్థితులను, కరోనా వ్యాప్తి తీవ్రతను చూస్తే, ఈ ఇరవై తొమ్మిది మందిపై ఎటువంటి చర్యా అవసరం లేదని అర్థం అవుతుందని న్యాయస్థానం పేర్కొంది.

న్యాయవాది ప్రశాంత్ భూషణ్ పై కోర్టు ధిక్కార కేసు

ప్రస్తుత, రిటైర్డ్ ప్రధాన న్యాయమూర్తులపై ప్రశాంత్ భూషణ్ రెండు ట్విట్‌లు పెట్టారు. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బాబ్డే ఒక బిజెపి ఎంఎల్ఏకు చెందిన అత్యంత విలువైన హార్లీ డెవిడ్‌సన్ మోటార్ సైకిల్‌పై కూర్చోవడంపై అభ్యంతరం వ్యక్తంచేశారు. నాలుగు నెలలుగా కోర్టు క్రమబద్ధంగా నడిచేందుకు అనుమతించని ప్రధాన న్యాయమూర్తి స్వయంగా చుట్టూ వ్యక్తులు ఉండగా, మాస్క్ లేకుండా మోటార్ సైకిల్‌పై కనిపించారని వ్యాఖ్యానించారు. మరో ట్విట్‌లో గత నలుగురు ప్రధాన న్యాయమూర్తుల హయాంలో ప్రజాస్వామ్యం విధ్వంసం జరిగిందన్నారు. పెండింగ్‌లో ఉన్న అనేక కేసులను ఆయన ఉటంకించారు. న్యాయవాది ప్రశాంత్ భూషణ్ కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారని సుప్రీంకోర్టు ఆగస్టు 14న ప్రకటించింది. తాను సుమోటోగా చేపట్టిన ఈ కేసులో ఆయన్ను దోషిగా ప్రకటించింది. ప్రజాహితం కోసం కోర్టు పనితీరుపై చేసిన సద్విమర్శగా ఆ ట్విట్‌లను భావించలేమని స్పష్టం చేసింది.

తిరోగమనం వైపు ఆర్థిక వ్యవస్థ

అనేక రాష్ట్రాల్లో ప్రణాళికారహితంగా చేపట్టిన అన్‌లాక్ ప్రక్రియతో పాటు ప్రస్తుతం విధిస్తున్న లాక్‌డౌన్ల వల్ల రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలు కుంచించుకు పోతున్నాయని, ఇది ప్రజల జీవన ప్రమాణాలు, ఉపాధిపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఒక అధ్యయనంలో తేలింది. కరోనా లాక్‌డౌన్, అన్‌లాకింగ్‌కు సంబంధించి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు చెందిన ఆర్థికవేత్తలు ఒక నివేదిక విడుదల చేశారు. అందులో రాష్ట్ర దేశీయ ఉత్పత్తిలో 10 శాతం తగ్గుదల ఉంటుందని (అన్ని రాష్ట్రాల సరాసరి 16 శాతం) అంచనా వేశారు. అట్లాగే కరోనాయేతర మరణాల సంఖ్య కూడా 0.5 నుంచి 3.5 శాతం మేరకు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు.

వీక్షణం దగ్గర అమ్మకానికి ఉన్న పుస్తకాలు

ఆర్థిక వ్యవస్థ - సామ్రాజ్యవాదం

ఒక దళారీ పశ్చాత్తాపం	జాన్ పెర్కిన్స్	రు. 120
కుట్రాజకీయం	స్టీఫెన్ కింజర్	40
అభివృద్ధిని ఇలా చూద్దాం	ముదునూరి భారతి	80
కొత్తచూపు	ఆర్.ఎస్. రావు	120
ఊరి దారి	ఎన్. వేణుగోపాల్	60
రాబందు వాలిన నేల	ఎన్. వేణుగోపాల్	180
ప్రపంచీకరణ ప్రాభవంలో...	విద్యాభూషణ్	120
మార్క్స్ రాసిన పెట్టుబడి	డేవిడ్ స్మిత్, ఫిల్ ఇవాన్స్	200

తెలంగాణ

తెలంగాణార్థం	ఎన్. వేణుగోపాల్	150
లేచినిలిచిన తెలంగాణ	ఎన్. వేణుగోపాల్	120
కొత్త వంతెన	కె. శ్రీనివాస్	120
సమగ్ర తెలంగాణ	వీక్షణం ప్రచురణ	295
ఎవరికోసం మల్లన్నసాగర్?	తెలంగాణ ఆత్మగౌరవ వేదిక	20
మానని గాయాలు	తెలంగాణ విద్యావంతుల వేదిక	100

శాస్త్రవిజ్ఞానం

విశ్వాంతరాళం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
మానవ పరిణామం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
ప్రకృతీ - పర్యావరణం	కొడవటిగంటి రోహిణీప్రసాద్	100
శాస్త్రీయ విద్యా విధానం	ఆకుల భూమయ్య	30

కులం-మతం

జెండర్ కులం	ఉమా చక్రవర్తి	150
బొజ్జా తారకం నీలిజెండా వ్యాసాలు	హెచ్.బి.టి	250
ఇది రిజర్వేషన్ల దేశం	బొజ్జా తారకం	150
అంటరాని తనం ఇంకానా?	బొజ్జా తారకం	50
పంచతంత్రం	బొజ్జా తారకం	200
కులం వర్గం	బొజ్జా తారకం	60
చరిత్ర మార్చిన మనిషి	బొజ్జా తారకం	150
శూద్రవర్ణం ఎలా పుట్టింది	ఆర్.ఎస్. శర్మ	150
గులాంగిరి	జోతిబా పూలే	60
కుల నిర్మూలన	అంబేద్కర్	60
శూద్రులు - ఆర్యులు	అంబేద్కర్	20
రాముని కృష్ణుని రహస్యాలు	అంబేద్కర్	30
వెలివాడల వెతలు	కుల నిర్మూలన ప్రచురణ	100

తత్వశాస్త్రం

మార్క్సిస్ట్ తత్వశాస్త్రం	న్యూవిస్టా పబ్లికేషన్స్	80
మార్క్స్ పెట్టుబడి రచనా క్రమం	విరసం ప్రచురణ	50

చరిత్ర-జీవిత చరిత్ర

గోదావరి వచ్చినపుడు	ఆర్. ఉమామహేశ్వరి	280
హైదరాబాద్ స్వాతంత్ర్య సంరంభం	ఎన్. వేణుగోపాల్	25
పద్య సాహిత్యం:సంఘ చరిత్ర	బూదరాజు రామకృష్ణ	25
నగరంలో కర్ఫ్యూ	మలుపు ప్రచురణ	75
నరమేధాలూ నియోగాలూ	బి. విజయభారతి	250
జీనా హైతో మర్‌నా సీకో	కాత్యాయని	100
పరిమళించిన మానవత్వం	ప్రొ. జి. హరగోపాల్	120
సన్నిహితుల జ్ఞాపకాలలో అంబేద్కర్	హెచ్‌బిటి	200
మా జ్ఞాపకాల్లో కెవిఆర్	వకుళాభరణం లలిత	80
భారత చరిత్ర అధ్యయానికి ఒక పరిచయం	డి.డి. కోసంబి	250
భారత చరిత్ర పరిచయ వ్యాసాలు	డి.డి. కొశాంబి	70
భగవద్గీత చారిత్రక పరిణామం	డి.డి. కొశాంబి	20
ప్రాచీన భారత దేశ చరిత్ర	కె. బాలగోపాల్	100
టిపు సుల్తాన్	యార్లగడ్డ నిర్మల	150
నా మాటే తుపాకి తూటా	విమల, కాత్యాయని	120
తరతరాల భారతదేశ చరిత్ర	రొమిల్లా థాపర్	100
ఇండియాలో దాగిన హిందుస్థాన్	పెరి ఆండర్‌సన్	150
బాబాసాహెబ్ అంబేద్కర్	బి. విజయభారతి	120
చేగువేరా	కాత్యాయని	120
మహాత్మా జ్యోతిరావ్ పూలే	ధనుంజయ్ కీర్	100
ఛత్రపతి సాహూ మహరాజ్	కాత్యాయని	40
తలపుల తోవ	షౌకత్ కైఫీ	100
కశ్మీర్‌లో నిషిద్ధ రాత్రి	బషారత్ పీర్	170

సాహిత్య విమర్శ - వ్యాసాలు

కవిత్వంతో ములాఖాత్	ఎన్. వేణుగోపాల్	120
సాహిత్య వ్యాసాలు	చలసాని ప్రసాద్	100
చలసాని ప్రసాద్ రచనలు	చలసాని ప్రసాద్	100
చలసాని ప్రసాద్ సాహిత్య సర్వస్వం-1	విరసం ప్రచురణ	270
మహోదయం	కె.వి.ఆర్.	200
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు-2	కె.వి.ఆర్.	250
కెవిఆర్ సాహిత్య వ్యాసాలు-3	కె.వి.ఆర్.	250
కెవిఆర్ సామాజిక వ్యాసాలు	కె.వి.ఆర్.	300
కెవిఆర్ కవిత్వం	కె.వి.ఆర్. శారదాంబ కమిటీ	200
అల్లంరాజయ్య కథలు పరిశీలన	ఎస్. నీళాదేవి	75
సహచరులు	వరవరరావు	100

విప్లవోద్యమం

తత్వశాస్త్ర దారిద్ర్యం	కార్ల్ మార్క్స్	150
తలకిందుల లోకం	మనీషా సేఠి	150
ప్రశ్నలు అలాగే ఉన్నాయి	ఎం. రాఘవాచారి	150
సముద్ర స్వరం	పాలమూరు అధ్యయన వేదిక	150
వ్యక్తిత్వమే కవిత్వం	మలుపు ప్రచురణ	100
మంద్రస్థాయి యుద్ధం	విరసం ప్రచురణ	100
జగిత్యాల జంగల్‌మహల్-1	విరసం ప్రచురణ	75
జగిత్యాల జంగల్‌మహల్-2	విరసం ప్రచురణ	100
నేటి రాయలసీమ	విరసం ప్రచురణ	100
దండకారణ్యంలో గ్రీన్‌హంట్	విరసం ప్రచురణ	60
మావో రచనలు - 1	విరసం ప్రచురణ	170
మావో రచనలు - 2	విరసం ప్రచురణ	220
30 ఇయర్స్ దండకారణ్య కల్చరల్ మూవ్‌మెంట్	ఎన్.ఎం. చేతనా	250
సంకెళ్ల సవ్వడి	అరుణ్ ఫరేరా	150
మలుపు తిప్పిన మహా ఉద్యమం	విరసం ప్రచురణ	60
బోల్షివిక్ పార్టీ చరిత్ర	విరసం ప్రచురణ	250
ఆవాజ్	విరసం ప్రచురణ	65
మెరిసే అక్షరాల వెనుక	సృజన ప్రచురణ	30
నక్సల్బరీ ఒక ఊరు మాత్రమే కాదు	విరసం ప్రచురణ	80
పికెఎం ప్రభాకర్ రచనలు	విరసం ప్రచురణ	70
కార్మికవర్గ విప్లవం-విప్లవ ద్రోహి కౌట్స్కీ	విరసం ప్రచురణ	60
భీమా కోరేగాం 12 - వివి	స్వేచ్ఛా సాహితి ప్రచురణ	50
యుద్ధం స్త్రీ ప్రకృతికి విరుద్ధం	ఎస్.అలెక్సీయెచ్	100
రగుతులున్న అడవి	నందినీ సుందర్	290

కథ - నవల

మేరువు	విరసం ప్రచురణ	90
మానధనులు	హూవర్డ్ ఫాస్ట్	150
దండకారణ్య కథలు (2005-2012)	విరసం ప్రచురణ	100
వసంతగీతం	అల్లం రాజయ్య	250
ఏడుతరాలు	అలెక్స్ హేలీ	150
వనవాసి	బిభూతిభూషన్ బంధోపాధ్యాయ	120
నేల నాగలి - మూడెద్దులు	బొజ్జా తారకం	25
దళితులు - రాజ్యం	బొజ్జాతారకం	25
స్పార్టకస్	హోవార్డ్ ఫాస్ట్	120
బీజభూమి	వరవరరావు	100
మరల సేద్యానికి	శివరామ కారంత్	150
అభాగ్యజీవులు	ఫ్రాంజ్ ఫనాన్	170
నిషిధ	నల్లూరి రుక్మిణి	180
మాటిగరి	గుగి వా థియోంగో	120
మట్టికాళ్ల మహారాక్షసి	గుగి వా థియోంగో	200
బందీ	గుగి వా థియోంగో	200
నేను చావును నిరాకరిస్తున్నాను	జి.ఎన్. సాయిబాబా	125

వీక్షణం, మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3,
హిమాయత్‌నగర్, హైదరాబాద్ - 500 029.
ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com, www.veekshanam.wordpress.com

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 227 - September 2020 ● ISSN 2231-6892
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/08/2020 ● Postal Regn. No. HD/1100/2020-22

Date of Posting : 29th, 30th

If undelivered please return to:

VEEKSHANAM
Mytri Residency, 3-6-394, St. No. 3,
Himayatnagar, Hyderabad - 500 029.
Phone: 040 66843495

To:
Mr./Mrs.________________________

____

____

____

Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao